

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 168

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సెలవు

వినాయకచవితి పర్వదినం సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. కావున ఆదివారం సంచిక వెలువడదు. పునర్దర్శనం సోమవారం.

ఒక శిబిరం.. ఎన్నో కన్నీళ్లు



అమ్మ పాల కోసం గుక్కపట్టి ఏడుస్తున్న పసికందులు

చిట్టి చేతులతో ఊయల ఊపుతూ బుజ్జగిస్తున్న చిన్నారులు

- బురద, చెత్తతో నిండిన ఇళ్లు, సామగ్రి శుభ్రం చేసుకునే పనిలో పెద్దలు
- అమ్మానాన్నల కోసం దీనంగా ఎదురుచూస్తూ పిల్లల గగ్గోలు
- ఉడికీ ఉడకని అన్నం మెతుకులే పరమాన్నంగా తినాల్సిన దుస్థితి
- విషజ్వరాలతో బాధపడుతున్న యువకులు.. విరేచనాలతో అవస్థపడుతున్న వృద్ధులు
- ఖమ్మంలోని పునరావాస కేంద్రంలో కన్నీళ్లు పెట్టిస్తున్న దృశ్యాలు

● నిండా ఆరు నెలలు కూడా నిండని పసికందు పునరావాస కేంద్రంలో చీరతో కట్టిన ఊయలలో గుక్కపెట్టి ఏడుస్తోంది. ఆరేళ్ల చిన్నారి నిహారిక కన్నీళ్లు పెట్టుకుంటూనే తన చిట్టి చేతులతో ఊయల ఊపుతూ తమ్ముడిని బుజ్జగిస్తోంది. ''తమ్ముడికి అమ్మ ఉదయం పాలిచ్చి వెళ్లింది. ఇప్పుడు ఆకలేసి ఏడుస్తున్నాడు. ఏం చేయాలి'' అంది ఆ చిన్నారి నిహారిక. ఖమ్మంలోని జలగం నగర్‌కు చెందిన నర్సింహ, భవాని దంపతుల ఇల్లు వరదలో మునిగిపోయింది. ఆ కాలనీలో, ఇంట్లో అంతా బురద, చెత్తా చెదారం మేట వేసింది. దీంతో పిల్లలను వెంట తీసుకెళ్లలేక.. వారిని పునరావాస కేంద్రంలోనే వదిలి, ఇంట్లో బురద ఎత్తిపోసేందుకు వెళ్లారు.

2లో

టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటన - 8లో

కేంద్రం ఆదుకోవాలి... తక్షణ సాయం అందించాలి



- ప్రాథమిక అంచనాల ప్రకారం రూ. 5,438 కోట్ల నష్టం
- విపత్తు నిధుల వినియోగం నిబంధనలు సడలించాలి
- తక్షణ మరమ్మతులు, పనులకు నిర్దేశించిన రేట్లు పెంచాలి
- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

19లో

రుణమాఫీ కాలేదని..

మేడ్చల్‌లో దుబ్బాక రైతు ఆత్మహత్య

- బ్యాంకులో తల్లి, కుమారుడికి వేర్వేరుగా పంట రుణాలు
- ఒకే రేషన్‌కార్డులో ఇద్దరి పేర్లూ ఉండటం, ఇద్దరి రుణాలూ కలిపి రూ.3 లక్షలకు పైగా ఉండటంతో జరగని రుణమాఫీ

8లో



ఒక శిబిరం.. ఎన్నో కన్నీళ్లు



గణేశ్ అనే యువకుడికి తీవ్ర జ్వరం. పునరావాస కేంద్రంలోనే ఓ కిటికీకి సెలైన్ వేలాడదీసి ఆయనకు పెట్టారు. గణేశ్‌కు డెంగీ లక్షణాలు ఉన్నాయని, ఆస్పత్రికి తీసుకెళ్లాలని అక్కడి వైద్య సిబ్బంది చెప్పున్నారు. ఆ యువకుడి తల్లిదండ్రులు వరద ముంచేసిన ఇంటిని శుభ్రం చేసుకునేందుకు వెళ్లారు. ఆస్పత్రికి తీసుకెళ్లేవారెవరూ లేక.. పునరావాస కేంద్రంలోనే బిక్కుబిక్కుమంటున్నాడు.



ఏదులాపురానికి చెందిన 70 ఏళ్ల గురవయ్యకు రెండు రోజులుగా నీళ్ల విరేచనాలు. కళ్లు పీక్కుపోయాయి. మాట పెగలడం లేదు. కాళ్లలో సత్తువ కూడా లేదు. పునరావాస కేంద్రంలో వైద్య సిబ్బంది ఇచ్చిన మాత్రలు వేసుకుని ఓ పక్కన ఒత్తిగిల్లుతున్నాడు. అక్కడున్న వారిలో 12 మందికి శుక్రవారం ఉదయం నుంచీ ఇలా విరేచనాలు మొదలయ్యాయని గురవయ్య చెప్పాడు. ఆహారం వల్లనో, నీటితోనో గానీ.. నానా అవస్థలు పడుతున్నామని వాపోయాడు..

ఖమ్మం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఖమ్మంలోని పునరావాస కేంద్రంలో వరద ముంపు బాధితుల కష్టాలివి.. ఇంటిక్లో పరిస్థితి లేక, పునరావాస కేంద్రంలో పెడుతున్న ఆహారం తినలేక, రాత్రుళ్లు నిద్రకూడా సరిగా లేక నానాయాతన పడుతున్నారు. కేంద్రంలో అన్ని వసతులు కల్పించామని అధికారులు చెప్తున్నా.. కానీ అన్నీ ఇబ్బందులేనని బాధితులు వాపోతున్నారు.

బిక్కుబిక్కుమంటూ గడుపుతూ..

వరదలతో ముంపునకు గురైన ఖమ్మంలోని జలగంనగర్, పలు ఇతర కాలనీల వాసులకు సమీపంలో రామ్‌లీలా ఫంక్షన్ హాల్‌లో పునరావాసం కల్పించారు. 1,500 మందిని ఆ కేంద్రానికి తరలిస్తే.. శుక్రవారం ఉదయం వంద మంది కూడా కనిపించలేదు. ఉన్న వారంతా చిన్న పిల్లలు, వృద్ధులే. యువకులు, తల్లిదండ్రులు ముంపు బాధితులు ఇళ్లను, సామగ్రిని శుభ్రం చేసుకోవడానికి.. పిల్లలు, వృద్ధులను పునరావాస కేంద్రాల్లోనే వదిలేసి ఇళ్లకు వెళ్తున్నారు. రాత్రికల్లా తిరిగి వస్తున్నారు. అంతదాకా పిల్లలు, వృద్ధులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

అమ్మా ఎప్పుడొస్తావ్!

'అమ్మా ఎప్పుడొస్తావ్. ఇక్కడ ఉండలేకపోతున్నాను'.. పదేళ్ల ప్రణవి ఏడుస్తూ సెల్‌ఫోన్‌లో తల్లిని అడుగుతోంది. ''చస్తే చస్తాం.. ఇంటికెళ్లి పోవాలనిపిస్తోంది..'' అన్నారో 75 ఏళ్ల పెద్దాయన. వారిని ఇంకా వరద బీభత్సం వెంటాడుతూనే ఉంది. ఏం జరిగిందో, ఇకపై జరుగుతుందో తెలియడం లేదంటూ ఆందోళన కనిపిస్తోంది. ఆడుతూ, పాడుతూ ఉండే పిల్లలు పునరావాస కేంద్రంలో కాలు కదపకుండా ఉండలేకపోతున్నారు. గుక్కెడు నీళ్లు తాగాలన్నా ఎవరినో అడగాలి.



ఖమ్మం రూరల్‌లోని రామ్‌లీల్ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో సేదతీరుతున్న బాధితులు

బుక్కెడు బువ్వ కోసమూ లైన్‌లో నిలబడాలి. ఇక్కడ ముద్ద నోట్లోకి వెళ్లడం లేదని వినేష్, పల్లవి, సుధ వాపోయారు. 'జ్వరం వచ్చిందని చెప్పుకునే తోడు లేదు. తిన్నావా? అని అడిగే దిక్కు లేదం'టూ వృద్ధులు కన్నీళ్లు పెడుతున్నారు.

అలా తినాలంటే ఎలా?

తాగునీటి డ్రమ్ముల్లో దోమలు, కీటకాలు, వంటశాలలో తడి, దుర్వాసన. వండే, వడ్డించే గరిటలు కిందే పెడుతుండటంతో అంటుతున్న మట్టి. హడావుడిగా వంట. ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల కూరలు.. అన్నం కోసం లైన్ కట్టాలి. అయిపోతే వండి తెచ్చేవరకు అలాగే నిరీక్షించాలి. పెట్టినంతే తినాలి. కడుపు నిండలేదని మళ్లీ అడిగినా ఉండదు.. ఇదీ సహాయక శిబిరాల్లో పరిస్థితి. ఇదంతా చూస్తూ ఖర్మకాలి వచ్చామంటూ వృద్ధులు వాపోతున్నారు. కలో గంజో తాగి ఇంటి దగ్గర ఉండటమే నయమంటున్నాడు సుబ్బయ్య. కాళ్లు లాగుతున్నాయని వెళ్తే పారాసిటమాల్ ఇచ్చారని చెప్పారో వృద్ధుడు. మూడు రోజులుగా చలి జ్వరంతో బాధపడుతున్నా చెప్పుకోలేని పరిస్థితి ఉందని బావురుమన్నారు మరో వృద్ధుడు.

అమ్మానాన్నలు రాగానే చిన్నారులు గట్టిగా పట్టుకుని ఏడుస్తున్నారు. ఇంటికి తీసుకెళ్లాలంటూ మారాం చేస్తున్నారు. ఇంటి నిండా బురద ఉందని చెప్పినా పిల్లలు వినడం లేదని సుశీల అనే మహిళ వాపోయింది.

నా ఖమ్మం కోసం నేను!

వినాయక మండపాల వద్ద సామగ్రి సేకరణకు బాక్సులు.. కలెక్టర్ వినూత్న ఆలోచన

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లాలో వరద ముంపుతో నష్టపోయిన వారికి అందరూ అండగా నిలబడాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన గూగుల్ మీట్ ద్వారా జిల్లా వ్యాప్తంగా అధికారులతో ముంపు ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా 'నా ఖమ్మం కోసం నేను' పేరిట కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ మేరకు ప్రతీ గణేశ్ మండపం వద్ద ఒక బాక్స్ ఏర్పాటు చేయాలని, అందులో ముంపు బాధితుల కోసం దుస్తులు, చెప్పులు తదితర ఉపయోగపడే సామగ్రి వేసేలా ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా ఆపదలో ఉన్న వారికి అందరం అండగా నిలుస్తామని కలెక్టర్ తెలిపారు.

సీఎం సహాయనిధికి విరాళాల వెల్లువ



శుక్రవారం సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటికి చెక్కును అందిస్తున్న సంగీతారెడ్డి

సాక్షి, హైదరాబాద్: వరద సహాయక చర్యల నిమిత్తం పలు సంస్థల నుంచి ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు వెల్లువలా వస్తున్నా యి. జీఎంఆర్ గ్రూప్ సంస్థల నుంచి రూ.2.5 కోట్లు విరాళంగా ప్రకటించారు. కెమిలాయిడ్స్ కంపెనీ చైర్మన్ రంగరాజు రూ.కోటి విరాళం ఇవ్వగా, శ్రీచైతన్య విద్యాసంస్థలు రూ.కోటి, విర్కో ఫార్మా రూ.కోటి, అపోలో హాస్పిటల్స్ జేఎండీ సంగీతారెడ్డి రూ.కోటి విరాళంగా అందజేసినట్లు శుక్రవారం సీఎం కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. అలాగే భువనగిరి ఎంపీ చామల కిరణ్‌రెడ్డి వరద బాధితులకు తన వంతుగా నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో ము ఖ్యమంత్రి ప్రత్యేక అధికారి (ఓఎస్డీ) వేముల శ్రీనివాసులును కలిసి రూ.1.85 లక్షల చెక్కును అందజేశారు.



శ్రీచైతన్య విద్యాసంస్థలు తరపున విరాళం అందజేస్తున్న దృశ్యం

ఆశలు పోయి.. ఆవేదనే మిగిలి..

ఖమ్మం వరద ముంపు కాలనీల్లో ఎవరిని కదిలించినా కన్నీళ్లే..

బురదలోనే బతుకు పోరాటం.. సాయం కోసం ఎదురుచూపులు

- గుక్కెడు మంచి నీళ్లు, ఒక్కపూట తిండి కోసమూ ఇబ్బందులు
- అటువైపు ఎవరొచ్చినా.. ఏదైనా సాయం చేస్తారేమోనని ఆశగా చూపులు
- బురద, చెత్త, దుర్వాసనతో అవస్థలు..
- ప్రభుత్వం నుంచి సాయం అందడం లేదంటూ ఆవేదన
- ఇంకా వెంటాడుతున్న 'వరదల' భయం



బీఆర్‌కే నగర్‌లో రోడ్డుపై బురద

ఖమ్మం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఇళ్లలో, కాలనీల్లో మోకాళ్లలోతు బురద పేరుకుపోయింది. ఎంతగా ఎత్తిపోస్తున్నా తగ్గడం లేదు. బురద, చెత్తాచెదారం కారణంగా డ్రైనేజీలూ మూసుకుపోయి ఉన్నాయి. ఒక్కపూట తిండి కోసం, గుక్కెడు మంచి నీళ్ల కోసం కూడా అల్లాడుతు న్నామని బాధితులు వాపోతున్నారు. అధికారులెవరూ తమ ప్రాంతాలకు రాలేదని, ఎలాంటి సాయం అందలేదని ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. పెద్దతండా, జలగంనగర్, బొక్కల గడ్డ, వెంకటేశ్వర కాలనీలలో పరిశీలించగా.. అంతటా బాధితుల నుంచి ఇదే మాట. ''మాకు ఇక ఏడ్చేందుకూ కన్నీళ్లు కూడా లేవు..'' అని వెంకటేశ్వర కాలనీలో అక్కి మంగమ్మ వాపోయింది. ''మా ఇళ్లు గుర్తుపట్టలేనంతగా దెబ్బ తిన్నాయి. నాలుగు రోజులుగా కట్టుబట్టలతో ఉన్నాం. ఇదేం పాపమో మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు..'' అని కె.సరిత, శీలం ప్రియాంక, ఎం.మమత, సత్యమ్మ బావురుమన్నారు. కాలనీ వైపు ఎవరొచ్చినా.. ఏదైనా సాయం చేస్తారేమోనని ఆశగా చూస్తున్నామని పేర్కొన్నారు.

బురద ఎత్తిపోస్తూ.. ఆరోగ్యం దెబ్బతిని..

ఇళ్లలో పేరుకున్న బురద ఎత్తిపోస్తూ, సామగ్రిని శుభ్రం చేసుకుంటున్న క్రమంలో చాలా మంది ముంపు బాధితులకు ఎలర్జీలకు లోనయ్యారు. కాళ్లు, చేతులపై పుండ్లు ఏర్పడ్డాయి. అలా ఏర్పడ్డ పుండ్లను చూపిస్తూ డి.లలిత, నారాయణమ్మ, రమణమ్మ కన్నీటి పర్యంతం అయ్యారు. ఫంగస్ వ్యాధులే దీనికి కారణమని వైద్యులు చెప్పారని పేర్కొన్నారు.

డ్రైనేజీలు పూడుకుపోయి.. తీవ్ర దుర్గంధంలో..

వరద ప్రభావిత కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. బురద నిండి నడవడమూ కష్టంగా మారింది. అన్నీ చిన్న చిన్న కాలనీలు కావడంతో కార్పొరేషన్ వాహనాలు రావడం లేదు. అక్కడి పేదలే రాత్రింబవళ్లు బురద ఎత్తిపోస్తున్నారు. వరద వచ్చిన ఐదు రోజుల తర్వాత ప్రభుత్వం నిత్యావసరాలు, దుప్పట్లను సరఫరా చేసినా.. అవి సరిపోని పరిస్థితి. బురద, చెత్తాచెదారంతో కాలనీల్లో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. పరిస్థితి ఇలాగే ఉంటే అంటువ్యాధులు వ్యాపిస్తాయని సహాయక శిబిరాల్లోని వైద్యులు హెచ్చరిస్తున్నారు కూడా. ఇక్కడి నుంచి రోజూ 300 ట్రాక్టర్ల చెత్తను డంప్‌యార్డ్‌లకు పంపుతున్నామని వరంగల్ నుంచి వచ్చిన శానిటేషన్ సూపర్‌వైజర్ చందు తెలిపారు.

అధికారుల జాడే లేదంటూ..

వరదలపై అప్రమత్తం చేయడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని బాధితులు మండిపడుతున్నారు. ముంపు తర్వాత కూడా అధికారులెవరూ తమ దగ్గరకు రాలేదని వెంకటేశ్వర కాలనీకి చెందిన పార్వతమ్మ వాపోయారు. ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి సాయం లేదని.. శాంతినగర్‌లోని చుట్టాల ఇంటికెళ్లి తినివస్తున్నామని, ఎన్నాళ్లిలా తింటామని జి.నాగమణి కన్నీళ్లు పెట్టింది. కూలీ పనిచేసే వడ్లకొండ సూరమ్మ మూడుగదుల రేకుల ఇల్లు కూలిపోయింది. ఆ ఇంటిని చూస్తూ ఆమె కన్నీళ్లుపెడుతూనే ఉంది. తల్లితండ్రి గుండెపోటుతో చనిపోతే ఒక్కడే ఉంటున్న కిరణ్ ఇల్లు కూలిపోయింది. చదువుకున్న సర్టిఫికెట్లు కూడా నీటిపాలై ఆవేదనలో పడిపోయాడు.



పద్మావతినగర్‌లో ఇంట్లోని సామగ్రి అంతా బయట వేసి శుభ్రం చేసుకుంటున్న ముంపు బాధితులు



రేకుల పైకప్పు కూలిపోయి బురదతో నిండిపోయిన ఇంట్లో వడ్లకొండ సూరమ్మ

'పండుగ'కూ వరద ముంపు

ఖమ్మం పట్టణం, రూరల్ మండలాలను ముంచేసిన వరద.. ఈసారి వినాయక చవితి పండుగనూ ముంచేసింది. ముంపు కాలనీల్లో ఏటా వీధివీధినా వినాయక విగ్రహాలతో నవరాత్రులను ఘనంగా జరుపుకొనేవారు. కానీ ఈసారి వరదల కలకలంతో పండుగ కళ దూరమైంది. వినాయక విగ్రహాలు, పూజా సామగ్రి విక్రయించేవారు కూడా నిరాశలో పడిపోయారు. కాలేజీల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో బాధితులు వస్త్రాలు, సామగ్రి ఆరబెట్టుకోవడం కనిపించింది. వరదలకు ముందే కాలనీల ప్రజలు వినాయక విగ్రహాల కోసం ఆర్డర్లు ఇచ్చారని.. అవన్నీ క్యాన్సిల్ అయ్యాయని విగ్రహాల తయారీదారు హరికుమార్ వాపోయారు.

'పాత సామాన్లు కొంటాం'!

కొందరికి అంతులేని ఆవేదన.. మరికొందరికి ఎంతో కొంత ఆశ. ముంపు ప్రాంతాల్లోనివారు వరదల్లో తడిసి, పాడైపోయిన సామగ్రిని ఓ మూలకు పడేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాత సామాన్లు కొనే వారి హడావుడి పెరిగింది. ఆటో ట్రాలీలకు మైకులు పెట్టుకుని 'పాత సామాన్లు కొంటాం. విరిగిన వస్తువులు, కుర్చీలు కొంటాం..' అంటూ తిరుగుతున్నారు. ఇది చూసి బాధితులు మరింత ఆవేదనకు లోనవుతున్నారు.



మున్నేటి వరదలతో ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండాలోని ఎంపీడీవో కార్యాలయం పూర్తిగా నీట మునిగింది. దీంతో రామ్‌లీలా ఫంక్షన్ హాల్ పునరావాస కేంద్రంలో.. తాత్కాలికంగా ఎంపీడీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

- తిరుమలలో శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఆధార్ ప్రామాణికంగా టీటీడీ సేవలు అందించేందుకు కేంద్రం నుంచి ప్రాథమిక అనుమతి లభించిందని టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో ఏపీ ప్రభుత్వం నుంచి వెలువడనుందని చెప్పారు.



సర్వే.. నామ్ కే వాస్తే..!

ఖమ్మం ముంపు ప్రాంతాల్లో బాధితుల ఆవేదన

- తమ ఇళ్లకు సర్వే సిబ్బంది ఎవరూ రాలేదంటూ పలువురు ఆందోళన
- కేవలం పేర్లు, బ్యాంకు ఖాతాల వివరాల సేకరణకే 'సర్వే' పరిమితం
- తాము కోల్పోయిన ఇళ్లు, సామగ్రి నష్టం పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం పట్టణం, రూరల్ మండలాల్లో చేపట్టిన ముంపు బాధితుల సర్వే నామ్‌కే వాస్తేగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే కోసం వచ్చిన సిబ్బంది కేవలం పేర్లు, ఫోన్ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, ఇంట్లోకి నీరు ఎంత వరకు వచ్చిందనే వివరాలు మాత్రమే తీసుకుంటున్నారని చెప్తున్నారు. భారీ వరదలతో పదులకొద్దీ ఇళ్లు నేలమట్టం అయ్యాయని.. వందల సంఖ్యలో ఇళ్ల గోడలు కూలి, కిటికీలు, తలుపులు ధ్వంసమై తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఇళ్లలోని సామగ్రి అంతా తడిసి, కొట్టుకుపోయి నష్టపోయామని గుర్తు చేస్తున్నారు. సర్వే సిబ్బంది ఇవేవీ నమోదు చేయడం లేదని చెప్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల సాయం కోసం మాత్రమే ఈ సర్వే చేస్తే.. తాము కోల్పోయిన ఇళ్లు, నష్టపోయిన సామగ్రికి పరిహారం అందనట్లేనా? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాని కోసం మళ్లీ సర్వే ఏదైనా చేస్తారా, సాయం అందుతుందా? అని ప్రశ్నిస్తున్నారు.



సర్వేలో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

పేర్లు నమోదు చేయడం లేదంటూ..

మున్నేరు వరదతో ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలాల్లో 70 కాలనీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మొత్తంగా 15,777 ఇళ్లు వరద తాకిడికి గురైనట్టు అంచనా. ఈ ముంపును తేల్చేందుకు 172 మంది ఎన్యూమరేటర్లు సర్వేలో పాల్గొంటున్నారు. ఈ ప్రక్రియ శుక్రవారం నాటికి కొలిక్కి వచ్చిందని అధికార యంత్రాంగం చెబుతోంది. కానీ సర్వే మొదలుపెట్టిన తొలి రోజున చాలామంది ఇళ్లలో లేకపోవడంతో వందలాది మంది పేర్లు నమోదు కానట్టు తెలుస్తోంది. తర్వాత కూడా దాతలు ఇచ్చే వస్తువులు, భోజనం అందుకోవడానికి వెళ్లినవారు, కుటుంబం మొత్తం పునరావాస కేంద్రాల్లోనే ఉన్న వారు చాలా మంది తమ పేరు ముంపు బాధితుల జాబితాలో నమోదుకాలేదని వాపోతున్నారు. నమోదవకుంటే ప్రభుత్వమిచ్చే రూ.10వేలు కూడా అందవేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏ అధికారి కూడా.. రాలేదు..



వరదలు వస్తున్నాయని సమాచారం ఇవ్వలేదు. తెలిసినవారు ఫోన్ చేస్తే నిద్రలో లేచి కట్టుబట్టలతో బయటికి పరుగెత్తాం. వరదలు తగ్గి ఐదు రోజులైనా మా ప్రాంతానికి ఏ అధికారి కూడా రాలేదు. మా దగ్గర సర్వే జరగకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం అందుతుందో, లేదో తెలియడం లేదు.

\- రేష్మ, పద్మావతినగర్, ఖమ్మం

సర్వే లేదు.. సాయం లేదు..



రెండు రోజుల నుంచి మా చుట్టుపక్కల ప్రాంతాల్లో అధికారులు సర్వే చేశారు. మా ప్రాంతానికి మాత్రం రాలేదు. అక్కడికి వెళ్లి అధికారులను అడిగితే 'వస్తారు.. మీ ఇంటి దగ్గరే ఉండు' అని చెప్పారు. సర్వేలో నమోదైతేనే సాయం అందుతుందని కొందరు అంటున్నారు. మరి మా వివరాలు ఎప్పుడు తీసుకుంటారు, ఎప్పుడు సాయం చేస్తారో తెలియడం లేదు.

\- పాటి ప్రదీప్‌కుమార్, వెంకటేశ్వరనగర్, ఖమ్మం



జల దిగ్బంధంలో ఏడుపాయల

పాపన్నపేట (మెదక్): సింగూరు నుంచి విడుదలైన నీటితో ఘనపురం ప్రాజెక్టు పొంగిపొర్లుతోంది. వనదుర్గమ్మ ఆలయాన్ని దిగ్బంధం చేస్తూ దిగువకు పరుగులు తీస్తోంది. గురువారం సింగూరు ప్రాజెక్టు 2 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేసిన నీరు, శుక్రవారం ఉదయానికి ఘనపురం చేరుకుంది. దీంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. దుర్గమ్మ ఆలయం గంగమ్మ చెరలో చిక్కుకుంది. రాజగోపురంలో దుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఉంచి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. పోలీసులు భద్రతా చర్యలు చేపడుతున్నారు.

9న బంగాళాఖాతంలో వాయుగుండం

- వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం
- రానున్న మూడు రోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు
- ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు

సాక్షి, హైదరాబాద్: వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శుక్రవారం కూడా కొనసాగుతూ మధ్య, ఉత్తర బంగాళాఖాతం వైపు ప్రయాణిస్తోంది. ఇది నెమ్మదిగా ఉత్తర దిశగా కదులుతూ బలపడి పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా, బంగ్లాదేశ్ తీరం వద్ద ఈనెల 9న వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, ఇది సముద్ర మట్టం నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని వివరించింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. శుక్రవారం వనపర్తి జిల్లాలో 4.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, గద్వాల జిల్లాలో 4.16 సెం.మీ., మహబూబ్‌నగర్ జిల్లాలో 3.16 సెం.మీ. వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో నైరుతి సీజన్‌లో ఇప్పటివరకు 60.87 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 85.57 సెంటీమీటర్ల వర్షం కురిసిందని వాతావరణ శాఖ వివరించింది.

శుక్రవారం రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు

జిల్లా	ప్రాంతం	వర్షపాతం (సెంటీమీటర్లలో)
నిజామాబాద్	కల్దుర్కి	6.53
రంగారెడ్డి	దండుమైలారం	6.18
ఖమ్మం	వెంసూర్	5.78
నిజామాబాద్	చిన్నమావంది	5.50
రంగారెడ్డి	గచ్చిబౌలి	4.30
సంగారెడ్డి	రుద్రారం	4.10
నల్లగొండ	తిమ్మాపూర్	4.08

ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేత



ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై వెంకటగిరి వైపు గోడ కడుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై నుంచి వాహనాల రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. ఈనెల 1న మున్నేటికి వరద పోటెత్తడంతో ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై ఎస్–12 స్పాన్ పక్కకు జరిగింది. దీనిపై శుక్రవారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'వందేళ్ల వంతెన చాన్నాళ్లు.. 12 ఏళ్ల వంతెనకు నూరేళ్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో గురువారం వరకు భారీ వాహనాలనే నిలిపివేసిన అధికారులు శుక్రవారం అన్నింటినీ నిలిపేశారు. ప్రస్తుతం మున్నేటి వరద ఉధృతి కొంత మేర ఉంది. వరద తగ్గిన అనంతరం అధికారులు బ్రిడ్జి మరమ్మతులు చేపట్టనున్నారు. పనులు పూర్తయ్యేవరకు వాహనాల రాకపోకలు ఈ బ్రిడ్జి మీదుగా సాగవని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. వాహనాలు రాకపోకలు సాగించకుండా బ్రిడ్జికి ఇరువైపులా ప్రకాశ్‌నగర్, ఖమ్మం రూరల్ మండల వెంకటగిరి వైపు గోడ కట్టారు.

యువరైతును మింగిన వర్షాలు

మిరపతోట కుళ్లిపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య



భూక్య హత్తిరాం (ఫైల్)

కురవి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సాగు చేసిన మిర్చి పంట కుళ్లిపోవడం.. చేసిన అప్పులు తీర్చేమార్గం లేక మనస్తాపానికి గురైన యువ రైతు భూక్య హత్తిరాం (33) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు శివారు హరిదాసు తండా జీపీ పరిధిలోని హర్య తండాలో శుక్రవారం జరిగింది. హత్తిరాం తనకున్న రెండు ఎకరాలకు తోడు మరో ఎకరం భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్నాడు. గతేడాది మిర్చి సాగు చేయగా నల్లి రోగంతో పంట నాశనమైంది. అప్పుడు పంట కోసం రూ.6 లక్షల అప్పులు చేశాడు. ఆ అప్పులు తీరలేదు. ఈ ఏడాది అదే పంటను నమ్ముకుని తిరిగి మిర్చి సాగు చేశాడు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో వేసిన మిరప తోట కుళ్లిపోయి పనికిరాకుండా పోయింది. దీంతో మనస్తాపానికి గురైన హత్తిరాం గురువారం తోట వద్ద పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. అస్వస్థతకు గురైన హత్తిరాం కుటుంబ సభ్యులకు మందు తాగినట్లు చెప్పాడు. అప్పటికే పరిస్థితి విషమిస్తుండటంతో కుటుంబసభ్యులు వెంటనే మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి భూక్య స్వామి (సామ్య) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీశ్ తెలిపారు. మృతుడికి భార్య మీనా, అరవింద్, అరుణ్ కుమారులున్నారు.

సిబ్బంది లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

- వినియోగదారులకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సూచన
- ఫిర్యాదుల స్వీకరణ కోసం 040–2345 4884/7680901912 నంబర్ల ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ పనులకు సంబంధించి తమ సిబ్బంది/అధికారులు ఎవరైనా లంచం అడిగితే 040–2345 4884కు లేదా 7680901912కు ఫిర్యాదు చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) వినియోగదా రులకు సూచించింది. ఈ మేరకు సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొందరు సిబ్బంది, అధికారులు అవినీతికి పాల్పడుతూ సంస్థకు చెడ్డపేరు తెస్తున్న నేపథ్యంలో వినియోగదారుల సమస్యలు/ఫిర్యాదులను నేరుగా తెలుసుకొని పరిష్కరించడంతోపాటు అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నూతన సర్వీసుల మంజూరు, కేటగిరీ మార్పు, టైటిల్ ట్రాన్స్‌ఫర్, బిల్లింగ్ లోపాల వంటి సేవలను సంస్థ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకొనే అవకాశం కల్పించామన్నారు. వినియోగదారులకు ఇబ్బంది కలిగించే లేదా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించబోమని సీఎండీ ముషారఫ్ ఫారూఖీ తేల్చిచెప్పారు.

లోక్ అదాలత్‌లో దేశంలో టీజీఎస్ఎల్ఎస్ఏ నం.1

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా నిర్వహించిన రెండో జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎస్ ఎల్ఎస్ఏ) నంబర్‌వన్‌గా నిలిచింది. ఒకే రోజు 10,33,051 కేసులను పరిష్కరించి ఈ రికార్డు సృష్టించింది. హైకోర్టు ఆవరణలోని లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలో శుక్రవారం సభ్యకార్యదర్శి సీహెచ్ పంచాక్షరి మీడియాతో మాట్లాడారు. 2024, జూన్ 8న నిర్వహించిన లోక్ అదాలత్‌లో రూ.750 కోట్ల పరిహారం కక్షిదారులకు అందజేశామని చెప్పారు. ప్రీలిటిగేషన్ కేసులు 5,71,486, పెండింగ్ కేసులు 4,61,565 కలిపి మొత్తంగా 10,33,051 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఈనెల 28న జరగనున్న మూడో లోక్ అదాలత్‌లో ఇంత కంటే ఎక్కువ కేసులు పరిష్కరిస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు. కేసుల సత్వర, ఖర్చు లేని పరిష్కారం కోసం లోక్ అదాలత్‌ను ఆశ్రయించాలని కక్షిదారులకు పంచాక్షరి పిలుపునిచ్చారు.

24 గంటల్లో 23 ఆపరేషన్లు

- వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల ఘనత

వేములవాడ అర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రి వైద్యులు మరో అరుదైన రికార్డు సాధించారు. 24 గంటల్లోనే 23 ఆపరేషన్లు చేసి శభాష్ అనిపించుకున్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు 10 సిజేరియన్లు, గర్భసంచిలో గడ్డల తొలగింపు ఆపరేషన్లు రెండు, ఐదు సాధారణ శస్త్రచికిత్సలు, కంటి ఆపరేషన్ ఒకటి, ఐదు ఆర్థోపెడిక్ ఆపరేషన్లు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ పెంచలయ్య, గైనకాలజిస్ట్ సంధ్య, కంటి వైద్యనిపుణులు రత్నమాల, ఆర్థో పెడీషియన్ అనిల్‌కుమార్, అనస్థీషియన్ రాజశ్రీ, వైద్యుడు తిరుపతి పాల్గొన్నారు. కాగా, ఇదే ఆస్పత్రిలో గత నెల 24న 24 గంటల వ్యవధిలో 17 ఆపరేషన్లు నిర్వహించారు.

'మొక్కజొన్న, పత్తి పంటలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి'

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో మొక్కజొన్న, పత్తి పంటలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దీని కోసం పంట మధ్యలో కాలువలు చేసి నీరు బయటకుపోయేలా చేయాలని రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, పరిశోధన సంచాలకుడు పి.రఘురామి రెడ్డి సూచించారు. పంట చేనులో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటే మొక్కలు చనిపోయే ప్రమాదం ఉందని, రైతులందరూ ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే గాలిలో తేమ శాతం 79 నుంచి 98 శాతం ఉండటం వల్ల వివిధ పంటల్లో తెగుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. సెప్టెంబర్‌లో వరి పంటను సాగు చేయొద్దని, వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆహార, చిరుధాన్యాలు, అపరాలు, నూనె గింజల పంటలను సాగు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఏ విధంగా ప్రవహించే నదులు తమ నామరూపాల్ని విడిచిపెట్టి సముద్రంలో విలీనమైపోతాయో, అదేవిధంగా జ్ఞానులైన మహాత్ములు తమ నామరూపాల నుండి విముక్తులై దివ్యపురుషుడైన పరమాత్మలో లీనమైపోతారు.

– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 7 సెప్టెంబర్ 2024

బుల్‌డోజర్ సంస్కృతికి కళ్లెం!

గత కొన్నేళ్లుగా బుల్‌డోజర్లతో చెలరేగుతున్న రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం చీవాట్లు పెట్టడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఈ చీడను వదల్చడానికి ఏం చేయాలో ప్రతిపాదనలివ్వాలంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించటంతోపాటు వాటి ఆధారంగా దేశవ్యాప్తంగా అమలయ్యేలా ప్రామాణిక మార్గదర్శకాలను రూపొందిస్తామని కూడా తెలిపింది. ఎక్కడైనా అడ్డదారులు పనికిరావు. పైగా చట్టబద్ధ పాలనకు ఆ ధోరణులు చేటు తెస్తాయి. కంచే చేను మేసినట్టు పాలకులే తోడేళ్లయితే ఇక సాధారణ పౌరులకు రక్షణ ఎక్కడుంటుంది? దేశంలో ఈ విష సంస్కృతికి బీజం వేసినవారు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. ఆయన్ను చూసి మొదట మధ్యప్రదేశ్ ప్రభుత్వం, ఆనక రాజస్థాన్‌లోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, మహారాష్ట్రలో ఆనాటి శివసేన–కాంగ్రెస్–ఎన్సీపీల కూటమి ప్రభుత్వం ఇష్టానుసారం చెలరేగి అనుమానితులుగా నిందితులుగా ఉన్నవారి ఇళ్లు, దుకాణాలు నేలమట్టం చేశాయి. హైదరాబాద్‌లో నీటి వనరులకు సమీపంలో, డ్రెయినేజిలకు అడ్డంగా ఉన్న నిర్మాణాలను కూల్చేయటానికి 'హైడ్రా' ఏర్పాటైంది. తెలంగాణలోని ఒకటి రెండు జిల్లాల్లో కూడా అధికారులు కూల్చివేతలు సాగించారు. తమకు కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా కూల్చేశారన్న ఫిర్యాదులొచ్చాయి. ఈవీఎం సర్కారుగా అందరితో ఛీకొట్టించుకుంటున్న ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే ప్రభుత్వం అధికారం వచ్చిరాగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలను కూల్చేయాలని చూసింది. హత్యలు, హత్యాయత్నాలు సరేసరి. తమకు ఓటేయలేదన్న కక్షతో పేదజనం ఇళ్లపై బుల్‌డోజర్లు నడిపింది. ఈ దుశ్చర్యలో ఒక మాజీ సైనికుడి ఇల్లు సైతం నేలకూలింది. ఏ చట్ట నిబంధనల ప్రకారం ప్రభుత్వాలు ఈ హేయమైన పనులకు పాల్పడుతున్నాయి? హత్యలతోనూ, బుల్‌డోజర్లతోనూ ప్రజానీకంలో భయోత్పాతం సృష్టించి ఎల్లకాలమూ అధికారంలో కొనసాగవచ్చని పాలకులు భావిస్తున్నట్టు కనబడుతోంది. దీన్ని సాగనీయకూడదు.

బుల్‌డోజర్ మార్క్ అకృత్యాలపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఎంత ఆగ్రహం వ్యక్తం చేసిందంటే... 'నిందితులు, అనుమానితులని ముద్రపడిన వారి విషయంలో మాత్రమే కాదు. ఆఖరికి నేరస్తులుగా నిర్ధారణ అయి శిక్షపడినవారి విషయంలో సైతం చట్ట నిబంధనల ప్రకారమే వ్యవహరించి తీరాలి' అని నిర్దేశించింది. చట్టబద్ధ పాలన ఎంతటి గురుతర బాధ్యతో చెప్పడానికి ఇది చాలదా? గోవధ కేసులో నిందితుడనో, అనుమానితుడనో భావించిన వ్యక్తిపై కక్ష తీర్చుకోవటానికి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటిచోట్ల ఇళ్లు, దుకాణాలూ నేలమట్టం చేసిన సందర్భాలు అనేకానేకం. ఈ పని చేశాక ఆ ఇల్లు లేదా దుకాణం నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిందనో, అక్రమంగా ఆక్రమించుకుని కట్టారనో, ఎప్పుడో నోటీసులు జారీచేశామనో అధికారులు సాకులు చెబుతున్నారు. అధికారుల్లో కొందరు ప్రబుద్ధులు ఏదో ఘనకార్యం చేశామన్నట్టు విందులు కూడా చేసుకుంటున్నారు. బాధితులు అవతలి మతస్తులైనప్పుడు కొందరు బాగా అయిందనుకుంటున్నారు. ఇది ప్రమాదకరమైన పోకడ. సమాజంలో ప్రతీకారేచ్ఛను పెంచి పోషించే దుశ్చర్య. ఇప్పుడున్న నాగరిక సమాజం ఎన్నో దశలను దాటుకుని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒక వ్యవస్థను ఏర్పర్చుకుంది. తప్పుడు వాగ్దానాలతోనో, కండబలంతోనో, ఈవీఎంలను ఏమార్చటం ద్వారానో అధికారాన్ని కైవసం చేసుకుని కేవలం అయిదేళ్లపాటు అధికారంలో ఉండటానికి వచ్చిన రాజకీయపక్షాలు ఎన్నో అగడ్తలను దాటుకుని వచ్చిన ఒక ప్రజాస్వామిక అమరికను ధ్వంసం చేయటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనీయ కూడదు. నిజానికి ఈ విషయంలో ఎంతో ఆలస్యం జరిగింది. ఎవరో న్యాయస్థానానికి ఫిర్యాదు చేయాలని, పిటిషన్ దాఖలయ్యాక నోటీసులు జారీచేసి చర్యలకు ఉపక్రమించవచ్చని అనుకోవటంవల్ల ఇలాంటి దుశ్చర్యలూ, వాటి దుష్పరిణామాలు సాగిపోతున్నాయి. ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పోతున్నాయి.

న్యాయస్థానాలు మీడియా కథనాలనే పిటిషన్‌లుగా స్వీకరించి ప్రభుత్వాలను దారికి తెచ్చిన సందర్భాలున్నాయి. ఆ క్రియాశీలత మళ్లీ అమల్లోకి రావాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే అందరూ న్యాయస్థానాలను ఆశ్రయించలేరు. వారికి ఆ స్థోమత ఉండకపోవచ్చు. కనుకనే న్యాయస్థానాలు తమంత తాము పట్టించుకోక తప్పదు. ప్రామాణికమైన మార్గదర్శకాలు రూపొందించాలన్న సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్ణయం హర్షించదగ్గదే. కానీ చర్మం మందం ప్రభుత్వాలు వీటికి తలొగ్గుతాయా? ఆమధ్య ఢిల్లీ హైకోర్టు అక్కడి అధికారులకు చేసిన సూచనలు ఈ సందర్భంగా గమనించదగ్గవి. వేకువజామునగానీ, సాయంసంధ్యా సమయం ముగిశాకగానీ ఎట్టి పరిస్థితుల్లోనూ బుల్‌డోజర్లు ప్రయోగించరాదని తెలిపింది. ముందుగా తగిన నోటీసులిచ్చి ప్రత్యామ్నాయ ఆవాసం చూపించేవరకూ అసలు కూల్చివేతలుండకూడదని చెప్పింది. కానీ ఆ తర్వాత కూడా అధికారులు దారికొచ్చిన దాఖలాలు లేవు. అందువల్లే మార్గదర్శకాలు రూపొందించేటపుడు కేవలం ఎలాంటి నిబంధనలు పాటించాలో చెప్పడం మాత్రమేకాక అసలు కూలగొట్టాల్సినంత ఆవశ్యకత ఎందుకేర్పడిందో నమోదుచేసే ఏర్పాటుండాలి. అధికారులకు జవాబుదారీతనాన్ని నిర్ణయించాలి. ప్రక్రియ సరిగా పాటించని సందర్భాల్లో కోర్టు ధిక్కార నేరంకింద కఠిన చర్యలుంటాయని చెప్పాలి. రాజకీయ కక్షతో, దురుద్దేశాలతో విధ్వంసానికి పూనుకున్న ఉదంతాల్లో వెంటవెంటనే చర్యలుండేలా చూడాలి. అన్నిటికన్నా ముఖ్యం– సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పులు, సూచనల స్ఫూర్తి కింది కోర్టులకు సైతం అందాలి. అలా అయినప్పుడే చట్టబద్ధ పాలనకు మార్గం ఏర్పడుతుంది.

దారి చూపగలది వ్యవ'సాయమే'!

విశ్లేషణ



డి. పాపారావు

దేశ జనాభాలోని అత్యధికులు ఇంకా వ్యవసాయ రంగంలోనే ఉండిపోవడం, వారి ఆదాయాలు నామమాత్రం కావడం దురదృష్టకరం. కానీ, ఈ ప్రతికూలతలోనే, మెరుగైన ఉపాధి కల్పనకు, డిమాండ్ పెంపుదలకు అవకాశాలను వెతుక్కోవచ్చు. 60 శాతం వ్యవసాయ ఆధారిత గ్రామీణ జనాభా ఆదాయాలను పెంచగలిగితే, అది దేశీయంగా మెజారిటీ జన సామాన్యం కొనుగోలు శక్తిని పెంచుతుంది. ఉదాహరణకు బాగా ఆదాయం వచ్చిన ఒక పసుపు రైతు... కారు, బైకు, గృహోపకరణాలు కొనుగోలు చేస్తే, ఆ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. గ్రామీణ కొనుగోలు శక్తి పెరుగుదల దేశంలోని నగర ప్రాంతాలలో కూడా పారిశ్రామిక రంగానికి ఊతాన్నిచ్చి, తద్వారా నగరాలలో కొత్త ఉపాధి కల్పనకూ, డిమాండ్ పెరుగుదలకూ కారణం కాగలదు.

దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. 2018 డిసెంబర్ నాటికే 45 ఏళ్ల గరిష్ఠ స్థాయిలో ఉందని జాతీయ నమూనా సర్వే గణాంకాలు వెలుగు చూశాయి. ఈ కారణాల చేతనే 2023 ఆర్థిక సంవత్సరంలో దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 22 శాతం (అంతకు ముందటి సంవత్సరం కంటే) అంటే, 46 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అదే కాలంలో స్టాక్ మార్కెట్‌లోకి వచ్చిన పెట్టుబడులను కూడా కలిపితే, దేశంలోకి వచ్చింది 70.97 బిలియన్ డాలర్లు. అంతకు ముందరి సంవత్సరంలో ఈ మొత్తం 84.83 బిలియన్ డాలర్లు. ఇది, దేశీయంగా డిమాండ్ తగ్గుదలను సూచిస్తోంది. మరో పక్కన, భారతదేశం నుంచి విదేశాలకు పెట్టుబడులుగా వెళ్ళిన మొత్తం 2023లో, దానికి ముందరి సంవత్సరం కంటే 50 శాతం మేరన అంటే, 23.50 బిలియన్ డాలర్లకు మందగించింది. ఇది, అంతర్జాతీయంగా డిమాండ్ పతనాన్ని సూచిస్తోందని రిజర్వు బ్యాంక్ గణాంకాలు చెబుతున్నాయి.

స్థూలంగా మనం గమనించవలసిన మరో అంశం కూడా ఉంది. అంతర్జాతీయంగా ప్రజల కొనుగోలు శక్తి పతనం కంటే, మన దేశంలోని ప్రజల కొనుగోలు శక్తి పతనం మరింత అధికం. దీనికి తార్కాణం, 1992 – 2012 కాలంలో, సరుకుల వ్యాపారంలో మన దేశం తాలూకు లోటు (ఎగుమతి, దిగుమతుల మధ్యన వ్యత్యాసం) సాలీన సగటున కేవలం 11 బిలియన్ డాలర్లు ఉండగా, అది ప్రస్తుత దశాబ్ద కాలంలో సాలీన సగటున 150 బిలియన్ డాలర్లకు పెరిగింది. దేశం ఎగుమతి చేస్తోన్న దాని కంటే, దిగుమతి చేసుకుంటోన్న సరుకుల విలువ పెరిగిపోయింది.

దేశ స్థూలజాతీయ ఉత్పత్తిలో సరుకు ఉత్పత్తిరంగం వాటాను పెంచడం కోసం, 2014 సెప్టెంబర్‌లో ఆరంభమైన 'మేకిన్ ఇండియా' కార్యక్రమం విఫలం అయ్యింది. ఈ పథకం ఆరంభం తర్వాత, దేశంలో సరుకు ఉత్పత్తిరంగం ఎదగకపోగా, మరింత కుంచించుకుపోయింది. 2019లో ఉత్పత్తిని పెంచేందుకు కార్పొరేట్లకు ప్రోత్సాహకం పేరిట, 32 నుంచి 22% మేరకు తగ్గించిన కార్పొరేట్ పన్ను రేటు కూడా పెట్టుబడులను పెంచ లేకపోయింది. దీనితో పాటుగా 2020 నుంచి కేంద్ర ప్రభుత్వం, ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల పేరిట పి.ఎల్.ఐ. పథకాన్ని తెచ్చింది. 14 రంగాల కార్పొరేట్ ఉత్పత్తి సంస్థలకు ఈ పథకం కింద రాయితీలు ఇస్తోంది. అయినా, కేవలం 2, 3 పారిశ్రామిక రంగాలలో మాత్రమే కొద్ది మేరకు పెట్టుబడులు పెరిగాయి. ఈ పథకం కాస్తంత సానుకూల ఫలితాన్ని సాధించింది అనుకున్న స్మార్ట్ ఫోన్ల రంగంలో కూడా 2023 జూలై నాటికి వరుసగా రెండు త్రైమాసికాలలో ఎగు మతులు పతనం అయ్యాయి.

మరో పక్కన దేశీయ సేవారంగం పరిస్థితి కూడా అంతంత మాత్రమే. సేవా రంగంలోని కీలక విభాగాలైన ఐటీ, బీపీఓ రంగాలలో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. దేశంలోని ప్రధాన ఐటీ కంపెనీలలో, 2024 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం నాటికి ఉద్యోగుల సంఖ్య, అంతకు ముందరి కాలం కంటే తగ్గిపోయింది. ఇక, మిగిలింది దేశీయ వ్యవసాయ రంగం. నేడు, గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా ఉన్న వారి సంఖ్య 48.3%. ఎంతో కొంత వ్యవసాయం ఆధారంగా జీవించే వారిని కూడా కలిపితే ఇది 60% అవుతుంది. ప్రస్తుతం, గ్రామీణ రైతు కుటుంబ నెలవారీ సగటు ఆదాయం 10,218 రూపాయలు మాత్రమే. ఇది జాతీయ తలసరి సగటు ఆదాయం అయిన 10,495 రూపాయలకంటే తక్కువ. ఈ 60% జనాభా ఆదాయాలను పెంచగలిగితే, అది దేశీయంగా మెజారిటీ జన సామాన్యం కొనుగోలు శక్తిని పెంచుతుంది. మరి వ్యవసాయ ఆదాయాల పెంపుదలకు చేయవలసింది ఏమిటి?



దీనికి ఒకటే జవాబు. వ్యవసాయదారులకు, వారి ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయడం. 'గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇన్‌క్యుబేటర్' సంస్థ ఇచ్చిన నివేదిక మేరకు, మన దేశ గ్రామీణ యువ జనులలోని 70– 85% మంది తక్కువ నిపుణతలు అవసరమైన చిన్న సరుకు ఉత్పత్తి రంగంలోనూ లేదా రిటైల్ రంగంలోనూ ఉపాధిని కోరుకుంటున్నారు. అంటే, వారు లాభసాటిగా లేని వ్యవసాయం నుంచి బయట పడాలనుకుంటున్నారు. కానీ, వారిలోని 60% మంది ఉపాధి కోసం తమ గ్రామాన్ని విడిచి వెళ్ళాలని కోరుకోవడం లేదు. కోవిడ్ అనంతర కాలంలో నగర ప్రాంత కార్మికులలోని పెద్ద విభాగం తిరిగి తమ గ్రామాలకు వెళ్ళిపోయింది. నేడు నగర ప్రాంతా లలో ఉపాధి అవకాశాలు బలహీనంగా ఉండడంతో, వీరిలోని అత్య ధికులు తిరిగి నగరాలకు వచ్చేందుకు సిద్ధంగా లేరు.

గ్రామీణ రైతాంగ ఆదాయాలు పెరిగితే, అది దేశీయంగా డిమాండ్ కల్పనను ఏ విధంగా తేగలదనేదానికి ఒక ఉదాహరణ చెప్పుకోవచ్చు. 2006–07లో నిజామాబాద్ జిల్లాలో పసుపు పంట బాగా పండింది. ఆ సంవత్సరంలో అంతర్జాతీయంగా కూడా భారీగా ధర పలికింది. ఫలితంగా, పసుపు రైతులు చాలామంది సొంతిళ్లు నిర్మించుకున్నారు. కార్లు, బైకులు కొనుక్కున్నారు. టీవీలు, ఫ్రిజ్‌ల వంటి గృహోపకరణాలు కొనుగోలు చేశారు. ఇక్కడ గమనించవలసింది, రైతుకు గనుక మంచి ఆదాయం ఉంటే... సిమెంట్, స్టీలు, వాహనాలు, గృహోపకరణాల వంటి ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. ఈ పారిశ్రామిక సరుకుల ఉత్పత్తి కేంద్రాలుగా నగరాలు ఉంటాయి. కాబట్టి, గ్రామీణ కొనుగోలు శక్తి పెరుగుదల దేశంలోని నగర ప్రాంతాలలో కూడా పారిశ్రామిక రంగానికి ఊతాన్నిచ్చి, తద్వారా నగరాలలో కొత్త ఉపాధి కల్పనకూ, డిమాండ్ పెరుగుదలకూ కారణం కాగలదు. ప్రస్తుత స్థితిలో దేశ జనాభాలోని కేవలం 20–30% మంది కొనుగోలు శక్తిపై ఆధారపడి ఉన్న మార్కెట్ కంటే, 60% మంది జనాభా తాలూకు కొనుగోలు శక్తి దేశీయ మార్కెట్‌కూ, ఉపాధి కల్పనకూ అత్యుత్తమమైన స్థితిగా ఉండగలదు.

కానీ కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను కల్పించేందుకు సిద్ధంగా లేదు. 1991లో ఆర్థిక సంస్కరణలు మొదలైన తర్వాత, గ్రామీణ ప్రాంతాలకు వ్యతిరేకమైన, నగర ప్రాంత కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలు అమలయ్యాయి. ఈ విధానాల సారాంశం: రైతాంగ ఉత్పత్తులకు ధరలను తక్కువ స్థాయిలోనే ఉంచడం. ఎందుకు? తద్వారా నగర ప్రాంతాలలో నిత్యావసర ధరలను తక్కువ స్థాయిలో ఉంచొచ్చు. దీని వలన, ఈ కార్పొరేట్లపై నగర ప్రాంతాల ఉద్యోగులు, కార్మికుల నుంచి అధిక వేతనాల కోసం డిమాండ్లు ఉండవు. వ్యవసాయం లాభసాటిగా ఉంటే, గ్రామీణ యువజనులు ఉపాధి కోసం నగరాల బాట పట్టరు. అంటే, నగర ప్రాంతాలలో కార్మికుల సప్లై తగ్గి కొరత ఏర్పడుతుంది. దాని వలన, వారికి డిమాండ్ పెరిగి కార్పొరేట్లు ఎక్కువ జీతాలతో పనిలో పెట్టుకోవాల్సి వస్తుంది. నగరాలకు నిరంతర కార్మికుల సరఫరా కోసం వ్యవసాయాన్ని నష్టాలలోనే ఉంచాలి.

ఇప్పుడిప్పుడే కనీసం ఆలోచనల రూపంలో భిన్నమైన వాదనలు వినపడుతున్నాయి. ఈ మధ్యన కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ ఇలా పేర్కొన్నారు: అంతర్జాతీయంగా వృద్ధి మందగిస్తోన్న దృష్ట్యా మనం ఏ రంగాన్ని కూడా తక్కువగా చూడగల స్థితిలో లేము. వ్యవసాయం కూడా ఆర్థిక వృద్ధికి చోదకశక్తిగా ఉండాలి. అంటే, వ్యవసాయాన్ని తిరిగి మరలా 'ఆకర్షణీయంగా' చేయగలగాలి. ఉదాహరణకు, నేడు బ్రెజిల్‌లో యువజనులు, గతంలో కంటే ఎక్కువగా వ్యవసాయంలో భాగం పంచుకుంటున్నారు. కాబట్టి, ప్రస్తుత ఆర్థిక సంక్షోభ కాలంలో వ్యవసాయ ఆధారిత సరికొత్త నమూనాని విస్తృతంగా ప్రజల్లో చర్చకు పెట్టాలి. ఇది మాత్రమే దేశీయ నిరుద్యోగం, కొనుగోలు శక్తి పతనాలకు పరిష్కారంగా ఉండగలదు.

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక రంగాల విశ్లేషకులు
మొబైల్: 98661 79615

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

స్వాగతిస్తాం!



కశ్మీర్ మ్యూజింగ్: బడ్‌గామ్ దగ్గరి ఒక గ్రామంలో ఓ పశ్మీనా శాలువాల నేతకాడు నాకు కన్నీళ్లు తెప్పించాడు. "మా డాక్టర్, స్కూల్ ప్రిన్సిపాల్ కశ్మీరీ పండితులు. వాళ్లు బాగా గుర్తొస్తున్నారు. వాళ్లు తిరిగి రావాలని కోరుకుంటున్నాను. వాళ్లొస్తే ప్రతీ గ్రామస్థుడూ వారి భద్రతకు గ్యారంటీ ఇస్తాడు." ఆశావహ గొంతుకలు.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

రెండు నగరాలు



పుణెలో ఎవరైనా సూపర్‌మార్కెట్‌కో, పచారీకొట్టుకో వెళ్తే స్వయంగా బట్ట బ్యాగు తీసుకెళ్లాలి. లేదంటే వాళ్ల దగ్గర కొనుక్కోవాలి. దీనివల్ల ప్లాస్టిక్ బ్యాగుల వాడకం బాగా తగ్గిపోయింది. అదే ఢిల్లీలో కూడా నియమం ప్రకారం దుకాణాలు ప్లాస్టిక్ బ్యాగులు ఇవ్వకూడదు. కానీ దాన్నెవరూ అమలు చేయడం లేదు. ఎంత సిగ్గుచేటు!

– షమా మహమ్మద్, కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి

ఊహించని మార్పులు



వాతావరణంలోని అనూహ్య మార్పులకు ఉత్తర సూడాన్ రుజువు. ఒకప్పుడు ఎడారిగా గుర్తించిన ప్రాంతాన్ని కూడా వరదలు ముంచెత్తుతున్నాయి. వరదలు తమ నివాసాల్లోకి రాకుండా జనాలు అడ్డుకట్టలు వేసుకోవాల్సి వస్తోంది.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

ప్రవర్తన నేర్చుకోవాలి



ఆత్మ రక్షణ అనేది నేర్చుకోవడం మహిళ బాధ్యత కాదు. కానీ ఎలా ప్రవర్తించాలో నేర్చుకోవడం మాత్రం కచ్చితంగా మగవాడి బాధ్యత. మహిళల భద్రత బరువును మహిళల మీద మోపకండి. సిగ్గులేకుండా దీన్ని విస్మరిస్తున్నారు.

– దేవ్‌లీనా గంగూలీ, నటి

వదిలిపెట్టరు!



ప్రతి ఒక్కరూ మిమ్మల్ని మరిచిపోతారు. మీ తల్లిదండ్రులు, మీ పిల్లలు, మీ తోడ బుట్టినవాళ్లు, మీ భాగస్వామి, మీ స్నేహితులు, అందరూ. మిమ్మల్ని ఎవరు మరిచిపోరో తెలుసా? బజాజ్ ఫైనాన్స్. 'నాకు ఆసక్తి లేదు' అని చెప్పినాసరే వాళ్లు ప్రతిరోజూ రెండు సార్లు ఫోన్ చేస్తారు. అదీ ప్రేమ.

– అభిషేక్ ముఖర్జీ, కంటెంట్ క్రియేటర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

సంగీత సాహిత్య సమలంకృతే!

సందర్భం



ఇంద్రగంటి జానకీబాల

నటి, గాయని, రచయిత్రి, ఇంకా చెప్పాలంటే చాలా ప్రక్రియల్లో ఆమె దిట్ట – కానీ ఇవి చాలు ఆమెలోని వ్యక్తిత్వం, ప్రతిభ చెప్పడానికి.

పి. భానుమతి అంటే సినిమాలతో, ముఖ్యంగా తెలుగు సినిమాలతో, అదీ కాస్త పాత సినిమాలతో (1945–1960) ఏ మాత్రం పరిచయం, ఆసక్తి ఉన్న వాళ్లకైనా ప్రత్యేకంగా ఎక్కువ చెప్పనవసరం లేదు.

ఆమె సంగీత దర్శకత్వం వహించారు. సినిమా దర్శకత్వమూ వహించారు. ఆమె భర్త పి. రామకృష్ణ సుప్రసిద్ధ దర్శకులు.

గాయనిగా, పాడుతూ నటించిన చక్కని పాత తరం నటిగా, ఎన్నో కళలకు ఆలవాలమైన ఆమె గుర్తుకొస్తూనే ఉంటుంది. ఆమె గళం, పాటలు తెలుగువారికి ప్రాణ సమానం. ఆమెలోని ప్రతిభను ఆరాధిస్తూ, ఆమెను అభిమానించే వారు ఎంతమందో ఉన్నారు.

సాధారణంగా నట జీవితంలో ఉన్నవారికి, నాట్యం, కాస్త సంగీతం మీద ఆసక్తీ, ప్రవేశం ఉండటం సహజం. కానీ పాలువాయి భానుమతి ప్రతిభావంతమైన రచయిత్రి కావడం గొప్ప విషయం. ఆమె ఎన్నో మాములు కథలు రాసినా 'అత్తగారి కథలు' ద్వారానే ఆంధ్ర దేశంలో తెలుగు పాఠకులకు సుపరిచితులయ్యారు. సాధారణంగా నటులు, గాయకులు, నాట్య కళాకారులు, సంగీత కళాకారులు, వారు చేపట్టిన ప్రక్రియలోనే బాగా సాధన చేసి కీర్తి, డబ్బు గడిస్తారు. కానీ భానుమతి రచనలో కృషి చేసి, ప్రతిభ కనబరిచి, కీర్తి గడించారు. ఇది అపురూపం. ఆమె సినిమా స్క్రిప్ట్ తయారు చేసినా, దర్శకత్వం వహించినా, సినిమా స్టూడియోని నిర్వహించినా... అసలు సినిమా ఛాయలు లేని అత్తగారి కథల ద్వారా, తెలుగు పాఠకులకు ఎంతో చేరువయ్యారు. రచన చేయాలంటే దానికొక ప్రత్యేకమైన మానసిక వ్యవస్థ, ఆలోచన, రచన చేయగల శక్తీ ఉండాలి. అందులో మధ్యతరగతి మామూలు అత్తగారు. అదీ చాలామంచి అత్తగారు. కోడల్ని ప్రేమించి, గౌరవించే అత్తగారు. ఆమె చుట్టూ ఈ కథలు, కథల సన్నివేశాలు, కథా వస్తువులు సృష్టించబడి మంచి రక్తి కట్టాయి. ఇది చాలా విచిత్రం. సాధారణంగా అత్తగారు అంటే కోడల్ని సాధించేది. మాటలతో హింసించేది. ఇంకా ఎన్నో కష్టాలు పెట్టేదిగా మనకి తెలుసు. కానీ భానుమతి అత్తగారు ఎంతో ఉత్తమురాలు. కోడల్ని అపురూపంగా చూసుకునే, అరుదైన అత్తగారు. ఈ అత్తగారి కథలన్నీ హాస్యరస ప్రధానంగా ఉండటం మరీ కొత్తగా, ఆహ్లాదకరంగా ఉంటాయి.

ఆమె రూపొందించిన సినిమాల్లో కూడా హాస్యం అందమైన ఆభరణం. ఒక మాట విరుపు – ఒక భావ ప్రకటన హాస్యంతోనే రంగరించి ఉంటాయి. అందుకే ఆమె సినిమాల్లోనూ సమస్య గంభీరమైనదైనా దాని నడక హాస్య రస ప్రధానంగా ఉంటుంది. అలా మరెవ్వరూ చేయలేకపోయారు. ముఖ్యంగా రచయిత్రులు అలాంటి రచన, పోనీ సినిమా రచన చేయడానికీ సాహసించలేదు.

నేను మద్రాసు వెళ్ళి భానుమతిని కలిసి మాట్లాడాలని అనుకున్నపుడు, నాకు ఆ అవకాశం కల్పించినవారు ముళ్లపూడి వెంకటరమణగారు. నేను



బహుముఖ ప్రజ్ఞాశాలి భానుమతి (1925-2005)

వాళ్ళింట్లోనే దిగి, చాలామంది సినీ కళాకారులను కలిసి, మాట్లాడి వ్యాసాలు రాశాను. ఆ సంపుటే 'కొమ్మా–కొమ్మా కోకిలమ్మ'. భానుమతి ఇంటికి వెళ్లినప్పుడు ఆమె చాలా ఆదరంగా ఆహ్వానించారు. పచ్చగా ఉన్న ఆమె ముఖం సంగీత, సాహిత్య కళతో వెలిగిపోతోంది. శ్రీకాంత శర్మ గురించి చెప్పినప్పుడు చాలా ఆప్యాయంగా, గౌరవంగా స్పందించారు.

'ఇదిగో ఇక్కడే కూర్చుని 'మనసున మల్లెల మాలలూగెనే' పాట రిహార్సల్స్ చేశాము' అని చూపించారు. నాకెంతో పులకింత కలిగింది.

ఆమె పాటలు కంపోజ్ చేసే సంగీత దర్శకులకి ఆమె ఎలా సహకరించేవారో, సలహాలిచ్చేవారో చక్కగా, వివరంగా చెప్పారు. కొందరికి అది అతిశయోక్తిగా అనిపిస్తుందేమోగానీ, నాకు చాలా ఉత్సాహంగా అనిపించింది. కొన్ని ప్రజాదరణ పొందిన పాటల రూపకల్పనలో తానెలా పాలు పంచుకునేవారో చెప్పారామె.

భానుమతి మాట్లాడే తీరులో గర్వంగానీ, అతిశయంగానీ నాకు కనిపించలేదు. ఆత్మవిశ్వాసాన్ని గర్వంగా మనవాళ్ళు అర్థం చేసుకోవటం తరచూ చూస్తూనే ఉంటాం. నేను ఆమెతో ఉన్నంతసేపు హాయిగా, స్వేచ్ఛగా, నిరాడంబరంగా మాట్లాడారు. వారి అత్తగారి గురించి చక్కని, మంచి, మృదువైన మాటలు చెప్పారు. రామకృష్ణతో ఆమె వివాహం అయిన తర్వాత 'మీరు ఆమెను వివాహం చేసుకున్నారు కదా' అని ఎవరైనా అంటే రామకృష్ణ 'నేను కాదు. ఆమే నన్ను వివాహం చేసుకున్నారు' అని పరిహాసంగా జోక్ చేసేవారని మిత్రులు చెప్తూ ఉంటారు.

గాయనిగా తెలుగు సినీ చరిత్రలో భానుమతికి ప్రత్యేక స్థానముంది. దానికి కొన్ని ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఆమెది చాలా విలక్షణమైన కంఠం. పైగా శ్రుతి కూడా కాస్త తక్కువగానే పెట్టుకుని పాడేవారు. రయ్యిమని పైకి వెళ్ళడం కంటే రమ్యంగా కింద స్థాయిలో అందంగా, హృదయంతో పాడటమే ముఖ్యం అని ఆ తరం సంగీతజ్ఞులు భావించారనిపిస్తుంది. ఆ ఆలోచనకి భానుమతి చక్కని ఉదాహరణ.

ఆమె తక్కువ శ్రుతిలో పాడటంవల్ల ఆమెతో యుగళ గీతం పాడాలంటే ఎంతో నేర్పు ప్రదర్శించాల్సి ఉంటుంది. అందులో సిద్ధహస్తులు ఘంటసాల వారైతే... ఆమెతో పాటను రక్తి కట్టించిన వారు పి.బి. శ్రీనివాస్ వంటివారు.

భానుమతిలో మరో వినూత్నమైన అంశం ఆమె సినిమాల్లో ఒక సంప్రదాయ కీర్తన, అష్టపది, అన్నమయ్య కీర్తన... అలా ఏదో ఒకటి పెట్టి శ్రోతలకు శాస్త్రీయ సంగీతంపట్ల ఆసక్తి కలిగేలా చేశారు.

పక్కల నిలబడి – త్యాగరాజ కీర్తన, మీనాక్షీ మేముదం– దీక్షితార్ కీర్తన, సావిరహే– అష్టపది... ఇలా ఎన్నో ఉన్నాయి. 'వివాహ బంధం'లో ఆమె వీణ వాయించి కీర్తన పాడతారు. వీణ మెట్లపై సరైన స్వర స్థానాల్లో వేళ్ళు కదిలిస్తూ అత్యంత సహజంగా ప్రతిభావంతంగా నటించారు.

గ్లామర్, డబ్బు, పేరు ప్రతిష్ఠలు ఇచ్చే ఉన్న సినిమా పరిశ్రమలో ఉంటూ తామరాకు మీద నీటి బొట్టులా తన సొంత వ్యక్తిత్వం, ప్రతిభ, సాధనతో... తన మాట నిలబెట్టుకున్న అరుదైన విదుషీమణి భానుమతి.

వ్యాసకర్త కవయిత్రి, రచయిత్రి, గాయకురాలు

(నేడు భానుమతి శతజయంతి సంవత్సర ప్రారంభం)

ఏకదంతం ఉపాస్మహే



'ఆడంబరాలూ, ఆర్భాటాలూ, అహంకారాలూ అనర్థదాయకాలు. నిగర్వం, నిరాడంబరతా, సరళత్వం, సౌశీల్యం వల్లే స్థిరమైన ఆనందం' అని వినాయకుడి విగ్రహమే బోధిస్తుంది. అన్ని ఆడంబరాలకూ, భేషజాలకూ ఆయన దూరం.

అమ్మవారు తన చేతులారా సృష్టించిన అందమైన రూపం ఆయనది. ప్రమాదం జరిగి, మళ్ళీ ప్రాణ ప్రతిష్ఠ జరిగినప్పుడు, కోరుకుంటే మునుపటి కంటే సుందరుడు కాలేక కాదు ఆయన గజముఖుడయింది. 'నశ్వరమైన బాహ్య సౌందర్యం గురించి నానా ఆరాటాలు పడటం వల్ల నష్టమే కానీ లాభం లేదు' అని లోకానికి తెలపడం కోసం ఆయన లంబోదరుడయ్యాడు.

"క్షణికమైన దేహం మీద 'అదే నేను' అన్న అభిమానం కూడదు. ఎంతెంతో శ్రమించి, ఏవేవో సేవించి, కండల పలకలతో శరీ రాన్ని శిల్పంలా మలచుకోవటం కంటే, భగవద్దత్తమైన దేహాన్ని పది కాలాల పాటు పదిలంగా ఉంచుకొని వివేకంతో వినియోగించు కోవటం ముఖ్యం" అని చెప్పక చెప్తాడు శ్రీగణనాథుడు.

జ్యోతిర్మయం

విఘ్నేశ్వరుడిది గుజ్జు రూపమే కావచ్చు, కానీ విక్రమ లోపమేమీ లేదు. పరశు రాముడికే చుక్కలు చూపిన పరాక్రమశాలి ఆయన. పాండిత్యంలో ప్రకాండుడు అయినా, పారాశరుడు కోరగా వట్టి వ్రాయసకాడై, మహాభారత సంహిత నిర్మాణంలో సహకరించి, అల్పత్వమూ – ఆధిక్యమూ చేసే పనిలో లేదు; చేపట్టినవాడి ప్రావీణ్యంలో ఉంది అని చూపినవాడు శూర్పకర్ణుడు.

వాహనాల ఆడంబరంవల్ల క్రియాసిద్ధి కలగదు. వాహన చోదకుడి కౌశలం వల్ల కలుగు తుంది అని వక్రతుండుడి వాహనం వాక్కు లేకుండానే వక్కాణిస్తుంది.

ఈ లోకంలో ఇన్ని రకాల ఆహారాలుండగా ఇభవదనుడు మెచ్చి చేతపట్టేది ఉప్పనా చప్పనా లేని ఉండ్రాళ్ళను! 'జిహ్వాచాపల్యం జయిస్తే, జితేంద్రియత్వాన్ని సగం సాధించినట్టే. ఆహారం కోసమే జీవనమని భావించి బతికేవాళ్ళకు, ఆరోగ్య సమస్యలు తప్ప అసలయిన పురుషార్థాలేవీ సిద్ధించవు' అని హిమగిరి పౌత్రుడి హితవు.

పూజలకు కావలసింది పుష్పాలూ, పూజాద్రవ్యాల ఆర్భాటం కాదు. చిత్తశుద్ధి ఉంటే చేతికందిన ఆకులతో పూజ చేసినా మనసారా మెచ్చడం మహాదేవ సుతుడి మతం. అగజా – ఆనన – పద్మ – అర్కుడూ, అనేక వరదాతా అయిన ఏకదంత గజాననుడికి వినాయక చతుర్థి సందర్భంగా వేయి వేల వందనాలు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.చవితి ప.1.54 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** చిత్త ఉ.10.31 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** సా.4.41 నుండి 6.25 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.40 నుండి 7.26 వరకు, **అమృతఘడియలు:** రా.3.07 నుండి 4.51 వరకు, వినాయక చవితి ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.08.

చదువులూ వరద పాలు!

- భారీ వర్షాలతో మానుకోటలో 188, ఖమ్మంలో 72 పాఠశాలలపై ఎఫెక్ట్
- స్కూళ్లు, ఇళ్లలో తడిసిన పుస్తకాలు, కొట్టుకుపోయిన బ్యాగ్‌లు
- దెబ్బతిన్న కంప్యూటర్లు, రికార్డులు, సర్టిఫికెట్లు
- వేలాది మంది విద్యార్థుల చదువులకు ఇబ్బంది
- రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో బడులకు వెళ్లలేని పరిస్థితి



నిచ్చెన పైకి ఎక్కి వెళ్తున్న ఉగ్గంపల్లి విద్యార్థులు



జలగంనగర్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మేటలు వేసిన బురద

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/సాక్షి, మహబూబాబాద్‌: భారీ వర్షాలు మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో విద్యార్థుల చదువునూ వరదపాలు చేశాయి. మానుకోటలో 188 పాఠశాలలు, ఖమ్మం జిల్లాలో 72 పాఠశాలలు దెబ్బతిన్నాయి. శ్లాబ్‌లు కూలిపోవడం, పగుళ్లు రావడం, లీకేజీలు, కాంపౌండ్ వాల్ దెబ్బతినడం, కిచెన్ షెడ్ కూలిపోవడం, ఫర్నిచర్ దెబ్బతినడం, పుస్తకాలు, కంప్యూటర్లు, రికార్డులు, సర్టిఫికెట్లు తడిసిపాడైపోవడం వంటివి సమస్యగా మారాయి. అటు ముంపు ప్రాంతాల్లోని ఇళ్లలోనూ విద్యార్థుల బ్యాగులు, పుస్తకాలు తడిసి పాడైపోయాయి. దీనితో వేలాది మంది విద్యార్థుల చదువుపై ప్రభావం పడే పరిస్థితి నెలకొంది. సోమవారం నుంచి బడులు తెరుచుకోనున్న నేపథ్యంలో చదువులు ఎలా సాగుతాయి, మళ్లీ పుస్తకాలు కొనడం ఎలాగని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల ఇది. రెండు అంతస్తుల ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్ తరగతి గదుల్లో బురద మేటలు వేశాయి. తొమ్మిదో, పదో తరగతి పుస్తకాలు తడిసి పాడైపోయాయి. పాఠశాలను చూసేందుకు వచ్చిన తొమ్మిదో తరగతి విద్యార్థులు రాంచరణ్, వరుణ్‌తేజ్, ప్రైమరీ స్కూల్ విద్యార్థులు ఇక్కడి పరిస్థితి చూసి ఆవేదన చెందారు.

బడికి వెళ్లాలంటే.. సర్కస్ ఫీట్లే..


మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరు– ఉగ్గంపల్లి మార్గంలో బ్రిడ్జి పక్కన రోడ్డు తెగిపోయింది. దీంతో విద్యార్థులు బడికి వెళ్లేందుకు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. తల్లిదండ్రులు బ్రిడ్జి పైనుంచి నిచ్చెన సాయంతో పిల్లలను కిందికి దింపి, రోడ్డుపైకి తీసుకెళ్లి పంపిస్తున్నారు. సాయంత్రం మళ్లీ అదే తరహాలో తిరిగి తీసుకెళుతున్నారు.

భయం భయంగా వెళ్లాల్సి వస్తోంది



మంగళవారం నుంచి రెండు రోజులు బడికి వెళ్లలేదు. మూడోరోజు మా నాన్న బ్రిడ్జి వద్దకు వచ్చి నిచ్చెన మీది నుంచి కిందికి దింపి రోడ్డు వరకు తీసుకొచ్చి బడికి పంపించాడు. సాయంత్రం మళ్లీ వచ్చి తీసుకెళ్లాడు. బ్రిడ్జి పైనుంచి నిచ్చెనతో దిగాలన్నా.. ఎక్కాలన్నా భయం వేస్తోంది.

– ఏనుగంటి శ్రీజ, ఏడో తరగతి, ఉగ్గంపల్లి



బీసీ కమిషన్ చైర్మన్‌గా జి.నిరంజన్

- సభ్యులుగా రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి
- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా ఎం.కోదండరెడ్డి
- విద్యా కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి



జి.నిరంజన్



సురేందర్



ఎం.కోదండరెడ్డి



ఆకునూరి మురళి



జయప్రకాశ్



బాలలక్ష్మి

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన వర్గాల (బీసీ) కమిషన్ చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోపిశెట్టి నిరంజన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది. తెలంగాణ వెనుకబడిన వర్గాల కమిషన్ చట్టం– 1993 (సెక్షన్–3) ప్రకారం బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం రాత్రి జీవో నం.199 విడుదల చేశారు. కమిషన్ సభ్యులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాపోలు జయప్రకాశ్, సీనియర్ జర్నలిస్టు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ తిరుమలగిరి సురేందర్, ఉస్మానియా విద్యార్థి నాయకురాలు బాలలక్ష్మి నియమితులయ్యారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి కమిషన్ సభ్య కార్యదర్శిగా కొనసాగుతారు. రాష్ట్రంలో బీసీల గణన నిర్వహించి స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లను నిర్ధారించడం కోసం ప్రత్యేకంగా ఈ కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా కొత్తగా ఏర్పాటు కానున్న బీసీ కమిషన్ మూడేళ్ల కాలపరిమితిని కలిగి ఉంటుంది. ఇలావుండగా.. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ధరణిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో కోదండరెడ్డి కీలక సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ఈయన రెండుసార్లు ఎమ్మెల్యేగా, హుడా చైర్మన్‌గా సేవలందించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి నియమితులయ్యారు. ఈ రెండు కమిషన్ల పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుందని శుక్రవారం రాత్రి విడుదల చేసిన రెండు వేర్వేరు ఉత్తర్వుల్లో సీఎస్ శాంతికుమారి పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నివేదిక

- పీజేడబ్ల్యూసీ ముందుకు తెలంగాణ వక్ఫ్‌బోర్డు ప్రతినిధుల బృందం



పార్లమెంటరీ జాయింట్ వర్కింగ్ కమిటీకి తెలంగాణ వక్ఫ్ బోర్డు తరపున అభిప్రాయాలు, సూచనల నివేదిక అందజేస్తున్న ప్రతినిధుల బృందం

సాక్షి, హైదరాబాద్‌: కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వక్ఫ్ సవరణ బిల్లు–2024ను వ్యతిరేకిస్తూ తెలంగాణ వక్ఫ్ బోర్డు ప్రతినిధుల బృందం పార్లమెంటరీ జాయింట్ వర్కింగ్ కమిటీకి నివేదిక సమర్పించింది. శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో జాయింట్ వర్కింగ్ కమిటీ సభ్యులను కలిసి తెలంగాణ వక్ఫ్ బోర్డు తరఫున అభిప్రాయాలు, సూచనలను అందజేసింది. ఇప్పటికే తెలంగాణ వక్ఫ్‌బోర్డు పాలకమండలి కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వక్ఫ్ సవరణ బిల్లును తిరస్కరిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది. పీజేడబ్ల్యూసీ ముందు హాజరైన బృందంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, బోర్డు సభ్యులు సయ్యద్ అక్బర్ నిజాముద్దీన్ హుస్సేన్, అబుల్ ఫతే సయ్యద్ బందగి బాద్‌షా ఖాద్రీ, సయ్యద్ నిసార్ హుస్సేన్, ముఖీద్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మొహమ్మద్ ఒబేదుల్లా కొత్వాల్, వక్ఫ్‌బోర్డు సీఈఓ మహమ్మద్ అసదుల్లా, హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ లియాకత్ హుస్సేన్ తదితరులున్నారు.

టీజీడీఎస్సీ ఫైనల్ 'కీ' విడుదల


సాక్షి, హైదరాబాద్‌: టీజీడీఎస్సీ పరీక్షల ఫైనల్ 'కీ'ని పాఠశాల విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసింది. ఫైనల్ 'కీ' తో పాటు అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు టీజీడీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. టీజీడీఎస్సీ పరీక్షలకు సంబంధించి ప్రాథమిక 'కీ' ఆగస్టు 13న విడుదలైన సంగతి తెలిసిందే. ఆగస్టు 20వ తేదీలోగా అభ్యంతరాలను అధికారులు స్వీకరించగా.. తాజాగా ఫైనల్ 'కీ'ని విడుదల చేశారు. డీఎస్సీ పరీక్షలను గత జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించిన సంగతి తెలిసిందే.

వాతావరణంలో

అపరిచిత ధోరణులు!







పదేళ్లుగా భారీ మార్పులు

- ఖరీఫ్‌కు ఇక కష్టకాలమే
- 'వర్షాకాల విస్తరణే' విలన్
- వరద ప్రాంతాల్లో కరువు
- కరువు జిల్లాల్లో వరదలు
- దేశవ్యాప్తంగా తీవ్ర మార్పులు
- పర్యావరణ ఒడిదుడుకుల వల్లే

వాన రాకడ, ప్రాణం పోకడ తెలియదంటారు. కొన్నేళ్లుగా మన దేశంలో వానాకాలం ఎప్పుడు మొదలవుతుందో, ఎప్పటిదాకా కొనసాగుతుందో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు అకాలంలో భారీ వానలు, సీజన్ మధ్యలో విపరీతమైన ఎండలు పరిపాటిగా మారాయి. వాతావరణ తీరుతెన్నుల్లో ఈ భారీ మార్పులు భారత్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా వర్షాకాల సీజన్ తీరుతెన్నులే మారిపోతున్నాయి. సీజనల్ వానలు సాధారణంగా జూన్ తొలి, లేదా రెండో వారంలో మొదలై సెప్టెంబర్లో తగ్గుముఖం పడతాయి. కానీ ఈ క్రమం కొన్నేళ్లుగా భారీ మార్పుచేర్పులకు లోనవుతోంది. వానలు ఆలస్యంగా మొదలవడం, సెప్టెంబర్‌ను దాటేసి అక్టోబర్ దాకా కొనసాగడం పరిపాటిగా మారింది. దాంతో ఖరీఫ్ పంటలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. సరిగ్గా చేతికొచ్చే వేళ వానల కారణంగా దెబ్బ తినిపోతున్నాయి. ప్రస్తుత వర్షాకాల సీజన్ కూడా అక్టోబర్ దాకా కొనసాగవచ్చన్న వాతావరణ శాఖ హెచ్చరికలు గుబులు రేపుతున్నాయి. ఇదంతా వాతావరణ మార్పుల తాలూకు విపరిణామమేనని సైంటిస్టులు చెబుతున్నారు... - సాక్షి, నేషనల్ డెస్క్

భారత్‌లో వర్షాకాలం రాకపోకల్లో మార్పులు ఒకట్రెండేళ్లలో మొదలైనవేమీ కాదు. పదేళ్లుగా క్రమంగా చోటుచేసుకుంటూ వస్తున్నాయి. ఏటా పలు రాష్ట్రాల్లో భయానక వరదలకే గాక తీవ్ర పంట నష్టానికీ దారి తీస్తున్నాయి. ఈ ధోరణి దేశ ఆహార భద్రతకు కూడా సవాలుగా పరిణమిస్తోంది. దీన్ని ఎదుర్కోవాలంటే వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులను మార్చుకోవడం మినహా ప్రస్తుతానికి మరో మార్గాంతరమేదీ లేదని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ''మన దేశంలో వర్షాలకు ప్రధాన కారణమైన నైరుతీ రుతుపవనాల కదలికలు కొన్నేళ్లుగా బాగా మందగిస్తున్నాయి. వాటి విస్తరణే గాక ఉపసంహరణ కూడా నెమ్మదిస్తూ వస్తోంది. మనం ఒప్పుకోక తప్పని వాతావరణ మార్పులివి. మన సాగు పద్ధతులనూ అందుకు తగ్గట్టుగా మార్చుకోవాల్సిందే'' అని చెబుతున్నారు.

అంతా గందరగోళమే...

సీజన్‌లో మార్పుచేర్పుల వల్ల ఉత్తర, పశ్చిమ భారతాల్లో కొన్నేళ్లుగా భారీ వర్షపాతం నమోదవుతోంది. గుజరాత్, రాజస్తాన్‌లలో గత దశాబ్ద కాలంగా సగటున ఏకంగా 30 శాతం అధిక వర్షపాతం నమోదవడమే ఇందుకు తార్కాణం. ఆ ప్రాంతాల్లో గతంలో లేని భారీ వర్షాలు ఇప్పుడు మామూలు దృశ్యంగా మారాయి. ఇక గంగా మైదాన ప్రాంతాల్లో అక్టోబర్ దాకా కొనసాగుతున్న భారీ వానలు ఉత్తరాఖండ్, యూపీ, బిహార్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో పంటల సీజన్‌నే అతలాకుతలం చేసేస్తున్నాయి. ఆ రాష్ట్రాల్లో అక్టోబర్ తొలి వారంలో పంట కోతలు జరుగుతాయి. అదే సమయంలో వానలు విరుచుకుపడుతున్నాయి. ''దాంతో కోతలు ఆలస్యమవడమే గాక పంట నాణ్యత కూడా తీవ్రంగా దెబ్బ తింటోంది. మొత్తంగా వరి, మొక్కజొన్న, పప్పుల దిగుబడి బాగా తగ్గుతోంది'' అని కౌన్సిల్ ఆఫ్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్‌లో సీనియర్ ప్రోగ్రాం లీడ్ విశ్వాస్ చితాలే అన్నారు.

ఆహార భద్రతకూ ముప్పు

వర్షాలు సీజన్‌ను దాటి కొనసాగడం వల్ల ఖరీఫ్ పంటలు దారుణంగా దెబ్బ తింటున్నాయి. ఈ ఖరీఫ్‌లో దేశవ్యాప్తంగా 408.72 లక్షల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ఈసారి వర్షాలు అక్టోబర్ దాకా కొనసాగుతాయన్న అంచనాలు ఇప్పట్నుంచే గుబులు రేపుతున్నాయి. ఇది తీవ్ర పంట నష్టానికి, తద్వారా దేశవ్యాప్తంగా బియ్యం, పప్పుల కొరతకు దారి తీయడం తప్పకపోవచ్చంటున్నారు.

- ఇలా సీజన్ దాటాక కొనసాగిన భారీ వర్షాలు, వరదల దెబ్బకు 2016 నుంచి 2022 మధ్యలో దేశవ్యాప్తంగా మొత్తమ్మీద 3.4 కోట్ల హెక్టార్ల సాగు విస్తీర్ణంలో పంటలు దారుణంగా దెబ్బ తిన్నట్టు కేంద్ర వ్యవసాయ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.
- వాతావరణ మార్పుల దెబ్బకు 2022లో భారత్‌లో జీడీపీ వృద్ధిలో 8 శాతం క్షీణత నమోదైంది. 7.5 శాతం సంపద హరించుకుపోయింది.
- సాధారణంగా సెప్టెంబర్ తర్వాత భారీ వర్షాలు కురవని పశ్చిమ భారతదేశం ఈ మార్పులకు తాళలేకపోతోంది. అక్కడి నీటి నిర్వహణ వ్యవస్థ ఈ వరదలను తట్టుకోలేకపోతోంది.
- ఈ సరికొత్త వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు వినూత్న పద్ధతులు అవలంబించాలని సైంటిస్టులు సూచిస్తున్నారు.
- డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడం, ఇటు వరదలను, అటు కరువు పరిస్థితులను సమర్థంగా తట్టుకునే వంగడాలను అందుబాటులోకి తేవడం, వినూత్న వ్యవసాయ పద్ధతులను అవలంబించడం తప్పదంటున్నారు.

85 శాతం జిల్లాలపై ప్రభావం

మన దేశంలో తీవ్ర వాతావరణ పరిస్థితులు గత పదిహేనేళ్లలో ఏకంగా ఐదు రెట్లు పెరిగిపోయాయి. ఈ ధోరణి దేశవ్యాప్తంగా ఏకంగా 85 శాతం పై చిలుకు జిల్లాలను ప్రభావితం చేస్తోంది. వరదలు, తుఫాన్లు, కరువులు, తీవ్ర వడగాడ్పులతో కిందామీదా పడుతున్నట్టు ఐపీఈ–గ్లోబల్, ఎస్రి–ఇండియా సంయుక్త అధ్యయనం తేల్చింది. అయితే వీటిలో సగానికి పైగా జిల్లాల్లో గతంలో తరచూ వరద బారిన పడేవేమో కొన్నేళ్లుగా కరువుతో అల్లాడుతున్నాయి. కరువు బారిన పడే జిల్లాలు ఇప్పుడు వరదలతో అతలాకుతలమవుతున్నాయి! గత 50 ఏళ్ల వాతావరణ గణాంకాలను లోతుగా విశ్లేషించిన మీదట ఈ మేరకు వెల్లడైంది. వాతావరణ మార్పుల వల్ల దేశానికి ఎదురవుతున్న ముప్పును ఇవి కళ్లకు కడుతున్నాయని అధ్యయనం పేర్కొంది. ఇంకా ఏం చెప్పిందంటే...

- పరిస్థితులు ఇలాగే కొనసాగితే 2036 నాటికి ఏకంగా 147 కోట్ల మంది భారతీయులు తీవ్ర వాతావరణ పరిస్థితుల ప్రభావానికి లోనవుతారు.
- దేశంలోని తూర్పు, ఈశాన్య, దక్షిణాది ప్రాంతాల్లో తీవ్ర వరదలు పరిపాటిగా మారతాయి.
- ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కర్నాటకల్లో కరువు పరిస్థితులు పెరిగిపోతాయి. శ్రీకాకుళం, గుంటూరు, కర్నూలు, కటక్ (ఒడిశా) వంటి జిల్లాల్లో ఈ మార్పులు కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి.
- ఏపీతో పాటు ఒడిశా, బిహార్, గుజరాత్, రాజస్తాన్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, అసోం, యూపీల్లో 60 శాతానికి పైగా జిల్లాలు తరచూ ఇటు కరువు, అటు వరదలతో కూడిన తీవ్ర వాతావరణ పరిస్థితుల బారిన పడుతున్నాయి.
- త్రిపుర, కేరళ, బిహార్, పంజాబ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో కరువు ప్రాంతాల్లో వరదలు, వరద ప్రాంతాల్లో కరువులు పరిపాటిగా మారతాయి.
- బెంగళూరు, పుణే, అహ్మదాబాద్, పట్నా, ప్రయాగ్‌రాజ్ వంటి నగరాలు, వాటి పరిసర ప్రాంతాలు ఈ 'కరువు–వరద' ట్రెండుతో అతలాకుతలమవుతున్నాయి.
- గత శతాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సగటున 0.6 డిగ్రీ సెల్సియస్ మేరకు పెరిగిపోవడమే ఈ విపరీత వాతావరణ పరిస్థితులకు ప్రధాన కారణం.

మన నిర్వాకమే...!

మనిషి నిర్వాకం వల్ల తీవ్ర రూపు దాలుస్తున్న వాతావరణ మార్పులే వానల సీజన్‌లో తీవ్ర హెచ్చుతగ్గులకు ప్రధాన కారణమని సైంటిస్టులు చెబుతున్నారు.

- సముద్రాల ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో వాతావరణంలో తేమ శాతం పెరుగుతోంది. భారీ వర్షాలు, వరదలకు దారి తీస్తోంది.
- ఎల్ నినో, లా నినా వంటివి పరిస్థితులను మరింత దిగజారుస్తున్నాయి.
- ఎల్ నినోతో వర్షాకాలం కుంచించుకుపోయి పలు ప్రాంతాల్లో కరువు తాండవిస్తోంది.
- లా నినా వల్ల వర్షాలు సుదీర్ఘకాలం కొనసాగి వరదలు పోటెత్తుతున్నాయి.
- సాగు, నీటి నిర్వహణతో పాటు దేశంలో సాధారణ జన జీవనమే తీవ్రంగా ప్రభావితమవుతోంది.

ఏం చేయాలి?

- వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు పసిగడుతూ సాగు తీరుతెన్నులను కూడా తదనుగుణంగా మార్చుకోవడం ఇకపై తప్పనిసరి.
- ఇందుకోసం సమీకృత క్లైమేట్ రిస్క్ అబ్జర్వేటరీ (సీఆర్ఓ), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్లైమేట్ ఫండ్ (ఐసీఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతి సీజన్లోనూ వాతావరణ శాఖ అంచనాలకు అనుగుణంగా పంటలను మార్చుకుంటూ వెళ్లాలి.
- జాతీయ, రాష్ట్ర, జిల్లా, స్థానిక స్థాయిల్లో పరిస్థితిని నిరంతరం అంచనా వేస్తూ అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు ప్రణాళికలను మార్చుకోవాలి.

కమలా హారిస్‌కు ఒక్క నెలలో రూ.3,030 కోట్ల విరాళాలు

డొనాల్డ్ ట్రంప్‌కు కేవలం రూ.1,091 కోట్లు




వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కమలా హారిస్‌కు ప్రజల నుంచి భారీగా విరాళాలు అందుతున్నాయి. ఆగస్టు నెలలో ఆమెకు 30 లక్షల మంది దాతల నుంచి 361 మిలియన్ డాలర్ల(రూ.3,030 కోట్లు) విరాళాలు లభించాయి. ఈ విషయం కమలా హారిస్ ప్రచార బృందం శుక్రవారం వెల్లడించింది. తన ప్రత్యర్థి, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కంటే రెండు రెట్లకుపైగా ఎక్కువ విరాళాలు కమలా హారిస్ అందుకోవడం విశేషం. ట్రంప్‌కు గత నెలలో కేవలం 130 మిలియన్ డాలర్లు (రూ.1,091 కోట్లు) విరాళంగా లభించాయి. ఆగస్టు నెలాఖరు నాటికి కమలా హారిస్ చేతిలో 404 మిలియన్ డాలర్ల నిధులున్నాయి. ట్రంప్ వద్ద కేవలం 295 మిలియన్ డాలర్లు ఉన్నాయి.

గెలిపిస్తే టిక్‌టాక్‌ను కాపాడుతా: ట్రంప్



వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికల్లో తనను గెలిపిస్తే చైనాకు చెందిన సోషల్ మీడియా వేదిక 'టిక్‌టాక్'ను కాపాడుతానని అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికాలో టిక్‌టాక్‌కు తాను రక్షకుడిని అవుతానని ఉద్ఘాటించారు. టిక్‌టాక్ కావాలని కోరుకునేవారంతా అధ్యక్ష ఎన్నికల్లో తనకు ఓటు వేయాలని కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ వీడియో విడుదల చేశారు. అమెరికాలో తన ప్రత్యర్థి వర్గం టిక్‌టాక్‌ను మూసివేయడానికి కుట్ర పన్నుతోందని పరోక్షంగా అధ్యక్షుడు జో బైడెన్‌పై ఆరోపణలు గుప్పించారు. టిక్‌టాక్‌ను అమెరికా కంపెనీకి విక్రయించడానికి దాని మాతృ సంస్థపై ఒత్తిడి పెంచేలా లేదా అమెరికాలో టిక్‌టాక్‌ను నిషేధించేలా జో బైడెన్ ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లో ఓ బిల్లుపై సంతకం చేసింది. నిజానికి ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 2020లో టిక్‌టాక్‌పై నిషేధం విధించడం గమనార్హం.

కాంగ్రెస్‌లో చేరిన ఆప్ ఎమ్మెల్యే



న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ మంత్రి రాజేంద్ర పాల్ గౌతమ్ అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి షాకిచ్చారు. శుక్రవారం ఆయన ఆప్‌తోపాటు సీమాపురి ఎమ్మెల్యేగా కూడా రాజీనామా చేశారు. దళితులు, మైనారిటీల పట్ల సీఎం కేజ్రీవాల్ ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని పాల్ ఆరోపించారు. అగ్ర కులాల మంత్రులు, ఎమ్మెల్యేలపై ఆరోపణలొచ్చినప్పుడు మద్దతుగా నిలిచే ఆప్.. ముస్లిం, దళిత మంత్రులు, ఎమ్మెల్యేలపై తప్పుడు ఆరోపణలొచ్చినా కూడా పట్టించుకోకుండా వదిలేస్తుందని పార్టీ చీఫ్ కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో ఆరోపించారు. సామాజిక న్యాయం, అన్ని రంగాల్లో బహుజనులు రాణించాలన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు 'ఎక్స్'లో పాల్ పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరుల సమక్షంలో ఆ పార్టీలో చేరారు.

బీజేడీకి మరో ఎంపీ రాజీనామా



న్యూఢిల్లీ: బీజేడీపై మరో దెబ్బ పడింది. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు సుజీత్‌కుమార్ శుక్రవారం పార్టీకి, పదవికి రాజీనామా చేశారు. బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, బీజేపీ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ తదితరుల సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. అంతకుముందు, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ కుమార్‌ను బీజేడీ అధిష్టానం పార్టీ నుంచి బహిష్కరించింది. తక్షణమే ఇది అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. బీజేడీని, కలహండి ప్రజల ఆశలు, ఆకాంక్షలను కుమార్ పట్టించుకోలేదని పార్టీ చీఫ్ నవీన్ పట్నాయక్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. కాగా, సుజీత్ కుమార్ రాజీనామాను ఆమోదించినట్లు ఉపరాష్ట్రపతి కూడా అయిన రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ కార్యాలయం తెలిపింది. కుమార్ రాజీనామాతో రాజ్యసభలో బీజేడీ బలం ఏడుకు పడిపోయింది. లోక్‌సభలో ఆ పార్టీకి ప్రాతినిధ్యం లేదు.

అపరాజిత బిల్లు రాష్ట్రపతికి

కోల్‌కతా: మహిళలపై నేరాలకు కఠిన శిక్షలను ప్రతిపాదిస్తూ పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఆమోదించిన అపరాజిత బిల్లును గవర్నర్ ఆనంద బోస్ శుక్రవారం రాష్ట్రపతి పరిశీలనకు పంపించారు. బెంగాల్ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ ఈ బిల్లుకు సంబంధించిన సాంకేతిక నివేదికను శుక్రవారం గవర్నర్‌కు సమర్పించారు. దీన్ని పరిశీలించిన గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి ద్రౌపది ముర్ముకు పంపాలని నిర్ణయించారని రాజ్‌భవన్ అధికారులు వెల్లడించారు. బిల్లుతో పాటు సాంకేతిక నివేదికను పంపనందుకు ఆనంద బోస్ గురువారం మమత సర్కారును విమ ర్శించారు. గవర్నర్ బిల్లును తొక్కిపెట్టినా, రాష్ట్రపతి పరిశీలనకు పంపినా.. రాజ్‌భవన్ ఎదుట ధర్నా చేస్తానని మమత హెచ్చరించడం తెలిసిందే.

ఒంటరిగానే ఆప్!

హరియాణాలో కాంగ్రెస్ పొత్తు లేనట్లే

న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కలిసిసాగాలన్న కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రయత్నాలు కార్యరూపం దాల్చే అవకాశాలు కనపడటం లేదు. పొత్తు చర్చల్లో పీటముడి పడినట్లు ఆప్‌లోని విశ్వసనీయ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ఒంటరిగానే హరియాణా అసెంబ్లీ బరిలోకి దిగుతుందని, 50 సీట్లలో పోటీచేస్తుందని తెలిపాయి. ఆప్ తమ తొలి జాబితాను ఆదివారం విడుదల చేసే అవకాశముందని చెప్పాయి. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశానికి కొద్దిముందు ఆప్ ఒంటరిపోరుపై సంకేతాలు ఇవ్వడం గమనార్హం. 'పొత్తుపై చర్చలు దాదాపు విఫలమైనట్లే. ఆప్ 50 నుంచి 90 స్థానాల్లో పోటీచేయడానికి సిద్ధమవుతోంది' అని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆప్ 10 సీట్లు అడుగుతుండగా.. కాంగ్రెస్ ఐదు నుంచి ఏడు స్థానాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఇదివరకు వార్తలు వచ్చాయి. అయితే కనుచూపుమేరల్లో ఏకాభిప్రాయం కుదిరే అవకాశాలు కనపడటం లేదని ఆప్ వర్గాలు తాజాగా తెలిపాయి.

కెన్యా స్కూల్‌లో ఘోర అగ్ని ప్రమాదం

నైరోబీ: కెన్యాలోని ఒక బోర్డింగ్ స్కూల్‌లో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో 18 మంది విద్యార్థులు సజీవ దహనం కాగా 27 మంది తీవ్రంగా గాయపడ్డారు. 70 మంది జాడ తెలియడం లేదని అధికారులు తెలిపారు. నియోరి కౌంటీలోని ఇందారషా ప్రైమరీ స్కూల్ హాస్టల్‌లో గురువారం రాత్రి ఈ దారుణం జరిగింది. కలప భవనం కావడంతో మంటలు త్వరగా వ్యాపించి, నిద్రలో ఉన్న విద్యార్థులను మింగేశాయని పోలీసులు అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఫోగాట్, పునియా

సాక్షి, న్యూఢిల్లీ: తమ రాజకీయ రంగ ప్రవేశంపై కొన్ని రోజులుగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ ప్రముఖ రెజ్లర్లు వినేశ్ ఫోగాట్, భజరంగ్ పునియా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఆయన నివాసంలో కలిశారు. అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, హరియాణా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపక్ బబారియా, పీసీసీ అధ్యక్షుడు ఉదయ్ భాన్, కాంగ్రెస్ మీడియా విభాగం అధ్యక్షుడు పవన్ ఖేరా సమక్షంలో అధికారికంగా కాంగ్రెస్‌లో చేరారు. వినేశ్ ఫోగాట్, భజరంగ్ పునియాను కాంగ్రెస్ నేతలు తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఫోగాట్ మాట్లాడారు. ''కాంగ్రెస్ పార్టీకి నా కృతజ్ఞతలు. లైంగిక వేధింపులకు నిరసన కొనసాగించిన గడ్డుకాలంలో కాంగ్రెస్ మాకు అండగా నిలిచింది. మమ్మల్ని రోడ్లపైకి లాగినప్పుడు బీజేపీ మినహా మిగిలిన అన్ని పార్టీలు మాకు మద్దతుగా మా కన్నీళ్లను తుడిచాయి. మాకు అండగా నిలిచిన పార్టీలో చేరుతున్నందుకు గర్వపడుతున్నా'' అని చెప్పారు. భజరంగ్‌ను అఖిల భారత కాంగ్రెస్ కిసాన్‌సెల్ వర్కింగ్ చైర్మన్‌గా నియమించారు.

జులానా నుంచి ఫోగాట్

హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు 31 మందితో కాంగ్రెస్ తొలి జాబితాను విడుదల చేసింది. మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడాను గార్హి సాంప్లా–కిలోయి నియోజకవర్గం నుంచి పోటీకి దించింది. వినేశ్ ఫోగాట్‌కు ఊహించినట్లుగానే జులానా టికెట్ కేటాయించింది. హరియాణా కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాన్ (హోడాల్), మేవా సింగ్ (లాడ్వా) సురేందర్ పన్వర్ (సోనిపేట్), భరత్ భూషణ్ బత్రా (రోహతక్), కుల్దీప్ వాట్స్ (బద్లీ), చిరంజీవ్ రావు (రేవారి), నీరజ్ శర్మ (ఫరీదాబాద్ నిట్)లకు టికెట్లు ఖరారు చేసింది.

రైల్వే ఉద్యోగానికి ఫోగాట్ రాజీనామా

కాంగ్రెస్‌లో చేరికకు ముందు వినేశ్ ఫోగాట్ రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేశారు. రైల్వే శాఖలో ఓఎస్డీ పోస్టులో ఉన్న ఆమె వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఫోగాట్ రాజీనామా అంశాన్ని రైల్వే శాఖ రాజకీయం చేస్తోందని కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ విమర్శించారు. కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించకముందే ఫోగాట్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చారని, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కలవడమే ఆమె చేసిన నేరమా? అని ప్రశ్నించారు.

సందీప్ ఘోష్ నివాసాల్లో ఈడీ సోదాలు

కోల్‌కతా/న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌తోపాటు అతడి బంధువులు, సన్నిహితుడు ప్రసూన్ ఛటోపాధ్యాయ నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. కలకత్తా నేషనల్ మెడికల్ కాలేజీలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ప్రసూన్ ఛటోపాధ్యాయను అదుపులోకి తీసుకున్నారు. ప్రసూన్ నివాసాల్లో 7 గంటలు సోదాలు జరిగాయి. మరోవైపు ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో ఆర్థిక అవకవతకల కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించడాన్ని సవాలు చేస్తూ సందీప్ ఘోష్ పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది.

లోపలికి తొంగిచూడొచ్చు

పారదర్శక ద్రావకంతో చర్మం మాయం • సైంటిస్టుల తాజా ఘనత


1897లో వచ్చిన హెచ్‌జీ వేల్స్ ప్రసిద్ధ సైన్స్ ఫిక్షన్ నవల 'ద ఇన్విజిబుల్ మ్యాన్' గుర్తుందా? ఒంట్లో కణాలన్నింటినీ పారదర్శకంగా మార్చేసే ద్రావకాన్ని హీరో కనిపెడతాడు. దాని సాయంతో ఎవరికీ కన్పించకుండా ఎంచక్కా మాయమైపోతాడు. దీని స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సినిమాలు కూడా వచ్చాయి. తాజాగా సైంటిస్టులు అలాంటి ఆవిష్కరణే చేశారు! అది కూడా సాదాసీదా ఫుడ్ కలరింగ్ ఏజెంట్ సాయంతో!! దాని సాయంతో తయారు చేసిన సరికొత్త 'ద్రావకం' చర్మాన్ని పారదర్శకంగా మార్చేస్తోంది. దాంతో ఒంట్లోని అవయవాలన్నింటినీ మామూలు కంటితోనే భేషుగ్గా చూడటం వీలుపడింది. దీన్నిప్పటికే ఎలుకలపై విజయవంతంగా ప్రయోగించి చూశారు. ఈ ప్రయోగం మనుషులపైనా విజయవంతమైతే బయో జీవ రసాయన, వైద్య పరిశోధన రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టగలదని భావిస్తున్నారు...

ఇలా సాధించారు...

టార్ట్రాజైన్ అనే మామూలు పసుపు రంగు ఫుడ్ కలరింగ్ ఏజెంట్‌ను నీళ్లలో కలపడం ద్వారా చర్మాన్ని మాయం చేసే ద్రావకాన్ని సైంటిస్టులు తయారు చేశారు. ఈ మేజిక్‌ను సాధించేందుకు ఆప్టిక్ రంగ పరిజ్ఞానాన్ని వాడుకున్నారు. పసుపు రంగు కలరింగ్ ఏజెంట్‌లోని అణువులు మామూలుగానైతే కాంతిని విపరీతంగా శోషించుకుంటాయి. ముఖ్యంగా నీలి, అతినీల లోహిత కాంతిని తమగుండా వెళ్లనీయవు. కానీ దాన్ని నీటితో కలిపిన మీదట వచ్చే ద్రావకం పూర్తిగా పారదర్శక ధర్మాలను కలిగి ఉంటుంది. దాన్ని చర్మంపై రుద్దితే దాని కణజాలాలకు కాంతి పరావర్తక సామర్థ్యం లోపిస్తుంది. దాంతో ద్రావకం లోపలికి ఇంకుతూనే చర్మం కన్పించకుండా పోతుంది! మరోలా చెప్పాలంటే 'మాయమవుతుంది'. ఈ ద్రావకాన్ని తొలుత కోడి మాంసంపై రుద్దారు. ఫలితం సంతృప్తికరంగా అనిపించాక ప్రయోగాత్మకంగా ఒక ఎలుకపై పరీక్షించి చూశారు. దాని తల, పొట్టపై ఉన్న చర్మం మీద ద్రావకాన్ని పూశారు. దాంతో ఆయా భాగాల్లో చర్మం తాత్కాలికంగా పారదర్శకంగా మారిపోయింది. ఫలితంగా తల, పొట్ట లోపలి అవయవాలు స్పష్టంగా కన్పించాయి. ద్రావకాన్ని కడిగేసిన మీదట చర్మం ఎప్పట్లాగే కన్పించింది. పైగా ఈ ప్రక్రియలో ఎలుకకు ఎలాంటి హానీ కలగలేదు.

రక్తనాళాలన్నీ కన్పించాయి

ఎలుకల తలపై ద్రావకం రుద్దిన మీదట మెదడు ఉపరితలం మీది రక్తనాళాలు మామూలు కంటికే స్పష్టంగా కన్పించాయి. అలాగే పొట్ట భాగంలోని అవయవాలు కూడా. ''మౌలిక భౌతిక శాస్త్ర నియమాలు తెలిసినవారికి ఇదేమీ పెద్ద ఆశ్చర్యం కలిగించదు. కానీ ఇతరులకు మాత్రం అచ్చం అద్భుతంగానే తోస్తుంది'' అని అధ్యయన సారథి, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జిహావో యూ అన్నారు. ''పొట్టపై ఈ ద్రావకాన్ని రుద్దితే చాలు. పొద్దుటినుంచీ ఏమేం తిన్నదీ స్పష్టంగా కన్పిస్తుంది. చూడటానికి చాలా సింపులే గానీ, ఈ పద్ధతి చాలా ఎఫెక్టివ్'' అని వివరించారు. అయితే దీన్నింకా మనుషులపై ప్రయోగించాల్సి ఉందని ఆయన చెప్పుకొచ్చారు. - సాక్షి, నేషనల్ డెస్క్



ద్రావకం రుద్దడంతో స్పష్టంగా కన్పిస్తున్న ఎలుక పొట్ట లోపలి అవయవాలు

లాభాలెన్నో...

మనుషులపై గనక ఈ ప్రక్రియ విజయవంతమైతే వైద్యపరంగా ఎనలేని లాభాలుంటాయని సైంటిస్టులు చెబుతున్నారు.

- రక్తం శాంపిళ్ల సేకరణ, రోగి ఒంట్లోకి అవసరమైన ఫ్లూయిడ్స్ ఎక్కించడం వంటివి మరింత సులభతరం అవుతాయి. ముఖ్యంగా రక్తనాళాలు దొరకడం కష్టంగా మారే వృద్ధులకు ఇది వరప్రసాదమే కాగలదు.
- చర్మ క్యాన్సర్ వంటివాటిని తొలి దశలోనే గుర్తించడం సులువవుతుంది.
- ఫొటోడైనమిక్, ఫొటోథర్మల్ థెరపీల వంటి కణజాల చికిత్సల్లోనూ ఇది దోహదకారిగా మారుతుంది.
- లేజర్ ఆధారిత టాటూల నిర్మూలన మరింత సులువవుతుంది.

కొన్ని పద్ధతులున్నా

కణజాలాలను పారదర్శకంగా మార్చేందుకు ప్రస్తుతం పలు ద్రావకాలు అందుబాటులో ఉన్నా అవి ఇంత ప్రభావవంతమైనవి కావు. పైగా పలు డీహైడ్రేషన్, వాపులతో పాటు కణజాల నిర్మాణంలోనే మార్పుల వంటి సైడ్ ఎఫెక్టులకు దారి తీస్తాయి. టార్ట్రాజైన్ ద్రావకంతో ఈ సమస్యలేవీ తలెత్తలేదు. అయితే టార్ట్రాజైన్ మనుషులకు హానికరమంటూ తినుబండారాల్లో దీని వాడకాన్ని అమెరికాలో పలువురు కోర్టుల్లో సవాలు చేశారు. దీన్ని చిప్స్, ఐస్‌క్రీముల్లో వాడతారు.

కొసమెరుపు: ఇన్విజిబుల్ మ్యాన్ నవల్లో మాదిరిగా మనిషిని పూర్తిగా మాయం చేయడం ఇప్పుడప్పట్లో సాధ్యపడేలా లేదు. ఎందుకంటే టార్ట్రాజైన్ ద్రావకం ఎముకలను పారదర్శకంగా మార్చలేదట.

సెబీ చైర్మన్‌ను పిలుస్తాం

ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ కేసీ వేణుగోపాల్ వెల్లడి



న్యూఢిల్లీ: మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) చైర్మన్‌గా ఉంటూనే మాధబి పురి బుచ్ ఐసీఐసీఐ నుంచి వేతనం తీసుకుని పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందడం సహా ఆమెపై, సెబీపై పలు ఆరోపణలు వెల్లువెత్తడంతో సెబీ పనితీరును సమీక్షించాలని ప్రజా పద్దుల కమిటీ(పీఏసీ) నిర్ణయించింది. ఈ విషయంలో మాధబిని పిలిపించి ప్రశ్నించేందుకు ఆమెకు సమన్లు జారీచేయడంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రజా పద్దుల కమిటీ చైర్మన్, కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ చెప్పారు. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో మాధబి, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని అమెరికన్ షార్ట్‌సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ ఆరోపణలు గుప్పించిన విషయం తెల్సిందే.

నిలకడగా ఏచూరి ఆరోగ్యం: సీపీఎం



న్యూఢిల్లీ: సీపీఎం జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరి(72) ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్సకు సానుకూలంగా స్పందిస్తున్నారని ఆ పార్టీ తెలిపింది. ఈ మేరకు సీపీఎం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'ఢిల్లీ ఎయిమ్స్‌లోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లో కామ్రేడ్ సీతారాం ఏచూరి చికిత్స పొందుతున్నారు. ఊపిరితిత్తుల తీవ్ర ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయనకు చికిత్స అందుతోంది. సానుకూల స్పందన కనిపిస్తోంది. కామ్రేడ్ సీతారాం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది' అని ఆ ప్రకటనలో పేర్కొంది. ఛాతీలో న్యుమోనియా వంటి ఇన్ఫెక్షన్ సోకడంతో ఆగస్ట్ 19వ తేదీన ఆన ఎయిమ్స్‌లో చేరారు.

లాల్‌బాగ్చాకు అనంత్ అంబానీ స్వర్ణకిరీటం



ముంబై: మహారాష్ట్ర రాజధాని ముంబైలో ప్రఖ్యాతి గాంచిన లాల్‌బాగ్చా రాజా వినాయకుడికి రిలయన్స్ సంస్థ చైర్మన్ ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ రిలయన్స్ ఫౌండేషన్‌తో కలిసి భారీ విరాళం అందజేశారు. రూ.15 కోట్ల విలువైన 20 కిలోల స్వర్ణ కిరీటాన్ని తన ఆరాధ్య దైవానికి సమర్పించారు. లాల్‌బాగ్చా రాజా భారీ విగ్రహాన్ని గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. అనంత్ అంబానీ వివాహం రాధికా మర్చంట్‌తో ఇటీవలే జరిగిన సంగతి తెలిసిందే. ఈ వివాహం తర్వాత వస్తున్న తొలి వినాయక చవితి కావడంతో స్వర్ణ కిరీటాన్ని తన ఇష్ట దైవానికి అందించినట్లు తెలుస్తోంది.

ఢిల్లీ నేతలకు నేనంటే ద్వేషం : ఒమర్



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల వేళ బీజేపీ అగ్రనాయకత్వంపై నేషనల్ కాన్ఫెరెన్స్ పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా పరోక్ష విమర్శలు చేశారు. శుక్రవారం గాందర్‌బల్ అసెంబ్లీ స్థానంలో ఎన్నికల ప్రచారంలో ఒమర్ మాట్లాడారు. '' ఢిల్లీలో ఉన్న నేతలకు నేనంటే ద్వేషం. ఎన్నికల్లో ఓడించి నా నోరు మూయించాలని చూస్తున్నారు. పని గట్టుకుని స్వతంత్య అభ్యర్థులను నాపై పోటీకి నిలుపుతున్నారు. నన్ను ఓడించి చట్ట సభల్లో నా గొంతు వినపడకుండా చేయాలని కుట్ర పన్నారు. ఢిల్లీ నేతలపై నేను పోరాడుతున్నది నా కోసమో, నా కుటుంబం కోసమో కాదు. జమ్మూకశ్మీర్ పౌరుల కోసం. నేనేం మాట్లాడిన ప్రజల గొంతుక వినిపిస్తా'' అని ఒమర్ అన్నారు.

పదేళ్ల సమస్యలను పరిష్కరిస్తున్నాం

- టీచర్లు, వార్డెన్లు విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్త తీసుకోవాలి
- జ్వరాలు వస్తే వసతి గృహంలోనే వైద్యం అందించాలి
- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: విద్యారంగంలో పదేళ్లుగా పాతుకుపోయిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరిస్తోందని పంచాయతీరాజ్, మహిళాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయం నుంచి గిరిజన సంక్షేమ శాఖ, ఎస్సీ గురుకుల సొసైటీ అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అస్తిత్వానికి, అభివృద్ధికి, ఆత్మగౌరవానికి ప్రతీకలుగా సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాలను ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని మంత్రి వివరించారు. వర్షాకాలం కీలక సమయానికి చేరుకోవడంతో టీచర్లు, వార్డెన్లు విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులు హాస్టల్ విడిచి బయటకు వెళ్లకుండా కఠినచర్యలు తీసుకోవాలని, జ్వరాల బారిన పడితే ఇంటికి పంపకుండా వసతి గృహంలోనే మెరుగైన వైద్యం అందించాలన్నారు. గురుకులాలు, వసతిగృహాల్లో నాణ్యమైన వేడి భోజనాన్ని, వేడి చేసి చల్లార్చిన తాగునీటిని విద్యార్థులకు అందజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారమే వడ్డించాలన్నారు. హాస్టళ్లకు సరుకుల సరఫరా సరిగ్గా లేకపోతే టెండర్లు రద్దు చేస్తామని మంత్రి హెచ్చరించారు. ప్రత్యేక పరిస్థితుల్లో విద్యార్థుల భోజన అవసరాల కోసం టీచర్లు ఖర్చు చేయాల్సి వస్తే.. ఆ నిధులను ప్రత్యేకంగా చెల్లించేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నపాటి సమస్యలను భూతద్దంలో చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ ప్రతిష్ట, ఉద్యోగుల స్థైర్యాన్ని దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణ మలిదశ ఉద్యమనేత
జిట్టా కన్నుమూత

- అనారోగ్యంతో రెండు నెలలుగా ఆస్పత్రిలోనే
- వెంటిలేటర్‌పై భువనగిరికి తరలింపు
- ఫాంహౌస్‌లో తుదిశ్వాస విడిచిన బాలకృష్ణారెడ్డి



జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థివదేహాన్ని చూసి రోదిస్తున్న ఆయన సతీమణి, కుటుంబ సభ్యులు



జిట్టా బాలకృష్ణారెడ్డి (ఫైల్)

సాక్షి, యాదాద్రి: తెలంగాణ మలిదశ ఉద్యమనేత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు భువనగిరికి చెందిన జిట్టా బాలకృష్ణారెడ్డి (53) కన్నుమూశారు. అనారోగ్యంతో ఆయన సుమారు రెండు నెలలుగా సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శరీరంలోని అన్ని అవయవాలు పాడైపోవడంతో శుక్రవారం ఉదయం జిట్టా ఆరోగ్యం పూర్తిగా విషమించింది. డాక్టర్ల సూచనల మేరకు కుటుంబ సభ్యులు వెంటిలేటర్ మీద ఆయన్ను స్వగ్రామమైన భువనగిరి సమీపంలోని ఫాంహౌస్‌కు తరలించారు. ఫాంహౌస్‌కు చేరుకున్న అనంతరం ఆయన తుదిశ్వాస విడిచారు. బాలకృష్ణారెడ్డిని ఆస్పత్రి నుంచి తరలించే సమయంలో ఆయన కుటుంబ సభ్యులతోపాటు తెలంగాణ ఉద్యమనేత డాక్టర్ చెరుకు సుధాకర్ తదితరులు ఉన్నారు.

అమరవీరుల స్తూపం వద్ద నివాళులు

తన ఫాంహౌస్‌లోనే తుదిశ్వాస విడవాలన్న జిట్టా కోరిక మేరకు వెంటిలేటర్‌పై ఉన్న ఆయన్ను బొమ్మాయిపల్లికి తరలించారు. మార్గమధ్యలో భువనగిరి పట్టణంలో ఆయన నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్తూపం వద్దకు భారీ ర్యాలీతో తీసుకొచ్చి అభిమానులు నివాళులర్పించారు. ఫాంహౌస్‌కు చేరుకున్న తర్వాత జిట్టాకు వెంటిలేటర్ తొలగించడంతో తుదిశ్వాస విడిచారు.

అధికార లాంఛనాల కోసం ప్రయత్నం

ప్రభుత్వ అధికార లాంఛనాలతో జిట్టా అంత్యక్రియలు నిర్వహించాలని అభిమానులు పట్టుబట్టారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిలు సీఎం కార్యాలయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అధికారిక లాంఛనాల కోసం ఇచ్చే ఆరుగురు ఆర్మ్‌డ్‌ఫోర్స్‌లో కనీసం ఇద్దరినైనా ఇవ్వాలని విన్నవించినా అమలు కాలేదు. 4.30 గంటలకు ప్రారంభించాల్సిన జిట్టా అంతిమ యాత్ర గంట ఆలస్యంగా 5.30 గంటలకు ప్రారంభమైంది. టీచర్స్‌కాలనీ మీదుగా బొమ్మాయిపల్లిలోని ఆయన సొంత వ్యవసాయ భూమిలో జిట్టా అంత్యక్రియలు నిర్వహించారు. వేలాదిగా వచ్చిన అభిమానులు తుది వీడ్కోలు పలికారు.

పలువురి నివాళి

కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతోపాటు అన్ని పార్టీల నేతలు, నాయకులు, కార్యకర్తలు, జిట్టా అభిమానులు, కళాకారులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, తదితరులు నివాళులర్పించారు. జిట్టా కుటుంబ సభ్యులను మంత్రి కోమటిరెడ్డి ఓదార్చారు.

- జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డా.కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్ తదితరులు సంతాపం ప్రకటించారు.
- తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటంలో జిట్టా బాలకృష్ణారెడ్డి క్రియాశీలకంగా పాల్గొన్నారంటూ ఆయన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. ఆయన మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్ ఉన్నారు.

సినీగేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ కన్నుమూత



లక్డీకాపూల్ (హైదరాబాద్)/ సిరిసిల్ల కల్చరల్: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, సినీగేయ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ అనారోగ్యంతో కన్నుమూశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 76 ఏళ్లు. లలిత గీతాల రచయితగా, టెలివిజన్ ధారావాహికల దర్శకుడిగా, గేయ రచయితగా, వివిధ డాక్యుమెంటరీలు, ఆడియో ఆల్బమ్స్ రూపకర్తగా ఆయన ప్రసిద్ధి చెందారు. తెలుగు సినీ పరిశ్రమలో రచయితల సంఘానికి ఆయన విశిష్ట సేవలందించారు. నంది పురస్కారాల కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. కాగా, అమెరికా నుంచి ఆయన కుమారుడు రావాల్సి ఉండటంతో కృష్ణ భౌతికకాయాన్ని నిమ్స్ మార్చురీలో భద్రపరిచారు. కృష్ణ మరణ వార్త గురించి తెలిసి పలువురు కవులు, కళాకారులు, రచయితలు నిమ్స్‌కు వచ్చి నివాళులర్పించారు. తెలంగాణ బీసీ కమిషన్ తొలి చైర్మన్ బి.ఎస్.రాములు సంతాపం తెలిపారు.

రెండు రోజుల క్రితమే జీవన సాఫల్య పురస్కారం

రెండు రోజుల క్రితమే తెలుగు సినీ రచయితల సంఘం వడ్డేపల్లి కృష్ణను జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించింది. అమెరికాలో ఆటా సభల్లో పాల్గొనడానికి వెళ్లిన ఆయన ఆరోగ్యం దెబ్బతినడంతో జూలై 16న హైదరాబాద్ వచ్చి ఆసుపత్రిలో చేరారు. నెల రోజులు ఆసుపత్రిలోనే ఉండి నాలుగు రోజుల క్రితం డిశ్చార్జ్ అయ్యారు. మళ్లీ ఇబ్బంది అనిపించడంతో మరోసారి నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. వడ్డేపల్లి కృష్ణ సిరిసిల్లలో చేనేత కుటుంబంలో జన్మించారు. హైదరాబాద్ నాగోల్‌లో స్థిరపడ్డారు. తొలుత తపాలా శాఖలో ఉద్యోగం చేశారు. వందేళ్లలో వెలువడిన పది వేల లలిత గీతాలను పరిశీలించి పీహెచ్‌డీ పూర్తి చేశారు. పిల్ల జమీందార్, భైరవద్వీపం, పెద్దరికం తదితర చిత్రాలకు రాసిన పాటలకు ఆయనకు మంచి పేరు వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జయ జయహే తెలంగాణ నృత్య రూపకం రచించారు. కృష్ణ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. రెండు సినిమాలకు దర్శకత్వం వహించారు.

జగిత్యాల-కరీంనగర్ రహదారిపై కేంద్రం సమీక్ష

సాక్షి, న్యూఢిల్లీ: పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 18 రహదారుల నిర్మాణంపై కేంద్రం దృష్టి సారించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల్లోని ఈ రహదారులకు సంబంధించి పీఎం గతిశక్తి నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ సమావేశం శుక్రవారం ఢిల్లీలో జరిగింది. ఇందులో రోడ్డు రవాణా, రహదారుల శాఖ ప్రతిపాదించిన 18 జాతీయ రహదారులు, ప్రాజెక్టులపై చర్చించారు. తెలంగాణకు సంబంధించి జగిత్యాల-కరీంనగర్ 4-లేన్ హైస్పీడ్ ప్రాజెక్టులో 58.87 కి.మీ. రహదారి ఉంది. దీంతోపాటు 131.90 కి.మీ. పొడవున్న ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల 4-లేన్ రహదారి ప్రాజెక్టును జగిత్యాల-కరీంనగర్ హైవే హైస్పీడ్ కారిడార్‌కు అనుబంధంగా విస్తరించనున్నారు. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి బద్వేల్-నెల్లూరు కారిడార్‌లో ఉన్న 4-లేన్ హైవే 108.13 కి.మీ విస్తరించి ఉంది.

గురుకుల ఉద్యోగుల వేతన బకాయిలు విడుదల చేయాలి

- ప్రభుత్వానికి తెలంగాణ గురుకుల విద్యా జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ ఉద్యోగులు, సబ్జెక్టు అసోసియేట్స్ వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గురుకుల విద్యా జేఏసీ ప్రతినిధులు సీహెచ్ బాలరాజు, యాదయ్య, వి.ప్రభుదాస్ తదితరులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మూడు నెలలుగా వారికి వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇకపై ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అలాగే ఎస్సీ గురుకుల సొసైటీలో పార్ట్‌టైమ్ టీచర్లను సర్వీసులో కొనసాగేలా సొసైటీ కార్యదర్శి నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

చాకలి ఐలమ్మ జయంత్యుత్సవాలకు రూ.15 లక్షలు

రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమకారిణి చాకలి ఐలమ్మ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15 లక్షల నిధులు కేటాయించిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఐలమ్మ జయంత్యుత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈనెల 26న రవీంద్ర భారతిలో జరిగే జయంతి కార్యక్రమాల కోసం రూ.12 లక్షలు కేటాయించామని, అలాగే ఈ నెల 10న జరిగే వర్ధంతి కార్యక్రమం కోసం రూ.3 లక్షలు కేటాయించినట్లు పొన్నం వెల్లడించారు. ఈ కార్యక్రమాల నిర్వహణ కమిటీకి చైర్మన్‌గా షాద్‌నగర్ శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ వ్యవహరిస్తారన్నారు. ఈ కమిటీలో 40 మంది సభ్యులను కూడా నియమించినట్లు చెప్పారు. పాలకుర్తిలో చాకలి ఐలమ్మ స్మారక భవన నిర్మాణానికి ఉన్న అనువైన స్థలాన్ని గుర్తించాలని, ఈమేరకు తగిన చర్యలు తీసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డికి మంత్రి సూచించారు.

నేటి నుంచి కాణిపాకం బ్రహ్మోత్సవాలు


విద్యుద్దీపాలంకరణలో కాణిపాకం ఆలయం

కాణిపాకం: చిత్తూరు జిల్లాలోని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక దేవస్థానంలో శనివారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 21 రోజులు జరిగే ఈ ఉత్సవంలో పలు రకాల వాహన సేవల్లో స్వామి వారు విహరించనున్నారు. తొలి రోజు చవితిని భక్తి శ్రద్ధలతో జరిపించనున్నారు. ఇందులో భాగంగా ఆలయాన్ని విదేశీ పుష్పాలతో ముస్తాబు చేశారు. ఉదయం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

గోదావరిలో దూకిన కానిస్టేబుల్

- కొత్తగూడెం క్లూస్ విభాగానికి చెందిన శీలం రమణారెడ్డిగా గుర్తింపు
- ఉదయం నుంచి సాయంత్రం వరకూ గాలింపు.. అయినా దొరకని ఆచూకీ


సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న నాగరమణారెడ్డి

భద్రాచలం అర్బన్: వంతెన పైనుంచి గోదావరి నదిలోకి దూకిన పోలీస్ కానిస్టేబుల్ శీలం నాగ రమణారెడ్డి గల్లంతయ్యాడు. శుక్రవారం ఉదయం ఆయన భద్రాచలంలోని బ్రిడ్జి వద్ద నదిలో దూకుతుండగా గమనించిన స్థానికులు.. ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. దీంతో భద్రాచలం టౌన్ పోలీసులు అప్రమత్తమై గజ ఈతగాళ్లు, బోటు సాయంతో ఉదయం నుంచి రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. తల్లాడ మండలం కర్ణపల్లి గ్రామానికి చెందిన నాగరమణారెడ్డి కొత్తగూడెం జిల్లా క్లూస్ విభాగంలో పనిచేస్తూ పాల్వంచలో నివాసముంటున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

సెల్ఫీ వీడియో..: తాను ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నాడో కుటుంబ సభ్యులకు తెలియజేసేందుకు నాగరమణారెడ్డి తన ఫోన్‌లో రికార్డు చేసిన సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. గత నెల 24న పాల్వంచలో రమణారెడ్డి ప్రయాణిస్తున్న కారు లారీని ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. అప్పటి నుంచి తాను మానసిక ఒత్తిడికి గురయ్యానని, గాయాల కారణంగా ప్రశాంతంగా నిద్ర కూడా పోలేని పరిస్థితి నెలకొందని వీడియోలో పేర్కొన్నాడు.

'సివిల్ సప్లయిస్'లో అక్రమాలపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఎస్‌సీఎస్‌సీఎల్)లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న పిటిషనర్ వాదనలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నాలుగు వారాల్లోగా అన్ని వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా వేసింది. కార్పొరేషన్‌లో అక్రమాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ ఖజానాకు రూ.1,100 కోట్ల నష్టం వాటిల్లనుందని మాజీ ఎమ్మెల్యే, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. 'కార్పొరేషన్‌లో అక్రమాలపై బీఆర్ఎస్ పార్టీ రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ధాన్యం అమ్మకాల టెండర్లలో అవకతవకలు జరిగాయి. ఈ అక్రమాలను అడ్డుకునేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలి' అని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్య దర్శి, ఎండీ, కమిషనర్ తదితరులతోపాటు, ఎఫ్‌సీఐ, కేంద్రీయ భండార్‌లకు నోటీసులు జారీ చేసింది.

ఎంతమంది రైతులు ఆత్మహత్య చేసుకోవాలి?

మాజీ మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్య కారణంగా ఇంకా ఎంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. రుణమాఫీ కాదన్న వేదనతో సురేందర్‌రెడ్డి అనే రైతు ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా బాధించిందని, వారి కుటుంబానికి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలిపారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ తప్పును ఒప్పుకొని వెంటనే రైతులందరికీ రుణమాఫీ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతులు ఇలాంటి బాధలు పడొద్దనే తెలంగాణ సాధించుకున్నామని, వచ్చిన తెలంగాణలోనూ రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం తీవ్రంగా బాధిస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు.

టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొమ్మా మహేశ్‌కుమార్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంతకాలం టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి అద్భుతంగా పనిచేశారంటూ పార్టీ అధిష్టానం అభినందించింది. మహేష్‌కుమార్‌గౌడ్ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

- సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్

విద్యార్థి నేత నుంచి

బొమ్మా మహేశ్‌కుమార్‌గౌడ్ 1980లో భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్ఎస్‌యూఐ) ద్వారా విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి వచ్చారు. నిజామాబాద్ జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన, ఎనిమిదేళ్లపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్ఎస్‌యూఐ కమిటీకి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆపై యూత్‌కాంగ్రెస్ జాతీయకార్యదర్శిగా, ఆ తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కమిటీల్లో స్థానం సంపాదించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధిగా, కార్యదర్శిగా, ప్రధానకార్యదర్శిగా పలు హోదాల్లో పని చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ఏపీ వేర్‌హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్ 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2017లో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియమితులైన సమయంలోనే మహేశ్‌కుమార్‌గౌడ్‌కు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశం దక్కింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిది నెలలుగా టీపీసీసీకి అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ స్థానం నుంచి టికెట్ ఆశించినా దక్కలేదు. పార్టీ వ్యవహారాల్లో నిమగ్నమై ఉండాలని హైకమాండ్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు టికెట్ రేసు నుంచి తప్పుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. విధేయతకు పెద్దపీట వేస్తూ తాజాగా అధిష్టానం ఆయన్ను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. తెలంగాణ ఏర్పాటయ్యాక నాలుగో పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. పొన్నాల లక్ష్మయ్య, కెప్టెన్.ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎ.రేవంత్‌రెడ్డిల తర్వాత అధ్యక్షుడు కానున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పదోన్నతి కల్పించి పీసీసీ అధ్యక్షుడిగా నియమించిన కాంగ్రెస్ హైకమాండ్... మళ్లీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పదోన్నతి కల్పించి అధ్యక్షుడిగా నియమించడం గమనార్హం.

కరాటే 'డాన్'....

రాజకీయాల్లో నిత్యం బిజీగా ఉండే మహేశ్‌కుమార్‌గౌడ్ తనకు ఇష్టమైన కరాటే పట్ల ఆసక్తిని మాత్రం తగ్గనివ్వలేదు. 2006లో కరాటే బ్లాక్ బెల్ట్ 6వ డాన్ పూర్తి చేసిన ఆయన రాష్ట్రంలో కరాటే క్రీడ అభివృద్ధికి తన వంతు పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షునిగా పనిచేస్తున్నారు.

చిత్తశుద్ధి, అంకితభావంతో పార్టీని బలోపేతం చేస్తా : మహేశ్‌కుమార్‌గౌడ్

నిరంతరం కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటూ పార్టీకి, ప్రభుత్వానికి అనుసంధానంగా పనిచేసి రాష్ట్రాభివృద్ధితోపాటు పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని టీపీసీసీ కొత్త అధ్యక్షుడు బొమ్మా మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధి, అంకిత భావంతో నెరవేరుస్తానని చెప్పారు. టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్లమెంట్‌లో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఇంతకాలం నాకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు.' అని ఆ ప్రకటనలో మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

- మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్, అధికార ప్రతినిధి శ్రీరంగం సత్యం తదితరులు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. మహేశ్‌గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా నియమించిన వార్త తెలియగానే గాంధీ భవన్‌లో టీపీసీసీ కల్లుగీత కార్మిక విభాగం అధ్యక్షుడు నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు.
- మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ చేసినట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. కొత్త అధ్యక్షుడికి ఫోన్ చేసిన రేవంత్ అభినందనలు తెలిపారని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరినట్టు వెల్లడించాయి.

మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రొఫైల్

పేరు: బొమ్మా మహేశ్‌కుమార్‌గౌడ్
తండ్రి: గంగాధర్‌గౌడ్ (లేట్)
పుట్టిన తేదీ: 24-02-1966
జన్మస్థలం: రహత్‌నగర్, భీంగల్ మండలం, నిజామాబాద్ జిల్లా
విద్యార్హత: బీకాం
రాజకీయ ప్రస్థానం: నిజామాబాద్ జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు (1986-1990)
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు (1990-98)
- యూత్ కాంగ్రెస్ జాతీయకార్యదర్శి (1998-2000)
- పీసీసీ కార్యదర్శి (2000-2003), అధికార ప్రతినిధి (2012-2016)
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి (2016-2021)
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ (2017-2024)

పాత ఫార్ములానే..!

- ముఖ్యమంత్రిగా ఓసీ, టీపీసీసీ అధ్యక్షునిగా బీసీ నేతను నియమించే సంప్రదాయం కొనసాగింపు
- విధేయతకు ప్రాధాన్యం.. రేవంత్ సిఫారసుకు గ్రీన్‌సిగ్నల్
- మధుయాష్కీ, మహేశ్‌ల మధ్య చివరి వరకూ దోబూచులాట
- ఎస్సీ నేతను నియమించాలని అనుకున్నా మారిన అధిష్టానం ఆలోచన



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్ష నియామకంలో కాంగ్రెస్ హైకమాండ్ పాత ఫార్ములానే అనుసరించింది. ముఖ్యమంత్రిగా ఓసీ వర్గాలకు చెందిన వారిని నియమిస్తే... బీసీ వర్గానికి టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే సాంప్రదాయాన్ని కొనసాగించింది. ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతోపాటు ఆయన మూడేళ్ల పదవీకాలం కూడా ముగిసిన నేపథ్యంలో కొత్త అధ్యక్షుడి ఎంపిక వ్యవహారాన్ని ఏఐసీసీ చాలా సీరియస్‌గా తీసుకుంది. నాలుగు నెలలుగా దీనిపై కసరత్తు చేసిన అధిష్టానం పలుమార్లు రాష్ట్ర నేతలతో సంప్రదింపులు జరిపి, అనేక కోణాల్లో పలువురు రాష్ట్ర కాంగ్రెస్ నేతల పేర్లను ఈ పదవి కోసం పరిశీలించి చివరకు మహేశ్‌గౌడ్ వైపు మొగ్గు చూపింది.

చర్చోపచర్చలు.. భిన్న వాదనలు

కర్ణాటక ఫార్ములా ప్రకారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కొత్త టీపీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తారని తొలుత ప్రచారం జరిగింది. బీసీ వర్గానికి చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కూడా అధ్యక్షుడిగా నియమించే అవకాశముందనే చర్చ కూడా జరిగింది. ఆ చర్చల అనంతరం సామాజికవర్గాల లెక్కలు తెరపైకి వచ్చాయి. ఓసీ వర్గానికి చెందిన నేత ముఖ్యమంత్రిగా ఉండడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ఒకరిని అధ్యక్షుడిగా నియమిస్తారని, ఈ మేరకు ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పోరిక బలరాంనాయక్, మధుయాష్కీగౌడ్, మహేశ్‌కుమార్‌గౌడ్‌లలో ఒకరిని ఈ పదవిలో నియమిస్తారనే ప్రచారం ఊపందుకుంది. దీంతో పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీలను పార్టీ అధిష్టానం ఢిల్లీకి పిలిపించినప్పటికీ అధ్యక్షుడి వ్యవహారాన్ని తేల్చలేదు. కేబినెట్ ఖాళీలు భర్తీ చేసే క్రమంలో సామాజిక సమతుల్యత సరిపోలడం లేదంటూ వాయిదాలు వేసుకుంటూ వచ్చింది. ఇక, ఎస్సీల వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా మాదిగ సామాజికవర్గానికి అవకాశం వస్తుందని, ఈ మేరకు ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేరు ఖరారైందని ప్రచారం జరిగింది. ఆ తర్వాత కొన్నాళ్లు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ పేరు వినిపించింది. సీనియర్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఈ పదవిలో నియమిస్తారని మరికొన్నాళ్లు చర్చ జరిగింది. ఇక, ఎట్టకేలకు ఆగస్టు చివరి వారంలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో జరిపిన చర్చల్లో బీసీ వర్గానికి అధ్యక్ష పదవిని ప్రతిపాదించిన ఏఐసీసీ మధుయాష్కీ, మహేశ్‌గౌడ్‌ల పేర్లపై కీలక నేతల నుంచి అభిప్రాయ సేకరణ జరిపింది. వారి అభిప్రాయాలు విన్న తర్వాత ఎట్టకేలకు మహేశ్‌గౌడ్ వైపు మొగ్గుచూపింది.

రెండు ప్రాంతాలకు చెరో పదవి

మహేశ్‌గౌడ్‌ను అధ్యక్షుడిగా ఎంపిక చేయడంలో విధేయతకు ఏఐసీసీ పెద్దపీట వేసింది. దక్షిణ తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో ఉత్తర తెలంగాణకు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వడం, సామాజిక సమతుల్యత, రేవంత్ సిఫారసుకు ప్రాధాన్యం, సంస్థాగత వ్యవహారాలపై పట్టు నేపథ్యంలో మధుయాష్కీ, మహేశ్‌గౌడ్‌ల మధ్య దోబూచులాటతో చివరి నిమిషంలో ఉత్కంఠ రేపింది. మహేశ్‌గౌడ్ నియామకం పూర్తయిందని, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై పార్టీ అధ్యక్షుడు ఖర్గే సంతకం చేశారని, కేసీ.వేణుగోపాల్ కూడా మహేశ్‌గౌడ్‌తో మాట్లాడి దిశానిర్దేశం చేశారనే వార్తలొచ్చిన తర్వాత కూడా మరోవారం రోజుల పాటు జాప్యం జరిగింది. ఈనేపథ్యంలో మళ్లీ కాంగ్రెస్ మార్కు ఊహాగానాలకు తెరలేచినా ఎట్టకేలకు మహేశ్‌గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి దక్కింది.

మాకెప్పుడు మాఫీ?

రుణమాఫీ జరగని రైతుల్లో ఆగ్రహావేశాలు	• రుణమాఫీ జరగని రైతుల కుటుంబసభ్యుల నిర్ధారణ కోసం గ్రామాల్లో సర్వే • వరదలు, వర్షాల కారణంగా చాలాచోట్ల నిలిచిన ప్రక్రియ
ఇంకా ఫిర్యాదులు తీసుకుంటూనే ఉన్న అధికారులు	• రుణమాఫీ ఎప్పుడు జరుగుతుందో అంటూ రైతుల్లో ఆందోళన • రూ.2 లక్షలకు మించిన రుణాల మాఫీపై ఇప్పటికీ కొరవడిన స్పష్టత.. మేడ్చల్ జిల్లాలో రైతు ఆత్మహత్యతో కలకలం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ జరగని లక్షలాది మంది రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఫిర్యాదులు తీసుకుంటున్నా, గ్రామాల్లో సర్వే చేస్తున్నా తమకు న్యాయం దక్కడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కారణాలతో కొందరికి రుణమాఫీ జరగలేదనీ ప్రభుత్వం చెబుతూ సర్వే చేస్తున్నప్పటికీ.. వారికి ఎప్పుడు రుణమాఫీ జరుగుతుందో స్పష్టత ఇవ్వక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకెందుకు రుణమాఫీ జరగడం లేదని వ్యవసాయశాఖ అధికారులను నిలదీస్తున్నారు. సురేందర్‌రెడ్డి అనే 52 ఏళ్ల రైతు తనకు రుణమాఫీ కాలేదనే ఆవేదనతో శుక్రవారం మేడ్చల్ వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలో బలవన్మరణానికి పాల్పడటం కలకలం రేపుతోంది.

మాఫీకి దూరంగా లక్షలాది మంది

గత ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చి 31 నాటికి బ్యాంకులు రైతులకు ఇచ్చిన మొత్తం పంట రుణాలు రూ.64,940 కోట్లు. ఇందులో డిసెంబర్ నాటికి ఇచ్చిన రుణాలు రూ.49,500 కోట్లు. ఈ నేపథ్యంలో రూ.2 లక్షల రుణమాఫీ కోసం రూ.40 వేల కోట్ల వరకు అవసరమని మొదట్లో కాంగ్రెస్ సర్కారు ప్రాథమిక అంచనా వేసింది. అనంతరం రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవుతాయంటూ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తీరా బడ్జెట్ కేటాయింపుల్లో దాన్ని రూ.26 వేల కోట్లకు కుదించారు. చివరికు మూడు విడతల్లో రుణమాఫీకి ఇచ్చింది రూ.17,933 కోట్లు మాత్రమే కావడంతో లక్షలాది మంది రుణమాఫీకి దూరమయ్యారు. గత ప్రభుత్వ హయాంలో రూ.లక్ష మాఫీకి 36.68 లక్షల రైతులు అర్హులు కాగా.. ప్రస్తుత ప్రభుత్వంలో రూ.2 లక్షల మాఫీకి 22.37 లక్షల మందే ఉండటం విస్మయం కలిగించే అంశం. కాగా రూ.లక్ష రుణమాఫీతో పోల్చితే రూ.2 లక్షల మాఫీలో రైతుల సంఖ్య ఏకంగా 14.31 లక్షలు తగ్గిపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు రుణమాఫీ జరగలేదంటూ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది రైతులు ఆందోళనలు చేపడుతున్నారు. లక్షలాది మంది ప్రభుత్వానికి ఫిర్యాదులు చేస్తున్నారు.

రైతుల వివరాల సేకరణ పూర్తయ్యేదెప్పుడు?

రేషన్‌కార్డు లేకపోవడం, ఆధార్..బ్యాంక్ అకౌంట్లలో తప్పిదాలు, ఇతర సాంకేతిక కారణాలతో రూ.2 లక్షల వరకు మాఫీకాని రైతుల కుటుంబసభ్యుల నిర్ధారణ కోసం వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో సర్వే చేపట్టారు. బ్యాంకు డేటా ఆధారంగా 4.5 లక్షల మంది రైతుల వివరాలను సేకరించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఇప్పటివరకు లక్షన్నర మంది రైతుల వివరాలను గుర్తించినట్లు చెబుతున్నారు. సర్వేలో భాగంగా కుటుంబసభ్యుల ఆధార్ నంబర్లు, వారి వయస్సులు, ఇతర వివరాలు సేకరించడంతో పాటు కుటుంబ పెద్దతో ఫొటో తీయాల్సి ఉంది. వారి సెల్ఫీ ఫొటోలను, రైతులు ఇచ్చిన అఫిడవిట్లను అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే వరదలు, వర్షాల కారణంగా ఈ ప్రక్రియ చాలాచోట్ల నిలిచిపోయింది. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వివరాల సేకరణ ఎప్పుడు పూర్తి అవుతుందో, రుణమాఫీ ఎప్పుడు జరుగుతుందో అంతుబట్టడం లేదనే నిరాశా నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు గత ఐదేళ్ల కాలంలో కుటుంబ పెద్ద చనిపోయిన రైతు కుటుంబాలు చాలా ఉన్నాయి. వారికి రుణమాఫీ కాలేదని అనేకచోట్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. దీనికి సంబంధించి ఫార్మాట్‌లో ఎలాంటి కాలమ్ లేదని బాధిత కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి.

అదనపు మొత్తంపై మార్గదర్శకాలెప్పుడు?

ప్రస్తుతం రూ.2 లక్షల్లోపు రుణం ఉన్న రైతులకే రుణమాఫీ వర్తింపజేశామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆపై ఒక్క రూపాయి అదనంగా రుణం తీసుకుని ఉన్నా మాఫీ వర్తింపజేయలేదు. రూ.2 లక్షల కంటే ఎక్కువగా ఉన్న రుణం సొమ్మును రైతులు చెల్లించాకే ప్రభుత్వం నుంచి సొమ్ము జమ అవుతుందని అంటున్నారు. అయితే ఇందుకు వ్యవసాయాధికారులు ఎలాంటి గ్యారంటీ ఇవ్వడం లేదు. కొన్నిచోట్ల రైతులు ఇప్పటికే అదనపు మొత్తం చెల్లించి అధికారులను సంప్రదించారు. కానీ ఇప్పటివరకు దీనికి సంబంధించిన మార్గదర్శకాలు రాలేదని చెబుతున్న అధికారులు, కనీసం అవి ఎప్పుడు వస్తాయో కూడా చెప్పలేని పరిస్థితిలో ఉండటంతో రైతుల పరిస్థితి దిక్కుతోచకుండా ఉంది. రాష్ట్ర స్థాయి వ్యవసాయాధికారులు కూడా దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు.

రాష్ట్రంలో పాశవిక ప్రభుత్వం రాజ్యమేలుతోంది

- రావణకాష్టం కాకముందే ప్రజలు మేలుకోవాలి
- రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైంది.. జైనూరు ఘటనలో బాధితులకు న్యాయం జరగాలి
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన హరీశ్‌రావు, ఇతర నేతలు


బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న హరీశ్. చిత్రంలో తలసాని, సునీతారెడ్డి, సబితారెడ్డి

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): రాష్ట్రంలో పాశవిక ప్రభుత్వం రాజ్యమేలుతోందని, రాష్ట్రం రావణకాష్టం కాకముందే ప్రజలంతా మేల్కొనాలని పలువురు బీఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చారు. జైనూరు ఘటనలో గాయపడి.. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళ, ఆమె కుటుంబసభ్యులను శుక్రవారం పరామర్శించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. జైనూరులో ఆదివాసీ మహిళపై జరిగిన ఘటన అత్యంత దారుణమని, అత్యాచారం చేసి రాయితో ముఖంపై దాడి చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యాచారాలు నిత్యకృత్యం అయ్యాయని, నాగర్‌కర్నూలు, జైనూరు, హైదరాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, నల్లగొండ తదితర ప్రాంతాల్లో మహిళలపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు మచ్చుకైనా కనిపించడం లేదని అన్నారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో 1,900 అత్యాచారాలు, 2,600 హత్యలు, 230 ఆయుధాల కేసులు నమోదు అయ్యాయని ఆయన గణాంకాలతో వివరించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం రక్షణకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందంటూ కేంద్ర హోం శాఖ అధికారులు, దేశ భద్రతా సలహాదారు మెచ్చుకున్నారని, పోలీస్ గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ భద్రతకు మారుపేరు అని కితాబు ఇచ్చారని గుర్తు చేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన డీజీపీ బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే నిర్మల్, సనత్‌నగర్, గోషామహల్, జైనూరులో మత కలహాలు చెలరేగాయన్నారు. మెదక్ మతకల్లోలాన్ని అదుపు చేయడంలో విఫలమైన ఎస్పీని హైదరాబాద్ ఈస్ట్‌జోన్ డీసీపీగా నియమించారని ఆక్షేపించారు. డయల్ 100 పని చేయడంలేదని, మహిళల భద్రతపై జాతీయ మహిళా కమిషన్ స్పందించాలని, కేంద్ర హోం శాఖ జోక్యం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నిరంగాల్లో పూర్తిస్థాయిలో విఫలం అయ్యారని విమర్శించారు. ఆదివాసీ మహిళ దారుణ అత్యాచారానికి గురై చావుబ్రతుకుల్లో ఉంటే పరామర్శించే మానవత్వం లేదా అంటు రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. జైనూరు ఘటనలో బాధిత మహిళలకు తక్షణ న్యాయం జరగాలని, రూ.10 లక్షల నష్టపరిహారం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేసేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కాగా, జైనూరు ఘటనలో నిందితుడికి వత్తాసు పలుకున్న వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని సునీతా లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముఠాగోపాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని..

మేడ్చల్‌లో దుబ్బాక రైతు ఆత్మహత్య

- బ్యాంకులో తల్లి, కుమారుడికి వేర్వేరుగా పంట రుణాలు
- ఒకే రేషన్‌కార్డులో ఇద్దరి పేర్లూ ఉండటం, ఇద్దరి రుణాలూ కలిపి రూ.3 లక్షలకు పైగా ఉండటంతో జరగని రుణమాఫీ
- మనస్తాపంతో వ్యవసాయ కార్యాలయం సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణం


ఘటనా స్థలంలో సురేందర్‌రెడ్డి మృతదేహం

మేడ్చల్/దుబ్బాక రూరల్: రుణమాఫీ కాలేదని మనోవేదనకు గురైన ఓ రైతు చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేటభూంపల్లి మండలం చిట్టాపూర్‌కు చెందిన సోలిపేట సురేందర్‌రెడ్డి (52) మేడ్చల్ హౌసింగ్ బోర్డు కాలనీలో భార్య మంజుల, కుమారుడు నితిన్‌రెడ్డితో కలిసి నివాసముంటున్నాడు. కండ్లకోయలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సురేందర్‌రెడ్డికి చిట్టాపూర్‌లో ఆయన పేరుపై 4.5 ఎకరాల భూమి, తల్లి సుశీల పేరిట రెండు ఎకరాల భూమి ఉంది. ఇద్దరూ చిట్టాపూర్‌లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకులో 2012లో పంట రుణం తీసుకున్నారు. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేస్తూ రాగా ప్రస్తుతం సుశీల పేరిట రూ.1,15,662, సురేందర్‌రెడ్డి పేరిట రూ. 1,92,440 పంట రుణం ఉంది. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతలుగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన సంగతి తెలిసిందే. కాగా సురేందర్‌రెడ్డి, సుశీల ఇద్దరి రుణాలూ కలిపి రూ.3,08,102 ఉండటంతో వారి రుణాలు మాఫీ కాలేదు. దీంతో సురేందర్‌రెడ్డి పలుమార్లు బ్యాంకు అధికారులను, వ్యవసాయాధికారులను సంప్రదించాడు. తనకు మాఫీ ఎందుకు కాలేదని వారిని అడగగా.. తల్లి, కుమారుడి పేర్లు ఒకే రేషన్‌కార్డులో ఉన్నాయని, రుణం రూ.3 లక్షల పైచిలుకు ఉండటం వల్ల మాఫీ కాలేదని అధికారులు చెప్పినట్లు తెలిసింది. ప్రభుత్వం రేషన్ కార్డుకు రూ.2 లక్షల వరకు మాత్రమే రుణమాఫీ చేసిందని వారు స్పష్టం చేసినట్లు సమాచారం. ఇద్దరికీ వేర్వేరు రేషన్‌కార్డులు ఉండి ఉంటే మాఫీ అయ్యేదని వారు పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సురేందర్‌రెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ విషయమై పలుమార్లు తన సోదరుడు రవీందర్‌రెడ్డి, ఇతర కుటుంబసభ్యులతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశాడు. రేషన్‌కార్డు నుంచి తల్లి పేరు తొలగించేందుకు దరఖాస్తు కూడా చేశాడు. సురేందర్‌రెడ్డికి గతంలోనూ రుణమాఫీ కాలేదని తెలిసింది. ఈ నేపథ్యంలోనే తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్ కోసమని ఇంట్లో నుండి వెళ్లిన సురేందర్‌రెడ్డి మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయ కాంప్లెక్స్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని నగరంలోని గాంధీ మార్చురీకి తరలించారు.

రెండురకాల సూసైడ్ నోట్‌లు

మృతుడి జేబులో నుంచి పోలీసులు రెండు రకాల సూసైడ్ నోట్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఏటీఎం (ఎస్‌బీఐ)లోంచి వచ్చే స్లిప్పులపై ఇవి రాసి ఉన్నాయి. ఒక దానిపై 'నా చావుకు కారణం నా అమ్మ' అని రెండు సార్లు, మరో పత్రంపై 'చిట్టాపూర్ బ్యాంకులో లోన్ మాఫీ కాలేదని, అందుకే నా ఆత్మహత్య' అని రాసి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. 2023 నుంచి ఇప్పటివరకు సురేందర్ రెడ్డి బ్యాంకు రుణం రూ.192440, తల్లి సుశీల బ్యాంకు రుణం రూ.115662 ఇద్దరిది కలిపి మొత్తం రూ.308102

రామన్నపేట రైతువేదికలో నిరీక్షిస్తున్న రైతు కుటుంబాలు



రైతు రుణమాఫీ కాని కుటుంబాల వివరాలు నమోదు

రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద శుక్రవారం రుణమాఫీ కాని రైతు కుటుంబాల ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న రామన్నపేటతో పాటు పరిసర గ్రామాలకు చెందిన రైతు కుటుంబాలు వందల సంఖ్యలో ఉదయం 10 గంటలకే రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. అయితే మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వర్ పనిచేయకపోవడంతో రైతులు రెండుగంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. అనంతరం మూడు ఫోన్ల ద్వారా వివరాలను అప్‌లోడ్ చేయడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



ఎర్రగడ్డ మార్కెట్‌లో..



సనత్‌నగర్‌లో..

ఖైరతాబాద్ కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ఖైరతాబాద్ మహా గణపతి దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధిస్తూ ట్రాఫిక్ విభాగం అదనపు పోలీసు కమిషనర్ పి.విశ్వప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం నుంచి ఈ నెల 17 వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఇవి అమలులో ఉండనున్నాయి. వీవీ స్టాచ్యూ నుంచి మింట్ కాంపౌండ్‌లోకి వచ్చే వాహనాలను నిరంకారి వైపు మళ్లిస్తారు. ఓల్డ్ సైఫాబాద్ ఠాణా నుంచి బడా గణేషుడి వైపు వచ్చే వాహనాలను రాజ్‌దూత్ హోటల్ నుంచి ఇక్బాల్ మినార్ వైపు పంపిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వచ్చే వాహనాలను తెలుగు తల్లి జంక్షన్ వైపు మళ్లిస్తారు. దీంతోపాటు మరికొన్ని మళ్లింపుల నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ చుట్టూ, ఖైరతాబాద్ ప్రాంతంలో భారీ ట్రాఫిక్ జామ్‌లకు ఆస్కారం ఉంది. నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ గార్డెన్స్ వైపు నుంచి వచ్చే వారు తమ వాహనాలను అంబేడ్కర్ విగ్రహం వద్ద, ఐమాక్స్ పక్కన, ఎన్టీఆర్ గార్డెన్స్ పార్కింగ్ ప్రాంతంలో నిలపాలి. ఎలాంటి సహాయ సహకారాలు అవసరమున్నా 90102 03626లో సంప్రదించాలని విశ్వప్రసాద్ కోరారు.

గణేష్ మండపాలకు నిరంతరాయ విద్యుత్: సీఎండీ

సాక్షి, సిటీబ్యూరో: వినాయక నవరాత్రులను పురస్కరించుకుని భక్తులు ఏర్పాటు చేసే మండపాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు సీఎండీ ముషారఫ్ ఫారూఖీ చెప్పారు. ఈ మేరకు గణేష్ మండపాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా, భద్రతా పరంగా తీసుకున్న చర్యలపై శుక్రవారం సీజీఎంలు, ఎస్ఈలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది, సెక్షన్ అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించి, విద్యుత్ పరంగా ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. సామాన్య ప్రజలు, భక్తులు, ఉత్సవ నిర్వాహకులు మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలని కోరారు. సమావేశంలో డైరెక్టర్ ఆపరేషన్ నర్సింహులు, చీఫ్ ఇంజినీర్స్ కె.సాయిబాబా, వి.శివాజీ, పి.ఆనంద్ పాల్గొన్నారు.

మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ శుభాకాంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: వినాయక చవితి పండగ సందర్భంగా జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కమిషనర్ ఆమ్రపాలి నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సకల విఘ్నాలను తొలగించే వినాయకుడి అనుగ్రహం నగర ప్రజలందరికీ కలగాలని, అందరి ఇంటా సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ఆనందంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని కోరారు. ఎలాంటి విఘ్నాలు లేకుండా నగరం మరింత అభివృద్ధి చెందాలని ఆమ్రపాలి అభిలషించారు.



నిమజ్జనానికి 73 ప్రాంతాల్లో పాండ్స్ ఏర్పాటు

లక్డీకాపూల్: గణపతి విగ్రహాల నిమజ్జనానికి వీలుగా నగరంలోని 73 ప్రాంతాల్లో వివిధ రకాల పాండ్‌లను జీహెచ్ఎంసీ అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా 27 బేబీ పాండ్స్, 24 పోర్టబుల్, 22 తాత్కాలిక పాండ్స్‌ను ఏర్పాటు చేసింది. వీటిలో 2 నుంచి 5 అడుగుల ఎత్తు విగ్రహాలను నిమజ్జనం చేయడానికి వీలుగా ఉంటుంది. గణపతి ఉత్సవాలను పురస్కరించుకుని పర్యావరణ హితమైన గణనాథుల పూజ కోసం జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా మట్టితో ఏర్పాటు చేసిన మూడు లక్షల పదివేల విగ్రహాలను ప్రజలకు బల్దియా పంపిణీ చేసింది. మండపాల నుంచి గణనాథులను నిమజ్జనానికి తీసుకువెళ్లే మార్గాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా చెట్ల కొమ్మలను తొలగించారు. రోడ్లపై గుంతలను పూడ్చివేసి గణేష్ శోభాయాత్ర సక్రమంగా జరిగేందుకు ఏర్పాట్లు చేశారు. వీధి దీపాలు వెలిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు... శానిటేషన్ నిర్వహణపైనా శ్రద్ధ పెట్టాలని ఆయా విభాగాల అధికారులను కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. నిమజ్జనం జరిగే ప్రదేశాలలో అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

శతాబ్దాల చారిత్రక సాంస్కృతిక వైభవం

- ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న భాగ్యనగరం
- నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన మండపాలు
- వేడుకలకు సిద్ధమైన వైవిధ్యభరిత గణపతి మూర్తులు



పత్రి కొనుగోలు చేస్తున్న నగర వాసులు

పత్రి, పూలు, పండ్ల ధరలకు రెక్కలు

వినాయక చవితిని పురస్కరించుకుని శుక్రవారం మార్కెట్లు కిటకిటలాడాయి. పూలు, పండ్లు, పత్రి, అరటి మొక్క, మామిడి ఆకుల, ఇతర పూజా సామగ్రికి ఫుల్ డిమాండ్ కనిపించింది. వినాయక విగ్రహాల స్టాల్స్ వద్ద ప్రజలు బారులు తీరారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలను ఉచితంగా అందిస్తున్నప్పటికీ కొనుగోళ్ల హవా కనిపించింది. మూడు అడుగుల వినాయక ప్రతిమ ధర రూ.3 వేల వరకు పలికింది.

200 టన్నుల పూలు వచ్చాయి..


మార్కెట్‌లో పూలకు విపరీతమైన గిరాకీ కనిపించింది. హోల్‌సేల్‌గా కిలో చామంతి రూ.250, బంతి రూ.50, గులాబీ రూ.200 చొప్పున అమ్ముతున్నాం. బయట ఇంకా ఎక్కువ ధర ఉండొచ్చు. సుమారు 200 టన్నుల కంటే ఎక్కువే పూలు వచ్చాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

– శ్రవణ్, పూల వ్యాపారి, గుడిమల్కాపూర్ మార్కెట్



భాగ్యనగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. బొజ్జ గణపయ్య కొలువుదీరనున్న మండపాలు సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. విభిన్న ఆకృతులలో రూపొందించిన వైవిధ్యభరితమైన విగ్రహ మూర్తులు నేటినుంచి తొమ్మిది రోజుల పాటు భక్తకోటికి కనువిందు చేయనున్నాయి. కరిముఖుడు భక్తుల నిత్యపూజలు అందుకోనున్నాడు. నగర వాసుల్లో పర్యావరణహితమైన విగ్రహాల పట్ల అవగాహన పెరిగింది. దీంతో మండపాల్లో ఏర్పాటు చేసే విగ్రహాలు మినహాయించి ఇళ్లలో చాలా వరకు మట్టి విగ్రహాలనే ప్రతిష్టిస్తున్నారు. అనేక స్వచ్ఛంద సంస్థలు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, కాలుష్య నియంత్రణ మండలి వంటి ప్రభుత్వ సంస్థలు భారీ సంఖ్యలో మట్టి విగ్రహాలను ఉచితంగా అందజేశాయి. హెచ్ఎండీఏ ఈ ఏడాది సుమారు లక్ష విగ్రహాలను పంపిణీ చేసింది. మరోవైపు ధూల్‌పేట్, నాగోల్, ఉప్పల్, కూకట్‌పల్లి, మియాపూర్ తదితర ప్రాంతాల్లోనూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల అమ్మకాలు పెద్ద ఎత్తున జరిగాయి. నగరమంతటా వందలాది మండపాలను నిర్వాహకులు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మరికొద్ది గంటల్లో ఆసీనుడు కానున్న వినాయకుడి ఉత్సవం.. మహోన్నతమైన హైదరాబాద్ సాంస్కృతిక వైభవానికి ఒక ప్రతీక.

– సాక్షి, సిటీబ్యూరో



భజే వినాయకం!



ఖైరతాబాద్ మహా గణపతి చెంత భక్తుల సందడి



ఎర్రగడ్డ మార్కెట్‌లో కొనుగోలుదారుల కోలాహలం

శతాబ్దాల వేడుక..

విభిన్న జీవన సంస్కృతుల ఆవిష్కరణ భాగ్యనగరం. సమూహమయ్యే ప్రతి మనిషిలో జీవనోత్సాహం పెల్లుబికుతుంది. వినాయక చవితి వేడుకలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. అనేక శతాబ్దాలుగా లంబోదరుడు భక్తజనుల పూజలను అందుకుంటూనే ఉన్నాడు. శాతవాహనులు, రాష్ట్రకూటులు, చాళుక్యుల కాలం నుంచే ప్రజలు విఘ్నేశ్వరుడి పండగలు చేసుకుంటున్నట్లు చరిత్ర చెబుతోంది. అప్పటికి ఇంకా ఈ వేడుక ఇంకా సామూహికం కాదు. 1818 నుంచి 1892 వరకు వినాయక నవరాత్రి ఉత్సవాలు కేవలం ఇళ్లకే పరిమితమయ్యాయి. ఎవరి ఇంట్లో వాళ్లు గణనాథుడికి పూజలు చేసి భక్తితో కొలిచేవారు. 1893 తర్వాతే వినాయకుడి పండగ ఒక సామూహిక ఉత్సవమైంది. బ్రాహ్మణ, బ్రాహ్మణేతరులుగా విడిపోయిన ప్రజలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు, స్వాతంత్ర్యోద్యమాన్ని బలోపేతం చేసేందుకు లోకమాన్య బాల గంగాధర తిలక్ లాల్‌బాగ్‌లో తొలిసారి నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఇలా మహారాష్ట్రలో ప్రారంభమైన ఈ వేడుకలు అనతి కాలంలోనే హైదరాబాద్‌లో మొదలయ్యాయి.

ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో..

- ఆరో నిజాం మహబూబ్ అలీఖాన్ హయాంలో హిందువుల పండగలకు, సంస్కృతులకు సమున్నతమైన స్థానం లభించింది. మూసీ వరదల నుంచి ప్రజలను కాపాడాలని కోరుతూ ఆయనే స్వయంగా పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయాంలో బహదూర్‌యార్‌జంగ్, ఖాసీం రజ్వీ నేతృత్వంలో జరిగిన అకృత్యాలను తిప్పికొట్టేందుకు ఆర్య సమాజ్ వాడ వాడలా వినాయక మండపాలను నెలకొల్పి విగ్రహాలను ఏర్పాటు చేసింది. పండిత్ నరేంద్రజీ నేతృత్వంలో నగరంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. 1950 తర్వాత ఈ వేడుకలు అన్ని చోట్ల ఘనంగా జరిగాయి.



పూల విక్రయాలు..



అమ్మకానికి సిద్ధంగా గణనాథుల ప్రతిమలు

- బాలాపూర్, లాల్‌దర్వాజా, మీరాలంట్యాంక్ , ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో అందమైన బొజ్జ గణపయ్యలు కొలువుదీరారు. పాతబస్తీలోని బారాగల్లి కబూతర్ ఖానాలో వందేళ్లకు పైగా వేడుకలు జరుగుతున్నాయి. నిజాం కాలంలో లక్ష్మయ్య, ఎంకమయ్య అనే ఇద్దరు భక్తులు మరికొందరితో కలిసి హుస్సేనీ ఆలం బారాగల్లీలో చిన్న వినాయకుడిని ప్రతిష్ఠించినట్లు స్థానికులు చెబుతారు. మీరాలంమండి వినాయకుడికి 140 సంవత్సరాల చరిత్ర ఉంది. 1953లో అప్పటి స్వాతంత్ర్య సమరయోధుడు శంకర్ ఖైరతాబాద్‌లో ఒక్క అడుగు ఎత్తు వినాయకుడితో వేడుకలను ప్రారంభించారు. ఇలా.. భక్తకోటి గుండెల్లో గుడి కట్టుకొన్న మహాదైవం వినాయకుడి వేడుకలకు హైదరాబాద్‌కు చాలాకాలంగా అనుబంధం ఉంది.

సామూహిక నిమజ్జనం ఇలా..

అందమైన ఉద్యానాలతో విరాజిల్లినట్లుగానే వందల కొద్దీ చెరువులతో, జలాశయాలతో భాగ్యనగరం కళకళలాడింది. వాడవాడలా కొలువుదీరినప్పటికీ ఆ రోజుల్లో ఎక్కడి వారు అక్కడే నిమజ్జనం చేసేవారు. ట్యాంక్‌బండ్‌తో పాటు సఫిల్‌గూడ, సరూర్‌నగర్, మీరాలం ట్యాంకు, రాజన్నబావి తదితర చెరువుల్లో నిమజ్జనం చేసేవారు. 1979 నాటి నిమజ్జనోత్సవానికి కంచి శంకరాచార్యులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. చార్మినార్ స్వాగత వేదికపై నుంచి ప్రసంగించారు. ఒకవైపు ఆయన ప్రసంగం కొనసాగుతుండగానే అల్లర్లు చోటుచేసుకున్నాయి. ఇరువర్గాల మధ్య దాడులు జరిగాయి. నిమజ్జన వేడుకలు విడి విడిగా జరగడమే ఇందుకు కారణమని భావించిన కొందరు పెద్దలు అన్ని విగ్రహాలను ట్యాంక్‌బండ్‌లోనే నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. అలా వందేమాతరం రామచంద్రయ్య నేతృత్వంలో ఆలె నరేంద్ర, బద్దం బాల్‌రెడ్డి, దత్తాత్రేయ, భరత్‌సింగ్, డాక్టర్ భగవంత్‌రావు, మరికొందరు కలిసి 1980లో భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితిని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు చెందిన వినాయక విగ్రహాలు హుస్సేన్‌సాగర్ బాట పట్టాయి. ఆ ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగుతోంది.

వద్దు వద్దంటూనే..

- గ్రేటర్‌లో ఏటా దాదాపు రూ.30 కోట్లు వ్యయం
- అద్దెల పేరిట ఖజానాకు చిల్లు..

స్వీపింగ్ యంత్రాలపై బల్దియా ద్వంద్వ వైఖరి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో అట్టహాస ఆర్భాటాలతో కనిపించే స్వీపింగ్ మెషిన్లు ఆకారానికి తప్ప వీధులను పరిశుభ్రం చేయడం లేదని పలు సందర్భాల్లో వెల్లడైంది. వాటితో ప్రయోజనం లేనప్పటికీ, కాంట్రాక్టుల గడువులు ముగిసినప్పటికీ, జీహెచ్ఎంసీ అధికారులు వాటిని కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా మార్కెట్‌లో అధునాతనంగా వచ్చిన స్వీపింగ్ యంత్రాలపై దృష్టి సారించారు. బహుశా, ప్రస్తుతమున్న వాటివల్ల ఎలాంటి ప్రయోజనం లేదని తెలిసి కాబోలు మార్కెట్‌లో ఏయే రకాల స్వీపింగ్ మెషిన్లున్నాయి.. వాటిలో జీహెచ్ఎంసీ రోడ్లకు పనికి వచ్చేవి ఏవి.. వాటిని వినియోగించేందుకు అయ్యే వ్యయమెంత.. జీహెచ్ఎంసీ ఆ వ్యయాన్ని భరించగలదా? అనే విషయాలను తెలుసుకునేందుకు స్వీపింగ్ మెషిన్ల తయారీదారులు/అధీకృత ఏజెన్సీల నుంచి జీహెచ్ఎంసీ ఆసక్తి వ్యక్తీకరణలను ఆహ్వానించింది. రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే విధానం, ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్, అందుకుగాను ఒక్కో స్వీపింగ్ మెషిన్‌కు ఏడాదికయ్యే వ్యయం వంటి వివరాలను ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తులో తెలపాలని కోరింది. అంటే, మళ్లీ అద్దెలపై వాటిని తీసుకునేందుకు సిద్ధమవుతోంది.

నిధుల దుబారాకేనని ఆరోపణలు..

స్వీపింగ్ మెషిన్ల అద్దెల పేరిట దాదాపు ఏడెనిమిదేళ్లుగా జీహెచ్ఎంసీ ఖజానాకు చిల్లు పెడుతున్నారు. ఏటా దాదాపు రూ.30 కోట్లు వాటి పేరిట వ్యయం చేస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. గతంలో ఓ అడిషనల్ కమిషనర్ నిర్వహించిన తనిఖీల్లో అసలు స్వీపింగ్ మెషిన్లు రోడ్లపై ఊడ్చడం లేదని, తిరగాల్సినంత దూరం తిరగడం లేదని గుర్తించారు. ఊరికే షో చేస్తూ నిధులు కొల్లగొట్టేందుకే అవి ఉపయోగపడుతున్నాయని గుర్తించారు. అసలు స్వీపింగ్ మెషిన్ల వల్ల ప్రయోజనమెంత? అన్నది పట్టించుకోకుండానే నిధుల దుబారాకే వాటిని వాడుతున్నారనే ఆరోపణలకు అడ్డుకట్ట వేయలేక పోయారు. తిరిగి మళ్లీ తాజాగా కొత్త రకాల పేరిట తెర తీసినట్లు వినిపిస్తోంది. ఏం జరగనుందో వేచి చూడాల్సిందే.

ఈసారైనా నిజంగా వీధులు శుభ్రం చేసేందుకేనా?

స్వచ్ఛ కార్యక్రమాల్లో ఎప్పుడూ అగ్రగామిగా నిలిచే ఇండోర్‌లో స్వీపింగ్ మెషిన్లు రోడ్లను శుభ్రంగా ఊడ్వడంతో పాటు ఊడ్చినప్పుడు దుమ్ము లేకుండా స్ప్రింకర్ల ద్వారా నీరు చల్లే ఏర్పాటు కూడా ఉండటాన్ని జీహెచ్ఎంసీ అధికారులు గుర్తించి ఏళ్లు గడుస్తున్నప్పటికీ, అలాంటివి మాత్రం జీహెచ్ఎంసీలో ప్రవేశపెట్టలేదు. అధునాతన స్వీపింగ్ మెషిన్ల పేరిట మళ్లీ కాంట్రాక్టర్లతో మిలాఖతయ్యే దందాకు తెర తీస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కార్మికుల రక్షణ కోసం..

వాస్తవానికి పారిశుధ్య కార్మికుల రక్షణను దృష్టిలో ఉంచుకొని స్వీపింగ్ మెషిన్లను వినియోగంలోకి తెచ్చారు. రాత్రుళ్లు వేగంగా వెళ్లే వాహనాల వల్ల విధుల్లోని పారిశుధ్య కార్మికులకు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వారి సేవల స్థానే ఈ మెషిన్లను వినియోగంలోకి తెచ్చారు. కానీ, అవి రోడ్లను ఊడ్వకుండానే నిధుల్ని ఊడ్చేందుకు మాత్రం కాంట్రాక్టర్లు, కొందరు అధికారులకు ఉపకరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి.



ఆ సంగతి మరిచారా?

స్వీపింగ్ మెషిన్లను ప్రధాన రహదారుల్లోనే వినియోగిస్తారు. జీహెచ్ఎంసీలో ప్రధాన రహదారుల నిర్వహణను సీఆర్ఎంపీ కింద పెద్ద కాంట్రాక్టు ఏజెన్సీలకిచ్చారు. రోడ్ల నిర్వహణతోపాటు రోడ్లు శుభ్రం చేసే బాధ్యత కూడా వాటిదే. జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ విషయాన్ని మరచిపోయిందా లేక ఆ నిబంధనను ఉపసంహరించుకుందో లేక కాంట్రాక్టు రేటు తగ్గించిందో సంబంధిత అధికారులకే తెలియాలి.

తమ్మిడి– ఈదుల కుంటలే రోల్‌మోడల్

- దీని నుంచే పునర్ నిర్మాణం ప్రారంభించనున్న హైడ్రా
- ఈదులకుంట వరకు ఉన్న నాలా ఆక్రమణల తొలగింపు
- చెరువుల పూడికతీత, పరిరక్షణలో స్థానికుల భాగస్వామ్యం
- పటిష్ట కార్యాచరణ సిద్ధం చేస్తున్న హైడ్రా కమిషనర్

ఎన్-కన్వెన్షన్ కూల్చివేతతో జాతీయ స్థాయి వార్తల్లోకి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ లేక్ సిటీ... ఇక్కడ గొలుసుకట్టు చెరువులు ఉండటం ఓ ప్రత్యేకత... ఒకప్పుడు నగరంలోని చెరువుల్ని కనెక్ట్ చేస్తూ నాలాలు ఉండేవి... ఇప్పుడవన్నీ ఆక్రమణలకు గురి కావడమే తరచూ వరదలు, రోడ్ల మునకలు.. చెరువులు, కుంటలతో పాటు నాలాలను చెర విడిపించి సంరక్షిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

– ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఆది నుంచి చెబుతున్న విషయాలివి. చెరువులు, నాలాల పునర్ నిర్మాణంతో కలిగే ఉపయోగాలను ప్రజలకు ప్రత్యక్షంగా చూపించాలని ఈ విభాగం కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. రాజధానిలోని రెండు చెరువుల్ని ఎంచుకుని, వాటితో పాటు నాలాలకు పాత రూపు తీసుకువచ్చి అభివృద్ధి చేయనున్నారు. వీటిని రోల్ మోడల్స్‌గా చూపుతూ మిగిలిన చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణకు ముందుకు వెళ్లనున్నారు. ఎన్–కన్వెన్షన్ కూల్చివేతతో జాతీయ స్థాయిలో వార్తల్లోకి ఎక్కిన తమ్మిడి కుంటతో పాటు దీని అనుబంధ చెరువు ఈదుల కుంటలను దీనికోసం ఎంచుకోవాలని భావిస్తున్నారు. వీటితో పాటు కనెక్టింగ్ నాలాలను అభివృద్ధి చేయడం ద్వారా చుట్టు పక్కల ప్రాంతాలకు ఒనగూరే ప్రయోజనాలను ప్రత్యక్షంగా చూపనున్నారు.

అందరితో కలిసి ముందుకెళ్తూ..

హైడ్రా ఆవిర్భావం నుంచి, డీఆర్ఎఫ్ రూపంలో దానికి ముందు అనేక అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. చెరువులు, కుంటలకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని భవనాలను నేలమట్టం చేసింది. భవిష్యత్తులోనూ ఈ జల వనరులతో పాటు నాలాల విస్తరణకు కీలక ప్రాధాన్యం ఇవ్వనుంది. తాము తీసుకుంటున్న ఈ చర్యలతో భవిష్యత్తులో కలిగే ప్రయోజనాలు ప్రజలకు తెలిసేలా చేయాలని రంగనాథ్ నిర్ణయించారు.

వ్యూహాత్మకంగా అభివృద్ధి చేయిస్తూ..

నగరంలోని కొన్ని చెరువుల అభివృద్ధి ప్రారంభించిన తర్వాత వాటి స్వరూపం మారిపోయింది. కట్టలు ఉండాల్సిన చోట సిమెంట్, కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టి లేక్స్‌ను ట్యాంక్స్‌గా మార్చేశారు. వీటిలోని ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోకు ఉద్దేశించిన నాలాలనూ విస్తరిస్తూ కేవలం గట్లపై పార్కులు, వాక్‌వేలు అభివృద్ధి చేయడంతో పాటు విగ్రహాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. ప్రభుత్వ సంస్థలతో పాటు కార్పొరేట్ సంస్థలు సైతం ఇదే పని చేశాయి. ఈ మూస ధోరణికి భిన్నంగా వెళ్లాలని హైడ్రా నిర్ణయించుకుంది



పూడికతీతలో స్థానికుల భాగస్వామ్యం..

ప్రస్తుతం అనేక చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు ఆక్రమణలకు గురి కావడానికి నిర్మాణ వ్యర్థాల పారవేత కూడా ఓ కారణమని హైడ్రా గుర్తించింది. సెల్లార్లు, ఇతర తవ్వకాల సమయంలో వెలువడుతున్న మట్టిని కూడా తీసుకువెళ్లి ఆయా చోట్ల పారేస్తున్నారు. ఇలా పూడుతున్న చెరువుల చుట్టూనే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. చెరువుల్ని పునరుద్ధరించాలంటూ ఇప్పటికే వాటి చుట్టూ పారేసిన నిర్మాణ వ్యర్థాలు, మట్టిని తీయాల్సిందే. దీనికి భారీ ఖర్చు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్న హైడ్రా ఆయా ప్రాంతాలకు చెందిన స్థానికుల్ని భాగస్వాముల్ని చేయాలని నిర్ణయించింది. సమీపంలోని చెరువుల్లో ఇలా పారేసిన మట్టితో పాటు వినియోగయోగ్యమైన నిర్మాణ వ్యర్థాలను వారు తీసుకువెళ్లేలా ప్రోత్సాహించాలని భావిస్తున్నారు. వీటిని తీసుకువెళ్లడంతో పాటు కొత్తగా ఎవరూ ఆయా ప్రాంతాల్లో డంప్ చేయకుండా చూసే బాధ్యతల్లోనూ స్థానికులకు భాగస్వామ్యం కల్పించాలని హైడ్రా సూత్రప్రాయంగా నిర్ణయించింది.

కులవృత్తులను ప్రోత్సహిద్దాం: మంత్రి పొన్నం



సాక్షి, సిటీబ్యూరో: 'అందరికి ప్రభుత్వ ఉద్యోగాలు రావడం సాధ్యం కాదు. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కుల వృత్తులు బతకాలి. అప్పుడే అందరికీ ఉపాధి దొరుకుతుంది' అని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయ పడ్డారు. గణేష్ నవరాత్రుల్లో మట్టి విగ్రహాలు వాడడం వల్ల కుల వృత్తులు బాగుపడతాయని, వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సింథటిక్ శాలువాలకు బదులుగా కాటన్ శాలువాలు వాడితే చేనేత రంగానికి చేయూత ఇచ్చినట్లు ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మట్టి విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణను పరిరక్షించవచ్చన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ..ప్రభుత్వ ఆదేశాల మేరకు మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగామట్టి విగ్రహాల పూజిస్తే, భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించేందుకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్.పి, ఈ.వెంకటచారి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా 'విస్కీ' ఐస్‌క్రీమ్

ఆర్డర్‌పై సప్లై చేస్తున్న నిర్వాహకులు

- విస్కీ ఐస్‌క్రీమ్‌పై ఫేస్‌బుక్‌లో ప్రకటన
- రకరకాల ఫ్లేవర్‌లలో విక్రయాలు
- కిలో రూ.2000 వరకు ధర
- చిన్నారుల ఆరోగ్యంపై పిడుగుపాటు



విస్కీ ఐస్‌క్రీమ్ వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్: పెళ్లిళ్లు, వేడుకలు, పండుగుల సందర్భంగా పిల్లలతో పాటు పెద్ద వాళ్లు కూడా ఐస్‌క్రీమ్‌ను ఎంతో ఇష్టంగా తీసుకుంటారు. కానీ ఇప్పుడు అదే ఐస్‌క్రీమ్ హైదరాబాద్‌లో కలకలం సృష్టిస్తోంది. గంజాయి వంటి మత్తు పదార్థాలను చాక్లెట్‌ల రూపంలో విక్రయించినట్లుగానే కొందరు వ్యాపారులు రకరకాల ఫ్లేవర్‌లలో విస్కీ ఐస్‌క్రీమ్‌లను విక్రయించడం సంచలనంగా మారింది. ఫేస్‌బుక్, ట్విటర్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్కీ ఐస్‌క్రీమ్‌పైన ప్రకటనలు ఇచ్చి మరీ అమ్మకాలు సాగించడం గమనార్హం. మరోవైపు వినియోగదారుల నుంచి ఆర్డర్‌లు తీసుకొని ప్రత్యేకంగా తయారు చేసి అందజేస్తున్నారు. సాధారణ ఐస్‌క్రీమ్ ధరల కంటే రెండు రెట్లు ఎక్కువ ధరలతో విక్రయిస్తున్న విస్కీఐస్ క్రీమ్ గుట్టును శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు రట్టు చేశారు. ఫేస్‌బుక్‌లో లభించిన వ్యాపార ప్రకటనను ఆధారం చేసుకొని వ్యూహాత్మకంగా దాడులు నిర్వహించి విస్కీ ఐస్‌క్రీమ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ ఐస్‌క్రీమ్‌ను తయారు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. 23 డబ్బాల్లో ఉన్న సుమారు 11.5 కిలోల విస్కీ ఐస్‌క్రీమ్‌ను పట్టుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు నాంపల్లిలోని ఆబ్కారీ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషి వివరాలను వెల్లడించారు.



ఆర్డర్‌పై అమ్మకాలు...

జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 1, రోడ్ నెంబర్.5లో ఉన్న అరికే కేఫ్ ఐస్ క్రీమ్ పార్లర్‌లలో గుట్టుగా విస్కీ ఐస్ క్రీమ్ అమ్మకాలను సాగిస్తున్నారు. ఆర్డర్‌లపైన వీటిని తయారు చేసి అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఒక కిలో ఐస్ క్రీమ్‌కు 60 ఎంఎల్ చొప్పున విస్కీ కలుపుతున్నారు. రకరకాల బ్రాండ్‌లకు చెందిన మద్యాన్ని ఇందుకోసం వినియోగిస్తున్నారు. శుక్రవారం ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో '100 పైపర్' బ్రాండ్‌కు చెందిన విస్కీతో తయారు చేసిన 11.5 కిలోల ఐస్‌క్రీమ్‌లను అధికారులు గుర్తించారు. సాధారణ ఐస్‌క్రీమ్ ధర కిలో రూ.500 నుంచి రూ.600 వరకు ఉంటుంది. విస్కీ ఐస్‌క్రీమ్ ధరలు మాత్రం వాటి కోసం వినియోగించే మద్యం బ్రాండ్‌ల ధరలకు అనుగుణంగా కిలో విస్కీ ఐస్‌క్రీమ్‌ను రూ.1700 నుంచి రూ.2000 వరకు విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ తనిఖీల్లో వెల్లడైంది. ఖరీదైన మద్యం బ్రాండ్‌లను వినియోగించినప్పుడు ఐస్‌క్రీమ్ ధరలు కూడా పెరుగుతాయి. అమ్మకాలను పెంచుకొనేందుకు ఫేస్‌బుక్ మాధ్యమాన్ని సమర్ధవంతంగా వినియోగించుకోవడం గమనార్హం. ఒక అరకిలో ఐస్‌క్రీమ్‌ను 23 పీస్‌ల చొప్పున చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ ప్రదీప్ రావు బృందం ఈ ఐస్‌క్రీమ్ పార్లర్ పైన దాడులు చేసి ఐస్‌క్రీమ్‌ను స్వాధీనం చేసుకున్నారు. దయాకర్‌రెడ్డి శోభన్‌లు అనే ఇద్దరు వ్యక్తులు విస్కీ ఐస్‌క్రీమ్‌లను తయారు చేస్తున్నారు. శరత్‌చంద్రారెడ్డి ఈ ఐస్ క్రీమ్ పార్లర్‌ను నిర్వహిస్తున్నాడు. ఆర్డర్‌లపైన తయారు చేసి ఇవ్వడమే కాకుండా పార్లర్‌లకు వచ్చే వినియోగదారులకు సైతం ఈ ఐస్‌క్రీమ్‌లను విక్రయిస్తున్నారు. ఈ ఆపరేషన్ లో ఎక్సైజ్ అధికారులు బలరాం, అరుణ్, మౌనిక, ప్రసన్న యాదగిరిలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దుష్ప్రభావం...

అరికె కేఫ్ ఐస్‌క్రీమ్ పార్లర్లలో రకరకాల స్నాక్స్‌తో పాటు విస్కీ ఐస్‌క్రీమ్‌ను అమ్ముతున్నారు. ఈ ఐస్‌క్రీమ్ తయారీ కోసం డైరెక్టు విస్కీని వినియోగిస్తున్నారు. ఐస్‌క్రీమ్‌లో ఉండే చక్కెరతో కలిసి ఇది మరింత ప్రభావవంతంగా పని చేస్తుంది. ఒక కిలోకు 60 ఎంఎల్ విస్కీని కలిపినప్పటికీ దాని గాఢత ఎక్కువగానే ఉంటుందని వైద్యనిపుణులు అంచనా వేస్తున్నారు. దీన్ని పిల్లలు తింటే వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు.

బాలాపూర్ గణేశ్ ఉత్సవాలకు రండి

సీఎం రేవంత్ రెడ్డికి ఉత్సవ సమితి ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు

బడంగ్‌పేట్: లడ్డూకు ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణనాథుని నవరాత్రుల ఉత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉత్సవ సమితి నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని సీఎం నివాసంలో ఆయనను కలిసి సన్మానించారు. బాలాపూర్ గణనాథుడిని దర్శించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని ఫిర్యాదులకు ఒక్కటే నెంబర్ 139

- రైల్ మదద్ హెల్ప్‌లైన్‌లో ఏకీకృత సేవలు
- 12 భాషల్లో 139 సేవలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికుల సేవలు, సదుపాయాలు, ఫిర్యాదులపై సహాయం కోసం ఏర్పాటు చేసిన 139 రైల్ మదద్ హెల్ప్‌లైన్ సేవలను రైల్వేశాఖ ఏకీకృతం చేసింది. ఈ ఒక్క హెల్ప్‌లైన్ ద్వారా ప్రయాణికులు తమకు ఏ రకమైన సహాయం కావలసినా పొందవచ్చు. బెర్తు నిర్ధారణ నుంచి ట్రైన్‌లో సదుపాయాలు, రైళ్ల సమాచారం, ప్రయాణికుల భద్రత వంటి అంశాలపైన తగిన సమాచారాన్ని రక్షణను పొందవచ్చునని అధికారులు తెలిపారు. అన్ని రకాల ఫిర్యాదుల కోసం ఈ రైల్ మదద్ హెల్ప్‌లైన్ నంబర్ 139ను సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే సూచించింది. రైల్వేతో సంప్రదింపులను మరింత సులభతరం చేసేందుకు హెల్ప్‌లైన్ నంబర్‌లను ఏకీకృతం చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. వన్ స్టాప్ కాంటాక్ట్‌గా '139' హెల్ప్‌లైన్ దోహదం చేయనుందన్నారు. ఈ హెల్ప్‌లైన్ తెలుగుతో సహా 12 భాషల్లో అందుబాటులో ఉంటుంది. ప్రయాణికులు ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్)ని ఎంపిక చేసుకోవచ్చు. లేదా 139కి డయల్ చేయడం ద్వారా కాల్-సెంటర్ ఎగ్జిక్యూటివ్‌తో నేరుగా మాట్లాడవచ్చు.

139 హెల్ప్‌లైన్ సేవలు ఇలా....

- ప్రయాణికులు తమకు కావలసిన సమాచారాన్ని పొందేందుకు ఎస్సెమ్మెస్ ద్వారా ఫిర్యాదును 139కు పంపవచ్చు.
- 139 నంబర్‌కు ఫోన్ చేసి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌కు నేరుగా ఫిర్యాదును తెలియజేయవచ్చు. తగిన పరిష్కారం కోసం ఫిర్యాదును నమోదు చేసుకుంటారు.
- ఆన్‌లైన్‌లో (https:// www. railmadad. indianrailways.gov.in) వెబ్‌సైట్‌ను సందర్శించి ఫిర్యాదు చేయవచ్చు. తగిన సమాచారం, సహాయ సహకారాలను పొందేందుకు అవకాశం ఉంటుంది.
- ప్రయాణ సమయంలో 139 రైల్వే యాప్‌లో భద్రతకు సంబంధించిన ఫిర్యాదులతో పాటు ట్రైన్‌లో అన్ని ఫిర్యాదులను నమోదు చేసి తగిన పరిష్కారం పొందవచ్చు.

బాలుడిపై సవతి తల్లి దాష్టీకం

- నిత్యం చిత్రహింసలు
- ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీస్ కేసు నమోదు



గాయాలతో బాలుడు

లంగర్‌హౌస్: ఓ బాలుడిపై సవతి తల్లి కర్కశత్వం చూపింది. చేరదీసి ప్రేమ చూపెట్టాల్సిన వయసులో పట్టించుకోకుండా నిత్యం చిత్రహింసలు పెట్టింది. వివరాల్లోకి వెళ్తే...హిమాయత్‌నగర్‌లో నివాసం ఉండే రోహిత్ కుమార్ బ్యాంకు అధికారిగా పనిచేస్తున్నాడు. ఇతనికి పదేళ్ల క్రితం వివాహం కాగా హర్ష్(8) అనే కుమారుడు ఉన్నాడు. భార్య కరోనా సమయంలో మృతిచెందింది. దీంతో తనకు, బాబుకు తోడుగా ఉంటుందని మరో మహిళను వివాహం చేసుకున్నాడు. ఆమెకు భర్త చనిపోగా అప్పటికే ఓ కుమారుడు ఉన్నాడు.

బాలుడికి చిత్రహింసలు.....

వివాహం జరిగిన కొద్ది రోజుల తర్వాత సవతి తల్లి హర్ష్‌ను పట్టించుకోవడం మానేసింది. నిత్యం చేతికి అందిన వస్తువులతో కొడుతూ నరకం చూపుతోంది. ఆ బాలుడు విషయాన్ని బంధువులు, తండ్రికి చెప్పినా..వారు మందలించినా ఆమెలో మార్పు రాలేదు. కాగా హర్ష్ లంగర్‌హౌస్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నాడు. ఇతని శరీరంపై తరుచుగా గాయాలు కన్పించడంతో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఆరా తీశారు. కాని వారికి విషయం తెలియకుండా బాలుడికి చర్మవ్యాధి ఉందని తల్లిదండ్రులిద్దరు బుకాయించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 30న బాలుడి ఒంటిపై చిన్నగా పొడిచిన రంధ్రాలు ఉండడం, రక్తం రావడం గమనించిన స్కూల్ ప్రిన్సిపాల్..బాలుడిని బుజ్జగించి విషయం అడగ్గా..తన సవతి తల్లి కొట్టిందని, రోజూ కొడుతోందని చెప్పాడు. దీంతో వారు వెంటనే శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన కమిషనరేట్ అధికారులు సవతి తల్లి వేధింపులు, చిత్ర హింసలు నిజమేనని తేల్చి లంగర్ హౌస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ నెల 2వ తేదీన కలెక్టర్ కార్యాలయం నుండి కూడా లంగర్‌హౌస్ పోలీసులకు ఆదేశాలు అందాయి. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా తల్లి రాక్షసత్వం వాస్తవమేనని తెలిసింది. ప్రస్తుతం హర్ష్ నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

2వేల 'విత్తన' గణపతి ప్రతిమల పంపిణీ

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ హిత ఉత్పత్తులు, పండుగలను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్లాస్టిక్ పైపులు - ఫిట్టింగ్‌ల కంపెనీ ట్రుఫ్లో బై హిండ్‌వేర్ ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా విత్తనాలు పొదిగిన మట్టితో తయారు చేసిన 2 వేలకు పైగా పర్యావరణ అనుకూల గణేశ విగ్రహాలను వినియోగదారులకు పంపిణీ చేశామని, అలాగే వీటిని నీటి కుండలోనే నిమజ్జనం చేయాల్సిందిగా అవగాహన కల్పించామన్నారు. నీటి కుండలో నిమజ్జనం చేసిన తర్వాత, ఈ విగ్రహాలు ఒక కొత్త మొక్కగా మొలకెత్తుతాయని తద్వారా అసలు సిసలైన పర్యావరణ హిత పండుగగా వినాయకచవితిని నిర్వహించినట్టు అవుతుందన్నారు.

10న కూచిపూడి నృత్యరూపకం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఉద్యమ వీర వనిత చాకలి ఐలమ్మ జీవితం తొలిసారి కూచిపూడి నృత్య రూపకంలో వేదిక పైకి రానున్నది. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన సాయంత్రం ఆరున్నర గంటలకు రవీంద్రభారతిలో ప్రముఖ నాట్య గురువు, కళాతపస్వి, సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ డా. అలేఖ్య పుంజాల బృందం ఈ నృత్యరూపకాన్ని ప్రదర్శించనున్నారు. ఐలమ్మ పాత్రను తానే పోషిస్తున్నట్లు డా.అలేఖ్య పుంజాల తెలిపారు. నృత్య రూపకాన్ని తిలకించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తదితరులు హాజరవుతారని తెలిపారు.

మంత్రితో అభ్యంతరకరంగా మాట్లాడిన వ్యక్తిపై కేసు

పంజగుట్ట: ఓ మహిళా మంత్రికి ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడిన వ్యక్తిపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 4వ తేదీన రాష్ట్ర మంత్రి సీతక్క ప్రజాభవన్‌లోని తన నివాసంలో ఉండగా ఆమె సెల్‌ఫోన్‌కు సాయంత్రం మూడుసార్లు గుర్తుతెలియని నెంబర్ నుండి ఫోన్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి అసభ్యకరంగా, అభ్యంతరకరంగా మాట్లాడాడు. దీంతో సీతక్క డ్రైవర్ ఎమ్.శ్రీను శుక్రవారం పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 79 బీఎన్ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుని గురించి ఆరా తీస్తున్నారు.

దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌పై కోర్టు ధిక్కరణ కేసు?

కీసర: దమ్మాయిగూడ నాసిమ్ చెరువులో హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించి కొనసాగుతున్న శ్మశాన వాటిక పనులను నిలిపివేయడంలో విఫలమైన మున్సిపల్ కమిషనర్‌పై రాష్ట్ర హైకోర్టులో కోర్టు ధిక్కరణ (కంటెంప్ట్ ఆఫ్ కోర్టు) కేసు నమోదైనట్లు సమాచారం. శుక్రవారం ఈ మేరకు జస్టిస్ వినోద్ కుమార్ ధర్మాసనం సదరు కోర్టు ధిక్కరణ కేసు విచారణను చేపట్టింది. కోర్టు ఆదేశాలను ధిక్కరించి చేపట్టిన నిర్మాణం, స్టే ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై వచ్చే వాయిదాలోగా సమాధానం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌ను కోర్టు ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయంపై దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణిని వివరణ కోరగా హైకోర్టు నుంచి తమకు మెసేజ్ వచ్చిందని, పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత స్పందిస్తామన్నారు.

ఎలాంటి ఘటనలకు తావివ్వొద్దు

పోలీస్ సిబ్బందికి ఏసీపీ మోహన్‌కుమార్ సూచనలు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ మోహన్‌కుమార్

పంజగుట్ట: ఎలాంటి చిన్న ఘటనలకు తావులేకుండా వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని పంజగుట్ట పోలీస్ డివిజన్ ఏసీపీ మోహన్‌కుమార్ అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని శుక్రవారం పంజగుట్ట ఏసీపీ కార్యాలయంలో పంజగుట్ట, మధురానగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోహన్ కుమార్ మాట్లాడుతూ పంజగుట్ట పోలీస్ డివిజన్ పరిధిలో మొత్తం 370కి పైగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నామని, మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 213, పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో 159 మండపాలు ఉన్నాయని తెలిపారు. రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారు 7కి పైగా సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామని, అందులో ముఖ్యంగా బీ.ఎస్ మక్తా, ఎల్లారెడ్డిగూడ ఉన్నాయని తెలిపారు. ప్రతీ వినాయక మండప నిర్వాహకులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చామని వారి భాగస్వామ్యం, ప్రజల సహకారంతో పండగ ప్రశాంతంగా జరుపుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్, మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐలు శ్రావణ్‌కుమార్, రవికుమార్, ఎస్సైలు ప్రదీప్, శివ శంకర్, వెంకటకిషన్, వేణుగోపాల్, బాలరాజు, సాయినాథ్‌రెడ్డి, అవినాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే బీసీలకు సముచిత న్యాయం

బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్ (బోరబండ): టీపీసీసీ చీఫ్‌గా బీసీ వర్గానికి చెందిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను నియమించడం అభినందనీయమని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం బోరబండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌడ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను టీపీసీసీ చీఫ్‌గా ఎంపిక చేయడంతో కాంగ్రెస్ పార్టీలోనే బీసీలకు సముచిత న్యాయం జరుగుతుందని నిరూపించుకుందని చెప్పారు. మహేష్‌గౌడ్ నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడి రాబోయే ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



బంజారాహిల్స్‌రోడ్ నెం. 14లో గణపతి మండపం



మట్టి గణనాథులను పంపిణీ చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది



గణపతి పూజకు వేళాయె..!

- మండపాలకు చేరుతున్న గణనాథులు
- నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- మార్కెట్లలో కొనుగోళ్ల సందడి
- పలు చోట్ల మట్టి విగ్రహాల ఉచిత పంపిణీలు





ఫిలింనగర్‌లో...

బంజారాహిల్స్: వినాయక చవితి పర్వదినానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, సోమాజిగూడ, హిమాయత్‌నగర్, వెంకటేశ్వర నగర్, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసే భారీ గణనాథులు ఆయా మండపాలకు చేరుకున్నాయి. కాగా నివాసాల్లో గణనాథులను ఏర్పాటు చేసుకునేందుకు చాలా మంది మట్టి గణనాథులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు. మరో వైపు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఎక్కడికక్కడ ఉచితంగా మట్టి గణనాథులను పంపిణీ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న శ్రీ విజయగణపతి ఆలయంలో నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలోని స్వామివారిని తొమ్మిది రోజులపాటు తొమ్మిది విభిన్న రూపాల్లో అలంకరించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విష్ణుభట్ట ఆంజనేయ చయనులు తెలిపారు. కాగా వినాయక చవితి సందర్భంగా శుక్రవారం పలు మార్కెట్లలో కొనుగోళ్ల సందడి కనిపించింది, గణనాథుల కొనుగోళ్లతోపాటు పూజలో వినియోగించే పత్రి, ఒనగాయ విక్రయించేందుకు పలు ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు ఒక్కరోజు ముందుగానే వినాయక విగ్రహాలతోపాటు పెద్ద ఎత్తున్న పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. అదే విధంగా మండపాల్లో నవరాత్రులు ఘనమైన పూజలు నిర్వహించేందుకు ఆయా మండపాల నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మరో వైపు పోలీసులు సైతం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.









వినాయక చవితి సందర్భంగా పూజా సామగ్రితోపాటు వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న భక్తులు







వెల్లివిరిసిన మతసామరస్యం



మట్టిగణపతులను పంపిణీ చేస్తున్న నజీర్

బంజారాహిల్స్: భాగ్యనగరంలో హిందూ, ముస్లిం భాయిభాయి అనే నానుడితో మతసామరస్యం వెల్లివిరిస్తోంది. మతాలు ఏవైనా పండుగలు మాత్రం హిందూ ముస్లింలు కలిసి నిర్వహిస్తూ మత సామరస్యాన్ని చాటుకుంటూ హైదరాబాద్ ఖ్యాతిని ఎప్పటికప్పుడు నలు దిశలా చాటుతున్నారు. ఈ క్రమంలోనే బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని ఉదయ్‌నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎండీ. నజీర్ గత అయిదేళ్లుగా తన టైలర్‌షాపులో వినాయక చవితికి ముందు మూడు రోజులపాటు మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తూ తన బాధ్యతను గుర్తు చేస్తూనే పర్యావరణానికి పెద్దపీట వేస్తున్నాడు. ప్రతియేటా వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తుంటానని రోజుకు 150కి పైగా విగ్రహాలను అందజేస్తుంటానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

చురుకుగా మట్టి గణపతి విగ్రహాల తయారీ



మట్టి గణపతులతో బీవీబీపీ స్కూల్ విద్యార్థులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో ప్రతియేటా నిర్వహించినట్లుగానే పర్యావరణహిత మట్టి గణపతుల తయారీలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తాము తయారు చేసిన మట్టి ప్రతిమలను ఉపాధ్యాయులకు, సహచర విద్యార్థులకు పంపిణీ చేయడమే కాకుండా తమ ఇళ్లకు కూడా తీసుకెళ్లారు. పర్యావరణాన్ని రక్షించుకోవడంలో ప్రకృతిని కాపాడుకోవడంలో తాము సైతం అంటూ మట్టి గణపతుల తయారీలో నిమగ్నమయ్యారు. శుక్రవారం పాఠశాలలో గణపతి పూజ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ వేడుకలో పాల్గొని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వడ్డాణం శ్రీనివాస్‌కు ఘన సన్మానం

బంజారాహిల్స్: గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ చరిత్ర విభాగ ఆచార్యులు, సామాజిక శాస్త్రాల డీన్, ఇ.ఎం.ఆర్ – ఆర్.సీ డైరెక్టర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్‌ను విశ్వవిద్యాలయ అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం అవార్డు గ్రహీత ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా గుర్తింపు పొందడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. విశ్వవిద్యాలయ ఇంచార్జ్ రిజిస్ట్రార్ ప్రొ. ఇ. సుధారాణి, ప్రొ. ఆనంద్ పవార్, డా.ఎల్వీకే రెడ్డి, ప్రొ. పల్లవీ కాబ్డే, డా.బొజ శ్రీనివాస్, డా.శ్రీదేవి, పలు విభాగాల డైరెక్టర్లు, డీన్లు, అధ్యాపకులు, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొని ప్రొ.వడ్డాణం శ్రీనివాస్‌ను అభినందించి ఘనంగా సన్మానించారు.

సాంకేతికతతో జన్యుపరమైన సమస్యలకు పరిష్కారం

డాక్టర్ జీవీ ప్రసాద్

బంజారాహిల్స్: ప్రస్తుత వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని పాత్‌కేర్ సంస్థ అధినేత, ప్రముఖ డాక్టర్ జీవీ.ప్రసాద్ అన్నారు. గతంలో సాంకేతికంగా అందుబాటులో లేక జన్యుపరమైన సమస్యలతో చాలా మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. కానీ ప్రస్తుత టెక్నాలజీతో గర్భస్థ శిశువులో ఉండే జన్యుపరమైన లోపాలను కూడా గుర్తించే అవకాశం లభించిందని జీవీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాత్‌కేర్ సంస్థ నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన పాత్‌కేర్ లైఫ్ సైన్సెస్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్యుపరమైన సమస్యలకు అడ్వాన్స్‌డ్ పద్ధతుల ద్వారా గుర్తించడంతోపాటు వారికి అందించబోయే వైద్యం గురించి కౌన్సెలింగ్ ఇవ్వబోతున్నామని తెలిపారు. గతంలో ఎంతో మంది శిశువులు జన్యుపరమైన సమస్యలతో జన్మించి చనిపోయేవారని కానీ నేడు తల్లిగర్భంలో ఉన్నప్పుడు ఆ సమస్యను గుర్తించి తగిన వైద్యం అందించే విధంగా అవకాశాలు పుష్కలంగా వచ్చాయని అన్నారు. కొన్ని వ్యాధుల్లో వేలల్లో ఒకరికి వస్తే, కొన్ని వ్యాధులు లక్షల్లో ఒకరికి జన్యుపరంగా వస్తాయని అన్నారు. తమ సంస్థ తెలంగాణ వ్యాప్తంగా 56 ల్యాబ్‌లను ఏర్పాటు చేసిందని నగరంలో రెండు ల్యాబ్‌లు సేవలందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి. నందినీప్రసాద్, అనిల్ సుంకర, డాక్టర్ రక్షిత్, డాక్టర్ పునీత్, డాక్టర్ దీపక్ పాల్గొన్నారు.



పాత్ కేర్ లైఫ్ సైన్సెస్ సేవలను ప్రారంభిస్తున్న డాక్టర్ జీవీ ప్రసాద్ తదితరులు

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



ప్రతిమలను అందజేస్తున్న వెల్దండ వెంకటేష్



విగ్రహాలను అందజేస్తున్న లక్ష్మణ్

ఫిలింనగర్: వినాయక చవితి సందర్భంగా ప్రతీ ఒక్కరూ పర్యావరణానికి మేలు చేసే మట్టి గణపతులను పూజించాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కోరారు. చవితి పండగ సందర్భంగా ఆయన శుక్రవారం ఫిలింనగర్‌లోని గౌతంనగర్ చౌరస్తాలో వద్ద ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు.

రహమత్‌నగర్‌లో...

రహమత్‌నగర్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికనగర్, బ్రహ్మశంకర్‌నగర్ బస్తీల్లో మట్టి గణపతి విగ్రహాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి జూబ్లీహిల్స్ నియోజకవర్గం అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్‌కాలనీలో...

శ్రీనగర్‌కాలనీ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణనాథులను పూజించాలని కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నేషనల్ సెక్రటరీ డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మధురానగర్‌లో స్థానికులకు మట్టి వినాయకులను అందజేశారు. వినాయక పండుగను ఘనంగా జరుపుకోవాలని కోరారు.

పర్యావరణ హితానికి మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠిద్దాం

బంజారాహిల్స్: పర్యావరణ హితానికి ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలని జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి కోరారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీఎంసీ ప్రశాంతి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని జలగం వెంగళరావు పార్కు వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో స్థానికులకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

డంపింగ్ యార్డు పరిశీలన

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని జలగం వెంగళరావుపార్కు సెకండ్ గేటు వద్ద ఉన్న సెకండరీ డంపింగ్ యార్డును శుక్రవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 ఉప కమిషనర్ ప్రశాంతి, ఏఎంఓహెచ్ పరిశీలించారు. స్వచ్ఛ ఆటోలు ఎన్ని వస్తున్నాయి, రికార్డు మెయింటెన్ చేస్తున్నారా లేదా ? అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పరిశుభ్రతను పాటించాలని, దుర్వాసన రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

అలరించిన ప్రదర్శనలు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో గణేష్ చతుర్థి పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భక్తి గీతాలు, నృత్యాలు, నాటికలు ఎంతోగానో అలరించాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ వరలక్ష్మీ మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో పండుగలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు



బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న ఆర్ఐ కిరణ్‌రాజ్

రహమత్‌నగర్: ప్రభుత్వ స్థలాలను కొనుగోలు చేసినా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఖైరతాబాద్ మండల రెవెన్యూ స్పెషల్ ఆర్ఐ కిరణ్‌రాజ్ హెచ్చరించారు. శుక్రవారం ఆర్ఐ కిరణ్‌రాజ్ తన సిబ్బందితో కలిసి ఎస్పీఆర్‌హిల్స్‌లో పలు బస్తీల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఖాళీ స్థలాలు భూ ఆక్రమణలకు గురికాకుండా బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎక్కడైన ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైతే తమకు సమాచారం అందించాలని కోరారు. బోర్డులు తీసినా లేదా ధ్వంసం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రహమత్‌నగర్ డివిజన్ ఏడుచోట్ల బోర్డులు పాతడం జరిగిందన్నారు.

నవరాత్రి ఉత్సవాల్లో డీజేకు అనుమతి లేదు



సూచనలిస్తున్న ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్

జహమత్‌నగర్ (బోరబండ): గణేష్ ఉత్సవాల్లో డీజేకు అనుమతి లేదని, నిబంధలను ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ స్పష్టం చేశారు. బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని తెలిపారు. పెద్ద గణేష్ మండపాల వద్ద తాత్కాలికంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతియుత వాతావరణంతో ఉత్సవాలు నిర్వహించు కోవాలని పేర్కొన్నారు. వర్షాల పడుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. తగిన జాగ్రత్తలు పాటిస్తూ నవరాత్రి ఉత్సవాలు సంతోషంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ ఎస్ఐ సర్దార్ జమాల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సేల్స్‌మెన్ దృష్టిమరల్చి బంగారు చైన్ చోరీ

పంజగుట్ట: బంగారం దుకాణంలో అసలు బంగారం చోరీ చేసి గిల్టీ ఆభరణాలు పెట్టిన ఘటనలో పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమాజిగూడలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో గత నెల 21వ తేదీన ఒక మహిళ, ఒక పురుషుడు బంగారం కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు నటించారు. సాయంత్రం 5:30 ప్రాంతంలో షోరూంలో రద్దీ ఉన్న సమయంలో సేల్స్‌మెన్‌ను మాటల్లో పెట్టి అతని దృష్టి మళ్లించి 47.86 గ్రాముల బంగారు చైన్ (3.58 లక్షల విలువగల) దొంగిలించారు. అదే స్థానంలో 27 గ్రాముల రోల్డ్‌గోల్డ్ ఆభరణాన్ని ఉంచి అక్కడ నుంచి మెల్లిగా జారుకున్నారు. షోరూం నిర్వాహకులు ప్రతీ రోజు కేవలం ఆభరణాలు లెక్కపెట్టుకుని షోరూం మూసివేసేవారు. ఇటీవల ఆడిటింగ్ జరిగినప్పుడు బంగారు ఆభరణాల బరువులో తేడా రావడం గమనించి అన్ని ఆభరణాలు పరిశీలించగా అందులో ఒకటి రోల్డ్‌గోల్డ్ ఆభరణం ఉన్నట్లు నిర్ధారించారు. సీసీ కెమెరాలు పరిశీలించగా ఒక మహిళ, ఒక వ్యక్తి ఇద్దరూ వచ్చి సేల్స్‌మెన్ దృష్టి మళ్లించి బంగారు ఆభరణం చోరీ చేసినట్లు నిర్ధారించారు. షోరూం హెడ్ మహ్మద్ అలీ రిజాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వనమల స్వప్నకు బెస్ట్ టీచర్ అవార్డు



శ్రీనగర్‌కాలనీ: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని నిమ్స్‌మేలో స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్న వనమల స్వప్నకు ఎంటర్‌ప్రీనర్‌షిప్ డెవలప్‌మెంట్ కేటగిరీలో బెస్ట్ టీచర్‌గా అవార్డు దక్కింది. టీచర్స్ డే సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ టీచర్స్ డే అవార్డ్స్‌లో భాగంగా గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవార్డు నాలో మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు.

సాక్షి
శనివారం । 7 । సెప్టెంబర్ । 2024

11కు ప్రజావాణి వాయిదా

లక్డీకాపూల్ : మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ నెల11వ తేదీకి వాయిదా వేసినట్టు ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అర్జీలను స్వీకరించేందుకు ప్రతీ మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్నామన్నారు. అయితే ఈ నెల10న ప్రజాభవన్‌లో 16వ కేంద్ర ఆర్థిక సంఘంతో ముఖ్యమైన సమావేశం జరుగుతున్న నేపథ్యంలో ప్రజావాణిని మంగళవారం నుంచి బుధవారానికి మార్చినట్టు వివరించారు.

ఓయూలో సంబరాలు



స్వీట్లు పంపిణీ చేస్తున్న బీసీ విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్‌ను నియమించడంతో బీసీ విద్యార్థులు ఓయూలో స్వీట్లు పంచిపెట్టారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగిన కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని పాటించి జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలను గుర్తించి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్య యాదవ్, కొమ్మన బోయిన సైదులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. స్తంభించిన ట్రాఫిక్

సాక్షి, సిటీబ్యూరో: వరుణ దేవుడు వెంటాడుతూనే ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం గంట పాటు వరణుడు మళ్లీ ప్రతాపం చూపించాడు. ఉదయం నుండి కాస్త వర్షం తెరిపిచ్చినప్పటికీ సాయంత్రం భారీగా వర్షం కురిసింది. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో స్కూల్స్, కాలేజీలు, ఆఫీసుల నుంచి ఇళ్లకు చేరుకునే సమయం కావడంతో నగర వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్లన్నీ జలమయం కాగా, డ్రైనేజీల పొంగిపొర్లాయి. పలు ప్రాంతాల్లో కిలో మీటర్ల కొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యధికంగా గచ్చిబౌలిలో 4.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. శేరిలింగంపల్లి, నాంపల్లి,షేక్‌పేట్, పటాన్‌చెరు, ఆసీఫ్‌నగర్, చార్మినార్,హయాత్‌నగర్, గోల్కొండ, బండ్ల గూడ , సైదాబాద్ తదితర ప్రాంతాలో భారీ వర్షం కురిసింది.

మహంకాళి ఆలయ ఈఓకు జైలు శిక్ష

ధిక్కరణ కేసులో హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ధిక్కరణ కేసులో సికింద్రాబాద్ మహంకాళి ఆలయ ఈఓకు హైకోర్టు నెల రోజుల సాధారణ జైలు, రూ. 2 వేల జరిమానా విధించింది. జరిమానా 2 వారాల్లోగా చెల్లించాలని చెబుతూ, జైలు శిక్షను 15 రోజులు సస్పెన్షన్‌లో ఉంచుతున్నట్లు స్పష్టం చేసింది. చీరెలు, జాకెట్ ముక్కలు, కొబ్బరి చిప్పల సేకరణ నిమిత్తం సికింద్రాబాద్ మహంకాళి ఆలయ కార్యనిర్వహణాధికారి మార్చి 3న నోటిఫికేషన్ జారీ టెండర్ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ రాకేశ్‌తో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ లీజు పొడిగించాలని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులను పట్టించుకోకుండా ఈఓ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ల లీజును జూలై 1 నుంచి 5 నెలలు పొడిగించాలని 2024, జూన్ 13న ఈఓ ఆదేశాలు జారీ చేశారు. హైకోర్టు ఆదేశాలిచ్చినా వాటిని కావాలనే పాటించడం లేదని రాకేశ్ సహా మరికొందరు ధిక్కరణ కేసు దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలను పాటించాలని జూలై 6న లీగల్ నోటీసులు కూడా ఈఓకు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జూన్ 13న కోర్టు ఆదేశించినా జూన్ 26 మళ్లీ టెండర్లు పిలిచారన్నారు. దీంతో కోర్టు ధిక్కరణ చట్టం సెక్షన్ 10, 12 కింద కేసు దాఖలు చేసినట్లు చెప్పారు. ఈఓ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జూన్ 13 నాటి ఆదేశాలపై డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా, అప్పీల్‌ను కొట్టివేసిందన్నారు. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించామని, సింగిల్ జడ్జి ఆదేశాలపై స్టే ఇచ్చిందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని చెబుతున్నా, పలు మార్లు అవకాశం ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వుల కాపీ అందజేయలేదని చెప్పారు. తమ ఆదేశాలను ఉద్దేశ్యపూర్వకంగా పాటించనట్లు భావిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఈఓకు జైలు విధిస్తూ తీర్పునిచ్చారు.

జలకళ

నిండుకుండలా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్



▼ హిమాయత్‌సాగర్

- మూసీ పరీవాహకంలో అలర్ట్
- ఉస్మాన్‌సాగర్‌లో 1787.20 అడుగులకు చేరిన మట్టం
- హిమాయత్ సాగర్‌లో 1760.60 అడుగులు
- కొనసాగుతున్న వరద
- గేట్లు తెరిచేందుకు సిద్ధమవుతున్న యంత్రాంగం

మణికొండ/బండ్లగూడ : ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్ వరద ప్రవాహం కొనసాగుతోంది. రెండు జలాశయాలకు మరో మూడు అడుగుల నీరు వస్తే పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరనున్నాయి. రాబోయే ఒకటి, రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండటంతో జలమండలి అధికారులు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలయంత్రాంగంతో పాటు జీహెచ్‌ఎంసీ, పోలీసులను అప్రమత్తం చేశారు.

- శుక్రవారం కూడా శంకర్‌పల్లి, చేవెళ్ల , పరిగి, వికారాబాద్, షాబాద్ ప్రాంతాలలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురవటంతో హిమాయత్ సాగర్‌లోకి 1300 క్యూసెక్కులు, ఉస్మాన్‌సాగర్‌లోకి 1800 క్యూసెక్కుల నీరువచ్చిందని జలమండలి అధికారులు తెలిపారు.
- హిమాయత్ సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు కాగా శుక్రవారం రాత్రి వరకు 1760.60 అడుగులకు చేరింది.
- ఉస్మాన్‌సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా ప్రస్తుతం 1787.20 అడుగులకు చేరింది.
- శనివారం ఉదయం వరకు మరో అడుగు మేర రెండు చెరువుల్లో నీటి మట్టం పెరిగే అవకాశముందని వారు తెలిపారు.
- పైనుంచి చెరువుల్లోకి వస్తున్న వరద ప్రభావాన్ని బట్టి శనివారం సాయంత్రంలోపు జంట జలాశయాల గేట్లను తెరిచే అవకాశం ఉన్నట్టు సమాచారం.



▼ ఉస్మాన్‌సాగర్

దివ్యాంగుల ఉపకరణాలకు రూ. 50 కోట్ల కేటాయింపు



వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సంక్షేమం, ఉపకరణాల కోసం ప్రభుత్వము రూ. 50 కోట్లు బడ్జెట్ కేటాయించడముపై వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య హర్షం వ్యక్తము చేశారు. మలక్‌పేటలోని తన కార్యాలయములో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గత ప్రభుత్వము 2023–24 సంవత్సరానికి రూ.12 కోట్లు కేటాయించిందని, అయితే2024–25 సంవత్సరానికి రూ.50 కోట్లు కేటాయించడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో నేడు

- వినాయకచవితి సందర్భంగా ఖైరతాబాద్ మహాగణపతికి ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు
- గచ్చిబౌలి వినాయక నగరంలో లేట్ నైట్ స్టాండప్ కామెడీ షో రాత్రి 9.30గంటలకు
- గచ్చిబౌలి రంగ్ భూమి స్పేసెస్ నాటక ప్రదర్శన శాలలో రాత్రి 8 గంటలకు పతి చాహియే.. నాటక ప్రదర్శన
- కొండాపూర్ హైటెక్ సిటీలోని హెచ్ ఐసీసీలో సాయంత్రం 5 గంటలకు ఏడీపీ సంస్థ కంపెనీ డే వేడుకలు

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

కేన్సర్‌పై యుద్ధం చేద్దాం

మంత్రి సీతక్క



రన్‌కు సంబంధించిన టీ-షర్ట్స్ ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క, సినీనటుడు అలీ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: రోజు రోజుకూ పెరిగిపోతున్న కేన్సర్ మహమ్మారిని జయించేందుకు యుద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రపంచంలోనే అతి పెద్ద 'క్వాంబియంట్ గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్–2024'ను అక్టోబర్ 6న నిర్వహించనున్నారు. ఈ రన్‌కు సంబంధించిన టీ-షర్ట్, ఫినిషర్స్ మెడల్స్‌ను మంత్రి సీతక్క, సినీనటుడు అలీ శుక్రవారం హోటల్ దస్పల్లాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ., గతంలో చాలా తక్కువ మందికి కేన్సర్ వచ్చేదని, కానీ ప్రస్తుతం ఎక్కడ చూసినా కేన్సర్ విజృంభిస్తోందన్నారు. అవగాహన కల్పించడంతో పాటు గ్రామాల్లో ప్రత్యేకంగా డ్రైవ్స్ నిర్వహిస్తూ స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్న డా.చిన్నబాబు సుంకవల్లి కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ గ్రూప్ డైరెక్టర్ డా.పవన్ గోరుకంటి, క్వాంబియంట్ డెవలపర్స్ నుంచి యోగేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కోపం ఉంటే మాపై తీర్చుకోండి

బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

గచ్చిబౌలి/రాయదుర్గం: కోపం ఉంటే మాపై తీర్చుకోండి...కానీ ఈ పేద పిల్లలపై కాదని బీఆర్‌ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు, సాంఘీక సంక్షేమ గురుకులాల మాజీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సీఎం రేవంత్‌నుద్దేశించి పేర్కొన్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి గొలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర, బాలికల కళాశాలలను వేర్వేరుగా బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర స్థాయి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య, నోటి కాడ కూడు గుంజుకుంటున్నది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు. అప్పటి సీఎం కేసీఆర్ దర్శనీకతతో ఏర్పాటు చేసిన విద్యాలయాలను కాపాడుకోవడం కోసం విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు ముందుకు రావాలని, అందుకు పూర్తిగా అండగా నిలుస్తామన్నారు.

గురుకులాలలో 37 మంది చనిపోయారు

రాష్ట్రంలోని గురుకులాలలో 37 మంది విద్యార్థులు కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత చర్యలతో చనిపోయారంటే ఈ వ్యవస్థను ప్రశ్నార్థకంగా మార్చిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. అనేక గురుకులాలలో పురుగుల అన్నం, ఇతర సమస్యలు ఉత్పన్నమ వుతున్నాయన్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో గురుకులాలను ఆదర్శంగా తీర్చిదిద్దామని గుర్తు చేశారు. అనంతరం ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ గణేష్, కల్పనతో కూడా మాట్లాడారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, క్రాంతి, సీనియర్ నాయకులు గెల్లు శ్రీనివాస్, కొమిరిశెట్టిసాయిబాబా, రాజు ముదిరాజ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

28న జాతీయ లోక్ అదాలత్

సిటీ కోర్టులు: కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని తమ కేసులను వెంటనే పరిష్కరించుకోవాలని రాష్ట లీగల్ సర్వీస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ) మెంబర్, సెక్రటరీ పంచాక్షరి తెలిపారు. శుక్రవారం తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28న జాతీయ మెగా లోక్ అదాల్‌ను కక్షిదారులు వినియోగించుకొని పెండింగ్‌లో ఉన్న తమ క్రిమినల్, సివిల్, యాక్సిడెంట్ తదితర కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సంవత్సరం జూన్ 8న జాతీయ లోక్ అదాలత్‌లో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు.

పీఆర్పీ థెరపీతో ఆరోగ్య సంరక్షణ



సాక్షి, సిటీబ్యూరో: ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా (పీఆర్పీ) థెరపీ అనేది ఆరోగ్య సంరక్షణతో పాటు జీవన విధానాన్ని మార్చగల సామర్థ్యం ఉన్న చికిత్స అని ఎపియోన్ గ్రూప్ ఆఫ్ క్లినిక్స్ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్ దారా అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన టెడ్ టాక్‌లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా పీఆర్పీ థెరపీలో ఆయన చేసిన పరిశోధనలు, చికిత్సా విధానాల గురించి వివరించారు. ప్రపంచవ్యాప్తంగా రోగులకు శస్త్రచికిత్స లేని పీఆర్పీ చికిత్స గురించి తెలిపారు. ఇప్పటివరకు 50 వేలకు పైగా రోగులకు విజయవంతంగా పీఆర్పీ చికిత్స అందించానని చెప్పారు.

త్వరలో మరిన్ని అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా పరిధిలో మరిన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రకటించారు. కొత్త అంగన్‌వాడీ కేంద్రాల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ అనుబంధ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఏర్పాటైన కొత్త అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం చేపట్టేందుకు స్థలాలు ఇచ్చామన్నారు. త్వరలో నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పాతబస్తీ చార్మినార్ పరిధిలో మరో సఖి కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సఖి కేంద్రం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేయాలనీ, దసరా నాటికీ ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో అంతర్గత కమిటీని ఏర్పాటు చేసి మహిళా సాధికారతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించే విషయంలో రాజీపడొదని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో పిల్లలకు గుణాత్మక పూర్వ ప్రాథమిక విద్యానందించాలని సూచించారు. హైదరాబాద్ లోని 5 ప్రాజెక్టుల పరిధిలో గల అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల ప్రక్రియ మెరుగ్గా ఉండాలని, సీడీపీఓలు, సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. పిల్లల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ, నిబద్ధతతో చేపట్టి హాజరు శాతం పెంచాలని సూచించారు. అనంతరం పోషణ్ అభియాన్ పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్ రావు, సిడిపిఓ లు, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా మెడికల్ కాలేజీ అంటే ఓ బ్రాండ్

- మంత్రి దామోదర రాజనర్సింహా
- నూతన హాస్టల్ భవనాలకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు

సుల్తాన్‌బజార్ : ఉస్మానియా మెడికల్ కాలేజ్ అంటే ఒక బ్రాండ్ అని, దేశంలో ఎక్కడికి వెళ్లినా ఉస్మానియా అంటే హైదరాబాద్ అని.. హైదరాబాద్ అంటే ఉస్మానియా అని అంటారని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఉస్మానియా వైద్య కళాశాలలో హాస్టల్ విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించనున్న హాస్టల్ భవనాలకు శుక్రవారం మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. రూ.121 కోట్లతో ఈ భవనాలను మంత్రులు ఎంతో ఆట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ..గత 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను జూడాలు అనేక సార్లు నోటీసులు ఇస్తే ఎట్టకేలకు సమస్యలను సాధించుకున్నారన్నారు. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఇప్పటికే నిధులను మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. 32 ఎకరాలలో అత్యాధునిక సౌకర్యాలతో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం తమ ప్రభుత్వం చేపట్టబోతుందన్నారు. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం కోర్టు కేసులో ఉన్న కూడా తాము వేరే స్థలంలో నిర్మాణానికి తీసుకున్న నిర్ణయం అందరూ స్వాగతిస్తున్నారు. మరొక్క నెల రెండు నెలల్లో ఉస్మానియా ఆసుపత్రికి కొత్త భవనం నిర్మాణం కోసం శంకుస్థాపన చేయబోతున్నామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.... విద్యార్థి దశలో మంచి వైద్య విద్యను చదువుకొని మంచి వైద్యులు కావాలని ఆయన కోరారు. వైద్య ఆరోగ్య శాఖకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా, కుటుంబ సంక్షేమ కమిషనర్ డీఎంఈ డాక్టర్ వాణి, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్ర నాయక్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కర్ణాన్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సివరేజీ సమస్యకు తక్షణమే పరిష్కారం

జల మండలి ఎండీ అశోక్ రెడ్డి సుడిగాలి పర్యటన



సాక్షి, సిటీబ్యూరో: వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో సీవరేజీ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. సీవరేజి ఓవర్ ఫ్లోతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు పూడికతీత పనులు కొనసాగించాలని సూచించారు. శుక్రవారం కూడా ఎండీ అశోక్ రెడ్డి క్షేత్ర స్థాయి సుడిగాలి పర్యటన కొనసాగింది. పలు ప్రాంతాల్లో పనులు, పరిస్థితులను పరిశీలించి సంబంధిత సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

- చింతల్‌మెట్ – రాజేంద్రనగర్ ప్రధాన రహదారి వద్ద జీహెచ్‌ఎంసీ నాలా ధ్వంసమైన ప్రాంతాల్లో సీవరేజీ తొలగించే పనులను పరిశీలించారు. గోల్డెన్ హైట్స్ రిజర్వాయర్ ను సందర్శించి ఆవరణ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి ప్రైవేటు వ్యక్తులకు ప్రవేశం నిషేధించాలని ఆదేశించారు.
- క్లోరిన్ రూమ్ ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. క్లోరిన్ స్టాక్ స్థితిగతులు, ముగింపు దశకు రాగానే.. మొబైల్ కు అలెర్ట్ మెసేజ్ వచ్చేలా ఆటోమేషన్ ప్రక్రియకు సాధ్యాసాధ్యాల్ని పరిశీలించాలన్నారు.
- గోల్డెన్ హైట్స్ సెక్షన్ లో జనరేటర్ కొనుగోలు చేసి.. ఏళ్ల గడిచినా.. ఇప్పటికీ కనీసం విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.
- బుద్వేల్ లో గతంలో నిర్మించిన రిజర్వాయర్ లీకేజీ అవుతుండటంతో రిపేర్ చేసి నీటి వృథా అరికట్టాలని ఆదేశించారు. గంట గంటకూ వాటర్ లెవల్, క్లోరిన్ శాతం రిజిస్టర్ లో రికార్డు చేయడంతో పాటు.. ఆన్ లైన్ లో సైతం నమోదు చేయాలన్నారు.
- హైదర్ నగర్ సెక్షన్ ఆఫీసును తనిఖీ చేసి.. ఎంసీసీలో పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులపై ఆరా తీశారు. బడ్జెట్ కేటాయించినా పనులు ప్రారంభించక పోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు.
- అదే ఆవరణలో ఉన్న ఉపయోగంలో లేని పురాతన 22 ఎంఎల్డీల సామర్థ్యం గల నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ఆ నీటి శుద్ధి కేంద్ర పునర్వినియోగానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఎన్ని ఇళ్లకు రెండు కనెక్షన్లు ఉన్నాయో సర్వే చేసి అక్రమ నల్లా కనెక్షన్లు ఉంటే తొలగించాలని అధికారుల్ని ఆదేశించారు.

ఉద్యోగాల పేరిట వల

- నకిలీ ప్రకటనలు, ఆఫర్ లెటర్లు, ఐడీ కార్డులతో బురిడీ
- సబ్ కాంట్రాక్ట్‌లు, మద్యం టెండర్లు ఇప్పిస్తామంటూ మోసం
- ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన రాచకొండ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను..సబ్ కాంట్రాక్ట్‌లు, మద్యం టెండర్లు ఇప్పిస్తానంటూ వ్యాపారులను మోసం చేస్తున్న ఘరానా ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. మోస్ట్ వాంటెడ్ నిందితుడితో సహా మరో ఇద్దరిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.4 లక్షల నగదుతో పాటు మూడు ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, సెల్‌ఫోన్లు, నకిలీ ఆఫర్ లెటర్లు, ఐడీ కార్డులు, రబ్బరు స్టాంపులు, ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలను రాచకొండ పోలీసు కమిషనర్ జీ సుధీర్ బాబు శుక్రవారం మీడియాకు వెల్లడించారు.

- ఎల్బీనగర్‌కు చెందిన షేక్ బడే షాహెబ్ అలియాస్ షేక్ మున్నా, దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ముత్తోజు లక్ష్మణాచారి, కొత్తపేటకు చెందిన మడక రామస్వామిలు ముగ్గురు కలిసి సీవైఈ టెక్నాలజీస్ కన్సల్టెంట్‌ని ఏర్పాటు చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని నమ్మించేవారు. ఈ క్రమంలో పోచారంకు చెందిన కాసరపు తిరుపతికి దూరపు బంధువైన రామస్వామి ఫోన్ చేసి తన కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని, తెలిసిన వాళ్లెవరైనా ఉంటే సూచించాలని చెప్పాడు. రామస్వామి మాటలను పూర్తిగా విశ్వసించిన తిరుపతి.. ఈ విషయాన్ని తన స్నేహితులైన మహబూబాబాద్‌కు చెందిన రాంచందర్, భూపాల్‌పల్లికి చెందిన సమ్మయ్యలకు సూచించాడు. దీంతో వారి పిల్లలకు కూడా ఉద్యోగాలు ఇప్పించాలని రామస్వామిని కోరారు. దీంతో ముగ్గురు కలిసి రూ.44 లక్షలు చెల్లించారు. ఈ నిరుద్యోగుల ఆధార్ కార్డులు, ఇతరత్రా వివరాలను మున్నా బెంగళూరుకు చెందిన మహ్మద్ మాలిక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆకాశ్‌లకు పంపించేవాడు. వారు నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు, గుర్తింపు కార్డులను, ఇన్‌కంట్యాక్స్ సర్వీసెస్ నకిలీ వెబ్‌సైట్, ఈ–మెయిల్ ఐడీని సృష్టించి, దీని ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపించేవారు. దీంతో ఉద్యోగం వచ్చిందనే భ్రమలో బాధితులు ఉండేవారు. వారికి అనుమానం రాకుండా 2–3 నెలల పాటు వారి ఖాతాలో వేతనాలు కూడా వేసేవారు. ఉద్యోగం పర్మినెంట్ కావాలంటే ముందుగా డేటా అప్‌డేట్ ఉద్యోగం చేయాల్సి ఉంటుందని బాధితులను నమ్మించేవాడు. కొంతకాలం తర్వాత జీతం రాకపోవడం, నకిలీ ఉద్యోగం అని బాధితులకు తెలిసిపోయింది. దీంతో చెల్లించిన సొమ్ము తిరిగి ఇచ్చేయాలని బాధితులు మున్నాను కోరారు. దీంతో ఫోన్లు స్విచాఫ్ చేసుకుంటూ తప్పించుకొని తిరిగేవారు. దీంతో ఈనెల 4న తిరుపతి పోచారం ఐటీ కారిడార్ ఠాణలో ఫిర్యాదు చేశారు. దీంతో ఎల్బీనగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), పోచారం ఐటీ కారిడార్ పోలీసులు శుక్రవారం మున్నా, లక్ష్మణాచారి, రామస్వామిలను అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. మాలిక్, ఆకాశ్‌లు పరారీలో ఉన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శనివారం, 7, సెప్టెంబర్, 2024


1982


1983

ఆ రూపాలు సంతోషాన్నిచ్చాయి..

ఎలుక రథంపై 1982లో చేసిన వినాయకుడి రూపం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఆ తరువాత విశ్వరూప, మత్స్య వినాయకుడు, ఈ యేడాది 70 అడుగుల ఎత్తులో చేసిన శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి విగ్రహాలు నాకు ప్రత్యేకం. 2024 ఈ సంవత్సరం 70 అడుగుల ఎత్తులో మట్టితో మహాగణపతిని చేయడం వెనుక ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దివంగత సింగరి సుదర్శన్ భక్తులకు ఇచ్చిన మాటను నిలబెట్టేందుకు ఈ విగ్రహాన్ని చేశాను. ఎత్తులో ఇదే చివరి విగ్రహం.. వచ్చే యేడాది నుంచి విగ్రహం ఎత్తు తగ్గుతూ వస్తుంది..





ఆ గుర్తింపే ఇంటిపేరుగా..

ఎప్పుడైతే ఖైరతాబాద్ మహాగణపతికి శిల్పిగా వ్యవహరిస్తూ వచ్చానో ఆ తరువాత నన్ను మహాగణపతి ఆర్టిస్టుగా గుర్తించడం ప్రారంభించారు. ఇక అదే నాకు ట్రేడ్ మార్క్, ఇంటి పేరులా మారిపోయింది. ఖైరతాబాద్ మహాగణపతిని తయారుచేసే భాగ్యం నాకు దక్కడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను.

– చిన్నస్వామి రాజేంద్రన్, ఖైరతాబాద్ మహాగణపతి శిల్పి.


1986


2006


2007


2008

శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి..


విశ్వరూపం

ఒక్క అడుగుతో మొదలై 70 అడుగులకు

- ఖైరతాబాద్ మహాగణపతికి 70 వసంతాలు..
- ప్రపంచంలోనే అతి పెద్ద గణపతి ఉత్సవ మూర్తి
- ఇంటిపేరు 'ఖైరతాబాద్ శిల్పిగా' చిన్నస్వామి రాజేంద్రన్
- 18 ఏళ్ల వయసులోనే 14 అడుగుల ఎత్తు విగ్రహ రూపకర్త

ఇంతింతై వటుడింతయై.. అన్నట్లు.. వేయి అడుగుల ప్రయాణమైనా ఒక్క అడుగుతో మొదలు.. అన్నట్లు.. 70 ఏళ్ల ఖైరతాబాద్ మహాగణపతి ప్రస్థానం కొనసాగుతోంది.. 1954లో ఒక్క అడుగుతో మొదలైన ఖైరతాబాద్ మహాగణపతి ప్రస్థానం నిర్విఘ్నంగా 70 వసంతాలకు చేరుకుంది. యేటా ఒక్కో అడుగు పెంచుకుంటూ 70 అడుగుల ఎత్తులో శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా కొలువుదీరారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా రూపుదిద్దుకున్నాడు.

– ఖైరతాబాద్



హైదరాబాద్ వైబ్స్


యేటా ఒక్కో రూపంలో దర్శనమిచ్చే మహాగణపతి ఈసారి 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో నిలబడిన ఆకారంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు, మహంకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి రూపాలతో కూడిన సప్త ముఖాలు, ఆపై సప్త తలలతో ఆదిశేషావతారం, రెండువైపులా 14 చేతులతో కుడివైపు చక్రం, పుస్తకం, వీణ, కమలం, గద.. ఎడమవైపు రుద్రాక్ష, ఆసనం, పుస్తకం, వీణ, కమలం, గద ఉంటాయి. మహాగణపతికి కుడివైపున పది అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా బాలరాముడి విగ్రహంతో ఈసారి దర్శనమివ్వనున్నారు. ఎడమవైపు రాహు కేతువుల విగ్రహాలను 9 అడుగుల ఎత్తులో ఏర్పాటుచేశారు. మహాగణపతి పాదాల చెంత ఆయన వాహనమైన మూషికం ఆకారాలు 3 అడుగులలో దర్శనమిస్తున్నాయి. విగ్రహానికి కుడివైపున 14 అడుగుల ఎత్తులో శ్రీనివాస కళ్యాణం, ఎడమవైపు శివపార్వతుల కళ్యాణం విగ్రహ మూర్తులను ఏర్పాటు చేశారు. ఇంతటి అద్భుత రూపాలతో యేటా మహాగణపతిని రూపొందిస్తున్న శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ అంతఃకరణ శుద్ధితో తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ మహాగణపతి గురించి ఆయన పంచుకున్న పలు విశేషాలు..

ప్రపంచవ్యాప్త గుర్తింపు...

మహాశక్తి గణపతి వరల్డ్ రికార్డు నెలకొల్పనుంది. అప్పట్లో బాలగంగాధర్ తిలక్ అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు వాడ వాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటుచేయాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు సింగరి శంకరయ్య ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన ఒక్క అడుగు విగ్రహం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. దేశవ్యాప్తంగానే కాక, విదేశాల నుంచి భక్తులు ఇక్కడికి తరలివచ్చి గణనాథుని వేడుకోవడం విశేషం.

సింగరి శంకరయ్య ఆధ్వర్యంలో..

రిజర్వ్‌బ్యాంక్ ఉద్యోగి ఏసుపాదం 1978లో నా వద్దకు వచ్చి ఖైరతాబాద్‌లో సింగరి శంకరయ్య ఆధ్వర్యంలో 14 అడుగుల ఎత్తులో వినాయకుడిని తయారు చేయాలని కోరారు. అదే మొట్టమొదటి సారిగా ఆరు బయట స్టేజీపై 14 అడుగుల ఎత్తులో విష్ణు అవతారంలో చేసిన విగ్రహం. అది అందర్నీ ఆకట్టుకోవడంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించాననే సంతోషం దక్కింది. 1980లో పంచముఖ వినాయకుడిని సారథి స్టూడియోలో చేసి ఖైరతాబాద్ తీసుకొచ్చాం. 1982లో ఎలుక రథంతో మంటపంలో చక్రాల బండిపై స్టాండ్‌తో తయారుచేశాం. అదే సంవత్సరం సాగర సంగమం సినిమా షూటింగ్‌లో భాగంగా నటుడు కమల్ హాసన్‌తో పాట చిత్రీకరణ జరిగింది. 1993 నుంచి 1999 వరకూ ఏడు సంవత్సరాల పాటు ఖైరతాబాద్ మహాగణపతికి శిల్పిగా వ్యవహరించలేదు. ఆ ఏడు సంవత్సరాలు ఆర్టిస్టు రంగారావు నేతృత్వంలో మహాగణపతిని తయారుచేశారు. మరలా 2000 నుంచి ఇప్పటి వరకూ నిర్విరామంగా మహాగణపతికి శిల్పిగా వ్యవహరిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది.




లడ్డూ ప్రసాదం నైవేద్యంగా..

తాపేశ్వరానికి చెందిన సురుచి ఫుడ్స్ నిర్వాహకుడు మల్లిబాబు మొట్టమొదటి సారిగా ఖైరతాబాద్ మహాగణపతికి 2010లో 500 కిలోల లడ్డూను ప్రసాదంగా చేతిలో ఉంచి భక్తులకు పంచిపెట్టారు. ఆ తరువాత వరుసగా 2400, 3600, 4200 లడ్డూను నైవేద్యంగా ఇచ్చారు. 2015లో 6000 వేల కిలోల లడ్డూ మహాగణపతి చేతిలో 11 రోజులు పూజలందుకోవడం మొట్ట మొదటిసారి ఖైరతాబాద్ మహాగణపతికే సొంతం.


1987


1990


1995


1998


పుట్టింది అక్కడే..

తమిళనాడు, పరంబలూరు జిల్లా, పుదువేట కుడి గ్రామానికి చెందిన చిన్నస్వామి, మరుదాయి దంపతులకు 8 మంది సంతానం కాగా, వీరిలో రెండో సంతానం చిన్నస్వామి రాజేంద్రన్. పేదరికంలో ఉన్నా కుటుంబ పోషణ కోసం చిన్న వయసులోనే చెన్నైకి వచ్చి అక్కడ వేలుస్వామి వద్ద పనిచేయడం ప్రారంభించా. అప్పట్లో హైదరాబాద్‌లో ఎన్టీఆర్ నటించే పౌరాణిక ఘట్టాలకు సంబంధించిన ఆభరణాలకు స్టోన్స్ అతికించే పనికోసం నా సీనియర్స్‌తో పాటు నన్ను హైదరాబాద్ పంపారు. ఆ సమయంలో నేను చేసిన పనిని గుర్తించి నన్ను ఆర్టిస్టుగా ప్రోత్సహించారు.


2009


2012


2014


2021

నాన్న వారసత్వాన్ని కొనసాగిస్తూ..



ఖైరతాబాద్ వినాయకుడు, మా నాన్న గారి ఆశీర్వాదంతో నేను ఉన్నన్ని రోజులూ ఖైరతాబాద్ మహాగణపతి ఖ్యాతిని ఏమాత్రం తగ్గకుండా పెంచేందుకు అందరితో కలిసి ముందుకు వెళ్తా. 70 సంవత్సరాలు 70 అడుగులు చేయాలన్న మా నాన్న సింగరి సుదర్శన్ ఆఖరి కోరికను తీరుస్తూ ఆ దిశగా అడుగులు వేయటం సంతోషంగా ఉంది. – సింగరి రాజ్‌కుమార్

70 అడుగుల మట్టి వినాయకుడు..



ఈ యేడాది 70 అడుగుల మట్టి వినాయకుడే వరల్డ్ రికార్డు. ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా, ఎన్నో దశాబ్దాలుగా మహాగణపతి సేవలతో వెన్నుదన్నుగా వ్యవహరిస్తున్నా. వైజాగ్‌లో గతంలో 80 అడుగుల వినాయకుడిని చేసినా అక్కడే నిమజ్జనం చేశారు. ఈ సంవత్సరం విజయవాడలో 72 అడుగులు వినాయకుడిని చేశారు. కానీ అక్కడే నిమజ్జనం చేస్తారు. ఇక్కడ 70 అడుగుల మహాగణపతిని ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం గావిస్తాం. ఇది వరల్డ్ రికార్డు.

– సందీప్ రాజ్, ఉత్సవ కమిటీ కన్వీనర్



అన్నీ తానై..

కర్ర పూజ నుంచి నిమజ్జనం దాకా..

అన్నీ తానై చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్న ఫిరోజ్

మతసామరస్యానికి ప్రతీకగా

ఓల్డ్ బోయిన్‌పల్లి: వినాయకచవితి వచ్చిందంటే అక్కడి ప్రజలు 11 రోజుల పాటు నిత్య పూజలతో భక్తి పారవశ్యంలో మునిగి తేలుతుంటారు. ఇందులో అంజయ్యనగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రతి యేటా వినూత్నంగా మండపాలను ఏర్పాటు చేసి వినాయకుల విగ్రహాలను అదే తరహాలో ఏర్పాటు చేయడం ఆనవాయితీ.

అన్నదానం.. నిమజ్జనం..

అంజయ్యనగర్‌లో మండపం ఏర్పాటు కోసం తొలి పూజ చేసేనాటి నుంచి పెద్ద ఎత్తున అన్నదానం, నిమజ్జనం చేసే వరకూ ఓ ముస్లిం యువకుడు అన్నీ తానై చూసుకోవడం ఇక్కడి ప్రత్యేకత. ఫిరోజ్‌ఖాన్ గత నాలుగేళ్లుగా వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నాడు. అతనికి యూత్ సభ్యులందరూ సహకారం అందిస్తూ ముందుకు వెళుతున్నారు.


ఫిరోజ్‌ఖాన్

ఆకర్షిస్తోన్న మండపం..

రాజమహల్‌ను తలపిస్తున్న మండపం, ఆ మండపం లోపల భక్తులకు భక్తి భావాన్ని నింపేలా ఏర్పాట్లు చేయడం అందరినీ ఎంతగానో అకట్టుకుంటోంది. నిత్యం పూజలతో పాటు వినాయకుని వద్ద భజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అంజయ్యనగర్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో పండగ వాతావరణం తలపించేలా చేసిన ఏర్పాట్లను స్థానికులు అభినందిస్తున్నారు.

కల్యాణ్ జ్యువెలర్స్ నూతన షోరూం ప్రారంభం

శాలిబండ: భారత్‌లోని జ్యువెలరీస్ బ్రాండ్‌లో ఒకటైన కల్యాణ్ జ్యువెలర్స్ తాజాగా చార్మినార్ వద్ద తమ షోరూమ్‌ను ప్రారంభించింది. చార్మినార్ శాలిబండలో నూతనంగా ఏర్పాటు చేసిన కల్యాణ్ జ్యువెలర్స్‌ను శుక్రవారం ఆ సంస్థ బ్రాండ్ అంబాసిడర్, సినీ హీరో అక్కినేని నాగార్జున ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తెలంగాణలో 8వ షోరూమ్‌గా ప్రారంభమైన ఈ కల్యాణ్ జ్యువెలరీస్‌లో ముహూర్త ముద్రలాంటి పలు ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కల్యాణ్ జ్యువెలరీస్‌కి చెందిన లైఫ్ స్టైల్ జ్యువెలరీ బ్రాండ్ క్యాండియర్ కూడా ఆవిష్కరించారు. వీటి ధర రూ.10 వేల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కల్యాణ్ జ్యువెలరీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కల్యాణ్ రామన్ తదితరులు పాల్గొన్నారు.



ఈ బుడతడు కోడింగ్‌లో మొనగాడు!

14 ఏళ్లకే ఏఐలో ప్రావీణ్యం సాధించిన సిద్దార్థ్ ● 'గ్లోబల్ సదస్సు'లో అబ్బురపరిచే ఉపన్యాసం

సాక్షి, హైదరాబాద్: బుడిబుడి అడుగులు వేస్తూ ఇంట్లో తిరగాడాల్సిన వయసులో ఆ బుడతడు కంప్యూటర్ కీబోర్డు పట్టాడు. ఏడేళ్ల నుంచే కోడింగ్‌లో మెళకువలు నేర్చుకోవడం ప్రారంభించాడు. 14 ఏళ్లకే ఏఐలో ప్రావీణ్యం సంపాదించి సర్టిఫికెట్ సాధించాడు. ప్రపంచంలోనే చిన్న వయసులో కోడింగ్ సర్టిఫికెట్ సాధించిన తొలి వ్యక్తిగా రికార్డు సాధించాడు. అతడి పేరే సిద్ధార్థ్ నంద్యాల. ఇటీవల అమెరికా పర్యటన సందర్భంగా (డల్లాస్‌లో) సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించడంతో.. హెచ్ఐసీసీలో జరిగిన గ్లోబల్ ఏఐ సదస్సులో పాల్గొనేందుకు అక్కడి నుంచి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం ఏఐపై అతడిచ్చిన ఉపన్యాసం సాంకేతికతలో ఉద్ధండులను సైతం ఆశ్చర్యపరిచింది. హైదరాబాద్‌కు చెందిన సిద్ధార్థ్‌తో పాటు అతడి కవల సోదరి సౌమ్య నంద్యాల కూడా కోడింగ్‌లో అత్యంత ప్రతిభావంతమైన ప్రదర్శన కనబరుస్తోంది.

చిన్న వయసులోనే కంపెనీలకు సీఈవోలు

ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే సిద్ధార్థ్, సౌమ్యలు అమెరికాలో కంపెనీలు నెలకొల్పారు. వాటికి తామే సీఈవోలుగా కొనసాగుతున్నారు. పలు ఏఐ ఆధారిత ఉత్పత్తులకు స్వయంగా అల్గారిథం రూపొందిస్తూ ముందుకు వెళుతున్నారు. సిద్దార్థ్ వృద్ధుల కోసం ఫాల్ డిటెక్షన్ బ్యాండ్, ఏఐతో పనిచేసే ప్రోస్థెటిక్ చేయి రూపొందించాడు. ఫాల్ డిటెక్షన్ బ్యాండ్ ధరించిన వృద్ధులు ఇంట్లో పొరపాటున జారిపడితే వారి కుటుంబసభ్యులకు వెంటనే అలర్ట్ వెళ్లేలా దానిని తయారు చేశాడు. దీనిని మరింతగా అభివృద్ధి చేసేందుకు నగరంలోని టీ-వర్క్స్‌తో కలిసి పనిచేస్తున్నాడు. చేతులు లేనివారికి అమర్చేందుకు ఏఐ ప్రోస్థెటిక్ చేయిని తక్కువ ఖర్చుతో రూపొందించాడు.

ఖరీదైన వాచ్ బహూకరించిన మంత్రి శ్రీధర్‌బాబు

సదస్సు సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబుతో సిద్దార్థ్ ప్రత్యేకంగా సమావేశమయ్యాడు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు.. రూ.18.6 లక్షల విలువైన తన గడియారాన్ని తీసి సిద్ధార్థ్‌కు బహుమతిగా అందజేశారు. స్వయంగా అతని చేతికి అలంకరించి సంతోషాన్ని పంచుకున్నారు. తన చిన్ననాటి స్నేహితుడు ఒకరు ఆ వాచ్‌ను తనకు బహుకరించారని మంత్రి చెప్పారు.


సిద్దార్థ్‌కు వాచ్‌ను బహూకరిస్తున్న శ్రీధర్‌బాబు

ప్రాథమిక స్థాయి నుంచే ఏఐ

- పాఠశాలల్లో ప్రవేశపెట్టడంపై సమాలోచనలు..
- స్కిల్స్ వర్సిటీతో నైపుణ్యాభివృద్ధి బ్రిడ్జి కోర్సు
- 'సాక్షి'తో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖాముఖి

సాక్షి, హైదరాబాద్: ప్రాథమికస్థాయి నుంచే విద్యార్థుల్లో కృత్రిమ మేధపై అవగాహన కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఫిన్‌లాండ్‌లో మాత్రమే ఈ కోర్సు ప్రవేశపెట్టారని, త్వరలోనే తెలంగాణలోని స్కూళ్లలో కూడా ఇలాంటి కోర్సు ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలి పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో రెండోరోజు జరిగిన తెలంగాణ గ్లోబల్ ఏఐ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో ఆయన ముఖాముఖి మాట్లాడారు. ఏఐపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులను వివరించారు. కంప్యూటర్‌లో ఉండే సీపీయూ కన్నా ఎన్నో రెట్ల శక్తిమంతమైన జీపీయూ (గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్)తో నడిచే కంప్యూటర్లను అందుబాటులోకి తీసుకొచ్చి, అద్భుతమైన స్పీడ్‌తో స్టార్టప్‌లకు ఇంటర్నెట్ అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

నగరంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్..

అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఏఐ ఆధారితంగా పనిచేసే కంపెనీలకు ఊతమిచ్చేందుకు శంషాబాద్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్ (డబ్ల్యూటీఏ)ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో లక్ష చదరపు అడుగుల్లోనిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఏఐ సిటీ నిర్మాణానికి కనీసం రెండుమూడేళ్ల సమయం పడుతుందని, ఆలోపు డబ్ల్యూటీఏ కార్యకలాపాలు నిర్వహిస్తామని వివరించారు. స్కిల్స్ వర్సిటీ ద్వారా ఏఐ బ్రిడ్జి కోర్సులు ప్రవేశపెట్టి, వారికి నైపుణ్యం నేర్పిస్తామన్నారు.

విదేశాల నుంచి కంపెనీలు

సదస్సులో వివిధ దేశాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారని, కృత్రిమ మేధలో అనుపానుల గురించి వివరించారని శ్రీధర్ బాబు తెలిపారు. ఎంఐటీ, జార్జియా టెక్ యూనివర్సిటీ, న్యూయార్క్ యూనివర్సిటీ, యూకే, దక్షిణాఫ్రికా వంటి దేశాల నుంచి వచ్చి, వారి అభిప్రాయాలను పంచుకోవడమే కాకుండా నగరంలోని ఏఐ సిటీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఆసక్తి చూపారని వివరించారు. 2004లో వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్ ముఖచిత్రం పూర్తిగా మారిపోయిందని గుర్తు చేసుకున్నారు. గత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాల విషయంలో ఎలాంటి కక్ష సాధింపు చర్యలు ఉండబోవని, వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

ఏఐ పదునైన కత్తిలాంటిది

లాభాలతో పాటు నష్టాలూ ఉంటాయి.. తెలంగాణ గ్లోబల్ ఏఐ సదస్సులో వక్తలు

సాక్షి, హైదరాబాద్: ఏఐ పదునైన కత్తిలాంటిదని, ఈ సాంకేతికతను ఎలా వాడుకోవాలంటే అలా వాడుకోవచ్చని తెలంగాణ గ్లోబల్ సదస్సులో పాల్గొన్న పలువురు వక్తలు పేర్కొన్నారు. దీనితో లాభాలతో పాటు నష్టాలు కూడా ఉన్నాయని, జాగ్రత్తగా వాడుకుంటే మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని, అజాగ్రత్త వహిస్తే పర్యవసానాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. శుక్రవారం ఉదయం సదస్సు ప్రారంభం కాగానే ఖాన్ అకాడమీ వ్యవస్థాపకుడు సాల్ ఖాన్ అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. విద్యార్థులకు ఏఐతో పాఠాలు బోధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అయితే దీని విషయంలో రెండు కోణాలు ఉన్నాయని గుర్తు చేశారు. పిల్లలకు డిజిటల్ ఎక్స్‌పోజర్ ఎక్కువగా ఉండటం ఆందోళనకరమైన విషయమే అయినా.. ఏఐతో పిల్లలు ఎన్నో విషయాలు నేర్చుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎన్‌వైయూ స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ అరుణ్ సౌందరరాజన్ మాట్లాడుతూ.. ఏఐతో ఎన్నో లాభాలు ఉన్నప్పటికీ ఈ సంస్థల ఏర్పాటుతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతుందని పేర్కొన్నారు. దాదాపు ఒక న్యూక్లియర్ సంస్థకు కావాల్సినంత విద్యుత్ అవసరమవుతుందని చెప్పారు. విద్యుత్ వినియోగం తగ్గించే దిశలో పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు.



మ్యాథ్ హ్యాకథాన్ విజేతలతో మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో జయేశ్‌రంజన్ తదితరులు

స్టాళ్లకు విద్యార్థుల తాకిడి

సదస్సు సందర్భంగా పలు స్టార్టప్‌లు ఏర్పాటు చేసిన స్టాళ్లను చూసేందుకు సందర్శకులు పెద్ద ఎత్తున వచ్చారు. ముఖ్యంగా పలు ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఇక్కడ ఏర్పాటు చేసిన అనేక ఉత్పత్తులు ఎంతో ఉపయోగపడేలా ఉన్నాయని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఆవిష్కరణలు చేయాలనే స్ఫూర్తి కలుగుతోందని పలువురు పేర్కొన్నారు.

ఆమ్రపాలి సందర్శన

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కూడా స్టాళ్లను సందర్శించారు. పలు ఉత్పత్తుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రోబోలతో కాసేపు సరదాగా గడిపారు. సందర్శకులతో ముచ్చటించారు.

మ్యాథ్ హ్యాకథాన్‌లో మెరిసిన విద్యార్థులు

తెలంగాణ గ్లోబల్ సదస్సు వేదికగా ఎన్నో అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయి. 36 గంటల పాటు సాగిన మ్యాథ్ హ్యాకథాన్‌లో ఎంతోమంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. టాప్ త్రీలో నిలిచిన వారికి ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు చెక్కు రూపంలో బహుమతులు అందజేశారు. జనగాంకు చెందిన నితిన్, గౌతమ్ టీం కలిసి రూపొందించిన ఫ్లాట్‌మేట్స్.ఏఐకి మొదటి బహుమతి వచ్చింది. వీరికి రూ.5 లక్షల నగదు బహుమతి అందజేశారు. ఇక జుట్టు ఊడిపోవడం వంటి సమస్యకు ఏఐతో పరిష్కారం చూపించే ఉత్పత్తిని అభివృద్ధి చేసిన బృందానికి రెండో బహుమతి లభించింది. వీరికి రూ.3 లక్షల చెక్కు అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన రెండో సంవత్సరం విద్యార్థులు.. మానసిక ఆరోగ్యానికి ఏఐతో పరిష్కారం దిశగా ఓ ఐడియాను ముందుకు తీసుకొచ్చారు. వీరు రూ.2 లక్షల నగదు బహుమతి అందుకున్నారు.

మళ్లీ ముంచారు

మరోసారి పెరిగిన బుడమేరు ప్రవాహం.. ప్రజల్లో ఆందోళన
ఏపీ సర్కారు నిర్వాకంతో ఆరు రోజులుగా విజయవాడ వాసుల అగచాట్లు
కనీసం ఇప్పుడైనా వరద వస్తోందని అప్రమత్తం చేయని వైనం

(విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల నుంచి సాక్షి ప్రతినిధులు, నెట్‌వర్క్): వరద వస్తుందని వారం క్రితం చెప్పలేదు..! రెండో సారి నిన్న కూడా చెప్పలేదు! అసలు ప్రభుత్వం ఉందా? ఆ మాత్రం సమాచారం ఇవ్వకుండా మమ్మల్ని చంపేయాలనుకుంటున్నారా?.. విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో బాధితుల ఆక్రందన ఇదీ!! ఆరు రోజులవుతున్నా విజయవాడలో పలు కాలనీలు జల దిగ్బంధంలోనే ఉండగా.. గురువారం రాత్రి నుంచి బుడమేరు వరద మళ్లీ పోటెత్తడంతో పలు ప్రాంతాలను ముంచెత్తింది. కొన్ని కాలనీల్లో వరద ప్రవాహంతో 6–7 అడుగుల మేర నీళ్లు నిలిచాయి. జక్కంపూడి కాలనీలో వరద నీరు గంట గంటకూ పెరుగుతోంది. సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న వరద బాధితులతో అజిత్‌సింగ్‌నగర్ మొదలుకొని పైపుల రోడ్డు వరకు కిక్కిరిసిపోయింది. గత ఆదివారం వరద నీరు చుట్టుముట్టడంతో కేఎల్ పురానికి చెందిన నూలి అయ్యన్న గుప్తా కుటుంబం పీకల్లోతు నీటిలో రెండు రోజులు నరకం చవిచూసింది. మంగళవారం ఎలాగోలా బయటపడి బంధువుల ఇంటికెళ్లి తలదాచుకున్నారు. ముంపు తగ్గిందని చెప్పడంతో గురువారం ధైర్యం చేసి ఇంటికి చేరుకున్నారు. తెల్లారి చూసేసరికి మళ్లీ వరద ఇంటిని ముంచేసింది. చూస్తుండగానే నాలుగడుగులు నీరొచ్చేసింది. ఏం చేయాలో దిక్కు తోచక మళ్లీ కాలినడకన మూడు కిలోమీటర్లు ముంపు నీటిలోనే నడుచుకుంటూ నందమూరి నగర్ క్రాస్‌కు చేరుకున్నారు. గుప్తా భార్య పద్మావతి వరద ఉధృతిని చూసి తీవ్ర ఆందోళనకు గురైంది. వరద గురించి ప్రభుత్వం కనీస సమాచారం ఇవ్వలేకపోతే ఇంతమంది అధికారులు, పోలీసులు ఉండి ప్రయోజనం ఏమిటని గుప్తా కుటుంబం ఆక్రోశిస్తోంది. మ్యాచిస్ రోడ్డులో ఉండే మురళి కుటుంబం తమ ఇల్లు పూర్తిగా ముంపు నీటిలో చిక్కుకోవడంతో బంధువుల ఇంట్లో తలదాచుకుని తిరిగి వచ్చి శుభ్రం చేసుకుంది. శుక్రవారం తెల్లారి చూసేసరికి మళ్లీ వరద ఇంటిని చుట్టుముట్టేయడంతో వారి ఆవేదన వర్ణనాతీతం. ఆదివారం వరద వచ్చినప్పుడు చెప్పలేదు. ఈరోజు వరద వచ్చినప్పుడూ చెప్పలేదు. పైగా మళ్లీ వరద వచ్చే ప్రశ్నే లేదు..వర్షం పడే చాన్స్ లేదంటూ అధికారులు గంభీరంగా ప్రకటనలు ఇవ్వడం ఎంతవరకు సమంజసం? ప్రజల్ని చంపేయాలనుకుంటున్నారేమో అర్థం కావడం లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


విజయవాడలోని ఇందిరానాయక్ నగర్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు వరద నీరు

ప్రభుత్వ వైఫల్యం కాక ఇంకేమిటి?

ఇందిరా నగర్, నందమూరి నగర్, భరతమాత కాలనీ, పైపుల రోడ్, డాబాకొట్ల రోడ్డు, ఆంధ్రప్రభ కాలనీ.. ఇలా సింగ్‌నగర్ ఎగువ ప్రాంతాలలో ఉంటున్న వారంతా ఒకటే అడుగుతున్నారు. మొన్న.. అనుకోకుండా వరద ముంచెత్తిందన్నారు.. ఇప్పుడు మళ్లీ ముంచుకొస్తోంది. ముందుగా ఎందుకు అప్రమత్తం చేయలేదు? పైగా పుకార్లు నమ్మొద్దంటూ జిల్లా కలెక్టర్ స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. ఇంటి వద్దే ఉండండి.. ఆహారం, మంచినీళ్లు, నిత్యావసరాలు అందిస్తామని సీఎం చంద్రబాబు చెబుతున్నారు. బుడమేరుకు మళ్లీ గండి పడిందని, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద ముంచెత్తుతుందని ఎందరో చెబుతున్నారు. ఎవరి మాట నమ్మాలి? ప్రభుత్వం వద్ద ఎందుకు సమాచారం లేదు? ఎందుకు అప్రమత్తం చేయలేక పోతున్నారో అర్థం కావడం లేదు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం కాక ఇంకేమిటి? అని నిలదీస్తున్నారు. ప్రభుత్వం మాటలు నమ్మి ఇంటి పట్టునే ఉన్నందుకు ఈ రోజు నరకం చూస్తున్నాం. సింగ్‌నగర్ లోపల ప్రాంతాలకు కనీసం పాల ప్యాకెట్ అందించిన పాపాన పోవడం లేదని వాపోతున్నారు.

బయటకు వెళ్లి తిరిగి రాగానే..: స్వల్పంగా తగ్గిందనుకున్న బుడమేరు వరద అనూహ్యంగా మళ్లీ పోటెత్తడంతో విజయవాడ ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా మారిపోయింది. గురువారం రాత్రి నుంచి బుడమేరు వరద నీరు విజయవాడలోని పలు ప్రాంతాలను ముంచెత్తింది. ఉదయం వరద తగ్గడంతో ఊపిరి పీల్చుకున్న బాధితులు ఇళ్ల శుభ్రం చేసుకోవడం, నిత్యావసరాలు, ఇతర అవసరాల కోసం బయటకు రావడం ప్రారంభించారు. బయట ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు కూడా తిరిగి ఇళ్లకు వచ్చారు. కానీ మళ్లీ ఒక్కసారిగా ఇళ్లను వరద ముంచెత్తడంతో పరిస్థితి భయానకంగా మారింది. వారం రోజులుగా వరద వీడకపోవడం, ఎలాంటి సాయం అందకపోవడంతో గగ్గోలు పెడుతున్నారు. సింగ్‌నగర్ సమీపంలోని ఇందిరా నాయక్ నగర్ మొత్తం వరద ఉధృతికి వణుకుతోంది. ఇళ్ల నుంచి బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఇళ్ల మధ్య నుంచి బుడమేరు వేగంగా ప్రవహిస్తుండడంతో అపార్టుమెంట్లు, బిల్డింగ్‌లపైన నిలబడి తమను ఎవరైనా బయటకు తీసుకెళతారేమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆ ప్రాంతంలోకి ఎన్డీఆర్ఎఫ్ బోట్లు వెళ్లడం కూడా కష్టంగా మారింది. ప్రాణాపాయం ఉన్న వారిని బయటకు తెచ్చేందుకు వరదకు ఎదురు వెళ్లాల్సి రావడంతో సమస్యాత్మకంగా ఉంది. కొన్ని బృందాలు అతి కష్టం మీద కొందరిని బయటకు తెస్తున్నాయి.

పింఛన్ కోసం.. నడుం లోతు నీళ్లలో



విజయవాడ స్పోర్ట్స్: వరద ప్రభావిత ప్రాంతాల్లో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ డబ్బుల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఆగస్టు 31న పింఛన్లు పంపిణీ చేసిన ప్రభుత్వం వరద ప్రభావిత ప్రాంతాల్లో లబ్ధిదారులను విస్మరించింది. ముంపు ప్రాంతాలైన సింగ్ నగర్, లూనా సెంటర్, యార్డ్ రోడ్డు, కృష్ణా హోటల్ సెంటర్, వాంబే కాలనీ, న్యూ ఆర్ఆర్‌పేట, పాయకాపురం, ప్రశాంతినగర్, సుందరయ్య నగర్, కండ్రిక, రాజీవ్‌నగర్, జక్కంపూడి కాలనీ, అంబాపురం తదితర ప్రాంతాల్లో పింఛన్ డబ్బుల కోసం నడుం లోతు నీళ్లలో మూడు నుంచి ఆరు కిలోమీటర్లు నడవాల్సిన దుస్థితి నెలకొంది. పింఛన్ కోసం సింగ్ నగర్ ఫ్లై ఓవర్ వద్దకు రావాలని ఆదేశించడంతో ఆయా ప్రాంతాల్లో 25 వేల మందికిపైగా పింఛన్‌దారులు వరద నీటిలో నడుచుకుంటూ వెళుతున్న దయనీయ దృశ్యాలు కనిపిస్తున్నాయి. వృద్ధులు, దివ్యాంగుల పట్ల కనీసం మానవత్వం, కనికరం లేకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.

క్లుప్తంగా...

గవర్నర్, సీఎం చవితి శుభాకాంక్షలు




సాక్షి, హైదరాబాద్: వినాయక చవితి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుభాకాంక్షలు తెలిపారు. ఏదైనా మంచి కార్యాన్ని తలపెట్టే ముందు ఎలాంటి విఘ్నాలు లేకుండా విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తామని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వాడవాడలా వెలిసే గణేశ్ మండపాలలో భక్తిశ్రద్ధలతో ప్రజలు పూజలు నిర్వహించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సకల విఘ్నాలను పారదోలి సర్వ జనులకు సుఖశాంతులను అందించే వినాయక చవితి పండుగ సందర్భంగా తెలంగాణ ప్రజలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

వినాయకచవితి సందర్భంగా విఘ్నేశ్వరుడి ఆశీర్వాదంతో ప్రజలు చేసే పనుల్లో విఘ్నాలన్నీ తొలగిపోవాలని, అనుకున్న కార్యాలను విజయవంతంగా పూర్తిచేసే శక్తి ఇవ్వాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

చవితి సుఖసంతోషాలను నింపాలి: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ చవితి కష్టాలను తొలగించి ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలను నింపాలని గణనాథున్ని ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తి శ్రద్ధలతో వినాయకుడిని ప్రార్థించి దేవదేవుని అనుగ్రహం పొందాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

పలు రైళ్ల రద్దు

సాక్షి, హైదరాబాద్: ఏపీలోని గిద్దలూరు–దిగువమెట్ట సెక్షన్‌లో ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గుంటూరు–కాచిగూడ, కాచిగూడ–మెదక్, డోన్–గుంటూరు, గుంటూరు–తిరుపతి, గుంటూరు–ఔరంగాబాద్ మధ్య నడిచే 10 సర్వీసులను ఈనెల 11 నుంచి 22వ తేదీ వరకు రద్దు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే ఆ రూట్‌లో నడిచే కొన్ని రైళ్లను ఇతర మార్గాల్లోకి మళ్లించనున్నారు.

నాకు న్యాయం జరుగుతుంది: లావణ్య




మణికొండ: సినీనటుడు రాజ్‌తరుణ్‌పై తాను చేసిన ఫిర్యాదులు..చేస్తున్న పోరాటం ఫలించి తనకు న్యాయం జరుగుతుందని లావణ్య పేర్కొన్నారు. నార్సింగి పోలీసులు రాజేంద్రనగర్(ఉప్పర్‌పల్లి) కోర్టులో ఇటీవల చార్జిషీట్ దాఖలు చేయటంతో ఈ విషయం మరోమారు తెరపైకి వచ్చింది. శుక్రవారం లావణ్య మీడియాతో మాట్లాడుతూ రాజ్‌తరుణ్‌తో తన కు పెళ్లి జరిగిందని, పదేళ్ల కలసి ఉన్నామని అందుకు సంబంధించిన వీడియో, ఫొటోలు విచారణలో పోలీసులకు అందజేశానని వివరించారు. ఇప్పటికైనా రాజ్‌తరుణ్‌ను తనకు అప్పగించాలని ఆమె కోరింది. రాజ్‌తరుణ్ తనను మోసం చేసి హీరోయిన్ మాల్వీ మల్హోత్రతో కలిసి ఉంటున్నాడని, ఆమె సోదరుడు తనను చంపుతానని బెదిరిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని లావణ్య నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయగా, జూలై 9న కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో రాజ్‌తరుణ్ హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తీసుకున్నారు. నార్సింగి పోలీసులు వేసిన చార్జిషీట్ నేపథ్యంలో రాబోయే రోజుల్లో బెయిల్ రద్దు అవుతుందా.. రాజ్‌తరుణ్ అరెస్టు అవుతారా.. అనే విషయంపై ఉత్కంఠ నెలకొంది.

తాత్కాలిక ఉద్యోగుల తొలగింపుపై వెనక్కి తగ్గిన గురుకుల సొసైటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్) నుంచి ఆకస్మికంగా ఉద్వాసనకు గురైన దాదాపు 2 వేల మంది పార్ట్‌టైమ్ టీచర్లు, గెస్ట్ ఫ్యాకల్టీ చేపట్టిన ఆందోళన సత్ఫలితాన్నిచ్చింది. 268 గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలతోపాటు 38 డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న తమను విధుల నుంచి తొలగించాలంటూ సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి ఈ నెల 2న మౌఖికంగా, 3న లిఖితపూర్వకంగా ఆదేశించడంపై పార్ట్‌టైమ్ టీచర్లు, గెస్ట్ ఫ్యాకల్టీ భగ్గుమన్నారు. వందలాది గెస్ట్ ఫ్యాకల్టీ, పార్ట్‌టైమ్ టీచర్లు హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని గురుకుల సొసైటీ కార్యాలయానికి చేరుకొని నిరసన చేపట్టారు. వారికి ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతివ్వడంతో మూడు రోజులపాటు ఆందోళనలు మిన్నంటాయి. దీంతో వారి తొలగింపుపై గురుకుల సొసైటీ వెనక్కి తగ్గింది. తొలగించిన వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సొసైటీ కార్యదర్శి శుక్రవారం ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ఈ సమాచారం ఉద్యోగులకు చేరడంతో అందుబాటులో ఉన్న పలువురు శుక్రవారం మధ్యాహ్నమే విధుల్లో చేరిపోయారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో మిగిలిన ఉద్యోగులు సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉంది.

టుడేస్ గ్రాఫిక్



ఎమ్మెల్యేల ఫిరాయింపులో జోక్యం చేసుకోలేం



- తీర్పు తర్వాత పిటిషనర్ మెన్షన్ చేయవచ్చు
- కేఏ. పాల్ పిల్‌లో సీజే ధర్మాసనం వ్యాఖ్యలు


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎమ్మెల్యేల ఫిరాయింపునకు సంబంధించిన మూడు పిటిషన్లలో సింగిల్‌జడ్జి వద్ద తీర్పు రిజర్వు అయ్యిందని.. ఈ దశలో జోక్యం చేసుకోలేమని సీజే ధర్మాసనం తేల్చిచెప్పింది. అయితే తీర్పు వచ్చిన తర్వాత తమ ముందు మెన్షన్ (ప్రస్తావన) చేసే స్వేచ్ఛను పిల్‌లోని పిటిషనర్ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ.పాల్‌కు ఇచ్చింది.

- 'రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని నిబంధనల ప్రకారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో సహా ప్రతివాదులు (పార్టీ మారిన ఎమ్మెల్యేలు) తమ ఎమ్మెల్యేల పదవికి అనర్హులుగా ప్రకటించండి.
- 10వ షెడ్యూల్, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951ని ఉల్లంఘించినవారు.. వారు చేరిన పార్టీ నుంచి తిరిగి ఎన్నికయ్యేలా ఆదేశాలు జారీ చేయండి.
- ఫిరాయింపుల నిరోధక చట్టాలను కచ్చితంగా పాటించేలా భారత ఎన్నికల కమిషన్‌ను ఆదేశించండి. ఫిరాయింపు ఎమ్మెల్యేల చర్యలు రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలి.
- శాసనసభ్యులను కొనుగోలు చేసే వస్తువులుగా పరిగణించకుండా చూసేలా చర్యలు చేపట్టాలి.' అని కోరుతూ హైకోర్టులో కేఏ పాల్ పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్ రావు ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. పార్టీ ఇన్ పర్సన్‌గా పాల్ వాదనలు వినిపించారు. అయితే ధర్మాసనం సింగిల్ జడ్జి వద్ద తీర్పు రిజర్వయి ఉన్నందున ఈ అంశంలో ప్రస్తుతానికి కల్పించుకోలేమని స్పష్టం చేసింది.

ఫార్మాసిటీపై మీ వైఖరేంటి?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో ఫార్మా సిటీ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. అలా కాని పక్షంలో రైతుల నుంచి సేకరించిన ఆ భూములను ఏం చేస్తారో వివరాలు తెలియజేయాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేస్తూ, ఆలోగా వివరాలు తమ ముందు ఉంచాలని తేల్చిచెప్పింది. ప్రతిపాదిత ఫార్మా సిటీలో భూములున్న రైతులకు, భూ యజమానులకు రెవెన్యూ అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని కుర్మిద్దకు చెందిన పి.నరసింహతోపాటు మరో 37 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది రవికుమార్ వాదనలు వినిపిస్తూ.. ఫార్మా సిటీ కోసం రైతుల భూములను సేకరించేందుకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రైతుల భూమి వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడానికి అధికారులు అనుమతించడం లేదని, వ్యవసాయ భూములకు పూర్తి యాజమాన్య హక్కులను పొందకుండా నిరోధిస్తున్నారని చెప్పారు. ఫార్మా సిటీని ఏర్పాటు చేయబోమని సీఎం రేవంత్ పత్రికా ప్రకటనలు చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పేర్కొందని వెల్లడించారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఫార్మా సిటీ స్థానంలో అక్కడ లైఫ్ సైన్సెస్ పార్క్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు అధికారులు చెప్పారని వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ అంశంపై పూర్తి వివరాలతో ఈ నెల 20లోగా కౌంటర్ అఫిడవిట్ సమర్పించాలని రెవెన్యూ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు.




వర్షంలోనూ ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల నిరసన

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం ఓవైపు వర్షం కురుస్తున్నా.. ప్రధాన గేటు వద్ద ఆందోళన కొనసాగించారు. తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిరసన వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే. 17 డిమాండ్లు తీర్చాలని ఇది వరకే వినతిపత్రం ఇచ్చిన ఈ విద్యార్థి సంఘం పరిష్కారం కోసం పోరాటం చేస్తోంది. ట్రిపుల్‌ఐటీలోకి ఎవరినీ అనుమతించడం లేదు. ప్రధాన గేటు వద్ద సెక్యూరిటీని పెంచారు. మరోవైపు ఏబీవీపీతోపాటు ఇతర విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించినా లోనికి వెళ్లేందుకు అనుమతించడంలేదు. ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ రాజీనామాతోపాటు మరో 16 డిమాండ్లు నెరవేర్చాలని విద్యార్థులు కోరుతున్నారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టంచేశారు.

రైతు బతికుండగానే మృతిచెందినట్టు ధ్రువీకరణ

మరో వ్యక్తిపై అక్రమ పట్టా.. తహసీల్దార్ కోమిపై ఫిర్యాదు


మల్లయ్యతో కుటుంబ సభ్యులు

పర్వతగిరి: రైతు బతికి ఉండగానే మృతి చెందినట్టు ధ్రువీకరించి మరో వ్యక్తికి అక్రమంగా పట్టా చేశారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన రైతు ఎర్రం మల్లయ్యకు వారసత్వంగా సర్వే నంబర్ 185/7/1లోని ఎకరం 25 గుంటల భూమి ఉంది. క్రాప్ లోన్ రూ.85 వేలు తీసుకున్నాడు. ఇటీవల రుణమాఫీ రాకపోవడంతో అనుమానం వచ్చి తెలుసుకోగా బ్యాంకు, వ్యవసాయ అధికారులు భూమి మల్లయ్య పేరు మీద లేదని చెప్పగా అవాక్కయ్యాడు. వెంటనే తన కుమారుడితో సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తెలుసుకోగా, ఎర్రం దూడయ్య పేరు మీద భూమి ఉందని, గతేడాది మార్చి 13న అప్పటి తహసీల్దార్ పట్టా చేసినట్టు తేలింది. ఎర్రం మల్లయ్య మృతిచెందినట్లు తహసీల్దార్ ధ్రువీకరించారని, అందుకు సాక్షులుగా ఎర్రం రాజు, వల్లందాస్ వెంకటేశ్వర్లు, ఎండీ అక్తర్ పాషా సంతకాలు పెట్టినట్లు తెలుసుకున్నాడు. వెంటనే బాధిత రైతు మల్లయ్య కలెక్టర్, పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దార్ కోమిపై ఫిర్యాదు చేశాడు. ఎస్సై బోగం ప్రవీణ్‌ను వివరణ కోరగా విచారణ చేశామని, తహసీల్దార్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత తహసీల్దార్ వెంకటస్వామిని వివరణ కోరగా రైతు బతికి ఉండగానే మృతిచెందినట్టు ధ్రువీకరించి మరో వ్యక్తిపై అక్రమ పట్టా చేసిన విషయం వాస్తవమేనని, పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని తెలిపారు. పూర్తిస్థాయి సర్వే జరుగుతుందని, కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్టు చెప్పారు.

వినాయక చవితి ప్రత్యేకం



ప్రతి భాగం ఓ పాఠం... ..ప్రకృతికి పీఠం

గణనాథుని అణువణువూ విజ్ఞానం... ప్రతి ఘటనా సందేశం

వినాయక చవితి గురించి 'సాక్షి'తో కవినాయకుల కబుర్లు



● భువనచంద్ర


వినాయకచవితి అనేది కేవలం ఒక పండుగ కాదు.. ఈ పండుగ నుంచి ఎన్నో విషయాలు మనం నేర్చుకోవాల్సి ఉంది. ఏనుగు తలకాయ.. అంటే పెద్దది. అంటే గొప్పగా ఆలోచించు.. పెద్ద పెద్ద చెవులు ఉంటాయి అంటే... 'నాయనా నీ శక్తినంతా మాట్లాడుతూ మాట్లాడుతూ వేస్ట్ చేయకు, ఇతరులు చెప్పేది శ్రద్ధగా విను.. ఆ విన్నదాన్ని చక్కగా నీ మెదడుతో ఆలోచించు..' అని అర్థం. ఇక ఆయన పొట్టకు నాగ బంధం కట్టేశారు.. అంటే అర్థమేంటీ? జాగ్రత్తగా గమనిస్తే.. నాయనా నువ్వు ఎక్కువ గనుక తిన్నట్టయితే.. అది విషంతో సమానం. అందుకే మితంగా భుజించడం నేర్చుకో.. అందుకే తినే ముందు నీళ్లు జల్లి అమృత మస్తు అంటాం.. అమృతం ఎప్పుడు అవుతుంది? మితంగా తిన్నప్పుడు అమృతం.. అపరిమితంగా తిన్నప్పుడు అది విషం. మనం తినేటటువంటి ఆహారం ఎలుకలు గనుక తినేస్తే.. ఎలుకలను గనుక కంట్రోల్‌లో పెట్టకపోతే మనిషికి గింజ కూడా దొరకదు. అందు గురించే ఆయనకు వాహనంగా పాదాల దగ్గర ఎలుకను ఉంచి ఎలుకలను కంట్రోల్‌లో పెట్టుకున్నావో నీ ఆహారం సేవ్ అవుతుంది అని సూచిస్తున్నారు.

వినాయకుడి చేతిలోని అంకుశం... దేన్నైనా కంట్రోల్ చేసుకునే పవర్.. ఏ బంధమైనా.. స్నేహం కావచ్చు.. ఏదైనా నిర్ణయం కావచ్చు.. అంకుశం ఏంటంటే.. నువ్వు ఏది చేయాలనుకున్నా ఆ చేస్తున్నది కరెక్టా కాదా అనేది మన చేతుల్లో ఉండాలి. తర్వాత పాశం.. రిలేషన్స్.. ఇలా వినాయకుడి శరీరంలో ఉండే ప్రతి భాగమూ మనకు ఒక పాఠం లాంటిది. జీవిత పాఠం అది. గ్రామాల్లో స్థానికంగా ఉండే దేవతల్లో లక్ష్మీ, వినాయకుడు ఇద్దరూ ఉంటారు. ఆహార ఉత్పత్తి, పొదుపు వల్ల సమృద్ధి. నాకు ఒకరు గొప్ప మాట చెప్పారు. ఆరోజుల్లో జీతాలు తక్కువ వచ్చేవి కదా.. అప్పుడు ఒకరు చెప్పారు. అది చాలా మంచి మాట. 'ఏమండీ.. మా ఇంట్లో చింతపండు, ఉప్పు, ఎండు మిరపకాయలు, బియ్యం కచ్చితంగా ఎప్పుడూ ఉంచుతానండీ... జీతం రాగానే మొట్టమొదట ఎక్కువ మోతాదులో అవే తీసుకుంటానండి' అని. 'అదేంటీ?' అన్నాను. 'మన ఇంటికి పది మంది అప్పటికప్పుడు వచ్చారనుకోండి.. ఆ నాలుగు పదార్థాలుంటే కనీసం చారన్నం అయినా పెట్టొచ్చు కదా?' అని సమాధానం ఇచ్చారు. అంటే మిగిలినవన్నీ లగ్జరీ ఐటమ్స్.

ఇక తర్వాత లేఖిని.. వ్యాసుడు చెబుతుంటే మహాభారతం రాయడం. ఇక్కడ లేఖిని అంటే అక్షరం రాయడం మాత్రమే కాదు.. ఏ విద్యైనా సిద్ధింప చేయాలంటే మొట్టమొదట చెవులు కరెక్ట్‌గా ఉండాలి.. బుర్ర కరెక్ట్‌గా ఉండాలి. అందుచేత సిద్ధి వినాయకుడు.. ఏది మొదలుపెట్టినా 'అయ్యా ఇది నేర్చుకోదలిచాను.. నన్ను సిద్ధింపచేసే శక్తి నీలో ఉంది గనుక ఈ సిద్ధి నాకు ప్రాప్తించేలా చూడు' అని నమస్కరిస్తాం. చిన్నతనంలో కూడా అందుకే వినాయకచవితి వచ్చిందంటే.. పుస్తకాలు, అట్టలు.. పెన్నులు అన్నీ స్వామి వారి ముందు ఉంచి పూజ చేసుకుంటాం. ఏ పని మొదలుపెట్టినా.. ఇల్లు కట్టినా.. పెళ్లి చేసినా వినాయకుడికి మొట్టమొదటి స్థానం ఎందుకు ఇస్తారంటే..

ఆయన సిద్ధి కావాలంటే శ్రద్ధ ఉండాలి. శ్రద్ధ లేనిదే సిద్ధి లేదు. నిజానికి కుమారస్వామితో ఆయన పోటీ పడినప్పుడు కూడా ఆయన బుద్ధిని ఉపయోగించాడు.. అందుకే ఆయన భార్యలను సిద్ధి బుద్ధి అంటాం.. నీ బుద్ధిని గనుక సక్రమంగా వినియోగించినట్లు అయితే ఆటోమేటిక్‌గా సిద్ధి లభిస్తుంది. వినాయకచవితి ఏం చెబుతుందంటే.. ఏది చేసినా శ్రద్ధతో చెయ్.. చక్కటి ఆలోచనలతో ఉండాలి. ఆయన కళ్లు చాలా చిన్నగా ఉంటాయి. చిన్నగా అంటే అర్థం ఏంటీ? సూక్ష్మమైనదాన్ని కూడా చూడగలగాలి. చీమ కన్ను ఎంత చిన్నగా ఉంటుంది? దానికి కూడా ఆహారం దొరుకుతుంది కదా? అట్లాగే ఏనుగు కళ్లు చూడటానికి చాలా చిన్నగా ఉంటాయి. కానీ అతి సూక్ష్మమైన కదలికలను కూడా అది పట్టుకుంటుంది. ఇంకో విషయం ఏంటంటే.. జంతువులు అన్నింటిలోనూ చక్కటి బ్రెయిన్ ఉన్న జంతువు ఏనుగు. అదే నెంబర్ వన్. మానవుడికి ఎంత శక్తి ఉంటుందో అంత పవర్ దానికి ఉంది.

పత్రి అనేది మనం ఎందుకు కోసుకొస్తాం? వెలగ, వాక్కాయ్ వంటివన్నీ ఎందుకు తీసుకొస్తాం పూజకి? ఎందుకంటే ఈ సీజన్‌లో వాక్కాయ్ పచ్చడి తినమంటే ఎవరూ తినరు..? అందుకే వాక్కాయ్ – కొబ్బరికాయి, కొబ్బరికాయ – వెలగ కలిసి చేసుకుంటాం. నిజానికి ఈ సీజన్‌లో ఇవి తింటేనే రోగనిరోధక శక్తి అద్భుతంగా పని చేస్తుంది. రెండొవది ఆకులు దూసిన తర్వాత కొత్త ఆకులువస్తాయి. అలా కాకుండా ఆ ఆకులు మొక్కకే ముదిరిపోతే అక్కడితో ఎండ్ అయిపోతుంది. ప్రతి ఔషధ మొక్కలను సజీవంగా ఉంచాలంటే పాత ఆకుల్ని పీకాలి. ఇక కామెర్లకు నేల ఉసిరి బెస్ట్ మెడిసిన్. ప్రకృతిని రక్షించేవాడు దేవత.. ప్రకృతిని రక్షిస్తూ.. ప్రకృతి మీద ఆధారపడేవాడు మానవుడు. ప్రకృతిని నాశనం చేసేవాడు రాక్షసుడు. ప్రకృతితో సహజీవనం చెయ్ అని చెప్పే ఏకైక పండుగ వినాయకచవితి.





● సుద్దాల అశోక్‌తేజ

వినాయచవితి పట్ల నా పరిశీలన ఏంటంటే పురాణాలు కానివ్వండి.. ప్రబంధాలు కానివ్వండి.. కల్పనలు కావచ్చు.. యదార్థంగా జరిగినవి కావచ్చు.. ఏవైనా.. ఏవైనా సరే.. ప్రజాశ్రేయస్సు కోసం, ప్రకృతి శ్రేయస్సు కోసం రాసినవే.. పుట్టించినవే.. శంకరుడు.. పార్వతమ్మ ఉన్న ఇంట్లోకి వెళ్లబోతుంటే ఒక పిల్లోడు అడ్డుకుంటాడు.. అతడిపై ఆగ్రహించి శిరచ్ఛేదం చేశాడు. ఇది కదా కథ? తర్వాత పార్వతమ్మ వచ్చి.. బాగా ఏడ్చి.. భర్త మీద కోప్పడితే.. మళ్లీ బతికించాడు.. ఫస్ట్ ఏంటంటే.. తొందరపాటుతనం మనుషులకే కాదు.. దేవతలమైన మాకు కూడా ఉంటుందని చెప్పడమే ఆ పసివాడ్ని చంపడం.. ఒక తొందరపాటులో ఇన్ని అనర్థాలు జరుగుతాయి అని చెప్పడానికి ఈ కథ ఏర్పడింది అనుకుంటాను.. శివుడు సహనంగా ఉండి ఉంటే చంపేవాడు కాదు కదా..

నంబర్ 2– ఎంత పరమేశ్వరుడైనా భార్యకు శరీరంలో సగభాగం ఇచ్చాడు.. అదొక ఆదర్శమైతే.. భార్య అతడు చేసిన పొరబాటు గురించి చెప్పగానే.. ఎక్కడా పురుషాధిక్యత లేకుండా తన పొరబాటు తాను గ్రహించాడు.. అంటే ఇక్కడ స్త్రీలను ద్వితీయశ్రేణి పౌరుల్లా భావించడం తప్పు అని తన ఈ చర్య ద్వారా తెలిపాడు.. 'నేను భర్తను, నువ్వు భార్యవి.. అవును చంపేశాను.. నా ఇష్టం..' అని ఉంటే పోయేది కదా..? కానీ అలా అనలేదు.. పొరబాటు గ్రహించడమే కాదు.. భార్య చెప్పిన దిద్దుబాటు చర్యకు పూనుకున్నాడు. తనకన్నా చిన్నవాళ్లు చెప్పినా.. భార్య చెప్పినా.. మంచి చెప్పినప్పుడు మనం దాన్ని సవరించుకోవాలి.. వీలైతే ఆచరించుకోవాలి.. అనేది రెండో ఘటన.

మూడవది ఇది చాలా చిత్రం అనిపిస్తుంది నాకు. తలను తీసేశాడు.. భార్య వచ్చి ఏడవగానే ఉన్న తలను అతికించొచ్చు కదా? ఎన్నో మాయలున్నవాడు.. పైగా నరికిన తల పక్కనే ఉంటుంది కదా? ఆ తలను అతికించకుండా ఏనుగు తల తీసుకుని రావడం ఎందుకు అంటే.. మనిషికి ఎంత ప్రాధాన్యత ఉందో.. దేవతలకు ఎంత ప్రాధాన్యత ఉందో.. జంతువులకు కూడా అంతే ప్రాధాన్యత ఉంది అని చెప్పడానికన్నమాట. అంటే ప్రకృతిని గౌరవించడం అనిమాటే. ''నువ్వు జీవించు మిగతా వాటిని జీవించనివ్వు'' అని చెప్పడం కోసం ఒక జంతువుకి అపారమైన ప్రాధాన్యత ఇవ్వడం కోసం ఏనుగు తలకాయ పెట్టి ఉంటాడా? ఇవన్నీ నా ఆలోచనలే.. నా వ్యక్తిగతమైనవి.

తర్వాత శంకరుడి దగ్గర కైలాసంలో పరస్పర శత్రువులైన జంతువులన్నీ ఒకే దగ్గర ఉంటాయి. ఎలుకలను తినే పాము పక్కనే ఉంటుంది. పామును తినే నెమలి పక్కనే ఉంటుంది. మూడు పరస్పర వైషమ్యాలు కలిగిన జీవరాశులకు కూడా సమానమైన గౌరవం ఇస్తూ సమానమైన జీవితావకాశాన్ని ఇచ్చిన వాడు శివుడు. కైలాసంలో జాతీయ జంతువు ఎవరో తెలుసా..? ఎద్దు. ఎద్దుని వాహనం చేసుకున్నవాడు శివుడు. బ్రహ్మ కమలం మీద ఉంటాడు. విష్ణువు ఆదిశేషువు మీద ఉంటాడు. కాని శివుడు రైతుకి, వ్యవసాయానికి దగ్గరగా ఉన్న ఎద్దును వాహనంగా ఎంచుకున్నాడు.

ఇక వినాయకుడిని పూజించే దగ్గర.. సాధారణంగా మనం లక్ష్మీ దేవిని పూజిస్తే మన దగ్గర ఉన్నవో లేనివో నాణాలు తెచ్చిపెడతాం.. లేదా ఆరోజు బంగారం ఏదొకటి కొనుక్కుని పెడతాం. కానీ వినాయకుడికి అవేం ఉండవు. చెరకు, పత్రి, గరిక ఇలా అతి చౌక ఆకులు.. సులభంగా ప్రకృతిలో దొరికే వాటిని తెచ్చి పెడతాం. ప్రకృతి, ప్రకృతిలోని జీవులు, పరమాత్మ మూడు సమానమే అని చెప్పేందుకు గుర్తుగా ఈ వినాయకచవితి కొనసాగుతోంది. దీన్నే అందుకోవాలి సమాజం. దీన్ని అందుకోవాలన్నదే ప్రధానమైన ఉద్దేశం. అందుకే బాలగంగాధర తిలక్ దైవభక్తిలో దేశభక్తిని రంగరించి.. వినాయకచవితిని మొట్టమొదటిసారి ఘనంగా జరిపించారు. అందుకే అప్పటి స్వాతంత్ర్య ఉద్యమంలో గొప్ప శక్తిని నింపింది ఈ పండుగ. మా చిన్నప్పుడు వినాయకచవితికి ఇంత క్రేజ్ లేదు..ఇప్పుడు ఇంత ఘనంగా జరుగుతున్నదంటే దానికి కారణం తిలక్. ఆ గొప్పతనం ఆయనదే.


ఆ తర్వాత గణపతితో ఏం చేయించినారు.. ప్రపంచ పరుగు పందెం పోటీ పెట్టేస్తే ఎలుక మీదున్న వాడు ఏం గెలుస్తాడులే అని కుమారస్వామి నెమలి మీద వెళ్లిపోతుంటే.. వినాయకుడు అమ్మానాన్నలను మించి ప్రపంచం భూగోళంలో ఏముంటుందని చెప్పి మూడు చుట్లు తిరిగితే.. అందరూ కలసి ఎవరు మొదలు వచ్చారంటే.. వినాయకుడే మొదట వచ్చాడు కాబట్టి ఆయన ప్రధాన దేవుడు అయ్యాడు.. ప్రథమ దేవుడు అయ్యాడు.. ఇక్కడ తల్లిదండ్రుల ప్రాధాన్యత కనిపిస్తుంది. ఇది గ్రహించాల్సింది.

గరికతో కొలిచినా వరాలే

ఏ దైవాన్ని పూజించాలన్నా, ఏ కార్యాన్ని ప్రారంభించాలన్నా ముందుగా ఆయననే పూజించాలి. అప్పుడే ఆ కార్యం శుభప్రదం, శోభస్కరం.. ఆ తర్వాత జయప్రదం అవుతుంది. తల్లిదండ్రులను మించిన దైవం లేదని, నారాయణ మంత్రానికి మించిన మంత్రం లేదని నిరూపించి విఘ్నాధిపత్యాన్ని చేజిక్కించుకున్న సూక్ష్మగ్రాహి ఆయన. తండ్రిలాగానే ఈయన ఆకారాన్ని కల్పించటమూ, పూజించటమూ, ప్రసన్నం చేసుకోవటమూ ఎంతో సులువు.

ఓం గణానాతాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమం
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత
అనశ్శృణ్వన్నూతి భిస్సీద సాధనమ్

రాజులలో జ్యేష్ఠుడు, కవులలో కవి, గణాలకు అధిపతి, బ్రహ్మణస్పతి అని వేదాలు ఆయనను స్తుతిస్తే, మంత్రశాస్త్రాలు సుముఖుడనీ ఏకదంతుడనీ, కపిలుడనీ, గణాధ్యక్షుడనీ, గజకర్ణికుడనీ, వికటుడనీ, ఫాలచంద్రుడనీ, ధూమకేతువనీ, గజకర్ణికుడనీ విష్వక్సేనుడనీ, శూర్పకర్ణికుడనీ అన్నాయి. అంతగా ఆరాధించాయి. ఇక ఉపనిషత్తులయితే వాఙ్మయమూర్తిగా.. గణపతిగా... బ్రహ్మణస్పతిగా.. శ్రీ మహాగణాధిపతిగా విశ్వసించాయి. నిండుగా కొలిచాయి. గణపతి అంటే జ్ఞానమోక్షప్రదాత అని అర్థం. మనిషిని సన్మార్గంలో పయనింపజేసేది జ్ఞానమైతే, మరు జన్మ లేకుండా చేసేది మోక్షం.



గణపతి ఆవిర్భావం, రూపురేఖా విలాసాల గురించి అనేక పురాణేతిహాసాలు అనేక విధాలుగా వర్ణించినప్పటికీ సకలశాస్త్రాలూ ఆయనను పరబ్రహ్మస్వరూపంగానూ, భవిష్యద్బ్రహ్మగానూ పేర్కొన్నాయి. సామాన్యులకు మాత్రం గణపతి విఘ్నసంహారకుడు. ఆయనను స్తుతిస్తే సర్వ విఘ్నాలూ ఉపశమిస్తాయి. అంతేకాదు ఆయన భక్త సులభుడు కూడా. బంకమట్టిని తెచ్చి దానికి గణపతి రూపు కల్పించి, ప్రాణప్రతిష్ఠ చేసిన అనంతరం గరికతోటీ, రకరకాల పుష్పాలు, పత్రాలతోటీ పూజించి, అరటిపళ్లు, కొబ్బరికాయలు, ఉండ్రాళ్లు, వెలగ పళ్లు, పానకం, వడపప్పు, కుడుములు నివేదించి, అపరాధ క్షమాపణగా ఐదు గుంజీళ్లు తీస్తే చాలు – మన కోర్కెలన్నింటినీ తీర్చే మహా ప్రసన్న గణపతి... వల్లభ గణపతీ ఆయన.

ఎలా పూజించాలి?

ఏ పూజలోనైనా ముందుగా హరిద్రాగణపతిని (పసుపుతో గణపతి ప్రతిమను చేసి, తమలపాకులో ఉంచాలి) పూజించడం మంచిది. వినాయక చవితినాడు తప్ప తక్కిన రోజుల్లో తులసి దళాలతో పూజించరాదు. 21 రకాల పత్రి లభ్యం కానప్పుడు గరిక దొరికినా ప్రసన్నుడవుతాడు. రక రకాల నైవేద్యాలు సమర్పించలేకున్నా నారికేళం, అరటిపండ్లు, ఉండ్రాళ్లు, కుడుములు, వడపప్పు ఉంటే చాలంటాడు.

ఈ కింది శ్లోకం చదివితే చతుర్థీ చంద్ర దర్శన దోషం పరిహారమవుతుంది.

సింహః ప్రసేనమవధీః సింహో జాంబవతా హతః
సుకుమారక మారోదీః తవహ్యేషశ్యమంతకః

పత్రి అంటే ఎందుకంత ప్రీతి?

కన్యారాశికి అధిపతి బుధగ్రహం. ఈయన ఆకుపచ్చగా ఉంటాడు కాబట్టి, వినాయకునికి పత్రిపూజ ఇష్టమని చెప్పవచ్చు. అంతేకాదు... మునుల కోరిక మేరకు అగ్నితత్త్వం గల అనలాసురుడనే రాక్షసుని ఉండలా చేసి గుటుక్కున మింగాడాయన. లోపల చేరిన ఆ రాక్షసుడు తన మంటలతో ఆయన ఉదరాన్ని బాధించకుండా చల్లదనాన్ని చేకూర్చడం కోసమే మునులు ఆయనను అనేక రకాల ఔషధ విలువలు గల పత్రితోటీ, పుష్పాలతోటీ పూజించి, మరింత ఉపశమనాన్ని కలిగించడం కోసం గరికతో తాళ్లలా పేని ఆయన పొట్ట చుట్టూ పట్టీలా కట్టారు. ఆ ఉపచారాలన్నీ ఆయనకు అమితంగా నచ్చి, ఆ నాటి నుంచి ప్రతియేటా తనను పత్రితోటీ, పుష్పాలతోటీ, ముఖ్యంగా గరికపోచలతో పూజించిన వారికి కోరిన వరాలనిచ్చే వేల్పు అయ్యాడాయన.

ఏమి నివేదించాలి?

వినాయకచవితిరోజు గణపతిని షోడశోపచారాలతో పూజించి, శక్తికొద్దీ ఉండ్రాళ్లు, కుడుములు, పిండివంటలు, నారికేళాలు, కదళీఫలాలు, పానకం, వడపప్పులను నివేదిస్తే సకల కార్యసిద్ధి కలుగుతుంది.

పాలవెల్లి ఎందుకు..?

ఆకాశంలో గ్రహాలూ నక్షత్రాలూ ఉంటాయనే యథార్థాన్ని గుర్తింపజేసేందుకే, భాద్రపదమాసంలో విరివిగా లభించే పాలవెల్లికి నిండుగా మొక్కజొన్న పొత్తులూ, వెలక్కాయలూ, బత్తాయిలూ... వీటన్నింటినీ కడతారు.

నిమజ్జనమెందుకు?

భూమి నీటిలో నుంచి పుట్టింది. ఆ భూమితోనే అంటే బంకమట్టితో విగ్రహం చేసి, దానికి ప్రాణప్రతిష్ఠ, ధ్యానావాహనాది షోడశోపచార పూజలు చేసిన అనంతరం ఉద్వాసన చెప్పి, తిరిగి ఆ నీటిలోనే నిమజ్జనం చేయడం సంప్రదాయం. ఈ వినాయక చవితి మీ అందరి విఘ్నాలనూ దూరం చేయాలని, కోరిన కోరికలన్నీ నెరవేర్చాలని కోరుకుందాం. అన్నట్టు పూజకు మట్టి వినాయకుడినే తెస్తున్నారు గదా!

అమృత ఘడియల్లో విషమెందుకు?

వినాయకుడి విగ్రహం తయారీకి ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇనుము, సింథటిక్ రంగులతో పాదరసం, క్రోమియం, సీసం, లెడ్ ఆర్సనిక్ తదితర విషపూరిత రసాయనాలను వాడుతున్నారు. వీటితో జీవవైవిధ్యం దెబ్బతింటున్నది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగదు. మట్టిలో కలవదు. నిప్పుకు కూడా దహనం కాదు. దీనిలో జిప్సం అనేది ముడి పదార్థంగా ఉంటుంది. ఈ విగ్రహాలను నీటివనరుల్లో వేస్తాం. ఆ నీటిని వాడితే డయేరియా, స్కిన్ క్యాన్సర్‌తోపాటు అనేక చర్మ వ్యాధులు సోకే ప్రమాదం వుంది. ముఖ్యంగా తగరంతో చర్మ వ్యాధులు వచ్చి చర్మం రంగు మారుతుంది. ఆర్సనిక్ వల్ల జుట్టు రాలిపోతుంది. సీసం వల్ల కడుపు నొప్పి వస్తుంది. శరీరం పటుత్వం తగ్గుతుంది. అంతేగాక ఆ రసాయనాల నీటిని పంట పొలాలకు మళ్లిస్తే భూసారం తగ్గి భూమి సహజ స్వరూపాన్ని కోల్పోతుంది.

మట్టితో చేసిన ప్రతిమల వల్ల పైన చెప్పుకున్న ప్రమాదాలేవీ ఉండవు. పర్యావరణానికి ఎటువంటి హాని జరగదు. చూడటానికి కూడా విగ్రహం ముచ్చటగా ఉంటుంది. పండుగ తర్వాత నిమజ్జనం చేసిన కొద్దిసేపట్లోనే నీటిలో కరిగిపోతుంది. దీనివల్ల పర్యావరణం, జీవవైవిధ్యం రెండు కూడా సమతులంగా ఉంటాయి. మట్టి విగ్రహం తయారీలో కేవలం బంకమట్టి మాత్రమే వాడతారు. ఎలాంటి రంగులు వాడరు. కాబట్టి నీరు కలుషితం కాదు.

ఎంత విగ్రహం పెట్టి పూజిస్తే అంత గొప్ప అనుకోవడం మానేయాలి. విగ్రహం సైజు కంటే భక్తి ముఖ్యం. పర్యావరణం పట్ల బాధ్యత అంతకంటే ముఖ్యం. రసాయన రంగుల విగ్రహాల వల్ల పర్యావరణం, జీవవైవిధ్యం దెబ్బతింటాయి. రాబోవు రోజుల్లో జీవకోటికి ప్రమాదం ఏర్పడుతుంది.



– డాక్టర్ ఎల్ నాగిరెడ్డి,
అసిస్టెంట్ ప్రొఫెసర్, పర్యావరణ విభాగం, శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాల, అనంతపురం

నైపుణ్యమే సంపద

'జీవితంలోని ప్రతి దశలోనూ గైడ్ చేస్తూ నా ఎదుగుదలకు దోహదపడిన వారు ఎంతో మంది ఉన్నారు. వారందరూ నాకు గురువులే..' అంటూ పరిచయం చేసుకున్నారు వనమల స్వప్న. హైదరాబాద్ లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్' లో అసోసియేట్ ఫ్యాకల్టీగా ఉన్న వనమల స్వప్నకు ఇటీవల నేషనల్ ఎంట్రప్రెన్యూర్ అవార్డు వచ్చింది. గురువారం రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా





శిక్షణా తరగతులలో స్వప్న

''సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం శిక్షణా తరగతులను నిర్వహించడంలో 18 ఏళ్ల అనుభవం ఉంది. 12 ఏళ్లుగా మేనేజ్‌మెంట్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎమ్ఎస్ఎమ్ఇ'లో వర్క్ చేస్తున్నాను. స్పెషలైజేషన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఇన్‌ఛార్జిగానూ వర్క్ చేస్తున్నాను.

వారధిగా.. సాయం

బిజినెస్ చేయాలని, రాణించాలనే ఆలోచన చాలా మందిలో ఉంటుంది. కానీ, సరైన నైపుణ్యాలు ఉండవు. అలాగే, ప్రభుత్వం నుంచి వచ్చే స్కీమ్స్ గురించి కూడా తెలియవు. స్కిల్స్‌తో పాటు వ్యాపార అవకాశాలు, లోన్లు, ప్రభుత్వ పథకాలను ఎలా ఉపయోగించుకోవాలి, మార్కెటింగ్ ఎలా చేయాలి.. అనే విషయాల్లో సాయం చేస్తాం. మా అకాడమీ నుంచి వివిధ రకాల స్కీమ్స్ ఉన్నాయి. వాటిలో ఇప్పుడు నాలుగు స్కీమ్స్‌తో నిరుద్యోగ యువత, మహిళలకు ఎంట్రప్రెన్యూర్‌షిప్ స్కిల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ చేస్తున్నాం. నాలుగేళ్ల నుంచి మల్టీమీడియా, ఫ్యాషన్, బ్యూటీ.. వంటి రంగాలలో దాదాపు 4000 మంది యువతకు శిక్షణ ఇచ్చాం. స్టేట్, సెంట్రల్ గవర్నమెంట్, ప్రైవేట్, పబ్లిక్ సెక్టార్స్‌లోని వాళ్లకూ స్కిల్ ట్రెయినింగ్స్ ఇస్తున్నాం.

మంచి రేటింగ్

త్రీ స్టార్స్ రేటింగ్ రావడంతో ఎమ్ఎస్ఎమ్ఇ ఇన్నోవేటివ్ స్కీమ్ కింద సివిల్ సర్వెంట్స్‌కు శిక్షణ ఇవ్వడానికి మా ఇన్‌స్టిట్యూట్‌కు అప్రూవల్ వచ్చింది. వివిధ రంగాలలో నిపుణులైన వారు కూడా శిక్షణ తరగతులకు హాజరవుతుంటారు. తాము సృష్టించిన ఉత్పత్తులను ప్రదర్శించడానికి వేదికలను కూడా ఏర్పాటు చేస్తుంటాం. ఇటీవల శిక్షణ తీసుకుంటున్న వారిలో మహిళల శాతం ఎక్కువగా ఉంటోంది. దీంతో 55 స్కిల్ ప్రోగ్రామ్స్ మహిళలకే పరిచయం చేస్తున్నాం. జిల్లా, గ్రామీణ స్థాయి మహిళలకు కూడా 60 స్కిల్స్ ప్రోగ్రామ్స్ కండక్ట్ చేశాం.

ప్రతి రోజూ సవాళ్లే

దేశవ్యాప్తంగా ప్రోగ్రామ్స్, శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడానికి ఆయా ప్రాంతాలకు వెళ్లినప్పుడు కాలేజీలు, యూనివర్శిటీల సాయం తీసుకుంటాం. అక్కడ చాలా వరకు శిక్షణకు కావల్సిన సరంజామా ఉండదు. దీంతో ప్రతీదీ సవాల్‌గానే ఉంటుంది. ముఖ్యంగా టెక్నాలజీకి సంబంధించిన శిక్షణ ఇచ్చేటప్పుడు సమస్యలు ఎదురవుతుంటాయి. దీంతో ఏ లోపం లేకుండా ముందస్తుగానే ప్లాన్ చేసుకుంటాం. ఇటీవల సైబర్‌సెక్యూరిటీకి సంబంధించి కాకినాడ ప్రభుత్వ కాలేజీలో, డిజిటల్ మార్కెట్‌కు సంబంధించి తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వారితో కలిసి వర్క్ చేశాం. ఫ్యాషన్ రంగానికి సంబంధించి ఇండోర్ ఫ్యాషన్ ఇన్స్టిట్యూట్‌తో కలిసి వర్క్ చేశాం. 2023–24 సంవత్సరానికి గాను 200కు పైగా ప్రోగ్రామ్స్ చేశాం. ట్రెనింగ్ క్లాసులకు ప్రిపేర్ అవడం, ప్రోగ్రామ్స్‌ని నిర్వహించడం, జనాల్లోకి రీచ్ అయ్యేలా చేయడం ఓ పెద్ద ప్రణాళిక.

కుటుంబ మద్దతు

నేను పుట్టింది తెలంగాణలోని సిద్దిపేట. మా నాన్నగారి ఉద్యోగరీత్యా రామగుండంలో చదువుకున్నాను. ఉస్మానియా యూనివర్శిటీలో ఇంజనీరింగ్ చేశాను. మా వారు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, మాకు ఇద్దరు పిల్లలు. మహిళగా నా వర్క్‌లో రాణించాలంటే కుటుంబం సపోర్ట్ ఉండాలి. మా పేరెంట్స్ ఉన్న అపార్ట్‌మెంట్‌లోనే నేనూ ఇల్లు తీసుకోవడంతో పిల్లలకు సంబంధించి ఒత్తిడి తక్కువగా ఉంటుంది. హైదరాబాద్‌లోని అడిక్‌మెట్ నుంచి రోజూ నా ప్రయాణం ఉంటుంది. ఒక్కొక్కరు ఒక్కో దశలో నన్ను గైడ్ చేయడానికి వచ్చారు. వారంతా నాకు గురువులే' అంటూ తెలిపారు స్వప్న.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వైద్యం

పత్రాల రూపంలోని మాత్రలివి



ప్రొఫెసర్ నారాయణ రెడ్డి

వినాయక చవితి రోజున గజ ముఖుడైన వినాయకుణ్ణి పూలు, పండ్లతోనే కాదు, రకరకాల పత్రాల(ఆకులు)తోనూ పూజిస్తుంటాం. పాలవెల్లిలో వరుసగా పేర్చి, అలంకరించుకుంటాం. వినాయక పూజలో ఏకవింశతి పత్రాలను– అంటే, ఇరవై ఒక్క రకాల పత్రాలను ఉపయోగిస్తారు. వీటికి అద్భుతమైన ఆయుర్వేద ప్రయోజనాలు ఉన్నాయి. ఆ ప్రయోజనాలు ఏమిటో వివరిస్తున్నారు శ్రీకృష్ణ దేవరాయ ఉద్యాన కళాశాల అధ్యాపకులు ప్రొఫెసర్ నారాయణ రెడ్డి. పూజ తర్వాత ఆ ఆకులను విడివిడిగా నీడలో ఆరబెట్టి, పొడి చేసుకుని లేదా కషాయం చేసుకుని రకరకాల అనారోగ్యాలకు ఔషధాలుగా వినియోగించుకోవచ్చని వివరిస్తున్నారు.



మాచీపత్రి (దవనం)

ఇది మంచి సువాసన గల పత్రి. దద్దుర్లు, తల నొప్పి, వాతం, మధుమేహం, ఉబ్బసం, మూర్ఛ వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది.

బృహతీపత్రం (వాకుడు)

దగ్గు, జలుబు, జ్వరం, మూత్రవ్యాధులు, నేత్రవ్యాధుల నివారణకు అద్భుతంగా పనిచేస్తుంది.

బిల్వపత్రం (మారేడు)

జిగట వీరేచనాలు, జ్వరం, మధుమేహం, కామెర్లు, నేత్ర సమస్యలు, రక్తహీనత, పగుళ్ళు, గాయాలకు దివ్య ఔషధం.

దూర్వాయుగ్మం (గరిక)

గాయాలు త్వరగా మానడానికి, చర్మవ్యాధుల నివారణకు, ఉదర సమస్యలకు, మొలల నివారణకు ఉపయోగపడుతుంది.

దత్తూరపత్రం (ఉమ్మెత్త)

ఉబ్బసం, దగ్గు, శ్వాసకోస సమస్యలు, చర్మవ్యాధులు, కుక్కకాటు చికిత్సకు పనికొస్తుంది.

అపామార్గ పత్రం (ఉత్తరేణి)

దగ్గు, ఉబ్బసం తగ్గిస్తుంది. దీని పుల్లలను దంతాలు శుభ్రపరచడానికి ఉపయోగిస్తారు.

బదరి పత్రం (రేగు)

చర్మ సమస్యలు, మలబద్ధకం, విరేచనాల నివారణకు
వాడతారు.

చూతపత్రం (మామిడి)

మామిడాకు నోటి దుర్వాసన, చిగుళ్ల వాపు సమస్యలకు బాగా పనిచేస్తుంది. ఉబ్బసం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

కరవీర పత్రం (గన్నేరు)

శరీరంపై గడ్డలు, పుండ్లు, గాయాలకు గన్నేరు వేరు, బెరడు ఉపయోగపడతాయి.

మరువక పత్రం (మరువం)

మరువం ఆకులు సువాసనను వెదజల్లుతాయి. వీటి వాసన చూస్తే ఒత్తిడి, ఆందోళన వెంటనే తగ్గుతాయి.

శమిపత్రం (జమ్మి)

నోటి సంబంధిత సమస్యలను తగ్గించడంలో జమ్మి ఆకులు బాగా పనిచేస్తాయి.

విష్ణుక్రాంతపత్రం (నీలపుష్పి)

నిద్రలేమి, దగ్గు, జ్వరం, విరేచనాలు, కడుపునొప్పి వంటి సమస్యలతో పాటు గాయాలను తగ్గించడంలోనూ బాగా ఉపయోగపడుతుంది.

సింధువార పత్రం (వావిలాకు)

కీళ్ల నొప్పులను నయం చేయడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

అశ్వత్థ పత్రం (రావి)

చర్మ సమస్యలకు రావి ఆకు బాగా పని చేస్తుంది.

దాడిమా పత్రం (దానిమ్మ)

వాంతులు, విరేచనాలను అరికట్టడంలో దానిమ్మ ఆకులను మించిన మందు లేదు.

జాజిపత్రం (జాజి ఆకులు)

చర్మ సమస్యలు, స్త్రీ సంబంధ వ్యాధులకు జాజి ఆకులు బాగా పనిచేస్తాయి.

అర్జున పత్రం (తెల్ల మద్ది)

తెల్ల మద్ది ఆకులు గుండెకు రక్తసరఫరాను మెరుగుపరుస్తాయి. అల్సర్లు, మధుమేహం, దగ్గు, ఉబ్బసం, చర్మ వ్యాధుల నివారణకూ బాగా ఉపయోగపడతాయి.

దేవదారు పత్రం (దేవదారు)

దేవదారు హిమాలయాల వంటి చల్లటి ప్రదేశాల్లో ఎక్కువగా పెరుగుతుంది. దేవదారు ఆకులను ఆరబెట్టి, వాటిని నూనెలో కాచి చల్లార్చి, ఆ నూనెను తలకు రాసుకుంటే మెదడు, కంటి సమస్యలు రాకుండా ఉంటాయి. దీని మాను నుంచి తీసిన నూనె చుక్కలను వేడి నీళ్లలో వేసి, ఆ నీటితో స్నానం చేస్తే శ్వాసకోశ సమస్యలు నయమవుతాయి.

తులసి పత్రం (తులసి)

ఇది రోగ నిరోధక శక్తిని పెంచి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. జలుబు, దగ్గును నివారిస్తుంది.

గణికా పత్రం (కామంచి)

కామంచి ఆకులు దగ్గు, జ్వరం, తల నొప్పి, ఉబ్బసం, అతిమూత్ర వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

అర్కపత్రం (జిల్లేడు)

జిల్లేడు ఆకులను నరాల బలహీనతకు, చర్మ వ్యాధుల నివారణకు వాడతారు.

ఈ 21 పత్రాలను చవితి రోజునే కాదు, సాధారణ దినాల్లోనూ వినియోగించుకోవచ్చని శ్రీకృష్ణ దేవరాయ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్‌గా పనిచేస్తున్న డాక్టర్. ఎస్. నారాయణ రెడ్డి బృందం తెలియజేస్తోంది.

నైవేద్యం

తేలిగ్గా అరిగే ఆరగింపులు



వినాయక పూజలో తప్పనిసరిగా ఉపయోగించే ఇరవైఒక్క రకాల పత్రాలు, సమర్పించే నైవేద్యాల వెనుక ఆధ్యాత్మిక పరమార్థం మాత్రమే కాదు, ఆరోగ్య పరమార్థం కూడా ఉంది. ఈ పూజలో ఉపయోగించే పత్రాలలో విశేష ఔషధ గుణాలు ఉన్నాయి. ఆయుర్వేద ఔషధాల తయారీలో వీటిని నేటికీ వాడుతున్నారు. వర్షరుతువులోని వాతావరణం శరీరంలో త్రిదోషాలను ప్రకోపింపజేస్తుంది. అగ్నిమాంద్యం కలిగించి, జీర్ణకోశ వ్యాధులకు దారితీస్తుంది. అందువల్ల వినాయక పూజలో తేలికగా అరిగే పదార్థాలనే ఆరగింపుగా సమర్పిస్తారు. వినాయక పూజ మనకు ఆరోగ్య పరిరక్షణనూ నేర్పిస్తుంది.

వినాయక చవితి పర్వదినం రోజున భక్తులు వినాయకుడికి రకరకాల నైవేద్యాలను శక్తి కొద్ది సమర్పిస్తారు. సంప్రదాయబద్ధంగా వినాయకునికి సమర్పించే నైవేద్యాలలో మోదకాలు, ఉండ్రాళ్లు, కుడుములు, లడ్డూలు, పాల తాలికలు, చలిమిడి, అప్పాలు, వడపప్పు, పాయసం, పానకం వంటివి ముఖ్యమైనవి.

పుష్టి శక్తి...

వినాయకుడు మోదకప్రియుడు. ముత్తుస్వామి దీక్షితార్ రాసిన 'మహాగణపతిం మనసా స్మరామి' కీర్తనలో 'మూషిక వాహన మోదకప్రియం' అనే ప్రస్తావనే దీనికి తార్కాణం. మోదకాలను బియ్యప్పిండి, బెల్లం, నెయ్యి ప్రధానంగా ఉపయోగిస్తారు. వీటికి తోడుగా ఏలకులు, జీడిపప్పు, కొబ్బరి తురుము చేర్చి, ఆవిరిపై ఉడికిస్తారు. మోదకాలు తేలికగా జీర్ణమవుతాయి. పుష్టినిచ్చి, చక్కని శక్తినిస్తాయి. వినాయకుడికి అమిత ప్రీతిపాత్రమైన నైవేద్యాల్లో లడ్డూలు కూడా ముఖ్యమైనవి. అందుకే గణపతి సహస్ర నామ స్తోత్రం 'లక్షో లక్షప్రదో లక్ష్యో లయస్థో లడ్డుకప్రియ' అని ప్రస్తావిస్తుంది.. 'విఘ్నేశ్వర దండకం' వినాయకునికి సమర్పించే నైవేద్యాలలో వడలు, నేతిబూరెలు, గోధుమ అప్పాలు, పునుగులు, చలిమిడి తదితరమైనవి ప్రస్తావిస్తుంది.

ఆకలి తీరేలా...

వినాయకుడికి కుడుములను నైవేద్యంగా పెట్టడంపై ఒక పురాణగాథ ఉంది. శివపార్వతులు ఒకసారి బాలగణపతితో అరణ్య విహారానికి వెళ్లారట! అప్పుడు బాలగణపతికి ఆకలి వేయడంతో, ఆ అరణ్యంలోనే ఉన్న అత్రి మహాముని ఆశ్రమానికి వెళ్లారట! అత్రి మహాముని, అనసూయ దంపతులు వారికి ఆతిథ్యం ఇచ్చి, పంచభక్ష్య పరమాన్నాలను వడ్డించారు. ఎంత తిన్నా బాలగణపతి ఆకలి తీరలేదు. అప్పుడు అనసూయ వరిపిండితో ఆవిరి మీద ఉడికించిన కుడుమును పెట్టింది. ఆ కుడుము తినగానే బాలగణపతి బొజ్జనిండి, తృప్తిగా ఇరవైఒక్కసార్లు తేన్చాడట! అందుకే వినాయక పూజలో నైవేద్యంగా కుడుములు, ఉండ్రాళ్లు మొదలైన నైవేద్యాలను రకానికి ఇరవైఒకటి చొప్పున సమర్పిస్తారు.

త్రిదోషాల నివారణ

వినాయక చవితి భాద్రపద శుక్లచవితి రోజున జరుపుకొనే పర్వదినం. మన దేశంలో శ్రావణ భాద్రపదాలు వర్షరుతువులో వస్తాయి. ఏయే రుతువుల్లో వచ్చే పండుగల్లో ఆయా రుతువుల్లో ఆరోగ్యానికి మేలు కలిగించే పదార్థాలనే నైవేద్యంగా సమర్పించడం తరతరాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ. అలాగే, వినాయక చవితి రోజున సమర్పించే నైవేద్యాలు వర్షరుతువులో ఆరగించడానికి అత్యంత అనుకూలంగా ఉంటాయి. ఆయుర్వేదం ప్రకారం వర్షరుతువులో అగ్నిమాంద్యం కలుగుతుంది. అందువల్ల కఠిన పదార్థాలు జీర్ణమవడం కష్టమవుతుంది. రోజుల తరబడి ముసురు వాతావరణం ఉన్నప్పుడు వాత పిత్త కఫాలనే త్రిదోషాల వల్ల కలిగే వ్యాధులు పెరుగుతాయి. వాటితో పాటు క్రిమిదోషాల వల్ల కలిగే వ్యాధులు విజృంభిస్తాయి. ఈ కాలంలో తేలికగా జీర్ణమయ్యే పోషక పదార్థాలను తినడం మంచిది. ముఖ్యంగా ఆవిరిపై ఉడికించినవి, పిండికి నేతిని జత చేసి తయారు చేసేవి, త్రిదోషాల సమతుల్యతను కాపాడేవి తినడం వల్ల వర్షరుతువులో ఆరోగ్యానికి ఇబ్బందులు రాకుండా ఉంటాయి.

పిల్లలకు వెన్నను తినిపిస్తే...



వెన్న తింటే గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. వెన్న తింటే కొవ్వు పెరుగుతుందనీ, బరువు పెరుగుతారని చాలామంది అనుకుంటున్నారు. కానీ ఇందులో విటమిన్ ఎ గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుందని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్స్ గుండెను దృఢంగా ఉంచుతాయి.

అంతేకాకుండా వెన్నను ఆహారం ద్వారా తీసుకోవడం వలన త్వరగా కడుపు నిండినట్లు ఉండడంతో పాటు ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. దీని వలన అధికబరువు సమస్యలు తలెత్తవు. వెన్నలో మంచి కొలెస్ట్రాల్ ఉండడం వలన చిన్నపిల్లలకు ఇది చాలా ఉపయోగపడుతుంది. చిన్నపిల్లలకు రోజూ రెండు స్పూన్ల వెన్న ఇవ్వడం వలన వారి మెదడు, నాడీ వ్యవస్థ ఎదుగుదల చాలా మంచిది. చిన్నతనం నుంచి పిల్లలకు తగు మోతాదులో వెన్నను తినడం అలవాటు చేస్తే మంచి ఫలితాలను పొందవచ్చు.

స్టడీ

ఒవెన్స్‌లోనూ బ్యాక్టీరియా!



మైక్రోవేవ్ ఒవెన్ లోపల రేడియేషన్ వాతావరణం సూక్ష్మజీవులకు నివాసయోగ్యం కాదనే నమ్మకం ఉండేది. అయితే ఇది నిజం కాదు అని చెబుతుంది తాజా పరిశోధన. ఒవెన్లు బ్యాక్టీరియా పెరుగుదలకు అనువైన వాతావరణాన్ని కలిగి ఉంటాయని ఈ అధ్యయనం చెబుతుంది.

ఒవెన్ స్వాబ్‌లను విశ్లేషించిన పరిశోధకులు పలు ప్రాంతాలలో వందకు పైగా బ్యాక్టీరియా రకాలను గుర్తించారు.

సైన్స్ న్యూస్ నివేదిక ప్రకారం ఒవెన్‌లలో నివసించే సూక్ష్మజీవుల కమ్యూనిటీలను డాక్యుమెంట్ చేయడం ఇదే మొదటిసారి. స్పెయిన్‌లోని వాలెన్సియా యూనివర్శిటీకి చెందిన మైక్రోబయాలజిస్ట్ మాన్యుయెల్ పోర్కార్ నేతృత్వంలోని బృందం గృహాల్లోని కిచెన్‌ల నుంచి 10, ల్యాబ్‌ల నుంచి 10, హోటల్స్ నుండి 10.....మొత్తం 30 ఒవెన్ వాల్స్, రొటేటింగ్ ప్లాటర్‌లాంటి లోపలి భాగాలను నిశితంగా పరిశీలించింది.

బ్యాక్టీరియా కాలనీల డీఎన్ఏను పరిశోధకులు విశ్లేషించినప్పుడు వాటిలో ప్రోటియో బ్యాక్టీరియా,ఫిర్మికట్స్,ఆక్టినోబాక్టీరియా, బాక్టీరోయిడ్స్ ఉన్నట్లు తేలింది. సాధారణంగా ఇవి మానవ చర్మంపై, మనుషులు తరచుగా తాకే ఉపరితలాలపై కనిపిస్తాయి. ఆహారం ద్వారా వచ్చే వ్యాధులకు కారణం అయ్యే బ్యాక్టీరియా కూడా వీటిలో ఉంది.

ఒవెన్‌లలో తాము కనుగొన్న సూక్ష్మజీవులు వంటగదిలో కనిపించే వాటితో సమానంగా ఉన్నాయని, వాటిలో వ్యాధి కారక సూక్ష్మజీవులు కూడా ఉన్నాయని, వంటగదిని శుభ్రం చేసినట్లే మైక్రోవేవ్ ఒవెన్‌ను శుభ్రపరచాలని పోర్కార్ చెబుతున్నారు.

వంటగది ఒవెన్‌లు మాత్రమే బ్యాక్టీరియా పెరుగుదలకు కారణం కాదని ఆయన నొక్కి చెబుతున్నారు.

అధిక ఉష్ణోగ్రత, ఎలక్ట్రోమాగ్నెటిక్ రేడియేషన్‌లను తట్టుకొని ఒవెన్‌లలో బ్యాక్టీరియా జాతులు ఎలా మనుగడ సాగిస్తున్నాయనేది మాత్రం తెలియకుండా ఉంది. పూర్తిగా తెలుసుకోవడానికి మరింత పరిశోధన అవసరం అంటున్నారు శాస్త్రవేత్తలు.

సినిమా

నివిన్‌పై ఆరోపణలు అవాస్తవం

● వినీత్ శ్రీనివాసన్, పార్వతీ ఆర్. కృష్ణ



● వినీత్



● పార్వతి



● నివిన్

సినిమా అవకాశం ఇప్పిస్తానంటూ దుబాయ్‌లో తనతో అభ్యంతరకరంగా ప్రవర్తించారని ఓ ఆరుగురి గురించి ఇటీవల ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ఆ ఆరుగురిలో మలయాళ నటుడు నివిన్ పాలీ ఒకరు. అయితే ఏ తేదీల్లో (గత డిసెంబరు 14 నుంచి 16) అయితే తనతో నివిన్ అభ్యంతరకరంగా ప్రవర్తించారని ఆ మహిళ పేర్కొన్నారో అదే తేదీల్లో ఆయన 'వర్షంగళుక్కు శేషమ్' అనే మలయాళ సినిమా షూట్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఆ చిత్రంలో నటించిన పార్వతీ ఆర్. కృష్ణ తెలిపారు. అలాగే ఈ చిత్రదర్శకుడు వినీత్ శ్రీనివాసన్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. నివిన్‌పై ఆరోపణలు అవాస్తవం అంటున్నారు ఈ ఇద్దరూ. ''ఆ మహిళ చెప్పిన తేదీలో కేరళలోని కొచ్చిలో 'వర్షంగళుక్కు శేషమ్' షూటింగ్‌లో ఉన్నారు నివిన్. అక్కడి న్యూక్లియస్ మాల్ లోపల, బయట కూడా చిత్రీకరణ జరిపాం. అలాగే మా సినిమా షూటింగ్ ముగించుకుని 'ఫార్మా' అనే వెబ్ సిరీస్ షూట్‌కి వెళ్లారు. ఇక నివిన్ మా టీమ్‌తోనే ఉన్నారనడానికి సీసీటీవీ ఫుటేజ్, మా యూనిట్‌లోని పార్వతీ ఆర్. కృష్ణ, ఆర్ట్ డైరెక్టర్ సాబూ రామ్, మా నిర్మాత విశాఖ్ సుబ్రమణియం తదితరులు సాక్ష్యం'' అని పేర్కొన్నారు వినీత్ శ్రీనివాసన్. ''వర్షంగళుక్కు శేషమ్'లో నేనో చిన్న పాత్ర చేశాను. డిసెంబర్ 14న మా షూటింగ్‌కి సంబంధించిన వీడియో చూపిస్తాను. ఆ రోజు నివిన్ కాంబినేషన్‌లో నేను కొన్ని సీన్స్‌లో నటించాను'' అంటూ ఇన్‌స్టాలో వీడియోను షేర్ చేశారు పార్వతీ ఆర్. కృష్ణ.

రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థ ఉండాలి!

● సినీ పరిశ్రమలో మహిళల భద్రతపై సుమలత



మలయాళ చిత్ర పరిశ్రమలో చోటు చేసుకున్న లైంగిక వేధింపులపై జస్టిస్ హేమా కమిటీ ఇచ్చిన నివేదిక సినిమా రంగంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇతర భాషల్లోనూ హేమా తరహా కమిటీని ఏర్పాటు చేయాలని పలువురు నటీనటులు కోరుతున్నారు. వేధింపుల ఘటనలపై తాజాగా నటి, మాజీ ఎంపీ సుమలత స్పందిస్తూ– ''చిత్ర పరిశ్రమలోని లైంగిక వేధింపుల అనుభవాలను నాతో చాలామంది పంచుకున్నారు. సెట్స్‌లో చాలా మందికి భయానక అనుభవాలు ఎదురవుతున్నాయని విన్నాను. అవకాశాల కోసం వేధింపులు ఎదుర్కొన్నామని పలువురు మహిళలు నాతో చెప్పారు. అయితే నాకు ఇలాంటి ఘటనలు ఎప్పుడూ ఎదురవలేదు. నేను చూడలేదు కాబట్టి వేధింపులు జరగలేదని కాదు. కేవలం సినిమా అనే కాదు.. రాజకీయ రంగంతో పాటు ప్రతి రంగంలోనూ ఇలాంటి పవర్ గ్రూపులు ఉన్నాయి. సినిమా ఇండస్ట్రీలో ఎవరూ బయటపెట్టని రహస్యాలు చాలా ఉన్నాయి. ఈ విషయాలను ధైర్యంగా బయటపెట్టిన మహిళలకు, అందుకు బాటలు వేసిన డబ్ల్యూసీసీ (ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్)కి ధన్యవాదాలు. తమకు జరిగిన చేదు అనుభవాలను బయట పెడుతోన్న మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత మనపై ఉంది. సెట్స్‌లో మహిళలకు భద్రత కల్పించేలా నిబంధనలను తీసుకురావడం, అలాగే వాటిని ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ఒక పరిష్కారం. ఒకవేళ ఫిర్యాదు చేసినా యూనియన్లు, సినిమా పరిశ్రమలోని ఇతర విభాగాలు వినకపోవచ్చు. అందుకే సెన్సార్ బోర్డు ఉన్నట్లే మహిళలకు సంబంధించిన భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థ ఉండాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తాను'' అని పేర్కొన్నారు.

అలా ప్రశ్నించడం దారుణం!



''ఒక యువతిపై లైంగిక వేధింపుల దాడి జరిగితే వెంటనే ఎందుకు చెప్పలేదు? అని ప్రశ్నించడం దారుణం'' అంటున్నారు సిమ్రాన్. మలయాళ పరిశ్రమలో జస్టిస్ హేమా కమిటీ నివేదిక దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన నేపథ్యంలో వేధింపుల ఘటనలపై పలువురు నటీనటులు స్పందిస్తున్నారు.

తాజాగా సిమ్రాన్ కూడా ఇదే విషయంపై మాట్లాడుతూ– ''ఇప్పుడు నటీమణుల వేధింపుల వ్యవహారం పెద్ద చర్చకే దారి తీస్తోంది. వేధింపుల ఘటన గురించి వెంటనే ఎలా చెప్పగలరు ? మన చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకోవడానికే చాలా టైమ్ పడుతుంది. సహనం పాటించి ఆలోచించాకే స్పందించగలం.. అందుకు టైమ్ పడుతుంది. అయితే నేనూ అలాంటి బాధితురాలినే. చిన్నతనంలో ఇలాంటి సమస్యలను చాలాసార్లు ఎదుర్కొన్నాను. కానీ వాటి గురించి ఇప్పుడు చెప్పలేను'' అన్నారు.

చల్లని గాలి...



● ఐశ్వర్యా లక్ష్మి

సాయిదుర్గా తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎస్‌డీటీ18' (వర్కింగ్ టైటిల్). రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'హను–మాన్' వంటి పాన్ ఇండియా చిత్రం నిర్మించిన కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఐశ్వర్యా లక్ష్మి పుట్టినరోజు (సెప్టెంబర్ 6) సందర్భంగా వసంతగా ఆమె పాత్రని పరిచయం చేస్తూ లుక్ విడుదల చేశారు. 'ఓ చల్లని గాలి... తుఫాను కూడా' అంటూ వసంత పాత్రను ఉద్దేశించి సోషల్ మీడియాలో పేర్కొన్నారు సాయిదుర్గా తేజ్. ''హై యాక్షన్, పీరియడ్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం ఇది. హీరోయిన్ రోల్‌కి కూడా ప్రాముఖ్యత ఉంది. వసంత పాత్రలో ఐశ్వర్యా లక్ష్మి ఆకట్టుకుంటారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

న్యూ స్టార్‌కు ఆహ్వానం



● నితిన్


హీరో నితిన్ తండ్రి అయ్యారు. ఆయన భార్య షాలిని మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు నితిన్. చిన్నారి చేయి ఫొటోను షేర్ చేసి.. 'మా ఫ్యామిలీ న్యూ స్టార్‌కు ఆహ్వానం' అని క్యాప్షన్‌పెట్టారు. 2020 జూలై 16న నితిన్, షాలినిల వివాహం జరిగింది. తాజాగా వారు తల్లిదండ్రులు కావడంతో హీరోయిన్ సమంత, డైరెక్టర్ వెంకీ అట్లూరితో పాటు పలువురు ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

మోక్షజ్ఞ ఎంట్రీ షురూ



నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ హీరోగా పరిచయం కానున్నారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఎం తేజస్విని నందమూరి సమర్పణలో సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. మోక్షజ్ఞ పుట్టినరోజు (సెప్టెంబర్ 6) సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ– ''నాపై, నా కథపై బాలకృష్ణ గారు ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు. మన ఇతిహాసాల నుండి పొందిన స్ఫూర్తితో ఈ కథ ఉంటుంది'' అన్నారు. ''మోక్షజ అరంగేట్రానికి సరిపోయే కథను ప్రశాంత్ వర్మ సిద్ధం చేశారు. ఇప్పటికే నటన, ఫైట్స్, డ్యాన్స్‌లో మోక్షజ్ఞ శిక్షణ తీసుకున్నారు'' అని సుధాకర్ చెరుకూరి అన్నారు.

మరోసారి వాయిదా



● కంగనా రనౌత్

కంగనా రనౌత్ లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన 'ఎమర్జెన్సీ' విడుదల మరోసారి వాయిదా పడింది. శుక్రవారం (సెప్టెంబర్ 6న) ఈ సినిమా రిలీజ్ కావాల్సి ఉంది. అయితే సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ జారీ చేయని కారణంగా మరోసారి వాయిదా పడింది. 1975లో ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో విధించిన ఎమర్జెన్సీ టైమ్‌లో జరిగిన ఘటనలతో ఈ మూవీ రూపొందింది. ఈ సినిమా పలుమార్లు విడుదల (2023 నవంబరు 24, 2024 జూన్ 14, 2024 సెప్టెంబర్ 6) వాయిదా పడింది. దీనిపై కంగనా రనౌత్ స్పందిస్తూ ''ఎమర్జెన్సీ' మరోసారి వాయిదా పడిందని చెప్పడానికి బాధగా ఉంది. సెన్సార్ బోర్డు నుంచి సర్టిఫికెట్ కోసం ఎదురు చూస్తున్నాం. త్వరలో కొత్త రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని పేర్కొన్నారు.

కామెడీ పటేల



● తేజస్


''లాక్‌డౌన్ టైమ్‌లో మూఢ నమ్మకాల గురించి వార్తలు ఎక్కువగా చదివాను. అలా కొన్ని ఘటనల చుట్టూ 'ఉరుకు పటేల' కథని అల్లుకున్నాం. థ్రిల్లర్, కామెడీ జానర్లో ఈ సినిమా తీశాం'' అన్నారు తేజస్ కంచర్ల. 'హుషారు' ఫేమ్ తేజస్ కంచర్ల హీరోగా, ఖుష్బూ చౌదరి హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఉరుకు పటేల'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా తేజస్ మాట్లాడుతూ– ''నా ఫ్రెండ్ వివేక్ చెప్పిన ఓ పాయింట్ నచ్చడంతో ఇద్దరం కలిసి 'ఉరుకు పటేల' కథ రాశాం. కథ బాగున్నా నాపై అంత బడ్జెట్ పెట్టడానికి నిర్మాతలు ముందుకు రాలేదు. వ్యాపార కోణంలో చూస్తే వాళ్లు కూడా రైటే. ఫైనల్‌గా మా నాన్న కంచర్ల బాల భాను నిర్మించారు. నేను కథలు రాస్తాను. భవిష్యత్‌లో దర్శకత్వం చేయాలని ఉంది'' అన్నారు.

ఓటీటీ

ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'GRRR' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

మృగరాజుతో మత్తురాజు



నిద్రతో వచ్చే మత్తు నిమిషాల్లో వదులుతుంది. కానీ నిషాతో వచ్చే మత్తు నీళ్ళలో నానితేగాని వదలదు. ఇదే పాయింట్‌తో ఇటీవల ఓ కామెడీ సినిమా రిలీజైంది. సినిమా పేరు కూడా గమ్మత్తుగా వుంటుంది. అదే 'GRRR'.. ఈ సినిమా టైటిల్ ఇది. సింహం గురక భావనగా దర్శకుడు సృజనాత్మకతతో పెట్టిన పేరు. సినిమా పేరులో ఎంత గురక ఉందో సినిమాలో కామెడీ సరుకు అంతకన్నా ఎక్కువే ఉంది. వాస్తవ అంశాలను చక్కటి కథనంతో అల్లుకుని సున్నితమైన సందేశాన్ని ఈ సినిమా ద్వారా అందించారు దర్శకుడు జేకే. కథాపరంగా రెజిమోన్ నాడార్ అనే వ్యక్తి మద్యం మత్తులో అనుకోకుండా జూలో ఉన్న సింహం గుహ దగ్గరకు చేరుకుంటాడు. ఈ విషయం తెలుసుకున్న జూ సూపర్‌వైజర్ హరిదాస్ నాయర్ కూడా అతని దగ్గరకు చేరుకుని అతన్ని బయటకు లాగడానికి ప్రయత్నిస్తుంటాడు. ఇక అక్కడ నుండి కథ మొదలు. జూ అధికారి అతన్ని సింహం నుండి కాపాడి తను కూడా బయటపడతాడా? లేదా అన్నది మాత్రం హాట్ స్టార్ వేదికగా ఓటీటీలోనే చూడాలి. ఇక్కడ నావెల్టీ పాయింట్ ఏంటంటే మత్తులో ఉన్న వ్యక్తి ఏమాత్రం భయపడకుండా సింహాన్ని తొడగొట్టి ఆహ్వానించడం... ఇంకా ఇలాంటివి ఎన్నో రసవత్తర సన్నివేశాలు ఈ సినిమాలో చాలానే ఉన్నాయి. సినిమా మొత్తం తెలుగులో డబ్ అయి ఉంది. అలాగే ఎటువంటి అభ్యంతరకర సన్నివేశాలు, సంభాషణలు లేవు కాబట్టి సకుటుంబ సపరివార సమేతంగా ఈ సినిమా చూసేయొచ్చు.

– ఇంటూరు హరికృష్ణ

డిస్టింక్షన్ మార్కులు వేశారు



● విశ్వదేవ్

''35–చిన్న కథ కాదు' సినిమా కథ విన్నప్పుడే అందులోని ప్రసాద్ పాత్ర చేయాలనుకున్నాను. సినిమా విడుదల తర్వాత నా పాత్రకి వచ్చిన స్పందన చాలా ఆనందాన్ని ఇచ్చింది'' అని విశ్వదేవ్ అన్నారు. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '35–చిన్న కథ కాదు'. నందకిశోర్ ఈమాని దర్శకత్వం వహించారు. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా విశ్వదేవ్ మాట్లాడుతూ– ''విమర్శకులు, ప్రేక్షకులు ముక్త కంఠంతో మా సినిమాని ప్రశంసించడంతో పాటు డిస్టింక్షన్ మార్కులు వేయడం సంతోషంగా ఉంది. నంద కిశోర్ సినిమాని చక్కగా తీశాడు. నా కెరీర్‌లో అన్ని విషయాల్లో సంతృప్తి ఇచ్చిన చిత్రం ఇది. పెద్దలు, పిల్లలు, గ్రాండ్ పేరెంట్స్ కలిసి చూడాల్సిన అందమైన సినిమా ఇది'' అన్నారు.

మహాగణపతి దర్శనానికి సీఎం రేవంత్‌రెడ్డి

- నేడు ఉదయం 11 గంటలకు రాక
- సాయంత్రం 3 గంటలకు గవర్నర్ పూజలు

ఖైరతాబాద్ (హైదరాబాద్): వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి తొలిపూజకు సర్వం సిద్ధమైంది. శనివారం ఉదయం మహాగణపతికి ఖైరతాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కండువా, జంధ్యం, గరికమాలను సమర్పిస్తారు. ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పూజా కార్యక్రమానికి హాజరవుతారు. సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పూజలకు హాజరవుతారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పోలీసుల భారీ బందోబస్తు..

ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చే భక్తుల కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 400 మంది పోలీసులతో షిఫ్టుల వారీగా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ముగ్గురు డీఎస్పీలు, 13 మంది ఇన్‌స్పెక్టర్లు, 33 మంది ఎస్‌ఐలు, 22 ప్లాటూన్లు, 40 సీసీ కెమెరాలతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాగణపతి దర్శనానికి ఖైరతాబాద్ రైల్వేగేట్, మింట్ కాంపౌండ్, రాజ్‌దూత్ చౌరస్తాల నుంచి భక్తులను అనుమతిస్తారు.

విత్తనాల్లో మేధోసంపత్తి హక్కుల అమలు ఆవశ్యం

ఐకార్ మాజీ డైరెక్టర్ జనరల్ త్రిలోచన్ మహాపాత్ర

సాక్షి, హైదరాబాద్: విత్తనాలలో మేధో సంపత్తి హక్కుల అమలు (ఐపీఆర్) ఆవశ్యకత ఎంతో ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) మాజీ డైరెక్టర్ జనరల్ త్రిలోచన్ మహాపాత్ర అన్నారు. ఆవిష్కరణలు చేసిన వారి ప్రత్యేక హక్కులను పరిరక్షించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ అథారిటీ సహకారంతో ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐఐ) నిర్వహించిన 'విత్తనాల్లో ఐపీఆర్ అమలు' సదస్సులో ఆయన మాట్లాడారు. భారతదేశ వ్యవసాయ రంగం ఎంతో వేగంగా పరివర్తన చెందుతోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ప్రారంభించిన 109 అధిక దిగుబడినిచ్చే, వాతావరణాన్ని తట్టుకోగల, బయోఫోర్టిఫైడ్ విత్తనాలు దేశ వ్యవసాయంలో గణనీయమైన పురోగతిని సూచిస్తున్నాయని తెలిపారు. 20వ శతాబ్దం మధ్యకాలం నుంచి వ్యవసాయ ఉత్పత్తి ఆర్థిక వృద్ధిని గణనీయంగా పెంచిందన్నారు.

ఉచిత విద్యుత్‌కు ఆదిబట్ల నుంచే అడుగులు

5వ తరగతి విద్యార్థి అంజలి రాసిన ఉత్తరమే స్ఫూర్తిగా..

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ విద్యా సంస్థలకు అమలు చేయనున్న ఉచిత విద్యుత్ పథకం.. రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల ప్రాథమిక పాఠశాల నుంచి శనివారం ప్రారంభం కానుంది. ఈ స్కూల్‌లో 5వ తరగతి విద్యార్థిని ఎస్.అంజలి 'ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలని నా మనవి'అంటూ 9 డిసెంబర్ 2023న ముఖ్యమంత్రికి రాసిన ఉత్తరం ఇందుకు స్ఫూర్తిగా నిలిచింది. 23 జూలై 2024న అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ అందిస్తామని సర్కారు కీలక ప్రకటన చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖల విభాగాధిపతులకు ఆదేశాలు జారీ చేసింది.

నా ఆశయం నెరవేరింది



ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ ఇవ్వాలని నేను గతేడాది డిసెంబర్ నెలలో మా ఉపాధ్యాయుల సహకారంతో ముఖ్యమంత్రికి లేఖ రాశా. దీనిపై స్పందించిన ప్రభుత్వం సానుకూల ప్రకటనతోపాటు అమలు చేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం నేను ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నా.

– ఎస్.అంజలి, విద్యార్థిని, ఆదిబట్ల



ముఖ్యమంత్రికి లేఖ రాసి పోస్టుబాక్స్‌లో వేస్తున్న అంజలి (ఫైల్)

ఇది ప్రకృతి వైపరీత్యం

వాతావరణంలో అనూహ్య మార్పులతోనే భారీ నష్టం

ములుగు అటవీ విధ్వంసంపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేసిన అటవీశాఖ

వివరాలపై చేతులెత్తేసిన ఐఎండీ, ఇక ఎన్ఆర్ఎస్‌సీపైనే ఆశ



సాక్షి, హైదరాబాద్ : వాతావరణంలో అనూహ్యంగా చోటుచేసుకున్న మార్పుల చేర్పులతోపాటు అరుదైన ప్రకృతి వైపరీత్యం కారణంగా ములుగు అడవుల్లో చెట్లకు భారీగా నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వానికి అటవీశాఖ నివేదిక సమర్పించింది. దీనిని 'ఎకోలాజికల్ డిజాస్టర్'గానే పరిగణించాల్సి ఉంటుందని ఇందులో సూచించినట్టు సమాచారం. మొత్తంగా 204 హెక్టార్లలో (500 నుంచి 600 ఎకరాల్లో) దాదాపు 70 వేల దాకా వివిధ జాతుల చెట్లకు నష్టం వాటిల్లినట్టు పేర్కొంది. అటవీ పునరుద్ధరణతోపాటు, భూసార పరిరక్షణ చర్యలు, గ్యాప్ ఏర్పడిన చోట్ల వాటిని నింపేలా పెద్దమొత్తంలో మొక్కల పెంపకం, వంటివి చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ ప్రాంతంలో ఇంకా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతోపాటు, కొండ ప్రాంతాలు వంటివి ఉండడంతో జరిగిన నష్టం, కూలిన చెట్ల వివరాల సేకరణ అంత వేగంగా సాగడం లేదని అటవీ అధికారులు చెబుతున్నారు. వివిధ రూపాల్లో వాటిల్లిన నష్టంపై వారంరోజుల్లో క్షేత్రస్థాయి నుంచి ఒక స్పష్టమైన అంచనాకు వచ్చాక పర్యావరణం, అడవులతో సంబంధమున్న నిపుణులతో అధ్యయనం జరిపించాలని అటవీశాఖ నిర్ణయించింది. దేశంలోనే అత్యంత అరుదైన రీతిలో ములుగు అటవీప్రాంతంలో చెట్లకు నష్టం జరిగినందున, పూర్తి సమాచారం అందిన తర్వాతే అటవీ ఉన్నతాధికారులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి సవివరమైన నివేదిక అందజేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ములుగులో సుడిగాలుల బీభత్సం సమయంలోనే ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో, ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలోనూ స్వల్పస్థాయిలో చెట్లకు నష్టం జరిగినట్లు అటవీ అధికారులు గుర్తించారు.

ఉపగ్రహ ఛాయాచిత్రాలు వస్తేనే...

హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) నుంచి ఉపగ్రహ ఛాయాచిత్రాలను సేకరించడం ద్వారా ములుగు అటవీ విధ్వంసం కారణాలు వెల్లడి కాగలవని అటవీశాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దీనికి సంబంధించి అవసరమైన డేటాను ఉపగ్రహం నుంచి సేకరిస్తున్నామని, రెండురోజుల్లో దీనిపై వివరాలు అందజేస్తామని ఎన్ఆర్ఎస్‌సీ అధికారులు చెప్పారు. ఈ సమాచారాన్ని తమ ఎర్త్ అండ్ క్లైమేట్ సైన్స్ ఏరియా డివిజన్ క్రోడీకరించి అందజేస్తామని అటవీ అధికారులకు చెప్పారు. అయితే భారత వాతావరణ శాఖ (ఐఎండీ)పై అటవీ అధికారులు పెట్టుకున్న ఆశలు మాత్రం నెరవేరలేదు. ములుగు పరిసర ప్రాంతాల్లో తమ అబ్జర్వేటరీ లేనందువల్ల, ఈ బీభత్సం చోటుచేసుకున్న రోజునాటి వివరాలు ఇవ్వలేకపోతున్నామని అధికారులకు ఐఎండీ స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ఐఎండీనే చేతులెత్తేస్తే ఇంకా తమకు ఎవరు వాతావరణ సాంకేతిక విషయాలు అందించగలరని అటవీ అధికారులు విస్తుపోతున్నారు. క్షేత్రస్థాయిలో జరిగిన నష్టంపై ఎన్యుమరేషన్ పూర్తయి, ఎన్ఆర్ఎస్‌సీ నుంచి సాంకేతిక సమాచారం అందాక 2,3 రోజుల్లో ములుగు జిల్లా అటవీ అధికారులు నివేదిక సమర్పించే అవకాశాలున్నాయి.

ఎర్రవల్లిలో కేసీఆర్ దంపతుల నవగ్రహ యాగం



ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ దంపతులు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో వేద పండితులతో నవగ్రహ యాగం చేపట్టారు. యాగంలో భాగంగా కేసీఆర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కేసీఆర్ అతి సమీప బంధువులు కొందరు మాత్రమే ప్రత్యేక పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. విదేశీ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఈ యాగం కేవలం కేసీఆర్ కుటుంబ కార్యక్రమం మాత్రమేనని, ఇతర ప్రాధాన్యం ఏమీ లేదని పార్టీ నేతలు వెల్లడించారు.

తెలంగాణ, ఏపీల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి

కేంద్ర హోంశాఖ

సాక్షి, న్యూఢిల్లీ: భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర హోం శాఖ తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు అవసరమైన సహాయాన్ని అందిస్తోందని అధికారులు పేర్కొన్నారు. హోం మంత్రి అమిత్‌షా ఆదేశాల మేరకు, వరద నిర్వహణ, రిజర్వాయర్ నిర్వహణ, డ్యామ్ భద్రత సమస్యలను అక్కడికక్కడే అంచనా వేయడంతో పాటు వరద నుంచి తక్షణ ఉపశమనం కోసం సిఫార్సులు చేసేందుకు కేంద్ర నిపుణుల బృందాన్ని ఇప్పటికే విజయవాడకు పంపించామన్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పాముతో 'సెల్'గాటం.. ప్రాణాల మీదకు తెచ్చింది

- నోట్లో పాము తల పెట్టుకుని ఫొటోలకు పోజిచ్చిన యువకుడు
- కాటేసిందో.. విషం చిమ్మిందో తెలియని స్థితిలో పోయిన ప్రాణం



వీడియో తీయిస్తూ నాగుపామును నోటిలో పెట్టుకున్న శివరాజులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి /బాన్సువాడ రూరల్ : పాముతో చెలగాటం ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఆ యువకుడు తన నోట్లో పాము తల పెట్టుకుని మరీ ఫొటోలకు పోజులిచ్చాడు. అయితే ఆ పాము ఎప్పుడు కాటేసిందో కూడా తెలియని పరిస్థితుల్లో అతను ప్రాణాలు కోల్పోయాడు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని దేశాయిపేట గ్రామంలో గురువారం మోచి శివరాజులు (18) అనే యువకుడు పాముకాటుతో ప్రాణాలు కోల్పోయాడు. దేశాయిపేటలోని కొత్త డబుల్ బెడ్‌రూం కాలనీలోకి నాగుపాము వచ్చిందని స్థానికులు పాములు పట్టే మోచి గంగారాంకు సమాచారం అందించారు. అయితే, వేరేపనిపై వెళ్లే యత్నంలో ఉన్న గంగారాం.. పాములను పట్టడంలో రెండేళ్లుగా తర్ఫీదు పొందుతున్న తన కుమారుడు శివరాజులును అక్కడికి పంపించారు. శివరాజులు కాలనీకి చేరుకుని నాగుపామును పట్టుకుని తన సెల్‌ఫోన్‌లో రకరకాలుగా ఫొటోలు తీసుకున్నాడు. అంతటితో ఆగకుండా పామును నోట్లో పెట్టుకుని మరీ ఫొటోలు, వీడియోలు తీయించుకున్నాడు. ఈ క్రమంలో పాము ఎప్పుడు కాటేసిందో.. నోట్లో పాము తలను పెట్టుకున్నపుడు విషం చిమ్మిందో తెలియదు గానీ కాసేపటికే శివరాజులు స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు శివరాజులును బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

20 ఏళ్ల కేసులో మళ్లీ వాయిదానా?

- పీసీబీ రద్దుకు ఆదేశాలివ్వాల్సి వస్తుంది
- కంపెనీల కోసమే ఏర్పాటు చేసినట్టు మారింది
- పీసీబీ తీరుపై సీజే ధర్మాసనం మండిపాటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసలు కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) పని చేస్తున్నట్టు అనిపించడం లేదని, రద్దుకు సిఫార్సు చేయాల్సి వస్తుందని హెచ్చరించింది. 20 ఏళ్ల క్రితం దాఖలైన పిటిషన్‌లో వివరాలకు ఇంకా సమయం ఇవ్వాలా అని ప్రశ్నించింది. కేవలం కంపెనీల కోసమే పీసీబీ విధులు నిర్వర్తిస్తున్నట్టు ఉందని ఆగ్రహం వ్యక్తం చేసింది. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలకు పీసీబీ నోటీసులు జారీ చేస్తుందని.. వారు న్యాయస్థానాలను ఆశ్రయించి స్టే ఉత్తర్వులు పొంది కంపెనీలను కొనసాగిస్తున్నాయని వ్యాఖ్యానించింది. నిబంధనల మేరకు పీసీబీ విధులు నిర్వర్తించకపోవడమే దీనికి కారణమని స్పష్టం చేసింది. అధికారులు సరైన సమయంలో కోర్టుకు వివరాలు అందజేస్తే ఇలాంటి పరిస్థితి ఉండదన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తీగాపూర్, గుండ్లపట్లపల్లి, కొడిచెర్ల, అప్పాజీపల్లి తండాల్లోని వ్యవసాయ భూముల్లో స్పాంజి ఐరన్ పరిశ్రమలు నిర్వహించడాన్ని సవాల్ చేస్తూ 2005లో రవీందర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సాగు కరువై, ఉపాధి లేక ప్రజలతోపాటు గ్రాసం లేక పశువులు కూడా ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వాదనల సందర్భంగా వివరాల సమర్పణకు మరికొంత గడువు కావాలని పీసీబీ న్యాయవాది కోరడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 20 ఏళ్ల క్రితం దాఖలు చేసిన పిటిషన్‌లో ఇంకా గడువు కావాలనడంపై మండిపడింది. పీసీబీ ఇలాగే పనిచేస్తే రద్దు చేయాలంటూ సర్కార్‌కు ఆదేశాలు జారీ చేయాల్సి వస్తుందని హెచ్చరించింది. తదుపరి విచారణ ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	1,017	81,184
నిఫ్టీ ▽	293	24,852

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,709	▽ 418
డోజోన్స్	40,402	▽ 362
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,181	▽ 60
డాక్స్	18,302	▽ 275
షాంఘై	2,766	▽ 23
నికాయ్	36,657	▽ 266

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,329	△ 233
బంగారం (99.5 స్వచ్ఛత)	71,047	△ 235
వెండి (కిలో)	81,406	△ 567

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.57	84.59
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	109.25	118.86
€	యూరో	ఎస్‌బీఐ	91.95	94.34
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.81	59.13
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.56	57.52
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.23	66.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.98	23.76
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.97	12.79

సెప్టెంబర్ మాసం...

ఐపీఓల వర్షం!

ఈ నెలలో 15కు పైగా పబ్లిక్ ఇష్యూలు ● 2010 నాటి 14 ఏళ్ల రికార్డు బ్రేక్ అయ్యే చాన్స్...

వరుస ఐపీఓలతో సెప్టెంబర్ నెలలో స్టాక్ మార్కెట్ కళకళలాడనుంది. ఇప్పటికే గాలా ప్రెసిషన్ ఇంజనీరింగ్, బాజార్ స్టయిల్ రిటైల్ ఇష్యూలు పూర్తయ్యాయి. ఇంకా అనేక ఇష్యూలు నిధుల సమీకరణ బాటలో ఉన్నాయి. బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌తో పాటు నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్, గరుడా కన్‌స్ట్రక్షన్స్, మన్బా ఫైనాన్స్ సహా అనేక కంపెనీలు పబ్లిక్ ఇష్యూల మోత మోగించనున్నాయి. దీంతో 2010 సెప్టెంబర్ నెల 15 ఐపీఓల రికార్డు తుడిచిపెట్టుకుపోవచ్చనేది మార్కెట్ వర్గాల అంచనా. ఇన్వెస్టర్ల నుంచి పటిష్టమైన డిమాండ్‌కు సెకండరీ మార్కెట్లో నెలకొన్న ఉత్సాహం తోడవడంతో మరిన్ని కంపెనీలు ఐపీఓల బాట పట్టేందుకు దోహదం చేస్తోందని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు చెబుతున్నారు. 'వచ్చే కొన్ని వారాల్లో చాలా కంపెనీలు పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఉన్నాయి. ఇటీవలి ఐపీఓలకు బలమైన డిమాండ్‌తో పాటు దేశీయ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి నిధుల ప్రవాహం తగినంతగా ఉండటం కూడా దీనికి ప్రధాన కారణం'. మరోపక్క తాజా ఇష్యూలు లిస్టింగ్‌లోనూ, ఆ తర్వాత కూడా ఇన్వెస్టర్లకు మంచి లాభాలు పంచడం మార్కెట్లో మరింత జోష్ నింపుతోంది' అని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ ఎండీ వి. జయశంకర్ పేర్కొన్నారు.

> స్టాక్ మార్కెట్ జోరు నేపథ్యంలో పబ్లిక్ ఆఫర్లు (ఐపీఓ) వెల్లువెత్తుతున్నాయి. సెప్టెంబర్ నెలలో ఇష్యూల వర్షం కురవనుంది. 2010 సెప్టెంబర్‌లో అత్యధికంగా 15 ఐపీఓలతో రికార్డు నమోదైంది. ప్రస్తుతం ప్రైమరీ మార్కెట్లో జోరు చూస్తుంటే ఈ ఏడాది ఆ 14 ఏళ్ల రికార్డు బద్దలయ్యే అవకాశం కనిపిస్తోంది.

విదేశీ పోర్ట్‌ఫోలియో నిధుల వెల్లువ...

ఈ ఏడాది ఇప్పటిదాకా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) రూ.55,300 కోట్ల నిధులను ఐపీఓల్లో కుమ్మరించారు. మరోపక్క, సెకండరీ మార్కెట్లో రూ.2,700 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. రూ. 6,560 కోట్ల బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ భారీ ఇష్యూ 9న మొదలవుతోంది. దీని ప్రైస్ బ్యాండ్ రూ.66–70. టోలిన్స్ టైర్స్ రూ.230 కోట్ల నిధుల కోసం 9న మార్కెట్ తలుపుతడుతోంది. ఇక పీఎస్ గాడ్గిల్ జ్యువెల్లర్స్ రూ.228–240 ధరల శ్రేణితో ఈ నెల 10న ఐపీఓకు వస్తోంది. గతేడాది సెప్టెంబర్లో వచ్చిన రూ.11,893 కోట్ల విలువైన 14 ఐపీఓలే ఇటీవలి కాలంలో అత్యధికంగా నిలుస్తున్నాయి. 2024 ఆగస్టులో 10 కంపెనీలు రూ.17,076 కోట్ల నిధులను సమీకరించాయి. 'మెరుగైన వ్యాపారావకాశాల నేపథ్యంలో భారత కార్పొరేట్ సంస్థలు ప్లాంట్ల విస్తరణతో పాటు కంపెనీల కొనుగోళ్ల జోరు పెంచాయి. మరో పక్క, పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు ఆడిట్ చేసిన ఆర్థిక ఫలితాల గడువు ఆరు నెలలు మాత్రమే. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్నెల్ల గడువు సెప్టెంబర్‌తో ముగియనుంది. ఈలోపు ఐపీఓ పూర్తి చేయక పోతే, మళ్లీ ఆడిట్ చేయడంతో పాటు ఐపీవో ముసాయిదా దరఖాస్తు పత్రాలను మార్చాల్సి ఉంటుంది. దీని వల్ల ఇష్యూ జాప్యానికి దారితీస్తుంది. అందుకే కంపెనీలు వరుసకడుతున్నాయి' అని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ రవి శంకర్ చెప్పారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



ఎగబడుతున్న ఇన్వెస్టర్లు..


లిస్టింగ్‌లో అసాధారణ లాభాలిస్తుండటంతో ఇటీవలి కాలంలో మార్కెట్లోకి ఏ ఐపీఓ వచ్చినా రిటైల్ ఇన్వెస్టర్లు ఎగబడిపోతున్నారు. ఈ నెల 4న ముగిసిన రూ.168 కోట్ల గాలా ప్రెసిషన్ ఇష్యూ 201 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయింది. బాజార్ స్టయిల్‌కు 41 రెట్ల స్పందన లభించింది. అంతక్రితం ఎకోస్ మొబిలిటీకి 64 రెట్లు సబ్‌స్క్రిప్షన్ లభించింది. అంతేకాదు, ఇది 32 శాతం ప్రీమియంతో లిస్టయింది కూడా. ప్రీమియర్ ఎనర్జీస్ 87 శాతం, ఓరియంట్ టెక్నాలజీస్ 48 శాతం చొప్పున లిస్టింగ్ లాభాలను పంచాయి. ఆగస్టులో లిస్టయిన 8 ఐపీఓల సగటు లాభం 36 శాతం కావడం గమనార్హం.

క్యూలో ఉన్న ఐపీఓలు...

కంపెనీ	సమీకరణ (రూ. కోట్లలో)
అఫ్కాన్స్ ఇన్‌ఫ్రా	7,000
బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్	6,560
నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్	3,000
పీఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్	1,100
క్రాస్ లిమిటెడ్	500
వెస్టర్న్ క్యారియర్స్	*500
నార్తర్న్ ఆర్క్	*500
ఆర్కేడ్ డెవలపర్స్	430
శివాలిక్ ఇంజనీరింగ్	*335
టోలిన్స్ టైర్స్	230
శ్రీ తిరుపతి బాలాజీ ఆగ్రో	170
డిఫ్యూజన్ ఇంజనీర్స్	150

* ఆఫర్ ఫర్ సేల్ అదనం.

డీమ్యాట్ ఖాతాలు రయ్.. రయ్!



మార్కెట్ రికార్డులు, ఐపీఓల వరదతో కొత్తగా ఇన్వెస్ట్ చేసే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఆగస్టులో 41.4 లక్షల డీమ్యాట్ ఖాతాలు జత కావడంతో మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 17.1 కోట్లకు దూసుకెళ్లింది. ఇది ఆల్‌టైమ్ రికార్డు.

ఈవీ రంగంలోకి

రిలయన్స్ ఇన్‌ఫ్రా

కన్సల్టెంట్‌గా బీవైడీ మాజీ చీఫ్ సంజయ్ నియామకం



న్యూఢిల్లీ: అనిల్ అంబానీ గ్రూప్‌నకు చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తాజాగా ఎలక్ట్రిక్ కార్లు (ఈవీ), బ్యాటరీల తయారీ విభాగంలోకి ప్రవేశించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రణాళికలకు సంబంధించి వ్యయాలపరంగా సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు చైనా దిగ్గజం బీవైడీ ఇండియా మాజీ హెడ్ సంజయ్ గోపాలకృష్ణన్‌ను కన్సల్టెంటుగా నియమించుకున్నట్లు సమాచారం. రిలయన్స్ ఇన్‌ఫ్రా ప్రాథమికంగా ఏటా 2,50,000 ఈవీలతో మొదలుపెట్టి 7,50,000 వాహనాలకు ఉత్పత్తిని పెంచుకోవాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే 10 గిగావాట్ అవర్స్ (జీడబ్ల్యూహెచ్) సామర్థ్యంతో బ్యాటరీల తయారీ ప్లాంటు ఏర్పాటు సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలిస్తున్నట్లు వివరించాయి. ప్రభుత్వ రికార్డుల ప్రకారం రిలయన్స్ ఇన్‌ఫ్రా జూన్‌లోనే వాహన రంగానికి సంబంధించి కొత్తగా రెండు అనుబంధ సంస్థలను ప్రారంభించింది. రిలయన్స్ ఈవీ ప్రైవేట్ లిమిటెడ్ వీటిలో ఒకటి. అధిక రుణభారం, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న కంపెనీ ఈ కొత్త ఈవీ ప్రాజెక్టులకు నిధులెలా సమకూర్చుకుంటుందనే దానిపై ఇంకా స్పష్టత లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
బ్యాంకుల్లో అప్రెంటిస్‌లుగా గ్రాడ్యుయేట్లకు చాన్స్!
వొడాఫోన్‌కు గోల్డ్‌మన్ శాక్స్ షాక్

రెండు వారాల కనిష్టానికి సెన్సెక్స్

- 24,900 స్థాయి దిగువకు నిఫ్టీ
- అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం



ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని బలహీనతలకు తోడు దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒకశాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ రెండు వారాల కనిష్టానికి చేరుకోగా.., నిఫ్టీ 24,900 స్థాయిని కోల్పోయింది. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 82,171 వద్ద, నిఫ్టీ 25,094 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. ఇంట్రాడేలో అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,219 పాయింట్లు క్షీణించి 80,981 వద్ద, నిఫ్టీ 344 పాయింట్లు కుప్పకూలి 24801 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. చివరికి సెన్సెక్స్ 1,017 పాయింట్లు నష్టపోయి 81,184 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 293 పాయింట్లు పతనమై 24,852 వద్ద నిలిచింది.

నష్టాలు ఎందుకంటే...

ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను ప్రభావితం చేసే నిరుద్యోగ రేటు, నాన్‌ఫారం పేరోల్స్ డేటా వెల్లడి (శుక్రవారం రాత్రి)కి ముందు నెలకొన్న అప్రమత్తతతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మూడు వారాల కనిష్ట స్థాయి వద్ద ట్రేడవుతున్నాయి. ఈ ప్రతికూల ప్రభావం మన మార్కెట్లపైనా పడింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తమ అంతిమ లబ్ధిదారుల వివరాలు తెలిపేందుకు సెబీ తుది గడువు సెప్టెంబర్ 9న కావడంతో దేశీయ మార్కెట్లో ఎఫ్‌ఐఐలు అమ్మకాలకు పాల్పడుతున్నారు.

- ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈల లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ శుక్రవారం ఒక్కరోజే రూ.5.49 లక్షల కోట్లు హరించుకుపోయాయి. దీంతో బీఎస్‌ఈలో మార్కెట్ విలువ రూ.460.18 లక్షల కోట్లు దిగివచ్చింది.
- బజార్ స్టైల్ రిటైల్ లిస్టింగ్ రోజు నామమాత్రపు లాభాలు పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర రూ.389 వద్ద లిస్టయ్యింది. నష్టాల మార్కెట్లోనూ ఎదురీదడంతో షేరు ఇంట్రాడేలో 11% పెరిగి రూ.431 వద్ద గరిష్టాన్ని తాకింది. చివర్లో లాభాల స్వీకరణతో 3% స్వల్ప లాభంతో రూ.400 వద్ద నిలిచింది.

స్విగ్గీలో 'సీక్రెట్' ఆర్డర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డరింగ్, డెలివరీ కంపెనీ స్విగ్గీ పరిశ్రమలో తొలిసారిగా వినూత్న ఫీచర్‌ను పరిచయం చేసింది. ఫుడ్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో ఇన్‌కాగ్నిటో మోడ్ ద్వారా వినియోగదార్లు ప్రైవేటుగా ఆర్డర్ చేయవచ్చు. అంటే ఆర్డర్ వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంటాయి. ఇన్‌కాగ్నిటో మోడ్ యాక్టివేట్ చేస్తే చాలు. యాప్ హిస్టరీలో ఆర్డర్ వివరాలు ఎక్కడా కనిపించవు. ఆర్డర్ వివరాలను మాన్యువల్‌గా డిలీట్ చేసే అవసరం లేదని కంపెనీ చెబుతోంది. ఆర్డర్ తాలూకు ఉత్పత్తులు డెలివరీ అయ్యాక ఏవైనా సమస్యలు ఉంటే మూడు గంటలపాటు ట్రాక్ చేసేందుకు వీలు ఉంటుంది.

గాడ్‌ఫ్రే ఫిలిప్స్‌కు బోనస్ జోష్

2:1 నిష్పత్తిలో షేర్ల జారీకి సై



న్యూఢిల్లీ: సిగరెట్ల తయారీ దిగ్గజం గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా తాజాగా వాటాదారులకు బోనస్ షేర్లను ప్రకటించింది. 2:1 నిష్పత్తిలో షేర్ల జారీకి ప్రతిపాదించింది. ఈ అంశాన్ని పరిశీలించేందుకు కంపెనీ బోర్డు సెప్టెంబర్ 20న సమావేశంకానున్నట్లు వెల్లడించింది. వెరసి వాటాదారులకు తమవద్దగల ప్రతీ 1 షేరుకి 2 షేర్లను ఉచితంగా జారీ చేయనుంది.

గాడ్‌ఫ్రే ఫిలిప్స్ షేరు 13 శాతం దూసుకెళ్లి రూ. 7,204 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



ఇంటర్‌కాంటినెంటల్ కప్: సిరియా ఘనవిజయం

సాక్షి, హైదరాబాద్: ఇంటర్‌కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో సిరియా 2–0తో మారిషస్‌పై ఘన విజయం సాధించింది. ఈ పరాజయంతో మారిషస్ టోర్నమెంట్ నుంచి ఎలిమినేట్ కాగా... సోమవారం జరిగే ఆఖరి పోరులో ఆతిథ్య భారత్‌తో సిరియా తలపడుతుంది. జీఎంసీ బాలయోగి స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సిరియా ఫుట్‌బాలర్లు ఆరంభం నుంచే మ్యాచ్‌పై పట్టు సంపాదించారు. పదేపదే ప్రత్యర్థి గోల్ పోస్ట్ లక్ష్యంగా దాడులకు పదునుపెట్టారు. కానీ ప్రత్యర్థి డిఫెండర్ బ్రెండన్ సిటొరా చేసిన తప్పిదంతో సిరియా ఖాతా తెరిచింది. ఆట 32వ నిమిషంలో సిటొరా సెల్ఫ్‌గోల్‌తో సిరియా 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత రెండో అర్ధభాగంలో అల్ మవాస్ (70వ నిమిషంలో) సాధించిన గోల్‌తో సిరియా ఆధిక్యం (2–0) రెట్టింపైంది. మరోవైపు మారిషస్ కూడా రెండో సగంలో గోల్ కోసం చేసిన ప్రయత్నాల్ని సిరియా డిఫెండర్లు సమర్థంగా అడ్డుకున్నారు.

ప్రవీణ్ 'పసిడి' వెలుగులు

హైజంప్‌లో స్వర్ణం సాధించిన అథ్లెట్

- భారత్ ఖాతాలో ఆరో స్వర్ణం
- పారిస్ పారాలింపిక్స్ క్రీడలు



ప్రవీణ్

టోక్యోలో జరిగిన గత పారాలింపిక్స్ క్రీడల్లో భారత ఆటగాళ్లు ఐదు స్వర్ణాలు సాధించారు. ఇప్పుడు దానిని మన బృందం అధిగమించింది. 21 ఏళ్ల భారత అథ్లెట్ ప్రవీణ్ కుమార్ దేశానికి ఆరో పసిడి పతకాన్ని అందించాడు. హైజంప్‌లో అతను ఈ మెడల్‌ను గెలుచుకున్నాడు. శుక్రవారం జరిగిన పోటీల్లో భారత్‌కు స్వర్ణానందం దక్కగా.. ఇతర ఈవెంట్లలో మాత్రం నిరాశాజనక ఫలితాలు ఎదురయ్యాయి.

పారిస్: మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో రజత పతకంతో సత్తా చాటిన భారత హైజంపర్ ప్రవీణ్ కుమార్ ఈ సారి మరింత బలంగా పైకి లేచాడు. తన ప్రదర్శనను మెరుగుపర్చుకుంటూ అగ్రస్థానాన్ని అందుకున్నాడు. శుక్రవారం జరిగిన పురుషుల హైజంప్ – టీ64 ఈవెంట్‌లో ప్రవీణ్‌కు స్వర్ణ పతకం దక్కింది. 2.08 మీటర్ల ఎత్తుకు ఎగిరి ఆసియా రికార్డుతో అతను పసిడిని గెలుచుకున్నాడు. అమెరికాకు చెందిన డెరెక్ లాసిడెంట్ (2.06 మీ.) రజతం గెలుచుకోగా, తెమూర్‌బెక్ గియాజోవ్ (ఉజ్బెకిస్తాన్ – 2.03 మీ.)కు కాంస్యం దక్కింది. ముందుగా 1.89 మీటర్ల ఎత్తుతో మొదలు పెట్టిన ప్రవీణ్ తన ఏడో ప్రయత్నంలో అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. పారిస్ పారాలింపిక్స్‌లో శరద్ కుమార్, మరియప్పన్ తంగవేలు తర్వాత భారత్ తరఫున హైజంప్‌లో పతకం సాధించిన మూడో అథ్లెట్‌గా ప్రవీణ్ నిలిచాడు.

కస్తూరికి ఎనిమిదో స్థానం...

మహిళల పవర్‌లిఫ్టింగ్ 67 కేజీల విభాగంలో భారత ప్లేయర్ కస్తూరి రాజమణికి నిరాశ ఎదురైంది. మూడు ప్రయత్నాల్లో రెండు ఫౌల్స్ కాగా, అత్యుత్తమంగా 106 కిలోల బరువు మాత్రమే ఎత్తిన కస్తూరి ఎనిమిదో స్థానంతో ముగించింది. మహిళల కనోయింగ్ 'వా' సింగిల్ 200 మీ. హీట్స్‌లో రాణించిన ప్రాచీ యాదవ్ సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. కనోయింగ్ 'కయాక్' సింగిల్ 200 మీ. కూడా భారత ప్లేయర్ పూజ ఓఝా సెమీస్‌కు చేరింది. పురుషుల 'కయాక్' సింగిల్ 200 మీ.లో యష్ కుమార్ కూడా సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. పురుషుల జావెలిన్ త్రో – ఎఫ్ 54 కేటగిరీలో భారత అథ్లెట్ దీపేశ్ కుమార్ అందరికంటే చివరగా ఏడో స్థానంతో ముగించాడు. అతను జావెలిన్‌ను 26.11 మీటర్ల దూరం విసిరాడు. పురుషుల 400 మీ. – టీ47 ఈవెంట్ తొలి రౌండ్ హీట్స్‌లో మూడో స్థానంలో నిలిచి దిలీప్ గవిట్ ముందంజ వేశాడు. మహిళల 200 మీ.–టీ12 పరుగు సెమీ ఫైనల్లో రాణించిన సిమ్రన్ ఫైనల్‌కు అర్హత సాధించింది. మహిళల జావెలిన్ త్రో –ఎఫ్ 46లో భావనాబెన్ చౌదరి 39.70 మీటర్లు జావెలిన్‌ను విసిరి ఐదో స్థానంలో నిలిచింది.

బరిలోకి దిగితే పతకం ఖాయమే!



ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రవీణ్ కుమార్ పుట్టుకతోనే వికలాంగుడు. అతని ఎడమ కాలు పూర్తిగా ఎదగకుండా చిన్నగా ఉండిపోయింది. చిన్నతనంలో కొందరు హేళన చేయడం అతడిని తీవ్రంగా బాధపెట్టేది. దీనిని మర్చిపోయేందుకు అతను ఆటలపై దృష్టి పెట్టాడు. వైకల్యం ఉన్నా సరే దానిని పట్టించుకోకుండా మిత్రులతో కలిసి వాలీబాల్ ఆడేవాడు. అయితే అనూహ్యంగా ఒక సారి సాధారణ అథ్లెట్లు పాల్గొనే హైజంప్‌లో అతనికీ అవకాశం దక్కింది. దాంతో అథ్లెటిక్స్‌తో తనకు మరిన్ని అవకాశాలు ఉన్నాయని ప్రవీణ్‌కు అర్థమైంది. సత్యపాల్ సింగ్ అనే పారా అథ్లెటిక్స్ కోచ్ అతనిలో ప్రతిభను గుర్తించి హైజంప్‌పై పూర్తిగా దృష్టి పెట్టేలా చేశాడు. అన్ని రకాలుగా ప్రవీణ్‌ను తీర్చిదిద్దాడు. అనంతరం పారా క్రీడల్లో పాల్గొంటూ అతను వరుస విజయాలు సాధించాడు. టోక్యో పారాలింపిక్స్‌లో రజతం, ఇప్పుడు స్వర్ణంలతో పాటు ప్రవీణ్ వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఒక రజతం, ఒక కాంస్యం కూడా గెలిచాడు. పారిస్ క్రీడలకు ముందు గజ్జల్లో గాయంతో బాధపడిన అతను సరైన సమయానికి కోలుకొని సత్తా చాటాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో




దీప్తికి ఘన స్వాగతం

పారిస్ పారాలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతకం గెలుచుకున్న తెలంగాణ అథ్లెట్ దీప్తి జివాంజి హైదరాబాద్‌కు చేరుకుంది. శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయంలో ఆమెకు క్రీడాకారులు, కోచ్‌లు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) అధికారులు ఘనస్వాగతం పలికారు. పారాలింపిక్స్ 400 మీ. (టి20) పరుగులో దీప్తి కాంస్యం సాధించింది. విమానాశ్రయంలో ఆమె వెంట అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్, భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, 'శాట్స్' చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు ఉన్నారు.

ఫైనల్లో జెస్సికా, సబలెంకా

- సెమీస్‌లో ఓడిన ముచొవా, నవారో
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



సబలెంక



జెస్సికా

న్యూయార్క్: అమెరికా టెన్నిస్ స్టార్ జెస్సికా పెగూలా తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత సంపాదించింది. గ్రాండ్‌స్లామ్ కెరీర్‌లో తొలిసారి సెమీస్ చేరిన ఆమె తన ప్రదర్శనను మరింత మెరుగుపర్చుకుంటూ ఈ సారి సొంతగడ్డపై యూఎస్ ఓపెన్‌లో ఫైనల్ చేరింది. భారత కాలమాన ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఆరో సీడ్ జెస్సికా 1–6, 6–4, 6–2తో కరోలినా ముచొవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచింది. అయితే మరో అమెరికన్ ఎమ్మా నవారో ఆట సెమీస్‌తోనే ముగిసింది. రష్యన్ స్టార్, గత యూఎస్ ఓపెన్ రన్నరప్ అరినా సబలెంక 6–3, 7–6 (7/2)తో 13వ సీడ్ ఎమ్మా నవారోను వరుస సెట్లలో ఇంటిదారి పట్టించింది. నేడు జరిగే ఫైనల్లో పెగూలా తన తొలి గ్రాండ్‌స్లామ్ కోసం, సబలెంక తన మూడో గ్రాండ్‌స్లామ్ కోసం తలపడతారు. సబలెంకా 2023, 2024లలో వరుసగా ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గింది.

తొలి సెట్ కోల్పోయినా...

క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌ను ఓడించిన జెస్సికాకు సెమీస్ పోరు అంత సులువుగా సాగలేదు. మ్యాచ్ ఆరంభంలో ఫ్రెంచ్ ఓపెన్ 2023 రన్నరప్, చెక్ రిపబ్లిక్ ప్లేయర్ ముచొవా చెలరేగి ఆడింది. తొలి 12 విన్నర్లలో పది విన్నర్లను ఆమె కొట్టింది. తొలి సెట్‌లో పెగూలా అదేపనిగా చేసిన తప్పిదాలు, పేలవమైన సర్వీస్‌తో వెనుకబడింది. ఇదే అదనుగా పట్టు బిగించిన ముచొవా 28 నిమిషాల్లోనే తొలి సెట్‌ను వశం చేసుకుంది. రెండో సెట్‌లోనూ తొలి 9 గేముల్లో ఎనిమిదింట గెలిచి ఒక దశలో 3–0తో ఆధిక్యంలో నిలిచింది. కానీ ఇక్కడి నుంచి సీన్ మారిపోయింది. జెస్సికా జోరు మొదలైంది. ఫోర్‌హ్యాండ్ షాట్లతో ఆటలో వేగం పెంచింది. మూడు బ్రేక్ పాయింట్లతో రెండో సెట్‌ను గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. మూడో సెట్లో చెక్ ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా జెస్సికా మెరుపు షాట్లతో విరుచుకుపడింది.

సబలెంక జోరు

మరో సెమీఫైనల్లో రష్యన్ స్టార్ సబలెంక జోరుకు ఎమ్మా నవారో ఎదురు నిలువలేకపోయింది. ప్రత్యేకించి యూఎస్ ఓపెన్‌లో తొలిరౌండే దాటని అమెరికన్ ప్లేయర్ ఎమ్మా నిరుటి రన్నరప్ సబలెంక ధాటికి తొలిసెట్‌లో చతికిలబడింది. తొలిసెట్‌ను 6–3తో గెలుచుకున్న రెండో సీడ్ సబలెంకకు రెండో సెట్‌లో కాస్తా పోటీ ఇవ్వడంతో ఈ సెట్ టైబ్రేక్‌కు దారితీసింది. అయితే టై బ్రేక్‌లో అనుభవజ్ఞురాలైన రష్యన్ అలవోకగా పాయింట్లు సాధించడంతో కేవలం గంటన్నరలోనే మ్యాచ్ ముగిసింది. సబలెంక 8 ఏస్‌లతో చెలరేగింది. 34 విన్నర్లు కొట్టింది. ఒకే ఒక ఏస్ సంధించిన నవారో 13 విన్నర్లే కొట్టగలిగింది.

రాజకీయాలకు కాదు.. రైతుల కోసం వచ్చాం

అన్నదాతకు సేవ చేస్తే భగవంతుడికి పూజ చేసినట్టే

- గత ప్రభుత్వం ఫసల్ బీమాను నిర్లక్ష్యం చేసింది
- వరదతో నష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం
- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్



నర్సింహులగూడెం వద్ద పొలాల్లోకి దిగి దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు చౌహాన్, బండి సంజయ్, భట్టి, పొంగులేటి

కూసుమంచి: 'భారీగా వరదలు వచ్చాయి.. రైతులు ఎంతో నష్ట పోయారు. ఈ నష్టాన్ని కళ్లారా చూశాను. రైతులను ఆదుకునేందుకే నేనూ, హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ మీ వద్దకు వచ్చామే తప్ప రాజకీయాల కోసం కాదు' అని కేంద్ర వ్యవసా యశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు శుక్రవారం కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, బండి సంజయ్ ఖమ్మం జిల్లాకు వచ్చారు. ముందుగా ఖమ్మం నగరంలోని ముంపు ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించాక.. కూసుమంచి మండలానికి చేరుకున్నారు. అక్కడ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి జాతీయరహదారి గుండా వెళుతూ పాలేరువాగు వద్ద దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పాలేరు వద్ద ఎడమకాల్వకు పడిన గండి, నర్సింహులగూడెం వద్ద దెబ్బతిన్న వరిని పరిశీలించి నష్టంపై ఆరా తీశారు. ఆ తర్వాత నవోదయ విద్యాలయంలో ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో వరద నష్టంపై ఆయా జిల్లాల అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

నేనూ రైతునే..

వరదలకు వరి, మిర్చి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నట్టు ఏరియల్ సర్వే ద్వారా గమనించానని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. తాను రైతునేనని, రైతుల కష్టా లు తెలుసునని చెప్పారు. వందేళ్లలో ఇవే భారీ వరదలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పగా.. వాస్తవాన్ని చూసి చలించిపోయానన్నారు. ఒక్క పంటలే కాకుండా ఇళ్లు, వస్తువులు దెబ్బతినగా జంతువులు మృత్యువాత పడ్డాయని, రైతులు ఈ వరదల్లో పంటలనే కాదు, వారి జీవనాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన నష్టంపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి రైతులకు ఎలా మేలు చేయాలో నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం ఫసల్ బీమా అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసిందని, అందుకే ఇప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని మంత్రి చౌహాన్ తెలిపారు.

రైతు కన్నీరు.. ఓదార్చిన కేంద్ర మంత్రి

నవోదయ విద్యాలయంలో రైతులతో ముఖాముఖి ఏర్పాటు చేయగా కూసుమంచి మండలం కోక్యాతండాకు చెందిన రైతు హలావత్ వెంకన్న హిందీలో మాట్లాడారు. వరదలతో తాము సర్వస్వం కోల్పోయామని, ఆశలన్నీ గల్లంతయ్యాయని కన్నీరు పెడుతూ కేంద్రమంత్రి చౌహాన్ కాళ్లపై పడబోగా ఆయన రైతును పైకి లేపి ఓదార్చారు. 'మీ బాధలు కళ్లారా చూశాను.. కంటనీరు రానివ్వం' అని భరోసా కల్పించారు. పర్యటన అనంతరం నాయ కన్‌గూడెం టోల్‌ప్లాజా నుంచి కేంద్ర మంత్రులతోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి, తుమ్మల ఒకే హెలికాప్టర్‌లో హైదరాబాద్ బయలుదేరారు.





సచివాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా వరద నష్టంపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వివరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి, బండి సంజయ్

కేంద్రం ఆదుకోవాలి... తక్షణ సాయం అందించాలి

ప్రాథమిక అంచనాల ప్రకారం రూ. 5,438 కోట్ల నష్టం

- విపత్తు నిధుల వినియోగం నిబంధనలు సడలించాలి
- తక్షణ మరమ్మతులు, పనులకు నిర్దేశించిన రేట్లు పెంచాలి
- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- విపత్తులు సంభవించినప్పుడు సాయం విషయంలో రాజకీయాలకు తావులేదన్న చౌహాన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వరద బీభత్సంతో అపారనష్టం వాటిల్లిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వివరించారు. రాష్ట్రంలో వరద నష్టం దాదాపు రూ.5,438 కోట్లు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసినట్టు తెలిపారు. సమగ్రంగా అంచనాలు వేసిన తర్వాత ఈ నష్టం మరింత పెరిగే అవకాశముందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్, బండి సంజయ్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం సచివాలయంలో సమావేశమయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, సూర్యాపేటతోపాటు పలు జిల్లాల్లో ఒకే రోజు అత్యధికంగా 40 సెంటీమీటర్ల వరకు వర్షం కురిసిందని, రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించటంతో భారీ ప్రాణనష్టం తప్పిందని, కానీ వరద నష్టం భారీగా జరిగిందని సీఎం వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని దృశ్యాలను సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తోపాటు ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కేంద్ర మంత్రులకు చూపించారు. మహబూబాబాద్ జిల్లాలో వరదలో కట్ట కొట్టుకుపోవటంతో వేలాడుతున్న రైల్వే ట్రాక్ పరిస్థితిని, రైళ్ల రాకపోకలు నిలిచిపోయిన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. తెగిన చెరువులు, కుంటలు, దెబ్బతిన్న రోడ్లు, వంతెనల తాత్కాలిక మరమ్మతులకు కేంద్ర ప్రభుత్వం తక్షణసాయం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. వీటిని శాశ్వతంగా పునరుద్ధరించే పనులకు తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు.

నిబంధనలను సడలించాలి

విపత్తు నిధులను రాష్ట్రాలకు విడుదల చేసే విషయంలో ఇప్పుడు అమల్లో ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సడలించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వరద బాధిత ప్రాంతాల్లో తక్షణ మరమ్మతులకు, శాశ్వత పునరుద్ధరణ పనులకు అంశాల వారీగా నిర్దేశించిన యూనిట్ రేట్లు కూడా పెంచాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వరదలతో దెబ్బతిన్న చెరువులు, కుంటల తక్షణ మరమ్మతులకు కనీసం రూ.60 కోట్లు అవసరమవుతాయని, ఇప్పుడున్న నిర్ణీత రేట్ల ప్రకారం రూ.4 కోట్లు కూడా విడుదల చేసే పరిస్థితి లేదని అధికారులు వివరించారు. ఏపీకి ఎలా సాయం అందిస్తారో అదే తీరుగా తెలంగాణకూ కేంద్ర ప్రభుత్వం సాయం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. విపత్తులు సంభవించినప్పుడు ఆపదలో ఉన్న ప్రజలకు సాయం చేసే విషయంలో పార్టీలు, రాజకీయాలకు తావు లేదని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.

ఆయిల్ పామ్ రైతులకు సరైన ధర కల్పించండి: తుమ్మల విన్నపం

ఆయిల్ పామ్ రైతులకు సరైన ధర వచ్చే విధంగా చూడాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విన్నవించారు. తెలంగాణలో కొబ్బరి తోటలకు సంబంధించి ఒక రీజినల్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రైబల్ వెల్ఫేర్ ఆర్గానిక్ ఫార్మింగ్‌ను అశ్వారావుపేట (ట్రైబల్, నాన్ ట్రైబల్ శిక్షణ)లో ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన చౌహాన్ త్వరలోనే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద రూ.3,448 కోట్లు



- తెలుగు రాష్ట్రాలకు వెంటనే విడుదల చేసేలా చర్యలు
- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెల్లడి
- పూర్తిస్థాయిలో సాయం చేయడానికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన రెండు తెలుగు రాష్ట్రాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) కింద రూ.3,448 కోట్లు వెంటనే విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వరద ప్రాంతాల్లో పర్యటించడంతో పాటు అక్కడి రైతులను, ప్రజలను కలిసి పరిస్థితులను అంచనా వేసిన అనంతరం.. రెండు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబులతో చర్చించిన తర్వాత ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలకు పూర్తిస్థాయిలో సాయం అందించడానికి కట్టుబడి ఉన్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తెలంగాణలో పంటలు దెబ్బతిన్న మీనవోలు, పెద్దగోపవరం, మున్నూరు, కట్టలేరు పరిశీలించడంతో పాటు ఖమ్మంలో మున్నేరు వరదను ఏరియల్ సర్వే చేసినట్లు వెల్లడించారు. ఎవరూ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, ప్రధాని నరేంద్ర మోదీ అందర్నీ ఆదుకుంటారని భరోసా ఇచ్చారు.

నష్టం అంచనా వేసిన తర్వాత పరిహారంపై నిర్ణయం

వరదల వల్ల జరిగిన పంటనష్టాన్ని అంచనా వేసిన తర్వాత ఏ మేరకు నష్టపరిహారం ఇవ్వాలన్నది నిర్ణయిస్తామని చౌహాన్ చెప్పారు. వరదల్లో అరటి, పసుపు, కూరగాయ ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. ఇది ఊహించని విపత్తు అని మంత్రి వ్యాఖ్యానించారు. రైతులను ఆదుకోవడం, పంటల బీమా పథకం అమలు, రైతులు పొలాల్లో పనిచేసుకునే పరిస్థితులు కల్పించడం, తదుపరి పంటలు వేసుకునేలా సహకరించడం.. కేంద్ర ప్రభుత్వ నాలుగు ప్రాథమ్యాలని పేర్కొన్నారు. ఎరువులు, విత్తనాలకు ఎలాంటి లోటు లేకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

అంచనాలు, నిబంధనలను బట్టే సాయం

మీడియాతో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో వరదలతో నష్టం సంభవించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తప్పకుండా సాయం అందిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తెలిపారు. 'నిబంధనల ప్రకారం సాయం అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. రాజకీయాలకతీతంగా ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం. ప్రజలకు అండగా ఉంటూ భరోసా కల్పిస్తున్నాం. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాలనే బాధ్యతతో వచ్చాం. ఈ సమయంలో రాజకీయాలు మాట్లాడటం సరికాదు' అని పేర్కొన్నారు. బేగంపేట వద్ద తనను కలిసిన మీడియా ప్రతినిధులతో బండి సంజయ్ మాట్లాడారు.

అధికారంలోకి వస్తే సచివాలయ డోమ్‌ల కూల్చివేతకు కట్టుబడి ఉన్నాం

విలేకరులు అడిగిన ప్రశ్నకు పైవిధంగా స్పందిస్తూ.. బీజేపీ అధికారంలోకి వస్తే సచివాలయంలో డోమ్‌లను కూల్చేస్తామని గతంలో చేసిన ప్రకటనకు కట్టుబడి ఉన్నామని సంజయ్ స్పష్టం చేశారు. కేసీఆర్ నవగ్రహ యాగం చేయడంపైనా తనదైన శైలిలో సంజయ్ వ్యంగ్యోక్తులు విసిరారు. 'కేసీఆర్ దశమ గ్రహం. తెలంగాణ ప్రజలకు దశమ గ్రహం పీడ విరగడమైంది. అయినా పదేళ్లు కేసీఆర్ సహా ఆయన కుటుంబమంతా అధికారం అనుభవించింది కదా.. ఇంకా దేనికోసం నవగ్రహం యాగం చేస్తున్నాడో' అన్నారు. 'రాష్ట్ర ప్రజలు అల్లాడుతున్నరు. వరదలతో తీవ్రంగా నష్టపోయారు. కనీసం ప్రజల కోసమైనా యాగాలు చేస్తే బాగుండేది' అని సంజయ్ అన్నారు.

కేంద్ర మంత్రి హోదాలో తొలిసారిగా సచివాలయానికి...

కేంద్ర మంత్రి హోదాలో తొలిసారిగా రాష్ట్ర సచివాలయానికి బండి సంజయ్ వచ్చారు. వరదలపై జరిగిన అధికారిక సమీక్షలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న రోజుల్లో ఆయన సచివాలయం వైపు కన్నెత్తి చూడలేదు.

క్యూఆర్ కోడ్‌తో ఓటరుగా నమోదు



స్కాన్ చేసి ఓటరుగా నమోదు చేసుకోండి: సీఈవో సుదర్శన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఓటరు నమోదులో మరో కొత్త విధానం అమల్లోకి వచ్చింది. క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఓటరుగా నమోదయ్యే అవకాశం కల్పిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో సి. సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రజలు డిజిటల్ సేవలను వినియోగించుకోవడం ద్వారా సులభంగా ఓటరుగా నమోదు కావాలని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా త్వరితగతిన ఓటరుగా నమోదు కావచ్చని తెలిపిన సీఈవో, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ప్రజల్లో మంచి ప్రాచుర్యం పొందిందని, తమ మొబైల్ ఫోన్ల ద్వారా ఓటర్లు సంబంధిత సేవలను ఈ యాప్‌ద్వారా వినియోగించుకోవచ్చని వెల్లడించారు. https:// voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఓటరు సేవలను పొందవచ్చని, తమ వ్యక్తిగత వివరాలను అప్‌డేట్ చేయడంతో పాటు ఓటరు లిస్టులో పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చని సుదర్శన్‌రెడ్డి తెలిపారు.



శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన బీహెచ్‌ఈఎల్ సీఎండీ కె.సదాశివ మూర్తి

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.





బుజ్జి గణపతింభజే






వినాయక చవితి వచ్చిందంటే 'దండాలయ్యా ఉండ్రాలయ్యా' పాట ప్రతి మంటపంలో వినిపిస్తుంది. 'వాతాపి గణపతింభజే' రేడియోలో వినిపిస్తుంది. గణపతి మంటపాలను వీధి వీధిన వాడవాడన పెడతారు. ఎంత పెద్ద వినాయకుడి విగ్రహం పెడితే అంత గొప్ప. కాని పెద్ద వినాయకుడి విగ్రహం నిమజ్జనం చేయాలంటే కొద్దిగా సమస్య. పైగా కాలుష్య సమస్య కూడా. అందుకే పర్యావరణవేత్తలు మట్టి వినాయకుణ్ణి తయారు చేయమంటున్నారు. అదే సమయంలో బుజ్జి వినాయకుడి విగ్రహాలు లేదా బాల వినాయకుడి విగ్రహాలు బుజ్జబుజ్జివి మంటపాల్లో పెట్టి పూజించి నిమజ్జనం చేయడానికి ఇప్పుడు చాలామంది ముందుకొస్తున్నారు. వారి కోసమే అన్నట్టు విశాల్ షిండే అనే శిల్పి బుజ్జి వినాయకుల్ని తయారు చేస్తున్నాడు. ఆయన తయారు చేసే వినాయకులకి చాలా డిమాండ్.

భలే భలే వినాయక... చిన్నారి వినాయక

ముంబాయిలోని లోయర్ పరేల్ ప్రాంతంలో ఉండే విశాల్ షిండే కేవలం మట్టితో మాత్రమే విగ్రహాలు తయారు చేస్తాడు. అదీ బాల వినాయకుల విగ్రహాలు మాత్రమే తయారు చేస్తాడు. ఇదొక స్పెషలైజేషన్ అన్నమాట. పిల్లలంటే ప్రతి ఒక్కరికీ ఇష్టం. అలాంటిది దేవుడే బాలుడి రూపంలో ఉంటే ఎందుకు ఇష్టపడము? అందుకే విశాల్ తయారు చేసే విగ్రహాలకు ఎంతో ముందు నుంచి ఆర్డర్ పెట్టాలి. ఒక్క ముంబయి అనే కాదు విదేశాలలో ఉన్న భారతీయులూ ఈయన దగ్గర విగ్రహాలకు ఆర్డర్ ఇచ్చి చేయించుకుంటారు.

20 వేల వలకు

ఈ బాల గణపతులు ఐదు వేల రూపాయల నుంచి 20 వేల రూపాయల వరకూ ధరలో ఉంటాయి. మట్టి, ఫైబర్ రెండింటి శిల్పాలను తయారు చేస్తారు. ఒక విగ్రహం తయారీకి మూడు నుండి నాలుగు రోజులు పడుతుంది. ఒక సీజన్‌లో 300 విగ్రహాలను మాత్రమే తయారు చేస్తారు. 'చాలా మంది శ్రీమంతులు లాస్ట్ మినిట్‌లో వచ్చి విగ్రహం కావాలంటారు. నేను ఇవ్వలేను. డబ్బు కోసం నేను ఈ విగ్రహాలు తయారు చేయడం లేదు. నాకు బుజ్జి వినాయకుడు ఇష్టం కాబట్టే చేస్తున్నాను' అంటాడు షిండే. అతని కళకు ఈ వినాయకచవితి రోజు చప్పట్లు కొడదాం. గణపయ్యకు దండాలు పెడదాం.

ప్రత్యేకమట్టి

విశాల్ షిండే తాను చేసే విగ్రహాల కోసం ప్రత్యేక మట్టి వాడుతాడు. దానిని షాదుమతి మట్టి అంటారు.దీనితో చేసే విగ్రహాలకు రూపం, చూపులు, రంగు కలయిక, స్కిన్ టోన్ ఇవన్నీ అద్భుతంగా ఉంటాయి. ఫినిషింగ్ చూస్తే మట్టితో తయారైన విగ్రహం అని నమ్మబుద్ధి కాదు. ఊయాల ఊగుతున్న చిన్ని గణపయ్య.. అల్లరి చేస్తున్న బొజ్జ గణపయ్య.. చేతిలో లడ్డూలు పట్టుకుని సందడి చేస్తున్న బుజ్జి గణపతి.. రిలాక్స్‌గా సోఫాలో సేద తీరుతున్న సుందర గణేశుడు ఇలా మన ఇంటిలో చిన్న పిల్లలు ఎలా ఉంటారో అలా షిండే చేసిన బాల గణపతి రూపాలు ఉంటాయి. బాత్‌టబ్‌లో జలకాలాడుతున్న గణపయ్యను కూడా తయారు చేశాడు షిండే.

బ్రెయిన్ జిమ్



మన పొడుపు కథలు

1) శాస్త్రాల పెన్నప్ప నేల గీరప్ప
2) కోస్తుండగానే మల్ల పెరిగొచ్చె
3) ఊరు కల్లు కాదు ఈత కల్లు కాదు కల్లుగాని కల్లు
4) గుడి వెనుక నల్లన గుడిలోన తెల్లన

జవాబులు: 1) పార 2) సారె మీద కుండ 3) ఉప్పుగల్లు 4) కొబ్బరి కుడుక

మన తెలుగు



ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది.

ఈ వారం కొన్ని పదాలు...

మోచ	అరటి	తమము	చీకటి
తపనీయము	బంగారు	తరంగిణి	నది, ప్రవాహము
తపనుడు	సూర్యుడు	రజనీజలం	మంచు
తపస్వి	తపస్సు చేసే వ్యక్తి	రసన	నాలుక

కామెడీ క్లాస్



క్వశ్చన్స్ ఈజీనే...

తల్లి : ఎగ్జామ్‌లో క్వశ్చన్స్ హార్డ్‌గా ఉన్నాయా, ఈజీగా ఉన్నాయా?
చింటు : క్వశ్చన్స్ చాలా ఈజీగా ఉన్నాయి.... జవాబులు రాయడమే కష్టం అనిపించింది.

టెలిబోన్..!?

రవి : స్కెల్టెన్‌లు ఉపయోగించే ఫోన్
రాము : టెలిబోన్

చంద్రుడే గిఫ్ట్...

తండ్రి : మ్యాథ్స్‌లో సున్నా వచ్చింది ఏమిటి!!
బబ్లు : సున్నా కాదు డాడీ అది చంద్రుడు
తండ్రి : అదెలా?
బబ్లు : మ్యాథ్స్‌లో నా టాలెంట్ చూసిన సంతోషంలో టీచర్ చుక్కల వరకు వెళ్లారు. అక్కడ ఉన్న చంద్రుడిని గిఫ్ట్‌గా ఇచ్చారు.

వెలుగు రేఖలు



పిల్లలతో రువా హుస్సునా

బాల్యం తిరిగి వచ్చేసింది

యుద్ధ ప్రభావం పిల్లలపై ఎలా ఉంటుందో చెప్పడానికి నిరాశ్రయులైన పాలస్తీనా పిల్లలే సాక్ష్యం. వారిలో నవ్వులు, సంతోషం కనిపించేవి కావు. నిద్ర నుంచి భయంతో ఉలిక్కిపడి లేచినట్లుగా కనిపించేవారు. కుటుంబానికి దూరమైన పిల్లలు ఎప్పుడూ శోకసముద్రంలో ఉండేవాళ్లు. వారికి ధైర్యం ఇవ్వాలి. ధైర్యంతో పాటు వారి బాల్యాన్ని వారికి తిరిగి ఇవ్వాలి. దీని కోసం యువ కళా బృందాలు రంగంలోకి దిగాయి. ఆట నుంచి పాట వరకు రకరకాల వినోద ప్రకియల ద్వారా వారిని జడత్వం నుంచి చలనంలోకి తీసుకువచ్చాయి. వారి కళ్లలో సంతోషాన్ని నింపుతున్నాయి...

దక్షిణ గాజా పట్టణం రఫాలో పాలస్తీనియన్‌లకు ఆశ్రయం కల్పిస్తున్న గుడారాలలో ఇజ్రాయెల్ బాంబుదాడులతో నిరాశ్రయులైన, కుటుంబసభ్యులు, తల్లిదండ్రులను కోల్పోయిన ఎంతోమంది పిల్లలు దీనంగా కనిపించేవారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మొదలైనప్పటి నుంచి నిరాశ్రయులైన పాలస్తీనియన్‌లలో సగం మంది చిన్నారులేనని ఐక్యరాజ్య సమితి గణంకాలు చెబుతున్నాయి. ఐక్యరాజ్య సమితి బాలల సంస్థ యూనిసెఫ్ గాజా స్ట్రిప్‌ను 'ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ప్రదేశం'గా చెప్పింది. ఇజ్రాయెల్ బాంబుదాడులతో మరణించిన పిల్లల శవాలను చూసిన యూనిసెఫ్ అధికార ప్రతినిధి జేమ్స్ ఎల్డర్‌కు దుఃఖాన్ని ఆపుకోవడం కష్టంగా మారింది.

సంగీతం, వినోదంతో పిల్లలకు ఉపశమనం కల్పించడానికి వచ్చిన ఎంతోమంది స్వచ్ఛంద కార్యకర్తలలో రువా హుస్సునా ఒకరు. పాలస్తీనా అంతటా ప్రాచుర్యం పొందిన తీగల వాయిద్యమైన ఓడ్‌ను ఆమె వాయిస్తుంటే పిల్లలకు పండగే. ఆమెతో పాటు ఎంతో మంది యువ వాలెంటీర్లు కథల నుంచి నృత్యం వరకు ఎన్నో ప్రకియల ద్వారా పిల్లలకు ఆనందాన్ని పంచుతున్నారు.

'పిల్లల్లో యుద్ధ భయాన్ని తొలిగించడానికి, ఒత్తిడిని దూరంగా చేయడానికి, వారు స్వేచ్ఛగా పాడుకునేలా చేయడానికి మేము చేయని ప్రయత్నం లేదు' అంటుంది 23 సంవత్సరాల రువా హుస్సునా.

'ఒకప్పుడు మాతో మాట్లాడటానికి పిల్లలు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు మాత్రం ఎలాంటి భయాలు, సంకోచాలు లేకుండా మాట్లాడుతున్నారు. మమ్మల్ని వారి కుటుంబసభ్యులుగా భావిస్తున్నారు' అంటుంది సామాజిక కార్యకర్త సారా అన్వర్.

ఇప్పుడు ఇజ్రాయెల్ సైన్యం ఉపయోగించే భయానకమైన డ్రోన్‌ల శబ్దాలు పిల్లలకు వినిపించడం లేదు. ఇప్పుడు వారికి సంగీతం మాత్రమే వినిపిస్తుంది. గాజా శిబిరంలోకి వాలెంటీర్ రువా హుస్సునా రాగానే పిల్లలు సంతోషంతో అరుస్తూ ఆమెను చుట్టుముడతారు. రువా బృందం రోజుకు కనీసం మూడు గంటల సమయాన్ని శిబిరాల్లో గడుపుతుంది. 'అమ్మా,నాన్నలు గుర్తొచ్చి ఎప్పుడూ ఏడుస్తూ ఉండేవాడిని. రువా అక్క వచ్చిన తరువాత సంతోషంగా ఉండగలుగుతున్నాను' అంటున్నాడు పన్నెండేళ్ల షాహీన్.

ఒకప్పుడు విషాద నిశ్శబ్దంలో మునిగిపోయి కనిపించే శరణార్థి శిబిరాల్లో ఇప్పుడు నవ్వులు వినిపిస్తున్నాయి. ఆటలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం టాకింగ్ థెరపీ నుంచి పాలస్తీనా సంప్రదాయ ఆటల వరకు ఎన్నెన్నో విద్యలను, ఆటలను, పాటలను శరణార్థి శిబిరంలోకి తీసుకువచ్చిన రువా హుస్సునా లాంటి స్వచ్ఛంద కార్యకర్తలు, కళాకారులు.



పిల్లల సంతోషం

నాకో డౌటు

ఏనుగు చెవి అంజీరా పండ్లు అంటే?




మనకు అంజీర తెలుసు. కానీ ఏనుగు చెవి అంజీర తెలీదు. ఈ చెట్లు ఏడాది పొడవునా పండ్లను ఇస్తాయి. ఏనుగు చెవి అంజీర శాస్త్రీయ నామం ఫైకస్ ఆరిక్యులేటా. దీని పుట్టిల్లు హిమాలయాలు. ఆకులు పెద్దగా విశాలమైన ఏనుగు చెవి అంత, హృదయాకారంలో ఆకర్షణీయంగా ఉంటాయి. అందువల్లనే దీనికి ఏనుగు చెవి అంజీర అని పేరు వచ్చింది. దీన్ని ప్రస్తుతం మన దేశంలో, ప్రపంచవ్యాప్తంగా ఉద్యాన వనాల్లో అలంకరణ మొక్కగా వాడుతున్నారు. ఈ చెట్టు 20 అడుగుల ఎత్తు పెరుగుతుంది. నాటిన 4–5 ఏళ్ల నుంచి కాపు మొదలవుతుంది. పండ్లు నేరుగా కాండం మీద కింది నుంచి పై వరకు గుంపులుగా, గుత్తులు గుత్తులుగా కాస్తాయి. తాజా పండ్లను కొనేవాళ్లు చాలా మంది ఉన్నారు. ఇవి ఎక్కువగా తమిళనాడులోని సేలం, కేరళలోని త్రిస్సూర్, తిరువనంతపురంలలో సాగవుతున్నాయి.

ఎర్రటి పండు...

పక్వానికి వచ్చిన పండు ఎరుపు రంగు నుంచి ముదురు ఎరుపు రంగులో ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్లలో కిలో రూ.300 వరకు పలుకుతోంది. పిండిపదార్థం, చక్కెర, బి విటమిన్లు, కె విటమిన్, ఖనిజలవణాలైన కాల్షియం, మెగ్నీషియం, మాంగనీసు, జింక్ తదితర పోషకాలు ఈ పండులో ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే సాధారణ అంజీర పండులో ఉండే పోషక గుణాలన్నీ ఏనుగు చెవి అంజీరలోనూ ఉన్నాయి. కాబట్టి అంజీరా దొరికినా, ఏనుగు చెవి అంజీరా దొరికినా తప్పకుండా తినండి. బలం వస్తుంది.

అమ్మ తోడు



పారిస్‌లో పారా ఒలింపిక్స్ జరుగుతున్నాయని తెలుసు కదా. అంటే దివ్యాంగుల ఆటల పోటీలు. మన దేశం నుంచి విలువిద్యలో శీతల్ దేవి పాల్గొంది. 'మిక్స్‌డ్ టీమ్ ఆర్చరీ'లో మరో విలుకాడు రాకేష్ శర్మతో కలిసి కాంస్య పతకం సాధించింది. పుట్టుకతోనే రెండు చేతులూ లేకుండా ఉన్న శీతల్‌దేవి చిన్నప్పటి నుంచి తనకు చేతులు లేవని బాధ పడలేదు. హుషారుగా చెట్లెక్కి అల్లరి చేసేది. ఎందుకో తెలుసా? ఆమె తల్లి శక్తి దేవి ఆమెను దివ్యాంగురాలిగా కాకుండా ఒక మామూలు అమ్మాయి లాగానే పెంచింది. 'అయ్యో.. నా కూతురికి చేతులు లేవే' అనే మాటలు మాట్లాడితే ఆత్మవిశ్వాసం ఉంటుందా మరి. జమ్ములోని చిన్న పల్లె నుంచి విలు విద్య ప్రదర్శన కోసం విదేశాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు శీతల్‌కు తల్లే తోడు వచ్చింది. అంత వరకూ పల్లెటూరు దాటి పట్టణం కూడా చూడని తల్లి ఎయిర్‌పోర్ట్‌లో విమానం ఎక్కి కూతురికి తోడు నిలిచింది. పోటీల్లో కూతురు పతకాలు సాధిస్తుంటే పొంగిపోయింది. అందుకే మొన్న పారిస్‌లో కాంస్యం తీసుకున్నాక శీతల్ 'అమ్మా... నీకే ఈ పతకం అంకితం. నువ్వుండబట్టే నేను ఇదంతా సాధించగలిగాను' అని సోషల్ మీడియాలో పంచుకుంది. తల్లి మన బలం. మన సమస్యలు దూరం చేసే శక్తి అమ్మ.

సాక్షి ప్లస్
శనివారం। 7-9-2024

బిజినెస్ రీల్

ఎక్స్‌టర్ కొత్త వేరియంట్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుండై తాజాగా ఎంట్రీ లెవెల్ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ ఎక్స్‌టర్ నుంచి రెండు కొత్త వేరియంట్లను ప్రవేశపెట్టింది. మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో తయారైన ఎస్(ఓ) ధర ఎక్స్‌షోరూంలో రూ.7.86 లక్షలు కాగా, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో రూపొందిన ఎస్ ప్లస్ ధర రూ.8.44 లక్షలు ఉంది. 1.2 లీటర్, 4 సిలిండర్ పెట్రోల్ ఇంజన్‌తో తయారైన ఈ కారుకు స్మార్ట్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, కలర్ టీఎఫ్‌టీ మల్టీ ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లేతో డిజిటల్ క్లస్టర్, 8 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ఆన్‌డ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, రేర్ ఎయిర్ కండీషనర్ వెంట్స్, ఆల్ పవర్ విండోస్ వంటి హంగులు జోడించారు. ఆరు ఎయిర్‌బ్యాగ్స్, 3 పాయింట్ సీట్‌బెల్ట్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్, వెహికిల్ స్టెబిలిటీ మేనేజ్‌మెంట్, ఏబీఎస్, ఈబీడీ, ఇంపాక్ట్ సెన్సింగ్ ఆటో డోర్ అన్‌లాక్, ఎమర్జెన్సీ స్టాప్ సిగ్నల్ అదనపు ఫీచర్లు.

ఫార్మాలోకి 135 మిలియన్ డాలర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత ఫార్మా, హెల్త్‌కేర్ రంగ కంపెనీలు 2024 ఆగస్ట్‌లో 135 మిలియన్ డాలర్ల నిధులను అందుకున్నాయి. ట్రాక్ఎక్స్ఎన్ ప్రకారం.. గత నెలలో ఈ రంగంలోకి నిధుల రాక ప్రస్తుత సంవత్సరం జూలైతో పోలిస్తే 382 శాతం, గతేడాది ఆగస్ట్‌తో పోలిస్తే 20.5 శాతం పెరిగింది. కంపెనీలకు గత నెలలో లేట్ స్టేజ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా 62.2 శాతం, ఎర్లీ స్టేజ్ 31.5 శాతం, సీడ్ స్టేజ్ ద్వారా 6.3 శాతం నిధులు సమకూరాయి. జేడ్ బయోసైన్స్ 80 మిలియన్ డాలర్లు, ఈవెన్ హెల్త్‌కేర్ 20.2 మి.డాలర్లు, ఫార్మ్‌జీ 15 మిలియన్ డాలర్లను చేజిక్కించుకున్నాయి. వెన్‌రాక్, సిడ్బీ వెంచర్ క్యాపిటల్, ఖోస్లా వెంచర్స్ చురుకైన వీసీలుగా నిలిచాయి. భారత ఫార్మా, హెల్త్‌కేర్ రంగంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్‌లో అత్యధికంగా 626 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వెల్లువెత్తాయి. మే నెలలో 286 మి.డాలర్లు, జూన్‌లో 185, జూలైలో 28 మిలియన్ డాలర్ల నిధులు వచ్చి చేరాయి.

క్రెడ్‌తో ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ జట్టు

ముంబై: నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థ ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ తాజాగా పేమెంట్స్ ప్లాట్‌ఫాం క్రెడ్‌తో జట్టు కట్టింది. న్యూటాప్ ఫైనాన్స్ అనే సహ భాగస్వామి ద్వారా క్రెడ్ కస్టమర్లకు సులభతరంగా రుణాలు అందించేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడగలదు. దీనితో తాము కో-లెండింగ్ వ్యాపార విభాగంలోకి ప్రవేశించినట్లవుతుందని ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ ఎండీ సుదీప్తా రాయ్ తెలిపారు. మెరుగైన క్రెడిట్ స్కోరు, పేమెంట్స్ హిస్టరీ గల తమ కస్టమర్లకు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో నిమిషాల వ్యవధిలోనే రుణాలు అందించేందుకు ఈ ఒప్పందం తోడ్పడగలదని క్రెడ్ వ్యవస్థాపకుడు కునాల్ షా పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో)

7-9-2024	
విశాఖ	490-00
చిత్తూరు	518-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	480-00
విజయవాడ	485-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	470-00
వరంగల్	472-00
రిటైల్ ధర	5.30

నిఫ్టీ 50 టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	7,314.85	0.97
ASIANPAINT	3,266.50	0.87
JSWSTEEL	931	0.6
LTIM	6,171.65	0.36
NESTLEIND	2,510.00	0.2

నిఫ్టీ 50 టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBIN	783.9	-4.26
BPCL	352.25	-2.34
ICICIBANK	1,209.45	-2.14
NTPC	395	-2.05
HCLTECH	1,754.00	-2.04

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,851
ఎన్ఎస్ఈ	1,28,603
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,37,005
ఎఫ్ఐఐ	-621
డీఐఐ	+2,122

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.83	$ 69.15
బ్రెంట్	71.23	$ 72.69

వొడాఫోన్‌కు గోల్డ్‌మన్ శాక్స్ షాక్

అంచనా విలువ తగ్గింపుతో షేరు పతనం



న్యూఢిల్లీ: టెలికం రంగ కంపెనీ వొడాఫోన్ ఐడియా మార్కెట్ వాటా రానున్న 3-4 ఏళ్ల కాలంలో తగ్గుతూనే ఉంటుందని బ్రోకరేజీ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ తాజాగా అభిప్రాయపడింది. వొడాఫోన్ ఐడియా ఇటీవల చేపట్టిన మూలధన సమీకరణ సానుకూల అంశమే అయినప్పటికీ మార్కెట్ వాటా కోల్పోవడాన్ని అరికట్టబోదని గోల్డ్‌మన్ శాక్స్ పేర్కొంది. రానున్న 3-4 ఏళ్లలో 300 బేసిస్ పాయింట్ల(3 శాతం)మేర మార్కెట్ వాటాకు కోత పడనున్నట్లు అంచనా వేసింది. ఈ సందర్భంగా పెట్టుబడి వ్యయాలు, ఆదాయ మార్కెట్ వాటా మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని ప్రస్తావించింది. వొడాఫోన్ ఐడియాతో పోలిస్తే ప్రత్యర్థి కంపెనీలు 50 శాతం అధికంగా పెట్టుబడులను వెచ్చిస్తున్నట్లు పేర్కొంది. ఇటీవల నిధులను సమీకరించడం ఈ టెలికం కంపెనీకి సానుకూల అంశమేనని, అయితే మార్కెట్ వాటా బలహీనపడటాన్ని నివారించలేదని విదేశీ బ్రోకింగ్ సంస్థ వ్యాఖ్యానించింది. వెరసి సానుకూల ధోరణితో చూస్తే షేరు అంచనా విలువను రూ. 19గా పేర్కొంది. ప్రస్తుత రేటు(గురువారం ముగింపు)తో పోలిస్తే 26 శాతం అధికమైనప్పటికీ బేస్‌కేసుగా చేసిన మదింపుతో చూస్తే మాత్రం 83 శాతం పతనంకావచ్చని తెలియజేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2025-26) నుంచి వొడాఫోన్‌కు సర్దుబాటుచేసిన స్థూల ఆదాయ(ఏజీఆర్) స్పెక్ట్రమ్ సంబంధ చెల్లింపులు ప్రారంభంకానున్నట్లు తెలియజేసింది. వీటిలో కొంతమేర బకాయిలను ఈక్విటీగా మార్చుకునేందుకు ప్రభుత్వానికి అవకాశమున్న విషయాన్ని ప్రస్తావించింది. అయితే ఫ్రీక్యాష్‌ఫ్లో స్థితికి చేరేందుకు ఏఆర్‌పీయూ రూ. 200-270కు జంప్‌చేయవలసి ఉన్నట్లు అంచనా వేసింది. సమీపకాలంలో ఇది జరిగేందుకు అవకాశాలు తక్కువేనని అభిప్రాయపడింది. టారిఫ్‌ల పెంపు, పెట్టుబడుల సమీకరణ నేపథ్యంలోనూ 2025 మార్చికల్లా నికర రుణభారం-నిర్వహణ లాభం(ఇబిటా) నిష్పత్తి మెరుగుపడకపోవచ్చని వివరించింది.

ఈ నేపథ్యంలో వొడాఫోన్ ఐడియా షేరు బీఎస్ఈలో 11.5% పతనమై రూ. 13.36 వద్ద ముగిసింది.

బ్యాంకుల్లో అప్రెంటిస్‌లుగా గ్రాడ్యుయేట్లు



ముంబై: అప్రెంటిస్‌లుగా 25 ఏళ్లలోపు గ్రాడ్యుయేట్లను నియమించుకోవడానికి బ్యాంకులు యోచిస్తున్నాయని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ సునీల్ మెహతా శుక్రవారం తెలిపారు. 12 నెలల అప్రెంటిస్‌షిప్‌లో భాగంగా అభ్యర్థులకు ప్రత్యేక నైపుణ్యంపై శిక్షణ ఇస్తారు. వీరికి నెలకు రూ.5,000 స్టైపెండ్‌ను బ్యాంకులు చెల్లిస్తాయని మెహతా వెల్లడించారు. 'నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం లేని మార్కెటింగ్, రికవరీ వంటి అనేక విభాగాలు ఉన్నాయి. వారికి ఆయా విభాగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తాము. 21-25 ఏళ్ల వయసున్న గ్రాడ్యుయేట్లు అర్హులు. అభ్యర్థి పన్ను చెల్లింపుదారు కాకూడదు. అలాగే ఐఐటీ, ఐఐఎం వంటి అగ్రశ్రేణి సంస్థల నుండి డిగ్రీని కలిగి ఉండకూడదు. బ్యాంకింగ్ సేవలను చివరి మైలు వరకు తీసుకువెళ్లే అప్రెంటిస్‌లను బిజినెస్ కరస్పాండెంట్లుగా కూడా నియమించుకోవచ్చు. శిక్షణ పూర్తి అయ్యాక వారిలో కొందరు ఉద్యోగులుగా చేరే అవకాశమూ ఉంది. అన్ని బ్యాంకులు నెలరోజుల్లోగా అప్రెంటిస్‌లను నియమించుకోనున్నాయి. ఈ స్కీమ్ అమలుకు ప్రభుత్వ మద్దతు కూడా ఉంది' అని చెప్పారు. అయితే ఎంత మందిని అప్రెంటిస్‌లుగా చేర్చుకుంటారనేది వెల్లడి కాలేదు. ఐబీఏ ఈ స్కీమ్‌పై కార్పొరేట్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ సెక్రటరీతో గురువారం చర్చించింది.



ఎన్ఎస్ఈ ఆవరణలో నూతన 'బుల్'

ఎన్ఎస్ఈ ఆవరణలో మార్కెట్ దూకుడుకు సంకేతమైన 'బుల్' విగ్రహాన్ని ఆవిష్కరించిన మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఆశిష్‌కుమార్ చౌహాన్, మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్. ఈ 'బుల్' విగ్రహం వెనుక భాగంలో భారతీయ కుటుంబ వ్యవస్థకు ప్రతీకాత్మకంగా ఆరు విగ్రహాలు ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మ్యాక్స్ ఫైనాన్షియల్‌లో వాటా అమ్మకం

3.18 శాతం విలువ రూ. 1,218 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో ప్రమోటర్ మ్యాక్స్ వెంచర్స్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ 3.18 శాతం వాటా విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 1.10 కోట్ల షేర్లను అమ్మివేసింది. ఎన్ఎస్ఈ బల్క్ డీల్ వివరాల ప్రకారం షేరుకి రూ. 1,107.37 సగటు ధరలో వీటిని విక్రయించింది. తద్వారా రూ. 1,218 కోట్లకుపైగా అందుకుంది. అయితే కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు.

ఎన్ఎస్ఈలో మ్యాక్స్ ఫైనాన్షియల్ షేరు అర శాతం పెరిగి రూ. 1,121 వద్ద ముగిసింది.

ఆహారంపై భారీగా తగ్గిన వ్యయాలు

ఈఏసీ-పీఎం వర్కింగ్ పేపర్‌లో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా కుటుంబాలు ఆహారంపై సగటున చేసే వ్యయాలు 1947 నాటితో పోలిస్తే తొలిసారిగా సగానికి పైగా తగ్గినట్లు ప్రధాని ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) ఒక వర్కింగ్ పేపర్‌లో వెల్లడించింది. దీని ప్రకారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాలు నెలవారీగా చేసే మొత్తం వ్యయాల్లో ఆహారానికి వెచ్చించేది భారీగా తగ్గింది. అట్టడుగున ఉండే 20 శాతం మంది విషయంలో ఇది మరింత గణనీయంగా ఉంది. అన్ని రాష్ట్రాల్లోని వారికి, ముఖ్యంగా అట్టడుగు 20 శాతం కుటుంబాలపై ప్రధానంగా లబ్ధి చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వ ఆహార భద్రత పాలసీలు సమర్థమంతంగా అమలవుతుండటాన్ని ఇది ప్రతిఫలిస్తోందని వర్కింగ్ పేపర్ పేర్కొంది. ఇక, వివిధ వర్గాల్లో తృణధాన్యాల వినియోగం తగ్గుతున్న నేపథ్యంలో వాటికి సంబంధించి తగు సాగు విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని వివరించింది. 2011-12 నాటి వినియోగ ధోరణులను 2022-23తో పోలుస్తూ ఈ పేపర్ సమగ్రంగా విశ్లేషించింది.

త్వరలో 'ఇండియాసైజ్': కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్



న్యూఢిల్లీ: దుస్తులకు సంబంధించి భారతీయుల శరీరాకృతులకు తగినట్లుగా కొలమానాలను ప్రామాణీకరించేలా త్వరలో 'ఇండియాసైజ్' ప్రమాణాలను ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం దేశీయంగా దుస్తులను స్మాల్, మీడియం, లార్జ్ తదితర కేటగిరీల్లో వర్గీకరించేందుకు అమెరికా, బ్రిటన్ ప్రమాణాలను పాటిస్తున్నారు. అయితే, భారతీయుల ఎత్తు, బరువు లేదా నిర్దిష్ట శరీరభాగాల కొలతలు పాశ్చాత్యులతో పోలిస్తే భిన్నంగా ఉంటున్న నేపథ్యంలో ఫిట్టింగ్ పరమైన సమస్యలు వస్తుంటాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ ఇండియా సైజ్ ప్రాజెక్టును తలపెట్టింది.

క్రికెట్ ఆదాయం జూమ్: సన్ టీవీ

న్యూఢిల్లీ: క్రికెట్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ ద్వారా ఆదాయం భారీగా పెరగనున్నట్లు బ్రాడ్‌క్యాస్టింగ్ సంస్థ సన్ టీవీ నెట్‌వర్క్ అంచనా వేసింది. ఇది సినిమాల పంపిణీ బిజినెస్‌కు మద్దతునివ్వగలదని అభిప్రాయపడింది. ఆర్థిక సంవత్సరం (2023-24)లో సాధారణ ఎంటర్‌టైన్‌మెంట్ చానల్.. సన్ నియో ద్వారా హిందీ భాషా కార్యక్రమాలలోకి ప్రవేశించింది. అంతే కాకుండా బంగ్లా, మరాఠీ భాషలకూ విస్తరించింది. పటిష్ట కంటెంట్ ద్వారా ఆయా మార్కెట్లలో పోటీకి నిలవడమేకాకుండా పట్టుసాధించనున్నట్లు కంపెనీ తాజా వార్షిక నివేదికలో తెలియజేసింది. మారన్ కుటుంబం ప్రమోట్ చేసిన సన్ టీవీ గ్రూప్ ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)లో సన్‌రైజర్స్ హైదరాబాద్ క్రికెట్ ఫ్రాంచైజీని కలిగి ఉన్న సంగతి తెలిసిందే. దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లోనూ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ అఫ్ క్రికెట్ ఫ్రాంచైజీని నిర్వహిస్తోంది. క్రికెట్ ఫ్రాంచైజీల ద్వారా గతేడాది రూ. 659 కోట్ల ఆదాయం సాధించింది. అంతక్రితం ఏడాది రూ. 276 కోట్ల ఆదాయం మాత్రమే అందుకుంది. ఇక మూవీల పంపిణీ, హక్కుల విక్రయం ద్వారా 24 శాతం అధికంగా రూ. 313.5 కోట్ల ఆదాయం ఆర్జించింది. మరోవైపు జనరల్ ఎంటర్‌టైన్‌మెంట్, సినిమాలు, సంగీతం, వార్తలు, పిల్లల కోసం కంటెంట్ ద్వారా దక్షిణాదిలోని 4 కీలక రాష్ట్రాలలో కార్యకలాపాలు విస్తరించింది.

అమెజాన్ ఇండియా రూ.1.08 లక్ష కోట్ల ఎగుమతులు!

- 2024 చివరికి చేరుకుంటాయ్
- సంస్థ డైరెక్టర్ భూపేన్ వకంకర్



న్యూఢిల్లీ: భారత్ నుంచి అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ (అమెజాన్ ఇండియా ఎగుమతుల కార్యక్రమం) ఎగుమతులు ఈ ఏడాది చివరికి మొత్తంగా 13 బిలియన్ డాలర్లకు (రూ.1.08 లక్షల కోట్లు) చేరుకుంటాయని సంస్థ డైరెక్టర్ భూపేన్ వకంకర్ తెలిపారు. 2025 నాటికి 20 బిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకునే మార్గంలోనే ఉన్నట్టు చెప్పారు. 2015లో అమెజాన్ ఇండియా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచి భారత్‌లో తయారైన 40 కోట్లకుపైగా ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా అందించినట్టు వకంకర్ తెలిపారు. 2015 నుంచి 2023 మధ్య అమెజాన్ 8 బిలియన్ డాలర్ల ఎగుమతులే నమోదు చేయగా, కేవలం ఏడాది వ్యవధిలోనే (2023-24) 13 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు వివరించారు. గడిచిన 12 నెలల్లో 50వేల కొత్త విక్రేతలను ఇందులో చేర్చుకున్నట్టు తెలిపారు. దీంతో మొత్తం విక్రేతల సంఖ్య 1.5 లక్షలకు చేరుకున్నట్టు వెల్లడించారు. దేశీ విక్రేతలు అంతర్జాతీయ బ్రాండ్ల సృష్టికి అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ వీలు కల్పిస్తోంది. సౌందర్య ఉత్పత్తుల ఎగుమతులు 2023లో 40 శాతం వృద్ధిని చూడగా, వస్త్రాలు, ఆరోగ్యం, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు అత్యధిక వృద్ధితో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. యూఎస్, యూకే, కెనడా, జర్మనీ భారత విక్రేతలకు ప్రధాన ఎగుమతి మార్కెట్లుగా ఉన్నట్టు అమెజాన్ విడుదల చేసిన 'ది ఎక్స్‌పోర్ట్స్ డైజెస్ట్ 2024' నివేదిక వెల్లడించింది.

ఈజెనెసిస్‌లో నాట్కో పెట్టుబడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ నాట్కో ఫార్మాకు చెందిన నాట్కో ఫార్మా (కెనడా) తాజాగా యూఎస్‌లోని బయోటెక్నాలజీ కంపెనీ ఈజెనెసిస్‌లో రూ.67 కోట్ల పెట్టుబడి పెట్టింది. తద్వారా 4,06,29,761 షేర్లను కొనుగోలు చేయాలని కంపెనీ భావిస్తోంది. 2024 సెప్టెంబర్ 30లోగా ఈ ప్రక్రియ పూర్తి కానుంది.



జినోట్రాన్స్‌ప్లాంటేషన్‌లో ముందంజలో ఉన్న బయోటెక్నాలజీ సంస్థ ఈజెనెసిస్.. మార్పిడి కోసం సురక్షిత, సమర్థవంత మానవ-అనుకూల అవయవాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించింది. మానవులకు చికిత్స చేయడానికి మానవేతర కణాలు, కణజాలాలు లేదా అవయవాలను ఉపయోగించడమే జినోట్రాన్స్‌ప్లాంటేషన్. సజీవ రోగికి పోర్సిన్ కిడ్నీ మార్పిడిని 2024 మార్చిలో ఈజెనెసిస్ ప్రకటించింది. ఈ ప్రక్రియకు యూఎస్ ఫుడ్, డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ఎఫ్‌డీఏ) ఆమోదం పొందింది. 'జినోట్రాన్స్‌ప్లాంటేషన్ టెక్నాలజీ ప్రపంచ అవయవ మార్పిడి కొరతను అంతం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అవయవ మార్పిడి చికిత్స విధానాన్ని సమూలంగా మారుస్తుందన్న ఈజెనెసిస్ దృష్టితో మేము అంగీకరిస్తున్నాము' అని నాట్కో ఫార్మా వైస్ చైర్మన్, సీఈవో రాజీవ్ నన్నపనేని ఈ సందర్భంగా తెలిపారు. కాగా, డీల్ నేపథ్యంలో నాట్కో షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో బుధవారం 1.72 శాతం ఎగసి రూ.1,555.15 వద్ద స్థిరపడింది.

కైనెటిక్ ఫ్యామిలీ ఈ-స్కూటర్

ఏడాదిన్నరలో ప్రవేశపెడతాం

- ఫౌండర్ సులజ్జ ఫిరోదియా



పుణే: ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ కైనెటిక్ గ్రీన్ ఏడాదిన్నరలో ఫ్యామిలీ ఈ-స్కూటర్‌ను మార్కెట్‌లోకి తేనున్నట్టు ప్రకటించింది. 2025 మార్చిలోగా ఎల్5 విభాగంలో ప్యాసింజర్ త్రీ-వీలర్‌ను ప్రవేశపెట్టనున్నట్టు తెలిపింది. 2030 నాటికి రూ.10,000 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా చేసుకున్నట్టు సంస్థ ఫౌండర్, సీఈవో సులజ్జ ఫిరోదియా మోత్వానీ వెల్లడించారు. ఇందులో 60 శాతం ద్విచక్ర వాహన విభాగం, 35 శాతం త్రిచక్ర వాహనాల నుంచి సమకూరాలన్నది ఆలోచనగా చెప్పారు. మోటార్‌సైకిల్స్ విభాగంలోకి ఎంట్రీ ఇవ్వబోమని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహన విభాగంలో ఈ-స్కూటర్స్, ఈ-లూనాకు పరిమితం అవుతామని తెలిపారు. కైనెటిక్ గ్రీన్ గత నెలలో గ్రేటర్ పసిఫిక్ క్యాపిటల్ (జీపీసీ) నుంచి 25 మిలియన్ డాలర్ల పెట్టుబడి అందుకుంది. ఎలక్ట్రిక్ టూ, త్రీ వీలర్ల వ్యాపార విస్తరణకు ఈ నిధులకు కంపెనీ ఖర్చు చేయనుంది. లంబోర్గినీ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన ప్రీమియం గోల్ఫ్ కార్ట్ శ్రేణి ద్వారా విదేశాల్లో విస్తరించాలని సంస్థ నిర్ణయించింది. సిరీస్-ఏ నిధుల సమీకరణలో భాగంగా మరో 15 మిలియన్ డాలర్లను ఈ ఏడాది డిసెంబర్ కల్లా స్వీకరించే అవకాశం ఉందని సులజ్జ వెల్లడించారు. 16 గంటలపాటు కార్యకలాపాలు సాగించే కార్గో ఈ-త్రీ వీలర్స్ కోసం అల్ట్రా ఫాస్ట్ చార్జింగ్ సొల్యూషన్‌ను కంపెనీ అభివృద్ధి చేసింది.

జీఐసీ ఆర్ఈ ఓఎఫ్ఎస్ సక్సెస్

రూ. 2,300 కోట్ల విలువైన బిడ్స్ దాఖలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(జీఐసీ ఆర్ఈ) చేపట్టిన ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)కు సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ కనిపించింది. ఇష్యూ తొలి రోజే పూర్తి స్థాయిలో సబ్‌స్క్రయిబ్ అయ్యింది. ప్రభుత్వం 5.35 కోట్ల షేర్లను ఆఫర్ చేయగా.. రిటైలేతర ఇన్వెస్టర్ల నుంచి 108 శాతం అధికంగా 5.81 కోట్ల షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. బిడ్స్ సంకేత ధర రూ. 395 ప్రకారం వీటి మొత్తం విలువ రూ. 2,300 కోట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రభుత్వం చేపట్టిన తొలి డిజిన్వెస్ట్‌మెంట్ ఇది. గురువారం(5న) రిటైల్ ఇన్వెస్టర్లు దరఖాస్తు చేసేందుకు విండో ఓపెన్ అయ్యింది. తొలి వార్తల ప్రకారం 3.3 శాతానికి బిడ్స్ లభించినట్లు తెలుస్తోంది. కంపెనీలో ప్రభుత్వం 3.39 శాతం వాటాకు సమానమైన 5.95 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచింది. వీటి ఆఫర్(ఫ్లోర్) ధర రూ. 395కాగా.. అధిక డిమాండ్ లభిస్తే మరో 3.39 శాతం వాటాను సైతం ఆఫర్ చేసే అవకాశాన్ని(గ్రీన్‌షూ ఆప్షన్) ప్రభుత్వం వినియోగించుకోనుంది.

ఇక్కడ ఇళ్లు కొనడం సాధ్యమే!

- చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతాలో చౌక
- ముంబై, ఢిల్లీలో చాలా ఖరీదు
- మ్యాజిక్‌బ్రిక్స్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: అందుబాటు ధరల ఇళ్లకు చిరునామాగా చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతా నగరాలు నిలుస్తున్నాయి. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), ఢిల్లీ నగరాలు మాత్రం ఇళ్ల కొనుగోలు పరంగా ఖరీదైనవని ప్రాప్‌టెక్ సంస్థ మ్యాజిక్‌బ్రిక్స్ వెల్లడించింది. ప్రధాన పట్టణాల్లో ఇళ్ల ధరల తీరుపై ఒక నివేదిక విడుదల చేసింది. ఓ ఇంటి వార్షిక ఆదాయం నుంచి ఇంటి ధర (పీఐ రేషియో) నిష్పత్తి 2020లో ఉన్న 6.6 శాతం నుంచి 2024లో 7.5 శాతానికి పెరిగింది. అంటే ఓ ఇంటి వారందరూ ఏడున్నరేళ్లు కష్టపడి సంపాదించినంతా వెచ్చిస్తే కానీ ఇల్లు సమకూర్చుకోలేని పరిస్థితి. పీఐ రేషియో చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతాలో 5 చొప్పున ఉంది. అందుకే ఇక్కడి ఇళ్ల ధరలు అందుబాటులో ఉన్నట్టు ఈ నివేదిక పేర్కొంది. ఎంఎంఆర్‌లో 14.3గా ఉంటే, ఢిల్లీలో 10.1గా ఉంది. అంటే ఇక్కడ ఇళ్ల ధరలు ఖరీదుగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈఎంఐ - నెలవారీ ఆదాయం రేషియో 2020లో ఉన్న 46 శాతం నుంచి 2024 నాటికి 61 శాతానికి పెరిగింది. అంటే నెలవారీ వేతనంలో ఈఎంఐ వాటా 61 శాతానికి చేరింది. ఇళ్ల కొనుగోలుదారులపై పెరిగిన ఈఎంఐ భారాన్ని ఇది సూచిస్తోంది. నెలవారీ ఆదాయంలో ఈఎంఐ రేషియో ఢిల్లీలో 82 శాతం, ఎంఎంఆర్‌లో 116 శాతంగా ఉంది. హైదరాబాద్, గురుగ్రామ్‌లో 61 శాతం చొప్పున ఉంది. అహ్మదాబాద్, చెన్నైలో 41 శాతంగా, కోల్‌కతాలో 47 శాతంగా ఉంది.

అసాధారణంగా పెరిగిన ధరలు

2021 ద్వితీయ ఆరు నెలలతోపాటు 2022లోనూ ఇళ్ల ధరలు ఎంతో అందుబాటులో ఉన్నాయి. తక్కువ వడ్డీ రేట్లు, గృహ ఆదాయాలు తిరిగి పుంజుకోవడంతో ఈ కాలంలో ఇళ్ల ధరలు తిరిగి పుంజుకున్నాయి. సొంతిల్లు కలిగి ఉండాలన్న ఆకాంక్షతో డిమాండ్ సరఫరాను మించిపోయింది. దీంతో ఇళ్ల ధరలు అసాధారణ స్థాయిలో పెరిగాయి. దీంతో అందుబాటు ధరల ఇళ్ల కొనుగోలు పరంగా సవాళ్లను తీసుకొచ్చింది" అని మ్యాజిక్‌బ్రిక్స్ సీఈవో సుధీర్ పాయ్ పేర్కొన్నారు.

స్టార్టప్‌లతో గ్రీన్ హైడ్రోజన్‌కు ఊతం

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి
- 11 నుంచి గ్రీన్‌హైడ్రోజన్ సదస్సు



న్యూఢిల్లీ: గ్రీన్ హైడ్రోజన్ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. అప్పుడే కొత్త ఆలోచనలు, యువతను ఆకర్షించగలమన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ఇండియా 2024 రెండో అంతర్జాతీయ సదస్సు ప్రారంభానికి ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగే ఈ కార్యక్రమంలో 120 ప్రదర్శకులు పాల్గొననున్నారు. గ్రీన్ హైడ్రోజన్‌పై గతేడాది మొదటి అంతర్జాతీయ సదస్సు తర్వాత, ఈ విడత మరింత పెద్ద మొత్తంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మంత్రి చెప్పారు. ఇప్పటికే 2,000 మంది రిజిస్టర్ చేసుకోగా, 6,000 వరకు రిజిస్ట్రేషన్లు నమోదు అవుతాయని అంచనా వేస్తున్నట్టు తెలిపారు.

జోలోప్యాక్‌వైపు బాలీవుడ్ చూపు

- పెట్టుబడులకు పలువురు నటులు
- జాబితాలో అమీర్ ఖాన్, కరణ్

న్యూఢిల్లీ: పర్యావరణహిత(సస్టెయినబుల్) డిస్పోజబుల్ ప్యాకింగ్ సంస్థ జోలోప్యాక్ ఇండియాలో పెట్టుబడులకు పలువురు బాలీవుడ్ అగ్రహీరోలు ఆసక్తి చూపుతున్నారు. సెలబ్రిటీ నటులు అమీర్ ఖాన్, రణబీర్ కపూర్, కరణ్ జోహార్ పబ్లిక్ ఇష్యూకంటే ముందుగా కంపెనీలో ఇన్వెస్ట్ చేశారు. అంతేకాకుండా రోజీబ్లూ ఇండియా యజమాని రసెల్ మెహతా, ఆకాశ్ అంబానీ మామ సైతం కంపెనీలో మైనారిటీ వాటాలను సొంతం చేసుకున్నారు. అయితే ఎవరెంత ఇన్వెస్ట్ చేసిందీ వెల్లడికాలేదు. సంస్థ ప్రీఐపీవో రౌండ్‌లో వాటాలు కొనుగోలు చేసిన జాబితాలో రివర్‌స్టోన్ క్యాపిటల్‌కు చెందిన దేవనాథన్ గోవిందరాజన్, మినర్వా వెంచర్స్ ఫండ్, నెక్సా ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పీ, ఎస్‌వీఎస్ కార్పొరేట్ కన్సల్టెన్సీ సర్వీసెస్, టపస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, సరోద్ రియల్టీ, ఫిరోజ్ ఫామ్స్ అండ్ హోల్డింగ్స్, వినే ఈక్విటీ మార్కెట్ ఎల్ఎల్‌పీ చేరాయి.

కంపెనీ వివరాలివీ..

పుణేకు చెందిన జోలోప్యాక్ ఇండియా ఆర్గానిక్ డిస్పోజబుల్ చాకులు(కట్లెరీ), ఐస్‌క్రీమ్ స్టిక్స్, స్పూన్లు తదితర ఉత్పత్తులను రూపొందిస్తోంది. కంపెనీ ఇప్పటికే పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు వీలుగా స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ ఎమర్జ్‌కు ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా 52.86 లక్షల షేర్లను కొత్తగా జారీ చేయనుంది. గతేడాది(2023-24) కంపెనీ ఆదాయం రూ. 12 కోట్ల నుంచి రెండున్నర రెట్లు జంప్‌చేసి రూ. 31.5 కోట్లకు చేరింది. నికర లాభం సైతం రూ. 3.5 కోట్ల నుంచి రూ. 6.4 కోట్లకు ఎగసింది.


నవదీప్ సైనీ

సైనీ ఆల్‌రౌండ్ ప్రదర్శన

- అర్ధ సెంచరీతో పాటు 2 వికెట్లు
- భారత్ 'బి' 321 ఆలౌట్
- భారత్ 'ఎ' 134/2
- దులీప్ ట్రోఫీ

బెంగళూరు: భారత్ 'ఎ' జట్టుతో జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 'బి' జట్టు 116 ఓవర్లలో 321 పరుగులకు ఆలౌటైంది. ముషీర్ ఖాన్ (373 బంతుల్లో 181; 16 ఫోర్లు, 5 సిక్సర్లు) తన ఓవర్‌నైట్ స్కోరుకు మరిన్ని పరుగులు జోడించగా...పేసర్ నవ్‌దీప్ సైనీ (144 బంతుల్లో 56;8 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధ శతకంతో సత్తా చాటాడు. చిన్నస్వామి స్టేడియంలో జరుగుతున్న ఈ పోరులో 94 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన దశలో ఈ ఇద్దరూ ఎనిమిదో వికెట్‌కు 205 పరుగులు జోడించి భారత్ 'బి'ని గట్టెక్కించారు. డబుల్ సెంచరీ చేసేలా కనిపించిన ముషీర్ ఖాన్‌ను కుల్దీప్ యాదవ్ ఔట్ చేశాడు. ఆ తర్వాత భారత్ 'బి' ఇన్నింగ్స్ ఎక్కువసేపు సాగలేదు. భారత్ 'ఎ' జట్టు బౌలర్లలో ఆకాశ్ దీప్ 4, ఖలీల్ అహ్మద్, అవేశ్ ఖాన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ 'ఎ' జట్టు శుక్రవారం ఆట ముగిసే సమయానికి 35 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 134 పరుగులు చేసింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (25), మయాంక్ అగర్వాల్ (36; 8 ఫోర్లు) ఔట్ కాగా.. రియాన్ పరాగ్ (27 బ్యాటింగ్), కేఎల్ రాహుల్ (23) క్రీజులో ఉన్నారు. ఈ రెండు వికెట్లూ నవదీప్ సైనీకే దక్కాయి. చేతిలో 8 వికెట్లు ఉన్న భారత్ 'ఎ' జట్టు... ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 187 పరుగులు వెనుకబడి ఉంది.

స్కోరు వివరాలు

భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) (సబ్) రావత్ (బి) ఖలీల్ అహ్మద్ 30; అభిమన్యు ఈశ్వరన్ (సి) ధ్రువ్ జురెల్ (బి) అవేశ్ ఖాన్ 13; ముషీర్ ఖాన్ (సి) రియాన్ పరాగ్ (బి) కుల్దీప్ యాదవ్ 181; సర్ఫరాజ్ ఖాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అవేశ్ ఖాన్ 9; రిషభ్ పంత్ (సి) శుభ్‌మన్ గిల్ (బి) ఆకాశ్‌దీప్ 7; నితీశ్ కుమార్ రెడ్డి (బి) ఆకాశ్‌దీప్ 0; వాషింగ్టన్ సుందర్ (రనౌట్) 0; సాయికిశోర్ (సి) కేఎల్ రాహుల్ (బి) ఖలీల్ అహ్మద్ 1; నవ్‌దీప్ సైనీ (సి) రియాన్ పరాగ్ (బి) ఆకాశ్‌దీప్ 56; యష్ దయాల్ (సి) మయాంక్ అగర్వాల్ (బి) ఆకాశ్‌దీప్ 10; ముఖేశ్ కుమార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 14, **మొత్తం: 116 ఓవర్లలో 321. వికెట్ల పతనం:** 1-33, 2-53, 3-67, 4-80, 5-80, 6-89, 7-94, 8-299, 9-320, 10-321,**బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 23-6-54-2; ఆకాశ్‌దీప్ 27-7-60-4; అవేశ్ ఖాన్ 22-6-59-2; శివమ్ దూబే 12-4-14-0; కుల్దీప్ యాదవ్ 21-3-82-1; తనుశ్ కొటియాన్ 7-0-30-0; రియాన్ పరాగ్ 4-0-12-0.

భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్: మయాంక్ అగర్వాల్ (సి) పంత్ (బి) సైనీ 36; శుభ్‌మన్ గిల్ (బి) సైనీ 25; రియాన్ పరాగ్ (నాటౌట్) 27; కేఎల్ రాహుల్ (నాటౌట్) 23; ఎక్స్‌ట్రాలు: 23; **మొత్తం: 35 ఓవర్లలో 134/2. వికెట్ల పతనం:** 1-57, 2-66, **బౌలింగ్:** ముఖేశ్ కుమార్ 9-0-40-0; యష్ దయాల్ 10-1-25-0;నితీశ్ కుమార్ రెడ్డి 7-2-16-0; నవ్‌దీప్ సైనీ 8-1-36-2; సాయి కిషోర్ 1-0-1-0.

శ్రేయస్, పడిక్కల్ అర్ధ సెంచరీలు


శ్రేయస్ అయ్యర్


దేవదత్ పడిక్కల్

- భారత్ 'డి' రెండో ఇన్నింగ్స్ 206/8
- భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్ 168

సాక్షి, అనంతపురం: బౌలర్ల పట్టుదలకు, బ్యాటర్ల సహకారం తోడవడంతో అనంతపురం వేదికగా జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో భారత్ 'డి' జట్టు మెరుగైన స్థితిలో నిలిచింది. భారత్ 'సి'జట్టుతో జరుగుతున్న పోరులో శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 'డి' జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (44 బంతుల్లో 54; 9 ఫోర్లు, ఒక సిక్సర్), దేవదత్ పడిక్కల్ (70 బంతుల్లో 56; 8 ఫోర్లు) అర్ధ శతకాలతో రాణించారు. ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్ (91 బంతుల్లో 44; 5 ఫోర్లు, ఒక సిక్సర్) ఫర్వాలేదనిపించగా... తొలి ఇన్నింగ్స్ హీరో అక్షర్ పటేల్ (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. భారత్ 'సి' జట్టు బౌలర్లలో మానవ్ సుతార్ 5, విజయ్‌కుమార్ వైశాఖ్ రెండు వికెట్లు పడగొట్టారు. చేతిలో రెండు వికెట్లు ఉన్న భారత్ 'డి' జట్టు... ప్రత్యర్థి కంటే ప్రస్తుతం 202 పరుగుల ఆధిక్యంలో ఉంది. మూడో రోజు అక్షర్ మరెన్ని పరుగులు జోడిస్తాడనే దానిపై ఈ మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 91/4తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'సి'జట్టు 62.2 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. బాబా ఇంద్రజిత్ (149 బంతుల్లో 72; 9 ఫోర్లు) ఆఖరి వరకు నిలవగా... మిగిలినవాళ్లు ఆకట్టుకోలేకపోయారు. అభిషేక్ పొరెల్ (34) కాస్త సహకరించాడు. భారత్ 'డి' జట్టు బౌలర్లలో హర్షిత్ రాణా 4... అక్షర్ పటేల్, సారాన్ష్ జైన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు భారత్ 'డి' జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 164 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు

భారత్ 'డి' తొలి ఇన్నింగ్స్: 164;

భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్: రుతురాజ్ గైక్వాడ్ (సి) అథర్వ (బి) హర్షిత్ రాణా 5; సాయి సుదర్శన్ (సి) శ్రీకర్ భరత్ (బి) హర్షిత్ రాణా 7; ఆర్యన్ జుయెల్ (సి అండ్ బి) అక్షర్ పటేల్ 12; రజత్ పాటిదార్ (బి) అక్షర్ పటేల్ 13; బాబా ఇంద్రజీత్ (సి) శ్రీకర్ భరత్ (బి) సారాన్ష్ జైన్ 72; అభిషేక్ పొరెల్ (ఎల్బీడబ్ల్యూ) హర్షిత్ రాణా 34; మానవ్ సుతార్ (సి) యష్ దూబే (బి) హర్షిత్ రాణా 1; హృతిక్ షోకీన్ (సి) దేవదత్ పడిక్కల్ (బి) ఆదిత్య 5; విజయ్‌కుమార్ వైశాఖ్ (సి) శ్రీకర్ భరత్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 1; అన్షుల్ కంబోజ్ (బి) సారాన్ష్ జైన్ 2; హిమాన్షు చౌహాన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 16; **మొత్తం: 62.2 ఓవర్లలో 168. వికెట్ల పతనం:** 1-11, 2-14, 3-40, 4-43, 5-97, 6-101, 7-107, 8-108, 9-159, 10-168, **బౌలింగ్:** హర్షిత్ రాణా 13-5-33-4; అర్ష్‌దీప్ సింగ్ 16-6-29-1; ఆదిత్య 714-3-33-1; అక్షర్ పటేల్ 13-2-46-2; సారాంశ్ జైన్ 662-1-16-2.

భారత్ 'డి' రెండో ఇన్నింగ్స్: అథర్వ (సి అండ్ బి) విజయ్‌కుమార్ వైశాఖ్ 15; యష్ దూబే (ఎల్బీడబ్ల్యూ) విజయ్‌కుమార్ వైశాఖ్ 5; శ్రేయస్ అయ్యర్ (సి) రుతురాజ్ గైక్వాడ్ (బి) అన్షుల్ కంబోజ్ 54; దేవదత్ పడిక్కల్ (సి) ఇంద్రజీత్ (బి) మానవ్ సుతార్ 56; రికీ భుయ్ (ఎల్బీడబ్ల్యూ) మానవ్ సుతార్ 44; శ్రీకర్ భరత్ (సి) రజత్ పాటిదార్ (బి) మానవ్ సుతార్ 16; అక్షర్ పటేల్ (నాటౌట్) 11; సారాన్ష్ జైన్ (ఎల్బీడబ్ల్యూ) మానవ్ సుతార్ 0;అర్ష్‌దీప్ సింగ్ (సి) రజత్ పాటిదార్ (బి) మానవ్ సుతార్ 0; హర్షిత్ రాణా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 5, **మొత్తం: (49 ఓవర్లలో 9 వికెట్లకు) 206. వికెట్ల పతనం:** 1-13, 2-40, 3-90, 4-166, 5-186, 6-203, 7-203, 8-203, **బౌలింగ్:** అన్షుల్ కంబోజ్ 12-1-49-1; విజయ్‌కుమార్ వైశాఖ్ 7-0-51-2; హిమాన్షు చౌహాన్ 8-0-48-0; హృతిక్ షోకీన్ 7-1-25-0; మానవ్ సుతార్ 15-6-30-5.


జోష్ ఇంగ్లిస్

జోష్ ఇంగ్లిస్ రికార్డు సెంచరీ

స్కాట్లాండ్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం ● 2-0తో సిరీస్ కైవసం

ఎడిన్‌బరో: అంతర్జాతీయ టి20ల్లో ఆస్ట్రేలియా తరఫున వేగవంతమైన సెంచరీ నమోదు చేసిన జోష్ ఇంగ్లిస్ (49 బంతుల్లో 103; 7 ఫోర్లు, 7 సిక్సర్లు) స్కాట్లాండ్‌తో జరిగిన రెండో టి20లో జట్టును గెలిపించాడు. ఈ మ్యాచ్ ఆసీస్ ఆస్ట్రేలియా 70 పరుగుల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తుచేసింది. ఫలితంగా మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్ (0) డకౌట్ కాగా, మూడో స్థానంలో బరిలోకి దిగిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇంగ్లిస్ రికార్డు విశ్వరూపం చూపాడు. స్కాట్లాండ్ బౌలర్ల అనుభవరాహిత్యాన్ని సొమ్ము చేసుకుంటూ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో 43 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. గతంతో తనతో పాటు ఫించ్, మ్యాక్స్‌వెల్ పేరిట ఉన్న 47 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును అతను బద్దలుకొట్టాడు. ఇతర బ్యాటర్లలో కామెరూన్ గ్రీన్ (29 బంతుల్లో 36; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఫర్వాలేదనిపించాడు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్ క్యూరీ 3 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో స్కాట్లాండ్ 16.4 ఓవర్లలో 126 పరుగులకు ఆలౌటైంది. బ్రెండన్ మెక్‌మలెన్ (42 బంతుల్లో 59; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. ఆసీస్ బౌలర్లలో మార్కస్ స్టొయినిస్ 4, కామెరూన్ గ్రీన్ రెండు వికెట్లు పడగొట్టారు. ఇరు జట్ల మధ్య మూడో టి20 మ్యాచ్ శనివారం జరగనుంది.

డైమండ్ లీగ్ ఫైనల్‌కు నీరజ్ చోప్రా



న్యూఢిల్లీ: భారత్ స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా... ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన నీరజ్ చోప్రా... ఈ నెల 13, 14న జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్లో బరిలోకి దిగనున్నాడు. ఈ టోర్నీతో జావెలిన్ త్రో సీజన్ ముగియనుండగా... పారిస్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన తర్వాత స్వదేశానికి కూడా రాకుండా నీరజ్ ఈ టోర్నీ కోసం సాధన చేస్తున్నాడు. మొత్తం ప్రపంచ వ్యాప్తంగా 14 సిరీస్‌ల్లోని ఫలితాల ఆధారంగా మెరుగైన ప్రదర్శన చేసిన త్రోయర్లు ఈ టోర్నీకి ఎంపికవుతారు. దోహా డైమండ్ లీగ్, లుసానే డైమండ్ లీగ్‌ల్లో ద్వితీయ స్థానాల్లో నిలిచిన నీరజ్ చోప్రా 14 పాయింట్లతో నాలుగో స్థానంతో ఫైనల్లో అడుగు పెట్టాడు. గురువారం నుంచి జరిగే జ్యూరిచ్ డైమండ్ లీగ్‌లో నీరజ్ పాల్గొనాల్సి ఉన్నా, చివరి నిమిషంలో తప్పుకున్నాడు. అయితే దీని ప్రభావం పడకుండా అతనికి ఫైనల్ అవకాశం దక్కింది. గత కొంతకాలంగా గజ్జల్లో గాయంతో ఇబ్బంది పడుతున్న నీరజ్... డైమండ్ లీగ్ ఫైనల్ అనంతరం చికిత్స చేయించుకుంటానని గతంలోనే చెప్పాడు.

రాజస్తాన్ రాయల్స్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్

2019 తర్వాత మళ్లీ ఐపీఎల్‌లో

ముంబై: భారత మాజీ హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్... ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్తాన్ రాయల్స్ కోచ్‌గా ఎంపికయ్యాడు. రెండేళ్ల పాటు ద్రవిడ్ కోచ్‌గా వ్యవహరించనున్నట్లు శుక్రవారం రాజస్తాన్ రాయల్స్ యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. టీమిండియా టి20 ప్రపంచకప్ సాధించిన అనంతరం భారత జట్టు హెడ్ కోచ్‌గా తప్పుకున్న రాహుల్ ద్రవిడ్... శుక్రవారం నుంచే రాయల్స్‌తో చేరినట్లు ఫ్రాంచైజీ వెల్లడించింది. 2011-12 సీజన్లలో రాజస్తాన్ కెప్టెన్‌గా, 2014-15 సీజన్లలో అతను మెంటార్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత మరో ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ డేర్‌డెవిల్స్ (క్యాపిటల్స్) కోచ్‌గా పని చేసిన ద్రవిడ్ 2019లో జాతీయ క్రికెట్ అకాడమీ హెడ్‌గా నియమితుడైన తర్వాత ఐపీఎల్‌కు దూరమయ్యాడు. 'రాజస్తాన్ రాయల్స్ మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ తిరిగి జట్టుతో చేరాడు. రాయల్స్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ కుమార సంగక్కరతో కలిసి అతడు ఫ్రాంచైజీని మరింత ముందుకు తీసుకెళ్తాడనే నమ్మకముంది. భారత జట్టును ద్రవిడ్ నడిపించిన తీరు అమోఘం. ఫ్రాంచైజీతో అతడికి చక్కటి అనుబంధం ఉంది. సంగక్కరతో కలిసి ద్రవిడ్ అప్పుడే పని ప్రారంభించాడు. ఐపీఎల్ మెగా వేలానికి సంబంధించి చర్చలు జరుగుతున్నాయి' అని ఫ్రాంచైజీ వెల్లడించింది. మరోవైపు రాజస్తాన్‌తో మరోసారి కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది అని ద్రవిడ్ పేర్కొన్నాడు.



న్యూజిలాండ్ శిక్షణ బృందంలో రంగన హెరాత్, విక్రమ్ రాథోడ్



హెరాత్

న్యూఢిల్లీ: ఉప ఖండంలో వరుసగా ఆరు టెస్టులు ఆడనున్న న్యూజిలాండ్ క్రికెట్ జట్టు... అందుకు తగ్గ కసరత్తులు చేస్తోంది. స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంతో పాటు... తమ స్పిన్నర్ల వ్యూహాలకు పదును పెంచేందుకు శ్రీలంక మాజీ స్పిన్నర్ రంగన హెరాత్‌ను స్పిన్ బౌలింగ్ కోచ్‌గా నియమించుకుంది. గ్రేటర్ నోయిడా వేదికగా సోమవారం నుంచి అఫ్గానిస్తాన్‌తో న్యూజిలాండ్ ఏకైక టెస్టు ఆడనుంది. ఈ మ్యాచ్‌కు ముందే హెరాత్ కోచింగ్ స్టాఫ్‌లో చేరనున్నాడు. 93 టెస్టుల్లో 433 వికెట్లు తీసిన అనుభవం హెరాత్ సొంతం. మరో వైపు భారత మాజీ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్‌ను అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్ కోసం శిక్షణ బృందంలోకి ఎంపిక చేసుకుంది. అతడు కేవలం ఈ ఒక్క మ్యాచ్‌కే న్యూజిలాండ్ జట్టుతో కలిసి పనిచేయనున్నాడు. ఇటీవల టి20 వరల్డ్ కప్ విజయంతో భారత బ్యాటింగ్ కోచ్‌గా రాథోడ్ పదవీకాలం ముగిసింది. అనంతరం న్యూజిలాండ్ జట్టు శ్రీలంకతో గాలెలో రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఆ సిరీస్ ముగిసిన అనంతరం టీమిండియాతో మూడు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ నేపథ్యంలో స్పిన్ అస్త్రాలకు మరింత పదును పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు న్యూజిలాండ్ హెడ్ కోచ్ గ్యారీ స్టెడ్ తెలిపాడు. న్యూజిలాండ్ జట్టులో మొత్తం నలుగురు స్పిన్నర్లు ఉన్నారు. వీరిలో బ్రేస్‌వెల్ ఆఫ్ స్పిన్నర్ కాగా...లెఫ్టార్మ్ స్పిన్నర్లయిన ఎజాజ్ పటేల్, రచిన్ రవీంద్ర, మైకేల్ సాన్‌ట్నర్‌లకు హెరాత్ బౌలింగ్ సూచనలకు ఉపయోగపడనున్నాయి.

ఫైనల్లో దబంగ్ ఢిల్లీ

- గోవాతో నేడు అమీతుమీ
- అల్టిమేట్ టేబుల్ టెన్నిస్


దియా

చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) లీగ్‌లో దబంగ్ ఢిల్లీ జట్టు ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో ఢిల్లీ 8-6తో అహ్మదాబాద్ ఎస్జీ పైపర్స్‌పై విజయం సాధించింది. శనివారం జరిగే టైటిల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ గోవా చాలెంజర్స్‌తో మాజీ చాంపియన్ దబంగ్ ఢిల్లీ తలపడుతుంది. తొలి పురుషుల సింగిల్స్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్ 1-2 (4-11, 11-5, 5-11)తో లిలియాన్ బార్డెట్ చేతిలో ఓడిపోగా, మహిళల సింగిల్స్‌లో ఒరవన్ పరనగ్ 3-0 (11-7, 11-9, 11-9)తో బెర్నడెట్ సాక్స్‌పై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఒరవన్-సత్యన్ జోడీ 0-3 (9-11, 7-11, 9-11)తో బెర్నడెట్ సాక్స్-మానుశ్ షా ద్వయం చేతిలో ఓడింది. రెండో పురుషుల సింగిల్స్‌లో అండ్రియస్ లెవెంకో 2-1 (11-8, 10-11, 11-8)తో మానుశ్ షాపై గెలుపొందాడు. గేమ్‌ల పరంగా ఇరుజట్ల స్కోరు 6-6తో సమం కాగా కీలకమైన రెండో మహిళల సింగిల్స్‌లోకి దిగిన ఢిల్లీ ప్లేయర్ దియా చిటాలే వరుస గేమ్‌లు గెలిచి జట్టును గెలిపించింది. ఆమె 2-0 (11-8, 11-4)తో రీత్ రిష్యాపై నెగ్గడంతో దబంగ్ ఢిల్లీ విజయం ఖాయమైంది.

ఒలీ పోప్ అజేయ శతకం


ఓలీ పోప్

- ఇంగ్లండ్ 221/3
- శ్రీలంకతో మూడో టెస్టు

లండన్: సొంతగడ్డపై సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తున్న ఇంగ్లండ్ జట్టు... శ్రీలంకతో మూడో టెస్టులోనూ అదే జోరు కొనసాగిస్తోంది. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లు నెగ్గి సిరీస్ కైవసం చేసుకున్న ఇంగ్లండ్... శుక్రవారం వర్షం అంతరాయం మధ్య ప్రారంభమైన మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 44.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. తాత్కాలిక కెప్టెన్ ఒలీ పోప్ (103 బంతుల్లో 103 బ్యాటింగ్; 13 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ సెంచరీతో చెలరేగగా... ఓపెనర్ బెన్ డకెట్ (79 బంతుల్లో 86; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. వీరిద్దరూ వన్డే తరహా ఆటతీరుతో చెలరేగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వర్షం కారణంగా మ్యాచ్‌కు పలుమార్లు అంతరాయం ఏర్పడగా... ఆఖర్లో వెలుతురు లేమితో ఆటను నిర్ణీత సమయం కంటే ముందే నిలిపివేశారు. గత మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌లో సెంచరీలు చేసిన మాజీ కెప్టెన్ జో రూట్ (13) తో పాటు డాన్ లారెన్స్ (5) విఫలమయ్యారు. లంక బౌలర్లలో లహిరు కుమార 2 వికెట్లు పడగొట్టాడు. పోప్‌తో పాటు హ్యారీ బ్రూక్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

తీర్పు సమీక్ష సమయంలో నిర్దోషిని హైకోర్టు దోషిగా ప్రకటించలేదు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఏదైనా కేసులో ఒక వ్యక్తిని నిర్దోషిగా తేలుస్తూ ఇచ్చిన తీర్పును సమీక్షించే విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 401(3)(భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 442(3)) కింద హైకోర్టులు తీర్పును సమీక్షించే సమయంలో నిర్దోషిని దోషిగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేయలేవని జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టితో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. నిర్దోషిగా ప్రకటిస్తూ ఇచ్చిన ఉత్తర్వును హైకోర్టులు మార్చలేవని పేర్కొంది. ఒకవేళ నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు ఇవ్వడం పొరపాటు అని హైకోర్టు భావిస్తే.. ఆ తీర్పును తిరగతోడడానికి బదులు మరోసారి విచారణ జరిపి తీర్పు ఇవ్వాలంటూ అప్పిలేట్ కోర్టుకు పంపించాలని వెల్లడించింది. కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించే అధికారం హైకోర్టుకు ఉంటుంది. అయితే సీఆర్‌పీసీ సెక్షన్ 401(3) ప్రకారం.. తీర్పును సమీక్షిస్తున్నప్పుడు దోషిని నిర్దోషిగా ప్రకటిస్తూ ఉత్తర్వు జారీ చేసే అధికారం హైకోర్టుకు లేదు.

టిక్కెట్ ఇవ్వలేదని.. సీఎంతో కరచాలనానికి నిరాకరణ

చండీగఢ్: హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సైనీకి ఊహించని అనుభవం ఎదురైంది. అసెంబ్లీ ఎన్నికలకు గాను ఈ నెల 4న బీజేపీ విడుదల చేసిన అభ్యర్థుల జాబితా రాష్ట్ర పార్టీలో తిరుగుబాట్లకు కారణమైంది. జాబితాలో పేరు లేనందుకు ఇప్పటికే పలువురు రాజీనామా చేయడం తెలిసిందే. టిక్కెట్ దక్కలేదనే ఆక్రోశంతో ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి కరణ్ కాంబోజ్ గురువారం జరిగిన ఒక కార్యక్రమం సందర్భంగా సీఎం నాయబ్ సైనీతో కరచాలనం చేసేందుకు సైతం అంగీకరించలేదు. షేక్ హ్యాండ్ కోసం సీఎం సైనీ చేయి ముందుకు చాచగా, కాంబోజ్ చేతులు జోడించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టిక్కెట్ ఇవ్వనందుకు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఇప్పటికే ఆయన ప్రకటించారు. ఓబీసీలకు బీజేపీ అన్యాయం చేస్తోందని, నమ్మక ద్రోహులైన వారికే టిక్కెట్లిస్తోందని కాంబోజ్ ఆరోపించారు.

'దేఖో అప్నా దేశ్, పీపుల్స్ ఛాయిస్' ఓటింగ్‌లో పాల్గొనండి


దేశ ప్రజలకు కేంద్ర పర్యాటక శాఖ పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: మనదేశంలో ప్రపంచ పర్యాటకాన్ని పెంపొందించే దిశగా ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వెబ్ సైట్‌లో ఓటు వేయాలని కేంద్ర పర్యాటక శాఖ పిలుపునిచ్చింది. ఇందుకోసం ప్రధాని మోదీ మార్చిలో దేశవ్యాప్తంగా 'దేఖో అప్నా దేశ్ -పీపుల్స్ ఛాయిస్ 2024'కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'ఆధ్యాత్మికం, సంస్కృతి-వారసత్వం, ప్రకృతి-వన్యప్రాణులు, సాహస కార్యకలాపాలు'కేటగిరీల్లో అత్యుత్తమ పర్యాటక ఆకర్షణలపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నట్లు పేర్కొంది. ప్రపంచ స్థాయి పర్యాటకాన్ని అభివృద్ధి చేయడం దీని లక్ష్యమని పేర్కొన్నారు. దీన్లో భాగంగా httpr://innovateindia.mygov.in/dekhoa pnaderh పేజీని ఓపెన్ చేసి అందులో వివరాలు పొందుపరిచి ఓటు వేయాలని కోరారు. ఈనెల 15వ తేదీ వరకు ఓటు వేసేందుకు గడువు పెంచినట్లు పర్యాటక శాఖ వెల్లడించింది.

విద్యార్థులు రెండంకెల సంఖ్యను కూడా గుర్తు పట్టలేకపోతున్నారు

తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యాఖ్య

చెన్నై: తమిళనాడులో విద్యావిధానంపై గవర్నర్ ఆర్ఎన్ రవి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో 75 శాతం కనీసం రెండంకెల సంఖ్యలను కూడా గుర్తించలేకపోతున్నారన్నారు. దాదాపు 40 శాతం మంది విద్యార్థులు రెండో తరగతి పాఠ్య పుస్తకాలను సైతం చదవలేకపోతున్నారని చెప్పారు. పాఠశాలల్లో విద్యాబోధన దయనీయ స్థితిలో ఉందని విమర్శించారు. నాసిరకం విద్యతో పిల్లలు పనికిరాకుండా పోతున్నారని గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. స్కూళ్లు, కాలేజీల్లో డ్రగ్స్ పంపిణీ విచ్చలవిడిగా కొనసాగుతోందని, ఇది చాలా ప్రమాదకర సమస్య అని చెప్పారు. రాజ్‌భవన్‌లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆర్ఎన్ రవి మాట్లాడారు. అత్యంత సులువుగా డిగ్రీలు, సర్టిఫికెట్లు ఇచ్చేస్తూ వారిని నిరుద్యోగులుగా, పనికిరాని వారిగా మారుస్తున్నారని వ్యాఖ్యానించారు. తమిళనాడులో అత్యుత్తమ విద్యా విధానం అమలవుతోందని, విమర్శిస్తే ఊరుకోమంటూ డీఎంకే మంత్రి ఉదయనిధి స్టాలిన్ తీవ్రంగా హెచ్చరించిన రోజే గవర్నర్ పైవిధంగా వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



ఏ దేశమేగినా... బొజ్జ గణపయ్యే!

నేడు వినాయక చవితి. విఘ్నాలను తొలగించి, సర్వ కార్యాల్లో విజయం సిద్ధించాలని కోరుకుంటూ గణనాథుడికి పూజలు చేస్తాం. ఆసేతుహిమాచలం మాత్రమే కాదు భారతదేశానికి ఆవల సైతం పూజలందుకుంటున్న అతికొద్ది మంది దేవుళ్లలో వినాయకుడు సైతం ఉన్నాడు. థాయిలాండ్ మొదలు కాంబోడియా, జపాన్, చైనా ఇలా ఎన్నో దేశాల్లో బొజ్జ గణపయ్య ఘనంగా పూజలందుకుంటున్నాడు. ప్రతి ఏటా గణేష్ చతుర్థిని జరుపుకుంటూ మహదానందం పొందుతున్నాడు ఆయా దేశాల ప్రజలు. వాణిజ్య, ధార్మిక సంబంధాల కారణంగా ఆగ్నేయాసియాలో అనేక హిందూదేవతలను పూజించడం పరిపాటి. భారత్‌లో మాదిరే వరసిద్ధి వినాయకుడు విదేశాల్లోనూ చక్కని పూజలందుకుంటున్నాడు. అయితే గణపతిని ఆయా దేశాలు వివిధ రూపాల్లో కొలుస్తుండటం విశేషం. విఘ్ననాయకుడిని విశేష రూపాల్లో ఏ దేశం? ఎలా ఆరాధిస్తుందో ఓసారి పరికిద్దాం..

- సాక్షి, నేషనల్ డెస్క్

థాయిలాండ్‌లో..
థాయిలాండ్ బౌద్ధులకు వినాయకుడూ ఆరాధ్య దైవమే. క్రీ.శ 550-600 ప్రాంతంలో థాయిలాండ్‌లో లంబోదరుని విగ్రహాలు వెలిశాయి. థాయిలాండ్‌లో మన మోదకప్రియుడిని ఫిరా ఫికానెట్‌గా కొలుస్తారు. విజయానికి చిహ్నంగా, అడ్డంకులను తొలగించే శక్తిగా భావిస్తారు. కొత్త వ్యాపారాన్ని ప్రారంభించడానికి ముందు, వివాహం సందర్భంగా మహాగణపతిని పూజిస్తారు. గజాననుడి ప్రభావం థాయ్ కళ, వాస్తుశిల్పంలోనూ స్పష్టంగా గోచరిస్తుంది. గణపతి ఆలయాలు దేశవ్యాప్తంగా కోకొల్లలుగా ఉన్నాయి.

కాంబోడియాలో
ఆగ్నేయాసియా అంతటా మన విఘ్నరాజును పూజిస్తారు. ఈ సంప్రదాయ ఈ ప్రాంతానికి ఎలా వచ్చిందనేది మాత్రం తెలియడం లేదు. ఐదు, ఆరో శతాబ్దాలకు చెందిన గణాధ్యక్షుడి శాసనాలు, చిత్రాలు ఆగ్నేయాసియాలో ఉన్నాయి. కంబోడియాలో గణాధీశుడు ప్రధాన దైవం. ఏడో శతాబ్దం నుంచి ఆయనను దేవాలయాలలో పూజించారు. భక్తులకు మోక్షాన్ని ప్రసాదించే శక్తి ఈ దేవుడికి ఉందని ఇక్కడ నమ్ముతారు.

టిబెట్‌లో
టిబెట్‌లోనూ మన మంగళప్రదాయుడిని బౌద్ధ దేవుడిగా పూజిస్తారు. ఇక్కడ మహారక్త గణపతిగా, వజ్ర వినాయకుడిగా విభిన్న రూపాల్లో ఆరాధిస్తారు. భారతీయ బౌద్ధ మత నాయకులు అతిసా దీపంకర శ్రీజ్ఞ, గాయధర వంటివారు క్రీస్తుశకం 11వ శతాబ్దంలో టిబెట్ బౌద్ధ మతానికి వినాయకుడిని పరిచయం చేసినట్లు చరిత్ర చెబుతోంది. గణేశుడిని టిబెట్, మంగోలియాలో ఉద్భవించిన బౌద్ధమత రూపమైన లామాయిజం పుట్టుకతో ఈ దేశ పురాణాలు ముడిపడి ఉన్నాయి. ధర్మ రక్షకుడిగా, చెడును నాశనం చేసే శక్తిగా, అడ్డంకులను తొలగించే మూర్తిగా వినాయకుడిని బౌద్ధం బోధిస్తోంది.



చైనా, అఫ్గానిస్తాన్‌లలో..
చైనాలో లంబోదరుడిని 'హువాంగ్ సీ టియాన్'అని పిలుస్తారు. ఆయనను ఒక విఘ్నంగా భావిస్తారు. అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్ సమీపంలోని గార్దెజ్‌లో క్రీ.శ 6 లేదా 7వ శతాబ్దంలో చెక్కిన ప్రసిద్ధ వినాయ క విగ్రహం బయల్పింది. గార్దెజ్ గణేశుడుగా పిలువబడే ఆయనను జ్ఞానం, శ్రేయస్సునందించే దేవుడిగా స్థానికులు ఆరాధిస్తారు.

జపాన్‌లో..
గణాలకు అధిపతి అయిన వినాయకుడిని జపాన్‌లో కంగిటెన్ అని ముద్దుగా పిలుచుకుంటారు. ఇక్కడి వాణిజ్యవేత్తలు, వ్యాపారులు, జూదగాళ్ళు, నటులు, 'గీషా'లుగా పిలవబడే కళాకారిణులు ఎక్కువగా గణేషుడిని కొలుస్తారు. అయితే ఇక్కడ కొందరు ప్రత్యేకమైన రూపంలో ఉన్న వినాయకుడిని ఆరాధిస్తారు. ఈ వినాయక విగ్ర హంలో స్త్రీ, పురుష రూపాలు ఆలింగనం చేసుకు ని ఉంటాయి. జపనీస్ వినాయక రూపాల్లో ఒక రూపం నాలుగు చేతులతో, ముల్లంగి, మిఠాయి పట్టుకొని ఉండటం విచిత్రం.

అందుకే ఇక్కడి గణపతి విగ్రహం దృఢంగా, బలమైన కండరాలు, కవచం, దంతాలు, ఆయుధాలతో అలరారుతుంటాయి. ఇతర టిబెటన్ దేవతల మాదిరిగా కోపం కొట్టొచ్చినట్లు ఎరుపు, నలుపు, గోధుమ వర్ణాల్లో విగ్రహాలు కనిపిస్తాయి.

ఇండోనేసియాలో..
ఇండోనేసియాలోని జావా ద్వీపంలో కృతనాగర మహారాజు మాంత్రిక కర్మలలో అడ్డంకులను తొలగించే తాంత్రిక దేవతగా వినాయకుడిని పూజించారు. ఇది క్రీ.శ 14-15 వ శతాబ్దాల నాటికి ఇక్కడ అభివృద్ధి చెందిన తాంత్రిక బౌద్ధం, శైవ మతాల కలయికగా గణపతిని ఇక్కడ ఆరాధిస్తారు. పుర్రెలు ధరించి పుర్రెల సింహాసనంపై కూర్చున్న రూపంలో వినాయకుడు పూజలందుకుంటున్నారు. భారత్‌లో సాధారణంగా కనిపించే విగ్రహరూపాల్లోనూ గణపతిని ఇక్కడ పూజిస్తారు. తూర్పు జావా ప్రాంతంలోని తెన్‌గెర్ సెమెరూ జాతీయ వనంలోని బ్రోమో పర్వతం ముఖ ద్వారం వద్ద 700 సంవత్సరాలనాటి గణనాథుని విగ్రహం ఉంది. బ్రహ్మదేవుని పేరు మీద ఈ పర్వతానికి బ్రోమో పేరు వచ్చింది. అగ్నిపర్వతాల విస్ఫోటం నుంచి ఈ విగ్రహం తమను రక్షిస్తుందని స్థానికులు నమ్ముతారు.

'కమలం' గుర్తుపై పిటిషన్ కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల గుర్తుగా 'కమలం'పువ్వును ఉపయోగించుకోకుండా బీజేపీని నిరోధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జాతీయ పుష్పం అయిన నేపథ్యంలో 'కమలం'ను రాజకీయ పార్టీలు వినియోగించరాదంటూ జయంత్ విపాత్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీబీ వరాలేలతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రచారం కోసం ఇలాంటి పిటిషన్లు దాఖలు చేస్తున్నారని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ''పేరు, కీర్తి కావాలనుకుంటున్నారా? ఏం పిటిషన్ దాఖలు చేశారో అర్థమవుతోందా? ఏం కావాలనుకుంటున్నారో తెలుస్తోందా?''అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. అనంతరం పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

వ్యానును ఢీకొట్టిన బస్సు..15 మంది మృతి

హత్రాస్(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 15 మంది చనిపోగా మరో 16 మంది గాయాలపాలయ్యారు. ఆగ్రా- అలీగఢ్ 93వ నంబర్ జాతీయ రహదారిపై చాంద్‌పా పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు ముందు వెళ్తున్న వ్యానును అధిగమించేందుకు ప్రయత్నించే క్రమంలో వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో, వ్యానులోని నలుగురు చిన్నారులు, మరో నలుగురు మహిళలు సహా మొత్తం 15 మంది చనిపోయారు. వ్యానులోని మరో 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఘటన సమయంలో కురుస్తున్న భారీ వర్షమే ప్రమాదానికి కారణం కావచ్చని చెప్పారు. బాధితులంతా హత్రాస్ నుంచి ఆగ్రా వైపు వెళ్తున్నారని పోలీసులు తెలిపారు.

అమెరికా స్కూల్ షూటర్ తండ్రి అరెస్ట్

విండర్(అమెరికా): అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో తన స్కూల్లో కాల్పులు జరిపి నలుగురి ప్రాణాలను బలిగొన్న 14 ఏళ్ల టీనేజీ విద్యార్థి కేసులో అతని తండ్రినీ పోలీసులు అరెస్ట్‌చేశారు. మారణాయుధాలను జాగ్రత్తగా దాచిపెట్టకుండా, బాధ్యత మరచి నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపిస్తూ కోల్ట్ గ్రే తండ్రి కోలిన్ గ్రే(54)ను పోలీసులు అరెస్ట్‌చేశారు. ఏప్రిల్‌లో మిషిగన్‌లో స్కూల్లో కాల్పుల ఘటన తర్వాత అక్కడి టీనేజీ నిందితుడితోపాటు తల్లిదండ్రులపైనా కేసు వేశాక ఇలాంటి ఉదంతాల్లో తల్లిదండ్రులపైనా నేరం మోపడం ఇదే తొలిసారి. విండర్ పట్టణంలోని అపలాచీ హైస్కూల్‌లో సెమీ ఆటోమేటిక్ ఏఆర్-15 రకం రైఫిల్‌తో స్కూలుకొచ్చిన కోల్ట్ గ్రే ఇద్దరు విద్యార్థులు, ఇద్దరు టీచర్లను కాల్చిచంపడం తెల్సిందే. ఈ కేసు విచారణ నిమిత్తం తండ్రీకొడుకులను శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు.

ఇజ్రాయెల్ ఆర్మీ కాల్పుల్లో అమెరికన్ మృతి

నెబ్లుస్: ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ సైన్యం కాల్పుల్లో తుర్కియే సంతతికి చెందిన అమెరికా పౌరురాలు చనిపోయారు. నబ్లుస్ సమీపంలోని బెయిటా వద్ద ఇజ్రాయెలీల కోసం కొత్తగా నివాసాలు ఏర్పాటు చేయాలన్న నెతన్యాహు ప్రభుత్వ నిర్ణయంపై కొద్ది రోజులుగా నిరసనలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఈ నిరసనల్లో పాలుపంచుకున్న 26 ఏళ్ల అయ్‌సెనూర్‌పై ఇజ్రాయెల్ ఆర్మీ కాల్పులు జరిపింది. తలకు బుల్లెట్ గాయమైన అయ్‌సెనూర్‌ను తమ ఆస్పత్రికి తీసుకువచ్చారని, చికిత్స అందించిన కొద్ది సేపటికే ఆమె చనిపోయిందని స్థానిక ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

దైవదూషణ పోస్టు పెట్టాడని... టీనేజర్ హత్య

ఢాకా: మహమ్మద్ ప్రవక్తపై సామాజిక మాధ్యమంలో అభ్యంతరకర పోస్టులు పెట్టాడని 15 ఏళ్ల హిందూ టీనేజీ విద్యార్థిని ఓ అల్లరిమూక దారుణంగా నరికి చంపింది. బంగ్లాదేశ్‌లోని ఖుల్నా నగరంలోని పోలీస్ స్టేషన్‌లో సాయుధ పోలీసుల ఎదుటే ఈ దారుణ హత్య జరిగింది. షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయాక హిందువులపై దాడులు పెరిగిన వేళ ఈ హత్య జరగడం గమనార్హం. సాయుధ పోలీసుల సమక్షంలోనే ఉత్సవ్‌ను నరికి చంపారని హ్యూమన్ రైట్స్ కాంగ్రెస్ ఫర్ బంగ్లాదేశ్ మైనారిటీస్ (హెచ్‌ఆర్‌సీఎంబీ) వెల్లడించింది. ''నేరానికి పాల్పడిన వారికి శిక్ష పడలేదు. క్రూరమైన నేరాలు వారి కనుసన్నల్లోనే జరుగుతున్నా పట్టించుకోని బంగ్లాదేశ్ దర్యాప్తుసంస్థలు సైతం ఈ ఘటనలో దోషులే'అని హెచ్‌ఆర్‌సీఎంబీ వ్యాఖ్యానించింది.

ట్రంప్ కేసులో శిక్ష ఖరారు వాయిదా

న్యూయార్క్: హష్ మనీ కేసులో దోషిగా తేలిన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు భారీ ఊరట లభించింది. ఈ కేసులో శిక్ష ఖరారును మనహటన్ జడ్జి యువాన్ ఎం. మెర్చన్ నవంబరు 26కు వాయిదా వేశారు. నిజానికి ఈనెల 18 శిక్షను ప్రకటించాల్సి ఉంది. అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న ఈ దశలో ట్రంప్‌కు శిక్ష వేస్తే అది ఎన్నికల్లో జోక్యం కిందకు వస్తుందన్న న్యాయవాదుల వాదనను పరిగణనలోకి తీసుకుని శిక్ష ఖరారును వాయిదా వేశారు. నవంబరు 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

పట్టపగలే రోడ్డు పక్కన మహిళపై అత్యాచారం

- సెల్‌లో వీడియో చిత్రీకరించి ఆన్‌లైన్‌లో పెట్టిన ఆకతాయిలు
- నిందితుడు సహా నలుగురి అరెస్ట్

ఉజ్జయిని(మధ్యప్రదేశ్): చెత్త సేకరించే మహిళను పెళ్లి పేరుతో నమ్మించి మద్యం తాగించాడు. మత్తులో ఉన్న ఆమెపై పట్టపగలే రోడ్డు పక్కన షెల్టర్‌లో అత్యాచారానికి పాల్పడ్డాడు. దారిన వెళ్లే వారు ఆ ఘటనను తమ ఫోన్లలో చిత్రీకరించారే తప్ప, అడ్డుకోలేదు. తీవ్ర రాజకీయ దుమారానికి కారణమైన ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో చోటుచేసుకుంది. నగరంలోని అత్యంత రద్దీగా ఉండే కోయ్‌లా పాఠక్ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం లోకేశ్ అనే వ్యక్తి చెత్త ఏరుకునే ఓ మహిళతో మాటలు కలిపాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెకు మద్యం తాగించాడు. మత్తులో ఉన్న ఆమెను సమీపంలోనే రోడ్డు పక్కన షెల్టర్‌లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి వెళ్లాడు. అయితే, రోడ్డు పక్కన వెళ్లే వారు అసాంఘిక కృత్యాన్ని తమ సెల్ ఫోన్లలో బంధించారే తప్ప, అడ్డుకోలేదు. పైపెచ్చు, ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. వైరల్‌గా మారిన ఒక వీడియో పోలీసుల కంటబడింది. బాధిత మహిళ ఫిర్యాదుతో ఆ వీడియో ఆధారంగా పోలీసులు లోకేశ్‌ను అరెస్ట్ చేశారు. వీడియోలను సోషల్ మీడియాలో పెట్టిన నలుగురు అనుమానితుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ప్రకాశ్ మిశ్రా తెలిపారు. బాధిత మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆమె ఇంట్లోనే ఉందని సీపీ చెప్పారు.

జిల్లా జడ్జిల పదోన్నతి సిఫార్సులు... హైకోర్టు కొలీజియమే చేయాలి

సీజే వ్యక్తిగతంగా చేయడం కుదరదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: హైకోర్టు న్యాయమూర్తుల నియామకంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో హైకోర్టు కొలీజియం సమష్టిగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని కుండబద్దలు కొట్టింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒక్కరే సిఫార్సు చేస్తామంటే కుదరదని స్పష్టం చేసింది. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఇద్దరు జిల్లా జడ్జిల పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. సీనియర్ మోస్ట్ జడ్జిలమైన తమను పదోన్నతుల విషయంలో సీజే పరిగణనలోకి తీసుకోలేదని వారు ఆరోపించారు. కొలీజియంలో సంప్రదింపులు జరపకుండానే వేరే పేర్లను ఆయనొక్కరే సిఫార్సు చేశారని ఆక్షేపించారు. వారి వాదనలో న్యాయముందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇలా చేసే అధికారం సీజేకు లేదని స్పష్టం చేసింది. ''న్యాయవ్యవస్థలో ఉన్నత స్థాయి నియామకాల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరగడం చాలా ముఖ్యం. అప్పుడే న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది''అని అభిప్రాయపడింది. సీజే, ఇద్దరు సీనియర్ మోస్ట్ న్యాయమూర్తులతో కూడిన హైకోర్టు కొలీజియం మళ్లీ సమావేశమై పదోన్నతులకు వారిద్దరి పేర్లను కూడా పరిగణనలోకి తీసుకుంటూ సమిష్టిగా తుది సిఫార్సులు చేయాలని ఆదేశించింది.

ఆర్టికల్ 370 ఇక రాదు: అమిత్ షా

జమ్మూ: జమ్మూకశ్మీర్‌కు గతంలో ప్రత్యేక ప్రతిపత్తి కల్గించిన ఆర్టికల్ 370 ఇక రాదని, అది కాలగమనంలో కనుమరుగైందని కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా వ్యాఖ్యానించారు. జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికల కోసం పార్టీ మేనిఫెస్టోను శుక్రవారం జమ్మూలో విడుదలచేసి తర్వాత అమిత్ మాట్లాడారు. ''కశ్మీర్‌లో యువత రాళ్లు, ఆయుధాలు పట్టుకోవడానికి ఈ ఆర్టికల్ 370నే కారణం. ఆర్టికల్ 34ఏ, ఆర్టికల్ 370 అనేవి గతించిన చరిత్ర. అవి ఎన్నటికీ తిరిగిరావు' అని స్పష్టం చేశారు. మరోవైపు 25 గ్యారెంటీలతో అమిత్ బీజేపీ మేనిఫెస్టో 'సంకల్ప్ పత్ర'ను ఆవిష్కరించారు. ఉగ్రబాధితులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. శంకరాచార్య ఆలయం, రఘునాథ ఆలయం, మార్తాండ సూర్య దేవాలయంసహా కశ్మీర్‌లో గతంలో ధ్వంసంచేసిన 100 ఆలయాలను పునరుద్ధరిస్తామని చెప్పారు.


మణిపూర్ మాజీ సీఎం నివాసంపై రాకెట్ దాడి

వృద్ధుడు మృతి, బాలిక సహా ఐదుగురికి గాయాలు

ఇంఫాల్: మణిపూర్‌లో జాతుల వైరంలో అనూహ్య పోకడలు వెలుగుచూస్తున్నాయి. ప్రత్యర్థి వర్గాన్ని దెబ్బతీసేందుకు మొన్నటికి మొన్న రెండు డ్రోన్లను ప్రయోగించిన సాయుధ మూకలు, తాజాగా రాకెట్లను సైతం వాడుకలోకి తేవడం మరింత కలవరం కలిగిస్తోంది. శుక్రవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు రాకెట్లను ప్రయోగించినట్లు భద్రతా బలగాలు తెలిపాయి. ఇందులో ఒకటి బిష్ణుపూర్ జిల్లాలోని మొయిరంగ్‌లో ఉన్న మాజీ సీఎం మైరెంబం కోయిరెంగ్ నివాసం లక్ష్యంగా దూసుకొచ్చింది. మధ్యాహ్నం సమయంలో కోయిరెంగ్ నివాస ప్రాంగణంలో రాకెట్ పడి పేలడంతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వృద్ధుడొకరు అక్కడికక్కడే చనిపోయారు. అక్కడే ఉన్న 13 ఏళ్ల బాలికతోపాటు ఐదుగురు గాయపడ్డారు. మిలిటెంట్లు చురాచంద్‌పూర్ జిల్లా నుంచి ప్రయోగించినట్లు పోలీసులు అంటున్నారు. అంతకుముందు, ఇంఫాల్‌కు 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న ట్రొంగ్‌లావోబీలోని కొండప్రాంతం నుంచి ప్రయోగించిన రాకెట్ మూడుకిలోమీటర్ల దూరంలో నివాస ప్రాంతంలో పడిందని అధికారులు తెలిపారు. కమ్యూనిటీ హాల్‌తోపాటు ఖాళీగా ఉన్న ఒక నిర్మాణం దెబ్బతిన్నాయన్నారు. అదేవిధంగా, బిష్ణుపూర్ జిల్లాలో భద్రతా బలగాలపైకి మిలిటెంట్లు దాడులకు తెగబడ్డారు. బలగాలు దీటుగా స్పందించడంతో ఇరువర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నట్లు అధికారులు చెప్పారు.

జైల్లోంచి పనిచేయకుండా కేజ్రీవాల్‌పై నిషేధం ఉందా?

- ఫైళ్లపై సంతకానికి ఇబ్బందేమిటి?
- ఖైదీల ముందస్తు విడుదలలో నిర్ణయాల ఆలస్యంపై సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: జైలులో నుంచి విధులు నిర్వర్తించకుండా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై నిషేధమేమైనా ఉందా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఖైదీల ముందస్తు విడుదలకు సంబంధించిన ఫైళ్లపై సంతకం చేయడంలో జైలులో ఉన్న కేజ్రీవాల్‌కు అవరోధాలేమిటని నిలదీసింది. ముందస్తు విడుదలకు సంబంధించి ఫైళ్లపై నిర్ణయాలు ఆలస్యం కావడం సరికాదని అభిప్రాయపడింది. ఓ ఖైదీ ముందస్తు విడుదలకు సంబంధించిన కేసును శుక్రవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జిలతో కూడిన ధర్మాసనం విచారించింది. సాధారణంగా ఓ ఖైదీ ముందస్తు విడుదలకు సంబంధించిన ఫైలు లెఫ్టినెంట్ గవర్నర్‌ను చేరాలంటే తొలుత ముఖ్యమంత్రి సంతకం చేయాల్సి ఉంటుంది. అయితే, ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో జైలులో ఉన్న అరవింద్ కేజ్రీవాల్ సదరు ఫైలుపై సంతకం చేయడం ఆలస్యం కావడాన్ని కోర్టు గుర్తించింది. ఈ నేపథ్యంలో ''జైలు నుంచి సీఎం కేజ్రీవాల్ ముందస్తు విడుదల ఫైళ్లపై సంతకం చేయకూడదని ఏమైనా నిబంధన ఉందా? స్వయంగా ఓ కేసులో విచారణ ఖైదీగా ఉన్న సీఎం సదరు ఫైలుపై సంతకం చేయకుండా నిషేధం ఏమైనా ఉందా?''అని ఢిల్లీ ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి సూచనలు తీసుకుంటామని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యభాటి, సీనియర్ న్యాయవాది అర్చనా దవేలు కోర్టుకు తెలిపారు. ఇప్పటివరకూ ఇలాంటి ఘటన ఎదురు కాలేదని వివరించారు. ఒకవేళ అలాంటి నిబంధన ఏమైనా ఉంటే చెప్పాలని లేదంటే ఆర్టికల్ 142 ఇచ్చిన అధికారాలతో కోర్టు పరిశీలన చేస్తుందని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి కేసులు ఎక్కువ కాలం వేచి ఉండరాదని అభిప్రాయపడుతూ ధర్మాసనం విచారణ వాయిదా వేసింది.



కమలా హారిస్‌దే విజయం

ఎన్నికల 'నోస్ట్రడామస్' అలాన్ లిచ్‌మాన్ జోస్యం

నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ విజయం సాధిస్తారని అమెరికా ఎన్నికల నోస్ట్రడామస్‌గా పేరొందిన చరిత్రకారుడు అలాన్ లిచ్‌మన్ జోస్యం చెప్పారు. గత నాలుగు దశాబ్దాలుగా అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను అలాన్ దాదాపు ఖచ్చితంగా ఊహించి చెప్పడం విశేషం. అధ్యక్ష రేసు నుంచి ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ నిష్క్రమిస్తే వాళ్ల పార్టీ గెలుపు కష్టమేనన్న ఆయన.. ఇప్పుడు హారిస్ వచ్చాక తప్పక విజయం సాధిస్తారని చెప్పడం హాట్ టాపిక్‌గా మారింది. డెమొక్రాట్లు అప్పగించిన కీలక బాధ్యతను స్వీకరించిన కమలా హారిస్ అంతే ధీమాతో దూసుకెళ్తూ మాజీ అధ్యక్షుడు ట్రంప్‌ను ఓడించేందుకు రెడీ అయ్యారని అలాన్ అభిప్రాయపడ్డారు. ''ఫలితం ఏమిటన్నది మీ చేతుల్లోనే ఉంది. కాబట్టి బయటకు వచ్చి ఓటు వేయండి''అని తాజాగా న్యూయార్క్ టైమ్స్‌కు ఇచ్చిన 7 నిమిషాల వీడియో ఇంటర్వ్యూలో చెప్పారు.

1984 నుంచి విశ్లేషణలు
1984 ఏడాది నుంచి అమెరికాలో 10 సార్లు అధ్యక్ష ఎన్నికలు జరిగితే తొమ్మిది సార్లు ఈయన చెప్పింది నిజమైంది. దీంతో ఆయన్ను అమెరికా అధ్యక్ష ఎన్నికల నోస్ట్రడామస్‌గా అందరూ పిలుస్తారు. అమెరికన్ విశ్వవిద్యాలయంలో గత యాభై సంవత్సరాలుగా అధ్యాపకుడిగా పనిచేస్తున్న లిచ్‌మాన్ 'గెలుపునకు 13 సూత్రాలు'అనే విధానాన్ని ప్రతిపాదించారు. ఈ 13 అంశాల ప్రాతిపదికన ఏ పార్టీ, అభ్యర్థి గెలుస్తారని అంచనావేస్తానని చెప్పారు. 2016లో ట్రంప్ గెలుస్తాడని, 2020లో బైడెన్ గెలుస్తాడని చెప్పిన మాటలు నిజం కావడం విశేషం. 2000లో అల్‌గోర్‌పై జార్జి డబ్ల్యూ బుష్ విజయం సాధించడం మినహా మిగిలిన ఫలితాలన్నీ ఆయన చెప్పినట్లుగా రావడం గమనార్హం. 2016 ఎన్నికల్లో హిల్లరీ క్లింటన్ విజయం సాధిస్తారని ప్రధాన ఒపీనియన్ పోల్స్ చెప్పగా.. లిచ్‌మన్ మాత్రం ట్రంప్ తిరుగులేని విజయం సాధిస్తారని అంచనా వేశారు. ట్రంప్ అధ్యక్ష పదవిలో ఉండగా అభిశంసనకు గురవుతారని చెప్పారు. అలాన్ చెప్పినట్లే ట్రంప్ రెండుసార్లు అభిశంసనకు గురయ్యారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

సామరస్య చిత్రం



వినాయకుడి బొమ్మను గీస్తున్న ఉపాధ్యాయురాలు అసిఫా

మహానంది: మన మతమేదైనా మానవులంతా ఒక్కటే. అన్ని మతాల సారాంశం సైతం సాటి మానవుడిని ప్రేమించాలి, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్నదే. అందులో భాగంగా మహానంది మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాలలో శుక్రవారం ఎకో ఫ్రెండ్లీ గణేశుడి ఐడాల్స్‌ను తయారు చేసే సమయంలో విద్యార్థులకు అవగాహన కల్పించడంలో భాగంగా ఉపాధ్యాయురాలు అసిఫా గణేశుడి చిత్రాన్ని చక్కగా గీయడం ప్రత్యేకత సంతరించుకుంది.

బంగారు పుష్పాలు విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానానికి శుక్రవారం కర్నూలుకు చెందిన బి.సి.శివకుమార్ 108 బంగారు పూలను విరాళంగా సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగాణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు బంగారు పూలను సీనియర్ వేదపండితులు గంటి రాధాకృష్ణ, పర్యవేక్షకులు కె.అయ్యన్న, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునలకు అందజేశారు. విరాళంగా సమర్పించిన బంగారు పూలు 19 గ్రాముల బరువు ఉంటాయని దాత తెలిపారు. ఆయనను వేదాశీర్వచనంతో స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.



విరాళంగా సమర్పించిన బంగారు పుష్పాలు

సూక్ష్మంలో మోక్షం

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాలకు చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ అగ్గిపెట్టెపై 60 సూక్ష్మ వినాయకుల చిత్రాలను గీచి అబ్బురపరిచారు. రెండు అంగులాల పొడవు, రెండున్నర అంగులాల వెడల్పు గల అగ్గిపెట్టెపై మైక్రో బ్రష్‌తో 2 గంటల వ్యవధిలో గణనాథుల చిత్రాలను వేశారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ గత 20 ఏళ్లగా వినాయక చవితి సందర్భంగా స్వామి చిత్రాలను వేస్తున్నానన్నారు. చిత్రంలో త్రిముఖ గణపతి, నాట్య గణపతి, శంఖులో గణపతి, ఓం ఆకారంలో గణనాథుడు, కాణిపాకం గణనాథుల చిత్రాలు వేశానన్నారు.

– నంద్యాల(అర్బన్)



అగ్గిపెట్టె మీద 60 గణనాథులు



ఆవగింజల విఘ్ననాయకుడు

ఆవగింజలతో గణనాథుడి చిత్రాన్ని రూపొందించారు అనకాపల్లి జిల్లా, తూటిపాలకు చెందిన మైక్రోరైటర్ రవికుమార్. శనివారం వినాయక చవితిని పురస్కరించుకుని ఈ చిత్రాన్ని తయారు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందుకుగాను మొత్తం 2001 ఆవగింజలను వినియోగించినట్లు పేర్కొన్నారు.

– మాకవరపాలెం, అనకాపల్లి జిల్లా

చవితికి 'చంద్ర గ్రహణం'

- వినాయక చవితి ఉత్సవాలకు ఆంక్షలు, రుసుం వసూలు
- పవిత్రమైన పండగను ఈవెంట్‌గా మార్చేసిన చంద్రబాబు సర్కారు
- ఒక్కో మంటపానికి రోజుకు రూ.135 వసూలు
- మీ సేవలో చలానా చెల్లిస్తేనే అనుమతి
- పండుగలకు పన్నులేమిటని మండిపడుతున్న నిర్వాహకులు

పిఠాపురం: పిల్లా పెద్దా అందరూ ఉత్సాహంగా జరుపుకొనే గణపతి ఉత్సవాలపై చంద్రబాబు ప్రభుత్వం పలు ఆంక్షలు విధించి, పన్నులు మోపింది. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి వినాయక మంటపానికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) తీసుకోవాలని ఆదేశించింది. మంటపాలు ఎన్ని రోజులు నిర్వహిస్తే అన్ని రోజులకు రోజుకు రూ. 135 గరిష్ట చార్జీ వేస్తోంది. హిందువులు ఏటా భక్తి ప్రపత్తులతో 9 రోజులు జరుపుకొనే వినాయక చవితి ఉత్సవాలను ఒక ఈవెంట్‌గా చెబుతూ దానికి పర్మిషన్ ఫర్ ఈవెంట్ బందోబస్తు పేరున ఈ ప్రత్యేక రుసుం విధిస్తోంది. ఈమేరకు చెల్లించి మీ సేవలో చలానా తీసి ఇస్తేనే ఆన్‌లైన్‌లో పోలీసులు అనుమతి పత్రం జారీ చేస్తున్నారు. దీని కోసం ఆన్‌లైన్‌లో ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించారు. ఇలా చెల్లించని వారి మంటపాలను పోలీసులు నిర్దాక్షిణ్యంగా ఆపేస్తున్నారని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. ప్రతి మంటపానికి రూ.900 నుంచి రూ. 1,500 వరకు చెల్లించాల్సి వస్తోందని చలానా నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 20 వేలకు పైగా మంటపాలు ఏర్పాటు చేయగా, వాటి నుంచి రూ. 2 కోట్లకు పైగా సొమ్మును ప్రభుత్వం చలానాల రూపంలో వసూలు చేసిందని పలువురు నిర్వాహకులు తెలిపారు.



ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి అని కౌన్సెలింగ్ ఇస్తున్న కాకినాడ జిల్లా గొల్లప్రోలు ఎస్సై

పండగలకు పన్నులేంటి?



వినాయకుడి ఉత్సవాలకు ఆంక్షలు, పర్మిషన్లు ఏమిటి? చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఎన్‌ఓసీలు తీసుకోవడం ఏమిటి? ఇదంతా హిందువుల మనోభావాలను దెబ్బ తీయడమే. శాంతియుతంగా భక్తిభావంతో జరుపుకొనే పండగకు ఆంక్షలు విధించి హిందువులను రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోంది. ఇలాంటి ప్రయత్నాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. హిందువుల పండగలు అంటే అంత చులకనా? ప్రభుత్వం వెంటనే బేషరతుగా చలానా విధానాన్ని వెనక్కి తీసుకుని కట్టించుకున్న డబ్బు వెనక్కి ఇవ్వాలి.

– వెంకటేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్ నాయకులు, పిఠాపురం

పండగను ఈవెంట్ అంటారా?



సెలబ్రిటీలు వ్యాపార సంస్థల ప్రారంభాలకు వచ్చినప్పుడు బందోబస్తుకు ఎటువంటి ఫీజు లేనప్పుడు హిందూ ఉత్సవాల్లో ఇటువంటి ఫీజు ఎందుకు? మరే మతంలోనూ జరిగే కార్యక్రమాల్లో లేని బందోబస్తు ఫీజు గణేశ ఉత్సవాలకు మాత్రమే వసూలు చేయడంలో అర్థం ఏమిటి? ఇప్పటికే చవితి పందిళ్ల వద్ద జరిగే అన్నదానం అనంతరం పారిశుద్ధ్యం నిర్వహణ పేరిట రూ. 500 నుంచి రూ.1,500 కార్పొరేషన్ వసూలు చేస్తోంది. తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గణపతి మంటపాలు ఉన్న చోట విద్యుత్ స్తంభాలకు భారీ ఫ్లడ్ లైట్లు కూడా ఏర్పాటు చేయించారు. ప్రస్తుత తెలంగాణ సీం రేవంత్‌రెడ్డి వినాయక మంటపాలకు ఉచిత కరెంటు అందిస్తున్నారు. ఇక్కడ మాత్రం చార్జీలను వసూలు చేయడం దురదృష్టకరం.

– దూసర్లపూడి రమణరాజు, కాకినాడ నగర గణేశ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు

ఓ బొజ్జ గణపయ్యా... మా బొజ్జ నింపేదెవరయ్యా

ఓ బొజ్జ గణపయ్యా..

ఉండ్రాళ్లు, కుడుములతో నీ బొజ్జ నింపుదామనుకున్నాం..
వరదలో కాలే మా కడుపులు నింపే వారి కోసం దిక్కులు చూస్తున్నాం.



పాయకాపురం వైపు నుండి వినాయక విగ్రహాన్ని బయటకు తీసుకువస్తున్న స్థానికులు (ఇన్‌సెట్‌లో) పత్రిని తీసుకుని వెళుతున్న యువకుడు



మూషిక వాహనం మీద వచ్చి మా ఇంట్లో కొలువుదీరతావని అనుకున్నాం..
వరద నుండి బయట పడేందుకు బోట్లు, ట్రాక్టర్లు, గాలి ట్యూబుల కోసం వెంపర్లాడుతున్నాం.

ఇంటిల్లిపాదీ కలిసి నీకు పిండి వంటలు నైవేద్యంగా పెడదామని అనుకున్నాం..
నాలుగు రోజులుగా ముద్ద అన్నం కూడా లేక పస్తులుంటున్నాం

పీటేసి, పూలేసి నిన్ను ప్రతిష్ట చేద్దాం అనుకున్నాం..
నీట నాని మా ఇళ్ల పునాదులే కదిలేలా ఉన్నాయి.

అవిఘ్నంగా జరపాలనుకున్న నీ పూజకు..
ఎందుకయ్యా ఇన్ని విఘ్నాలు..
నీ పూజకు నోచుకోలేనంత నేరం మేమేమి చేశాం.. ఎవరో చేసిన తప్పుకు మాకెన్ని శిక్షలు..

పాలవెల్లి కింద శోభాయమానంగా నిన్ను పూజిద్దామనుకున్నాం..
పాల కోసం ఏడ్చే పిల్లాడికి పాల ప్యాకెట్ల కోసం ఆత్రంగా ఎగబడుతున్నాం.

జంగమయ్యకు నువ్వైనా చెప్పు గంగను విడవద్దని.. మమ్మల్ని నట్టేట ముంచొద్దని

- మా కన్నీరే నీకు పన్నీరు
- మా బాధలే నీ గాథలు
- మా ఆక్రందనలే నీకు మంత్రాలు
- మా ఆకలే నీకు నైవేద్యం
- ఓ బొజ్జ గణపయ్య మము గావుమయ్యా..

గణనాథా అవిఘ్నమస్తు అని ప్రార్థించాల్సిన మా పెదవులు..
నీ పూజకు ఇన్ని విఘ్నాలు ఏమిటయ్యా.. లంబోదరా అని రోదిస్తున్నాయి.

ఇంకా నీటిలోనే నానుతూ బతుకు పోరాటం చేస్తున్న విజయవాడ సింగ్‌నగర్, కండ్రిక, పాయకాపురం, శాంతినగర్, ఉడా కాలనీ ప్రాంతాల్లోని ప్రజల దైన్య పరిస్థితి.

పిల్లల పుస్తకాలకు పసుపు, కుంకుమలద్ది.. బొమ్మలు గీసి నీ పీఠంపై పెడదామనుకున్నాం..
పుస్తకాలన్నీ వరద నీటిలో నాని తేలుతున్నాయి..



పాల ప్యాకెట్లు, బ్రెడ్ ప్యాకెట్లకు ఎగబడుతున్న ప్రజలు

దీపారాధనలు చేసి అష్టైశ్వర్యాలిమ్మని కోరుదామనుకున్నాం..
పీకల్లోతు వరదలో చిక్కుకున్న మమ్మల్ని బతికించు పార్వతీపుత్రా అని వేడుకుంటున్నాం

– ప్రత్తిపాడు, లక్ష్మీపురం



అగ్గిపుల్లల గణనాథుడు

అగ్గిపుల్లలతో గణనాథుని చిత్రాన్ని తయారు చేసి అబ్బురపరిచారు ప్రకాశం జిల్లా, మార్కాపురానికి చెందిన నటుకుల తులసీప్రసాద్. వినాయక చవితి పండుగ సందర్భంగా 20 రోజుల నుంచి 23,450 అగ్గిపుల్లలు సేకరించి గణేశ్ ప్రతిమను తయారు చేసినట్లు ఆయన తెలిపారు. గతంలో పలువురు దేవతా మూర్తులను అగ్గిపుల్లలతోనే తయారు చేసినట్లు ఆయన చెప్పారు.

– మార్కాపురం

పారుతున్న అందాలు



చుట్టూ ఎత్తయిన కొండలు.. పరుచుకున్న పచ్చదనం.. ఆ మధ్య నుంచి తెల్లని జలపాతం ప్రకృతి ప్రేమికులను కట్టి పడేస్తుంది. ఒక మోస్తరు వర్షం కురిసిందంటే చాలు.. కర్నూలు–నంద్యాల రహదారిలో తమ్మరాజుపల్లె ఘాట్ వద్ద ఈ దృశ్యం ఆవిష్కృతమవుతుంది. చూపు తిప్పుకోనివ్వని ఈ జలపాతాన్ని చేరుకోవడం కూడా కష్టమే. ఒకప్పుడు ఆ ప్రాంతంలో ఒక అగ్రహారం ఉండేదని, అయితే సరైన సౌకర్యాలు లేకపోవడంతో స్థానికులు అక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోయినట్లుగా తెలుస్తోంది. ఎత్తయిన కొండపైనున్న బండ పరుపు మీదుగా గడ్డెల దేరిగా పిలువబడే ఈ జలపాతం పరవళ్లు తొక్కుతూ సమీపంలోని కొచ్చెరువులో కలుస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణం ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు 61,142 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,525 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.20 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కాకినాడకు అయోధ్య రామయ్య ధనుర్బాణాలు

బోట్‌క్లబ్: అయోధ్యలోని కోదండరామునికి స్వర్ణ, రజితాలతో తయారు చేసిన ధనుర్బాణాలు కాకినాడకు చేరుకున్నాయి. వాటిని స్థానిక భక్తులు దర్శించుకున్నారు. అయోధ్యవాసి చల్లా శ్రీనివాసశాస్త్రి దేశవ్యాప్త ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా శుక్రవారం గాంధీనగర్‌లోని వీరేష్ ప్రసాద్ స్వగృహంలో కొద్దిగంటల పాటు భక్తులు దర్శనార్థం వాటిని ఉంచారు.

సత్యదేవుని ఆలయానికి రెండో మెట్ల దారి

అన్నవరం: భక్త వరదుడు రత్నగిరి సత్యదేవుని ఆలయానికి వెళ్లేందుకు గాను రెండో మెట్లదారి నిర్మాణ పనులు మొదలయ్యాయి. మొదటి ఘాట్‌రోడ్ వద్ద గల దేవస్థానం హైస్కూల్ పక్క నుంచి అన్నదానం భవనం వరకు ఈ మెట్లు నిర్మిస్తున్నారు. రెండు మలుపులతో సాగే ఈ మెట్లదారిలో సుమారు 300 మెట్లు నిర్మించనున్నారు. సుమారు రూ.90 లక్షల వ్యయంతో నాలుగు నెలల్లో ఈ పనులు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు


ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. అర్చకులు సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మహాపూర్ణాహుతి,కుంభప్రోక్షణ నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ప్రాకారోత్సవం జరిగింది.



రేపు సింహగిరిపై శ్రీనృసింహ హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం శ్రీనృసింహ హోమాన్ని నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఉదయం 7గంటలకు ప్రారంభమయ్యే హోమంలో రూ.2500 టికెట్టు తీసుకుని ఉభయదాతలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈసేవలో భక్తులు ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగా కానీ టికెట్టు తీసుకొని పాల్గొనవచ్చన్నారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో టికెట్లు లభిస్తాయని తెలిపారు. అలాగే www.aptemples.ap. gov.in టికెట్లు తీసుకోవచ్చని తెలిపారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



దాబాగార్డెన్స్: విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

నేడు, రేపు ఆరోగ్యమాత తిరునాల

కడప కల్చరల్ : కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో నవదిన ఉత్సవాలలో భాగంగా శని, ఆదివారాల్లో తిరునాల నిర్వహించనున్నారు. ఈ వివరాలను కడప మేత్రాసన వికర్ జనరల్ తలారి బాలరాజు, కోశాధికారి రెవరెండ్ ఫాదర్ సురేష్, ఆ క్షేత్రం డైరెక్టర్ ఎండీ ప్రసాద్‌రావు శనివారం వెల్లడించారు. కడప నగరంలో మరియతల్లి స్వరూపాన్ని ఊరేగింపుగా మరియాపురానికి చేర్చనున్నట్లు తెలిపారు. విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని వివరించారు.

మహిళా వర్సిటీలో ఈఈఈ అసోసియేషన్ ప్రారంభం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం అసోసియేషన్‌ను శుక్రవారం ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఎం దేవేంద్రనాథ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ప్రావీణ్యం సాధించిన విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈఈఈ అసోసియేషన్ ఏర్పాటు కావడం సంతోషకరమని, అసోసియేషన్‌తో కలిగే ప్రయోజనాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు.

అమెరికా పర్యటనకు ఎస్వీయూ అధ్యాపకుల బృందం

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని పలు విభాగాలకు చెందిన సుమారు ఆరుగురు అధ్యాపకుల బృందం 8న అమెరికా పుర్డ్యూ వర్సిటీ పర్యటనకు వెళ్లనున్నారు. సుమారు 20రోజుల పాటు అక్కడ పలు అంశాలపై శిక్షణ పొందనున్నారు. రుసా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ఎంట్రప్రెన్యూర్‌షిప్‌లను పరిశీలిస్తారు.



9న జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఎస్ఏసీ శిక్షణ కేంద్రం వద్ద జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్టు వివరించారు. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9160200652, 7702921219, 7993768894 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యోగా కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో యోగా అండ్ ఫిట్నెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యోగా పీజీ డిప్లమా, యోగా సర్టిఫికేట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు స్వీకరణ గడువు పెంచినట్లు రిజిస్ట్రార్ పి.సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు 30 శాతం ఫీజు రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని రూ.200 ఫీజు చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు 9603699414 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

ఉన్నత విద్యా మండలి సమావేశంలో ఏయూ అధికారులు

విశాఖ సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి శుక్రవారం వర్చువల్‌గా సమావేశం నిర్వహించింది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీమ్ లీజ్ సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందించడం, ఓడీఎల్ విధానంలో కోర్సుల నిర్వహణ, డిజిటల్ స్కిల్స్ తదితర అంశాలను అందించడంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

అవయవాల అమ్మకం కథ కంచికేనా?

శ్రీకాంత్ అవయవాల దానం వెనుక వీడని మిస్టరీ

- కార్పొరేట్ ఆస్పత్రి నుంచి ఫోన్ చేసిందెవరు..
- శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు రూ.3లక్షలు ఇచ్చిందెవరు..?
- విచారణ కొనసాగుతోంది అంటున్న పోలీసులు



అవయవాలు అమ్మకం కేసులో అంబులెన్స్ నిర్వాహకులును అరెస్ట్ చూపిస్తున్న పోలీసులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా షెట్‌పల్లికి చెందిన రేవెళ్లి శ్రీకాంత్ అవయవ దానం వెనుక ఉన్న మిస్టరీ వీడడం లేదు. శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందగా, అంబులెన్స్ నిర్వాహకులే శ్రీకాంత్ అవయవాలు అమ్ముకున్నారనే చర్చ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇదికాస్త రోజు రో జుకో కొత్త మలుపు తిరుగుతోంది. ఆగస్టు 6న ప్రమాదానికి గురైన శ్రీకాంత్ హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో చనిపోయాడు. అనంతరం అతడి అవయవాలు అంబులెన్స్ డ్రైవర్లే అమ్ముకున్నారనే చర్చ మొదలైంది. అంబులెన్స్ డ్రైవర్లు మొదటి నుంచీ అవయవాలు దానం చేయాలంటూ ప్రోత్సహించడం మృతుడి కుటుంబ సభ్యులకు అనుమా నం కలిగించింది. అవయవాలను ఎక్కువ ధరకు అమ్ముకొని తమకు తక్కువ డబ్బులు ఇప్పించారేమోననే అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 13న ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అదే నెల 14న 'అవయవాలు అమ్ముకున్నారు'అనే శీర్షికన 'సాక్షి'దినపత్రికలో కథనం ప్రచురితం కాగా, సంచలనం సృష్టించింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి హైదరాబాద్‌లోని కార్పొరేట్, కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. గత నెల 19న స్థానిక ఏసీపీ కార్యాలయంలో అవయవాలు అమ్ముకున్నారనే కథనంపై డీసీపీ భాస్కర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. అవయవాలు అమ్మకం జరగలేదని, కేవలం జీవాన్‌దాన్ అనే సంస్థకు శ్రీకాంత్ కుటుంబసభ్యుల ఒప్పందం మేరకు అవయవాలు దానం చేశారని వెల్లడిస్తూ శ్రీకాంత్‌ను ఆస్పత్రిలో చేర్పించడంలో కమీషన్ల కోసం వేర్వేరు ఆస్పత్రులకు తిప్పుతూ కాలయాపన చేసినందుకు, అవయవాలు అమ్ముకున్నారనే అసత్య ప్రచారం చేశారని పేర్కొన్నారు. ఆరోపణలు చేసినందుకు కిరణ్, నరేష్, శ్రావణ్, సాయిరాం, సాగర్‌లపై చీటింగ్ కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై వదిలేశారు. అవయవాలు అమ్మకం జరగలేదనే విషయాన్ని తేల్చేశారు.

రూ.3లక్షలు ఇచ్చింది ఎవరు..?

శ్రీకాంత్ అవయవాలు అమ్మకం జరగకపోతే శ్రీకాంత్ మృతదేహాన్ని అప్పగించిన తర్వాత కార్పొరేట్ ఆస్పత్రి సర్జన్.. శ్రీకాంత్ భార్య స్వప్న, కుటుంబ సభ్యులను పిలిపించి ఖర్చులకు తీసుకోమని రూ.3లక్షలు ఇచ్చినట్లు చెబుతున్నారు. అవయవాలు దానం చేస్తే రూ.3లక్షలు ఇవ్వడం ఎందుకు, దీని వెనుక ఉన్న రహస్యం ఏమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకాంత్‌ను కరీంనగర్ ఆస్పత్రి నుంచి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు. కానీ వెళుతున్న క్రమంలో అవయవాలు దానం చేసిన ఆస్పత్రి నుంచి యాదగిరి అనే వ్యక్తి ఫోన్ చేసి కరీంనగర్ వైద్యులు సూచించిన ఆస్పత్రికి వెళ్లకుండా అడ్డుకొని మాయమాటలు చెప్పి ఆ ఆస్పత్రికి రప్పించుకున్నాడు.

ఈ యాదగిరి ఎవరనే దానిపై పోలీసులు దృష్టి సారించలేదు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.3లక్షలు ఇచ్చింది ఎవరనేదానిపైనా పోలీసులు స్పష్టత ఇవ్వలేకపోయారు. రూ.3లక్షల ప్రస్తావన, శ్రీకాంత్ భార్య స్వప్న ఫోన్‌నంబర్ ఎలా వెళ్లిందనే దానిపై స్పష్టత ఇవ్వకుండా పొంతన లేని సమాధానాలు చెప్పి దాటవేశారు. చివరకు కేసు విచారణ పూర్తి కాలేదని, అంబులెన్స్ నిర్వాహకులను మళ్లీ కస్టడీకి తీసుకొని శాస్త్రీయ ఆధారాలు సేకరించి ఈ కేసులో పూర్తి విచారణ చేపడుతామని పేర్కొనడం గమనార్హం.

పూర్తిస్థాయి విచారణ ఏమైంది..

అవయవాలు అమ్ముకున్న కథ కంచికేనా అన్న చందంగా మారింది. విచారణ పేరిట రోజుకో మలుపు తిరుగుతోంది. శ్రీకాంత్ అవయవాలు ఎవరు..? ఎంతకు అమ్ముకున్నారనేది ఇంకా ప్రజల్లో చర్చనీయాంశంగానే మిగిలిపోయింది. పోలీసులు మాత్రం విచారణ కొనసాగుతోందని చెబుతున్నారు. గత నెల 27న కరీంనగర్ ఆస్పత్రి నిర్వాహకులు మంచిర్యాలకు వచ్చి వెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ బన్సీలాల్‌ను సంప్రదించగా విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఈ కేసులో అంబులెన్స్ నిర్వాహకులపై కేసు నమోదు చేశామని, అవయవాలు అమ్మకంపై వస్తున్న వదంతులపై సాంకేతిక ఆధారాలు సేకరిస్తున్నామని, విచారణ సాగుతోందని తెలిపారు.

జాతర నాటికి పనులు పూర్తయ్యేనా!

మరో మూడున్నర నెలల్లో ప్రారంభం కానున్న కొమురవెల్లి జాతర

- ఆరేళ్లుగా కొనసాగుతున్న 50 గదుల నిర్మాణం పనులు
- కొనసాగుతున్న క్యూ కాంప్లెక్స్ నిర్మాణం
- ప్రతి ఏడాది జాతర సమయంలో ఇబ్బందులు పడుతున్న భక్తులు
- త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వానికి వినతి



క్యూ కాంప్లెక్స్ నిర్మాణం

సాక్షి, సిద్దిపేట: ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటి సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం. కోరమీసాల మల్లన్నగా ప్రసిద్ధి. ప్రతి ఏడాది మూడు నెలల పాటు జాతర జరుగుతుంది. ఈ దేవాలయానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పట్నం, బోనం, స్వామి వారికి మొక్కులు చెల్లిస్తుంటారు. మరో మూడు నెలల్లో జాతర ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జాతర సమయంలో రోజుకు 30 వేలకు పైగా, సాధారణ సమయంలో ఆదివారం, బుధవారాల్లో 20 వేలకు పైగా భక్తులు వస్తుంటారు.

ఆరేళ్లుగా కొనసాగుతున్న గదుల నిర్మాణం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయ పరిసరాల్లో దాతల సహకారంతో 128 గదులు కొన్నేళ్ల కిందట నిర్మించారు. అందులో 18 గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక మిగిలినవి 110 గదులు మాత్రమే. అందులో నుంచే జాతర సమయంలో పోలీసులకు, ఇతర అవసరాలకు దాదాపు 50 వరకు వినియోగిస్తారు. ఇక 60 గదులే భక్తులకు అందుబాటులో ఉంటాయి. జాతర మూడు నెలల పాటు జరుగుతుంది. బుధ, ఆదివారాల్లో రోజుకు 50 వేలకు పైగా మిగతా రోజుల్లో 30 వేలకు పైగా భక్తులు వస్తుంటారు. జాతర సమయంలో ప్రైవేట్ అద్దె గదుల యజమానులు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్కో గదికి 12 గంటలకు రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారు. డబ్బులు వెచ్చించలేని భక్తులు చెట్ల కిందనే బోనం వండి దేవాలయంలో బోనం, పట్నం చెల్లిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో 2018 సంవత్సరంలో 50 గదుల నిర్మాణంను ప్రారంభించారు. రూ.10.65 కోట్ల వ్యయంతో జీ ప్లస్ టుతో నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి పనులు ఆగుతూ సాగుతూ వస్తున్నాయి. ఆరేళ్లు పూర్తవుతున్నా ఇంకా గదుల నిర్మాణం పూర్తి కాలేదు. ఈ గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేసి ఈ జాతరకు అందుబాటులోకి వచ్చేలా చేసి, ఇంకా 150కి పైగా గదుల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.

జాతర నాటికి పనులు పూర్తయ్యేనా?

మరో మూడున్నర నెలల్లో స్వామి వారి కల్యాణంతో జాతర ప్రారంభం కానుంది. ఉగాది వరకు జాతర జరగనుంది. జాతర సమయంలో రోజుకు వేలాది మంది భక్తులు వస్తుంటారు. దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెరిగితేనే జాతర నాటికి పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుంది. లేకపోతే భక్తుల ఇబ్బందులు తప్పవు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

పూర్తయ్యేందుకు కృషి చేస్తాం

క్యూ కాంప్లెక్స్‌కు మూడు స్లాబ్‌లు వేశాం. 50 గదుల నిర్మాణం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ వారు చేస్తున్నారు.



ఈ జాతర నాటికి పనులు పూర్తయ్యేందుకు కృషి చేస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– బాలాజీ, ఈఓ

క్యూ కాంప్లెక్స్ పూర్తయ్యేనా?

మల్లికార్జున స్వామి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో వస్తుంటారు. కర్రలతో క్యూలైన్‌లను ప్రతి జాతర సమయంలో ఏర్పాటు చేస్తారు. దర్శనానికి బుధ, ఆదివారాల్లో 3 నుంచి 4 గంటల సమయం పడుతుంది. ఒక్కసారి క్యూలైన్‌లో ప్రవేశిస్తే మళ్లీ బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది.

వృద్ధులు, షుగర్ వ్యాధిగ్రస్తులు, చిన్నారులు మూత్రంకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. భక్తుల వినతుల మేరకు క్యూ కాంప్లెక్స్‌లను నిర్మించాలని నిర్ణయించారు. రూ.12 కోట్ల వ్యయంతో నిర్మాణం పనులను 2023, అక్టోబర్‌లో ప్రారంభించారు. ఇప్పటి వరకు స్లాబ్‌లు వేశారు. లోపల క్యూలైన్‌లు, మూత్రశాలలు నిర్మించాలి.



ఆరేళ్లుగా సాగుతున్న 50 గదుల నిర్మాణం పనులు

సమస్యల్లో ఎస్సీ సబ్‌ప్లాన్ గురుకులాలు



ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో నిర్మించిన బెల్లంపల్లి సంక్షేమ బాలుర సీఓఈ గురుకుల కళాశాల

మొత్తం 11 గురుకులాలు.. ఒక్కో విద్యాలయం రూ.13 కోట్లతో నిర్మాణం

- 2017లో ఇంటర్మీడియట్ కళాశాలలుగా అప్‌గ్రేడ్
- అయినప్పటికీ జేఎల్ పోస్టులు మంజూరు కాని వైనం
- ఒక్కో జూనియర్ కాలేజీకి 7 జేఎల్ పోస్టులు అవసరం
- సబ్జెక్ట్స్ అసోసియేట్స్‌తో బోధన చేయిస్తూ పోస్టుల మంజూరులో నిర్లక్ష్యం
- సబ్జెక్ట్స్ అసోసియేట్స్‌నూ తొలగించడంతో ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

బెల్లంపల్లి: ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రాష్ట్రంలో ప్రారంభించిన ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గురుకులాలకు అంకురార్పణ జరగగా 2014, జూలైలో ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో తొలుత 10 ఆ తర్వాత మరొకటి కలిపి మొత్తంగా 11 ఏర్పాటయ్యాయి. ఒక్కో సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని రూ.13 కోట్ల అంచనాతో నిర్మించారు. సాంకేతిక సమస్యలో మరే కారణమో తెలియదు గానీ పోస్టులు మంజూరు కాలేదు. ఆ లోటును గుర్తించి గురుకులాలు ఏర్పడిన మూడేళ్లకు 2016లో సబ్‌ప్లాన్ గురుకులాలకు పదో తరగతి వరకు పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతిస్తూ జీవో జారీ చేసింది. గురుకులాల్లో కొన్ని 2017లో, మరికొన్ని 2018లో ఇంటర్మీడియట్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. వీటిలో 7 బాలికల గురుకుల జూనియర్ కళాశాలలు ఉండగా మరో 4 బాలుర జూనియర్ కళాశాలలున్నాయి. వీటన్నింటిలో బాలికలు 2, బాలుర 4 చొప్పున మొత్తం 6 సంక్షేమ జూనియర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) కళాశాలలు ఉండటం గమనార్హం.

ఒక్కో కళాశాలలో..

ఒక్కో జూనియర్ కళాశాలలో సగటున 7 జేఎల్ పోస్టులకు తక్కువ కాకుండా మంజూరు చేయాల్సి ఉంటుంది. తెలుగు, ఇంగ్లిష్, బొటనీ, జువాలజీ, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ పోస్టులను మంజూరు అనుమతి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా సబ్జెక్ట్స్ అసోసియేట్స్‌తో బోధన చేయిస్తున్నారు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సబ్జెక్ట్స్ అసోసియేట్స్ ప్రత్యేక శ్రద్ధతో బోధన చేస్తూ సీఓఈల్లో ఉత్తమ ఫలితాలు, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మెరుగైన ర్యాంకులు సాధిస్తున్నారు. ప్రస్తుతం ఆ సబ్జెక్ట్స్ అసోసియేట్స్‌నూ విధుల్లో నుంచి తప్పించడంతో బోధన కుంటుపడింది. గత నాలుగు రోజుల నుంచి విద్యాబోధన పూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన ఆర్థిక శాఖ నుంచి అనుమతి ఇప్పించి మంజూరు చేయించాలని, ఐఐటీ, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో నెగ్గడానికి తప్పనిసరిగా సబ్జెక్ట్స్ అసోసియేట్స్‌తో తర్ఫీదు ఇప్పించి మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

మంజూరు లేని జేఎల్ పోస్టులు

ఎస్సీ సబ్‌ప్లాన్ గురుకులాలు ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు సదరు 11 సంక్షేమ గురుకుల కళాశాలల్లో జూనియర్ లెక్చరర్స్ (జేఎల్) పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ఆర్థిక శాఖ నుంచి అనుమతి తీసుకుని మంజూరు జీవో తీసుకు రావడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారనే విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగా సరిపడా జేఎల్ పోస్టులు, కళాశాలలకు కావాల్సిన బోధనేతర సిబ్బంది పోస్టులు మంజూరులో ప్రతిబంధకాలు ఏర్పడ్డాయి. నేటికీ జేఎల్ పోస్టులకు సాంక్షన్ లేకుండానే గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులకు బోధన చేస్తూ నెట్టుకొస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో ప్రారంభించిన బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో రెగ్యులర్ జూనియర్ లెక్చరర్ పోస్టుల మంజూరు లేని విషయం విద్యార్థుల తల్లిదండ్రులు నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని గురుకుల విద్యాలయాల సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారంగా వ్యవహరిస్తాను.



– అరుణకుమారి, జోనల్ అధికారి, కాళేశ్వరం జోన్

ఎస్సీ సబ్ ప్లాన్ జూనియర్ కళాశాలల వివరాలు

జిల్లా	ప్రాంతం	బాల/బాలికలు
మెదక్	కొల్చారం	బాలికలు
సంగారెడ్డి	రాయికోడ్	బాలికలు (స్పోర్ట్స్ స్కూల్)
మంచిర్యాల	చెన్నూర్	బాలికలు
మంచిర్యాల	బెల్లంపల్లి	బాలురు (సీఓఈ)
వనపర్తి	గోపాల్‌పేట్	బాలికలు
వరంగల్ రూరల్	వర్ధన్నపేట	బాలురు (సీఓఈ)
కామారెడ్డి	దోమకొండ	బాలికలు
ఖమ్మం	దానవాయిగూడెం	బాలికలు (సీఓఈ)
రంగారెడ్డి	గౌలిదొడ్డి	బాలికలు (సీఓఈ)
జోగులాంబ గద్వాల	అలంపూర్ (ఇటిక్యాల)	బాలురు (సీఓఈ)
కరీంనగర్	మానకొండూర్	బాలురు (సీఓఈ)

మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకంపై దాసు సురేశ్ హర్షం



సాక్షి, హైదరాబాద్: పీసీసీ చీఫ్ నియామకంపై కాంగ్రెస్ అధిష్టానానికి తాము అభ్యర్థించిన విధంగా బీసీ వర్గానికి చెందిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు దక్కడం పట్ల బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ నియామకానికి సహకరించిన కాంగ్రెస్ అధిష్టానానికి, సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పీసీసీ చీఫ్‌గా బీసీని నియమించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన ఎజెండా అయిన సామాజిక న్యాయాన్ని ప్రతిబింబిస్తుందని సురేశ్ అన్నారు. ఇదే విషయాన్ని తాము ఇటీవల ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో వ్యక్తిగతంగా పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు, ప్రత్యేక లేఖ ద్వారా రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తెలియజేసిన విషయాన్ని మీడియాకు తెలిపారు. సీఎంగా ఓసీ, డిప్యూటీ సీఎంగా ఎస్సీ సామాజిక వర్గ నేతలు ఉన్న ప్రస్తుత తరుణంలో పీసీసీ చీఫ్‌గా బీసీని నియమించడం రాష్ట్రంలో సామాజిక సమతుల్యానికి కాంగ్రెస్ పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఈ నియామకం రాష్ట్రంలో కులగణనను త్వరితగతిన నిర్వహించడానికి మార్గం సుగమం చేస్తుందన్న ఆశాభావాన్ని సురేశ్ వ్యక్తం చేశారు.

పర్యావరణ హిత గణేశులతో పండుగకు సార్థకత

ప్రజలకు పిలుపునిచ్చిన మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి హితాన్ని కోరే వినాయక చవితి పండుగను పర్యావరణహిత గణపతుల ప్రతిమలను ప్రతిష్టించి పండుగకు సార్థకతను చేకూర్చాలని అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ ప్రజలకు పిలుపునిచ్చారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర ప్రగతికి చేపట్టే కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తి కావాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. హిందూ ధార్మిక, ఆధ్యాత్మిక ప్రపంచానికి గణేశుడు ప్రథమ పూజ్యుడని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సకల శాస్త్రాలకు అధిపతిగా, ఆటంకాలను తొలగించే విఘ్నేశ్వరుడిగా, బుద్ధికి, జ్ఞానానికి ఆరాధ్యుడిగా భక్తులు వినాయకుడిని పూజిస్తారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ ఏడాది వినాయకుడి మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తోందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సురేఖ సూచించారు.

ఎంసెట్, జేఈఈ నీట్ కోచింగ్ ఇవ్వడం హర్షణీయం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఎంసెట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ పరీక్షలకు కోచింగ్ ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించడం హర్షించదగిన విషయమని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి వెంకటేశంకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఏ రోజైనా కేసీఆర్ ఉపాధ్యాయులను కలిశాడా?

టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు సంబురంగా జరుపుకుంటే బీఆర్‌ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు మాత్రం విమర్శలు చేస్తున్నారని, ఆయన్ను పిచ్చాస్పత్రిలో చేర్పించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయుల సన్మాన సభకు హాజరు కాలేదని, డిప్యూటీ సీఎంతో పాటు పలువురు మంత్రులు ఈ సభకు హాజరయ్యారని గుర్తుచేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో హర్షవర్ధన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అసలు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏ రోజైనా ఉపాధ్యాయులను కనీసం కలిశాడా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 40 వేల మంది టీచర్లకు బదిలీలు నిర్వహించిందని, వివక్షను తొలగించే విధంగా ఉపాధ్యాయుల వేతనాలను పెంచిందని తెలిపారు. బాధ్యతగల ప్రతిపక్షంలో ఉండి చవకబారు విమర్శలు చేయడం సరికాదని హర్షవర్ధన్‌రెడ్డి బీఆర్‌ఎస్ నేతలకు హితవు పలికారు.

సాక్షి ప్లస్
శనివారం : 7-9-2024

ఇండియన్ నేషనల్ ఆర్మీ ఏర్పాటైన సంవత్సరం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ఆధునిక భారతదేశ చరిత్ర - బ్రిటిషర్ల పాలన

వైస్రాయ్‌లు

లార్డ్ చెమ్స్‌ఫర్డ్ (1916-21)

ఇతడి కాలంలో 1916లో కాంగ్రెస్ లక్నో సమావేశంలో అతివాదులు, మితవాదులు, హిందూ-ముస్లింలు ఏకమయ్యారు. 1917లో చంపారన్ సత్యాగ్రహం, 1918లో అహ్మదాబాద్‌లో నూలుమిల్లుల ఉద్యమం జరిగాయి. 1919లో మాంటెగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రవేశపెట్టారు. వీటి ద్వారా ద్వంద్వ పరిపాలన (Diarchy) కింద రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కువ అధికారాలు కల్పించారు. ఆర్థిక వ్యవహారాలు, శాంతిభద్రతలు గవర్నర్ ప్రత్యక్ష ఆధీనంలో (Reserved Subjects); విద్య, ఆరోగ్యం, వ్యవసాయం మొదలైనవి శాసన సంబంధమైన అంశాలు (Transferred Subjects)గా ఉంటాయి. దీని ద్వారా ఎగువసభ, దిగువ సభలు ఏర్పడ్డాయి. చెమ్స్‌ఫర్డ్ కాలంలోనే 1919లో జలియన్ వాలాబాగ్ ఊచకోత జరిగింది. 1919లో ఢిల్లీలో అఖిల భారత ఖిలాఫత్ సమావేశం జరిగింది.

1920లో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించి పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాలను బహిష్కరించారు. గాంధీజీ తనకు ఇచ్చిన కైజర్-ఇ-హింద్ పతకాన్ని తిరిగి ఇచ్చేశారు. 1920లో బాలగంగాధర్ తిలక్ మరణించారు. సి.ఎన్. బెనర్జీ ఇండియన్ లిబరల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఖిలాఫత్ ఉద్యమం ప్రారంభమైంది. పుణేలో మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేశారు.

లార్డ్ రీడింగ్ (1921-26)

ఇతడి కాలంలో అలీగఢ్ జామియా మిలియా ఇస్లామియా (జాతీయ ముస్లిం విశ్వవిద్యాలయం), బిహార్ విద్యాపీఠ్, కాశీ విద్యాపీఠ్, గుజరాత్ విద్యాపీఠ్ తదితర విద్యాసంస్థలను స్థాపించారు. 1921లో పంజాబ్‌లో సిక్కులు గురుద్వారాల నుంచి అవినీతిపరులైన మహంతులను తొలగించడానికి అకాలీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1922లో చౌరీచౌరాలో ప్రజలు పోలీస్‌స్టేషన్‌ను తగులబెట్టారు. ఈ ఘటనలో 22 మంది పోలీసులు మృతి చెందారు. దీంతో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేశారు. 1922 డిసెంబర్‌లో చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ కలిసి స్వరాజ్య పార్టీని స్థాపించారు. 1921లో ఎం.ఎన్. రాయ్ భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. 1926లో మతకలహాలు చెలరేగాయి. వీటిలో భాగంగా



ప్రముఖ నాయకుడు, జాతీయవాది అయిన స్వామి శ్రద్ధానంద్‌ను మతచాంధసవాదులు హత్య చేశారు. కె.బి. హెగ్డేవార్, ఆర్.ఎస్.ఎస్.ను స్థాపించారు. రౌలత్ చట్టాన్ని రద్దు చేశారు.

లార్డ్ ఇర్విన్ (1926-31)

ఇర్విన్ కాలంలో 1928 ఫిబ్రవరిలో సైమన్ కమిషన్ భారతదేశానికి వచ్చింది. ఇందులో భారతీయులెవరికీ సభ్యత్వం కల్పించలేదు. దీంతో ఈ కమిషన్‌కు దేశవ్యాప్తంగా నిరసన ఎదురైంది. 1928 డిసెంబర్‌లో తొలిసారిగా అఖిల భారత యువజన కాంగ్రెస్ సమావేశం జరిగింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో రైతులు 1928లో పన్నుల నిరాకరణోద్యమం సాగించారు. 1928లో చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో 'హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' అనే విప్లవ సంస్థ ఆవిర్భవించింది. భగత్‌సింగ్, బి.కె. దత్తు కలిసి 1929 ఏప్రిల్ 8న కేంద్ర శాసనసభలో బాంబు విసిరారు. ప్రజారక్షణ బిల్లు ఆమోదానికి నిరసనగా వీరు ఈ ఘటనకు పాల్పడ్డారు. 1930లో చిట్టగాంగ్‌లో ప్రభుత్వ ఆయుధాగారంపై దాడి జరిగింది. సూర్యాసేన్ నేతృత్వంలో జరిగిన ఈ దాడిలో మహిళలు సైతం పాల్గొన్నారు. రాజకీయ ఖైదీలను ఉంచే జైళ్లలో దుర్భర పరిస్థితులు ఉండేవి. దీనికి నిరసనగా జతిన్‌దాస్ అనే యువకుడు 63 రోజుల పాటు ఉపవాస దీక్ష చేసి ప్రాణత్యాగం చేశాడు. 1931లో భగత్‌సింగ్, రాజ్‌గురును పోలీసు అధికారుల హత్యకేసుల్లో విచారించి ఉరితీశారు. 1929లో కాంగ్రెస్ పార్టీ లాహోర్‌లో సమావేశమైంది. 'సంపూర్ణ స్వరాజ్యం' కాంగ్రెస్ ఆశయమని ఈ సమావేశంలోనే ప్రకటించారు. అదే ఏడాది త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీజీ 1930 మార్చి 12న దండి సత్యాగ్రహం ప్రారంభించారు. ఇదే ఉప్పు సత్యాగ్రహంగా ప్రసిద్ధికెక్కింది. 1930లో జరిగిన తొలి రౌండ్ టేబుల్ సమావేశానికి భారతీయ నాయకులను ఆహ్వానించారు. కానీ, సైమన్ నివేదికపై చర్యకు నిరసనగా వీరు సమావేశాన్ని బహిష్కరించారు. తర్వాత గాంధీ-ఇర్విన్ సంధి జరిగింది. ఉద్యమాన్ని నిలిపివేశారు.

లార్డ్ వెల్లింగ్‌టన్ (1931-36)

ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ నాయకత్వంలో పఠాన్లు 'ఖుదాయ్ ఖిద్మత్ గార్' అనే సంస్థను ప్రారంభించారు. దీనికి భగవంతుడి సేవకులని అర్థం. వీరినే 'రెడ్ షర్ట్'లు అని కూడా పిలుస్తారు. మణిపూర్ వాసులు జాతీయోద్యమంలో సాహసోపేత పాత్ర పోషించారు. గాంధీజీ పిలుపు మేరకు నాగాలాండ్ వీరనారి 'రాణి గైడిన్‌లియూ' పదమూడేళ్ల వయస్సులోనే జాతీయోద్యమంలో పాల్గొన్నారు. విదేశీ పాలనకు వ్యతిరేకంగా ఆమె తిరుగుబాటు జరిపారు. 1932లో బ్రిటిష్ ప్రభుత్వం రాణికి యావజ్జీవ కారాగారశిక్ష విధించింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చాక భారత ప్రభుత్వం ఆమెను విడుదల చేసింది. 1931లో రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనడానికి గాంధీజీ లండన్ వెళ్లారు. ఈ సమావేశంలో 'కమ్యూనల్ అవార్డు'ను ప్రకటించారు. దీని ప్రకారం మైనారిటీలకు ప్రత్యేక నియోజక వర్గాలు కల్పించారు. దీనికి నిరసనగా గాంధీజీ నిరాహారదీక్ష చేపట్టారు.

నిమ్నజాతులకు కూడా ప్రత్యేక స్థానాలను ప్రకటించారు. గాంధీ-అంబేద్కర్ మధ్య పుణే ఒప్పందం జరిగింది. 1932లో మూడో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఓటింగ్ అర్హత, ఉమ్మడి నిధులు, రాష్ట్రాల ఆర్థిక వనరుల గురించి ఈ సమావేశంలో చర్చించారు. మహిళలకు ఓటు హక్కు కల్పించడం, రాష్ట్రాల శాసనసభ్యుల సమాఖ్య, ఎగువసభ, ప్రతినిధులను ఎన్నుకోవడం మొదలైనవి ఈ సమావేశం నిర్ణయించిన నూతన విషయాలు. గాంధీ-ఇర్విన్ ఒప్పందం తర్వాత 1933లో కాంగ్రెస్ అధికారికంగా ఉద్యమాన్ని నిలిపివేసింది. 1935 భారత ప్రభుత్వ రాజ్యాంగ చట్టం ఆమోదం పొందింది. ఈ చట్టం ప్రకారం దేశంలో ఫెడరల్ (సమాఖ్య) వ్యవస్థ ఏర్పాటైంది. రాష్ట్రాలకు స్వపరిపాలనాధికారం లభించింది. 1935 చట్టం రాజ్యాధికారాలను మూడు రకాలుగా విభజించింది. అవి:

1. సమాఖ్య అధికారాలు
2. రాష్ట్ర అధికారాలు
3. ఉమ్మడి అధికారాలు

తమ అధికార పరిధిలో శాసనాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వాధికారం ఉంటుంది. ఉమ్మడి జాబితాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాసనం చేయవచ్చు. ఏ శాసన్నాన్నైనా వీటో చేసే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంటుంది. బిల్లులను పునఃపరిశీలించమని సూచించే లేదా బ్రిటిష్ చక్రవర్తి నిర్ణయానికి పంపే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంటుంది. ఈ చట్టం ప్రకారం ఎగువ సభలో 2/5వ వంతు, దిగువ సభలో 3/5వ వంతు స్థానాలు సంస్థానాధీశులకు కేటాయించారు. భారత్ నుంచి బర్మాను వేరు చేశారు. జయప్రకాశ్ నారాయణ్ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీని ఏర్పాటు చేశారు. 1936లో ఆలిండియా కిసాన్ సభ ఏర్పాటైంది.

లార్డ్ లిన్‌లిత్ గో (1936-44)

భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం 1937 జూలై నాటికి ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చాలా రాష్ట్రాల్లో అత్యధిక స్థానాలను సాధించి, ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. 1937లో జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1936లో తొలి అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భవించింది. నాటి నుంచి రైతాంగం జాతీయోద్యమంలో క్రియాశీల పాత్ర పోషించింది. 1936 లక్నో కాంగ్రెస్ సమావేశంలో సోషలిజాన్ని ఆమోదించారు. 1938లో జాతీయ కాంగ్రెస్ గుజరాత్‌లోని హరిపూర్‌లో సమావేశమైంది. దీనికి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షత వహించారు. 1939లో బోస్ అధ్యక్ష పదవికి పోటీ చేశారు. గాంధీ, నెహ్రూ ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ సుభాష్ చంద్రబోస్ గెలుపొందారు. వర్కింగ్ కమిటీలో గాంధీజీ అనుయాయులు బోస్ పట్ల విముఖత చూపారు. దీంతో ఆయన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. కొందరు వామపక్ష వాదులతో కలిసి ఫార్వర్డ్ బ్లాక్ అనే కొత్త పార్టీని ప్రారంభించారు. 1927 డిసెంబర్ నాటికే అఖిల భారత సంస్థాన ప్రజాసభ ప్రారంభమైంది. 1939లో నెహ్రూ ఈ సభకు అధ్యక్షుడయ్యాడు. 1939లోనే రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. భారతీయులను సంప్రదించకుండానే భారత్‌లోని బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధంలోకి అడుగుపెట్టింది. ఈ విషయమై జాతీయ కాంగ్రెస్‌కు లేదా కేంద్ర శాసనసభకు ఎన్నికైన సభ్యులకు మాటమాత్రంగా కూడా చెప్పలేదు. 1940లో ముస్లిం లీగ్ దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. అదే ఏడాది బ్రిటిష్ ప్రభుత్వం ఆగస్టు ఆఫర్ జారీ చేసింది. దీని ప్రకారం మైనారిటీలకు అధిక స్థానాలను కేటాయిస్తారు. యుద్ధం ముగిశాక నూతన రాజ్యాంగంలో ఈ విషయాన్ని పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. 1941లో సుభాష్ చంద్రబోస్ నిర్బంధం నుంచి తప్పించుకొని బెర్లిన్ వెళ్లారు. 1942లో ఆయన ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఆజాద్ హిందు ఫౌజ్)ని స్థాపించారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం విదేశాల నుంచే బోస్ పోరాడారు. ఆయన 'జైహింద్' అనే నినాదమిచ్చారు.

రెండో ప్రపంచ యుద్ధంలో భారతీయుల పూర్తి సహకారం కోసం బ్రిటన్ ప్రయత్నించింది. ఇందు కోసం 1942 మార్చిలో సర్ స్టాఫర్డ్ క్రిప్స్ నేతృత్వంలో ఒక రాయబార బృందాన్ని భారత్‌కు పంపింది. క్రిప్స్ బ్రిటిష్ మంత్రివర్గ సభ్యుడు, లేబర్ పార్టీలో రాడికల్ సభ్యుడు. వీలైనంత త్వరగా స్వపరిపాలన ప్రతిపాదించడమే తమ లక్ష్యమని క్రిప్స్ తెలిపారు. కాంగ్రెస్ కమిటీ 1942 ఆగస్టు 8న బొంబాయిలో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించారు. కాంగ్రెస్ పార్టీ, గాంధీజీ నాయకత్వంలో అహింసాయుత ప్రజాపోరాటాన్ని కొనసాగించింది. బ్రిటిష్ ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని సమర్థవంతంగా అణచివేసింది.

ముఖ్యాంశాలు

- 1929: లాహోర్‌లో నెహ్రూ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సమావేశం. 'సంపూర్ణ స్వరాజ్యమే' తమ ఆశయమని ప్రకటన.
- 1930 మార్చి 12: దండి సత్యాగ్రహాన్ని ప్రారంభించిన మహాత్మా గాంధీ.
- 1942 మార్చి: సర్ స్టాఫర్డ్ క్రిప్స్ నేతృత్వంలో భారత్‌కు రాయబార వర్గం రాక.
- 1942 ఆగస్టు 8: బొంబాయిలో కాంగ్రెస్ కమిటీ సమావేశం, క్విట్ ఇండియా తీర్మానానికి ఆమోదం.
- 1946 మార్చి: కేబినెట్ మిషన్ భారత్ రాక.
- 1946 ఆగస్టు 16: కేబినెట్ ప్లాన్‌ను అంగీకరించని ముస్లిం లీగ్, ఆగస్టు 16ను ప్రత్యక్ష చర్యాదినంగా ప్రకటన.
- 1947 జూన్ 3: భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా అవతరిస్తాయనే ప్రకటన విడుదల.


లార్డ్ వేవెల్ (1944-47)

1944లో అట్లీ బ్రిటన్ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1945లో కాంగ్రెస్, ముస్లిం లీగ్ పార్టీలు లార్డ్ వేవెల్ సమక్షంలో సిమ్లాలో సమావేశమయ్యాయి. రాజ్యాంగ, మత అడ్డంకులను తొలగించేందుకు ఆ పార్టీలు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. 1946లో అఖిల భారత తంతి-తపాలా కార్మికులు సమ్మె చేశారు. కౌలు రేట్ల తగ్గింపు కోసం రైతాంగ పోరాటాలు అధికమయ్యాయి. సమ్మెలు, హర్తాళ్లు, ప్రదర్శనలు నిర్వహించడంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రముఖ పాత్ర పోషించారు. ఈ పరిస్థితుల్లో బ్రిటిష్ ప్రభుత్వం 1946 మార్చిలో కేబినెట్ మిషన్‌ను పంపింది. అధికార బదిలీ గురించి భారత జాతీయ నాయకులతో ఈ మిషన్ సంప్రదింపులు జరిపింది. నూతన రాజ్యాంగం అమల్లోకి వచ్చే దాకా తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బ్రిటిష్ రాయబార వర్గం సూచించింది. 1946 సెప్టెంబర్‌లో నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక జాతీయ ప్రభుత్వం ఏర్పాటైంది. ముస్లింలీగ్ మంత్రి వర్గంలో చేరింది. కేబినెట్ ప్లాన్‌ను అంగీకరించని ముస్లింలీగ్ 1946 ఆగస్టు 16ను ప్రత్యక్ష చర్యాదినంగా ప్రకటించింది. నేవీ తిరుగుబాటు చేసింది. ఇండియన్ నేషనల్ ఆర్మీ బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించింది.

లార్డ్ మౌంట్ బాటన్ (1947)

మౌంట్ బాటన్ 1947లో భారత వైస్రాయ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన కాంగ్రెస్, ముస్లిం లీగ్ నాయకులతో సుదీర్ఘ చర్చలు జరిపారు. భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా అవతరిస్తాయన్న ప్రకటన 1947 జూన్ 3న విడుదలైంది. 1947 ఆగస్టు 14న పాకిస్తాన్ నూతన దేశంగా ఆవిర్భవించింది. అదే రోజు అర్ధరాత్రి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1948 జనవరి 30న గాడ్సే గాంధీజీని కాల్చి చంపాడు.

'రాజనీతి శాస్త్ర పితామహుడు' అని ఎవరిని పేర్కొంటారు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

పాలిటీ

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పంచశీల సూత్రం కానిది?
   1) రాజ్యాల సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని పరస్పరం గౌరవించడం
   2) రాజ్యాల పరస్పర దురాక్రమణకు పాల్పడకుండా ఉండటం
   3) ఇతర రాజ్యాల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం
   4) ఇతర రాజ్యాల అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా ఉండటం
2. అలీనోద్యమ మొదటి శిఖరాగ్ర సమావేశం 1961లో యుగోస్లేవియాలోని బెల్‌గ్రేడ్‌లో జరిగితే, 2015లో 17వ శిఖరాగ్ర సమావేశాన్ని ఎక్కడ నిర్వహించారు?
   1) కౌలాలంపూర్ (మలేషియా)
   2) హవానా (క్యూబా)
   3) టెహ్రాన్ (ఇరాన్)
   4) కారకాస్ (వెనిజులా)
3. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శుల్లో రెండు పర్యాయాలు పనిచేసిన వారెవరు?
   1) ట్రిగ్వేలీ (నార్వే)
   2) యుథాంట్ (బర్మా)
   3) డాగ్‌హోమర్ జోల్డ్ (స్వీడన్)
   4) బుట్రోస్ బుట్రాస్ ఘలీ (ఈజిప్ట్)
4. కింది వాటిలో యూఎన్‌వో ప్రత్యేక ఏజెన్సీల్లో జెనీవాలో ప్రధాన కార్యాలయం లేని సంస్థ ఏది?
   1) అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్)
   2) అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో)
   3) ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)
   4) ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో)
5. కింది వాటిలో బ్రిక్స్‌లో సభ్యత్వం లేని దేశం ఏది?
   1) దక్షిణాఫ్రికా 2) బ్రెజిల్
   3) భారత్ 4) భూటాన్
6. CTBTను విస్తరించండి?
   1) Common Treatment for Bad Terrorists
   2) Comprehensive Nuclear Test Ban Treaty
   3) Conclusive Test Ban Treaty
   4) Community Test Base Treatment
7. వివిధ సమావేశాలకు అధ్యక్షత వహించే వారికి సంబంధించి కింది వాటిని జతపరచండి.
   జాబితా -I
   i) ఉపరాష్ట్రపతి ii) ప్రధానమంత్రి
   iii) స్పీకర్
   iv) శాసన మండలి చైర్మన్
   జాబితా -II
   a) కేబినెట్ సమావేశం
   b) పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశం
   c) రాజ్యసభ సమావేశం
   d) విధాన పరిషత్ సమావేశం
   1) i-c, ii-a, iii-b, iv-d
   2) i-c, ii-a, iii-d, iv-b
   3) i-b, ii-a, iii-c, iv-d
   4) i-a, ii-c, iii-b, iv-d
8. 'మున్సిపల్ వ్యవస్థకు కళ్లు, చెవులు, చేతులు' అని వేటిని పేర్కొంటారు?
   1) మున్సిపల్ కమిషనర్లు
   2) ఆర్థిక వనరులు
   3) పన్నులు, ప్రణాళికలు
   4) స్థాయి సంఘాలు
9. కలకత్తా, మద్రాస్, బొంబాయి హైకోర్టులను ఏ చట్టం ద్వారా ఏర్పాటు చేశారు?
   1) రెగ్యులేటింగ్ చట్టం -1773
   2) చార్టర్ చట్టం - 1833
   3) కౌన్సిల్ చట్టం - 1861
   4) భారత ప్రభుత్వ చట్టం - 1858
10. కింది వారిలో ముసాయిదా కమిటీలో సభ్యుడు కాని వారెవరు?
   1) టి. కృష్ణమాచారి 2) ఎన్. మాధవరావు
   3) కె.ఎం. మున్షీ 4) రాజేంద్రప్రసాద్
11. 'రాజనీతి శాస్త్ర పితామహుడి'గా ఎవరిని పేర్కొంటారు?
   1) సోక్రటీస్ 2) అరిస్టాటిల్
   3) ప్లేటో 4) మాకియవెల్లి
12. భారత రాజ్యాంగ రూపకల్పనకు పట్టిన కాలం?
   1) 36 నెలల 18 రోజులు
   2) 34 నెలల 18 రోజులు
   3) 35 నెలల 18 రోజులు
   4) 37 నెలల 18 రోజులు
13. రాజ్యాంగ పరిషత్ చిహ్నం?
   1) సింహం 2) ఐరావతం
   3) మేషం 4) వరాహం
14. భారత రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు, అందులో ఎన్ని ఆర్టికల్స్, షెడ్యూళ్లు, భాగాలు ఉన్నాయి?
   1) 395 ఆర్టికల్స్, 6 షెడ్యూళ్లు, 12 భాగాలు
   2) 395 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్లు, 21 భాగాలు
   3) 395 ఆర్టికల్స్, 12 షెడ్యూళ్లు, 8 భాగాలు
   4) 395 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్లు, 22 భాగాలు
15. జతపరచండి.
   కేసులు
   i) బెరుబారి ii) కేశవానంద భారతి
   iii) గోలక్ నాథ్ iv) మినర్వా మిల్స్
   సంవత్సరాలు
   a) 1967 b) 1980
   c) 1960 d) 1973
   1) i-c, ii-a, iii-b, iv-d
   2) i-b, ii-c, iii-a, iv-d
   3) i-b, ii-a, iii-c, iv-d
   4) i-c, ii-d, iii-a, iv-b
16. కింది వారిలో రాజ్యాంగ పరిషత్ సలహాదారుడిగా ఎవరు వ్యవహరించారు?
   1) బెనగల్ రామారావు
   2) బెనగల్ నర్సింగ రావు
   3) బెనగల్ నరేంద్ర 4) ఎవరూ కాదు
17. జతపరచండి.
   వ్యక్తులు
   i) గ్రాన్‌విల్లె ఆస్టిన్ ii) హెచ్.వి. కామత్
   iii) ఎం.వి. పైలీ iv) కె.సి. వేర్
   భారత రాజ్యాంగంపై వ్యాఖ్యానం
   a) న్యాయవాదుల స్వర్గం
   b) అందమైన అతుకుల బొంత
   c) ఐరావతం d) అర్ధ సమాఖ్య
   1) i-c, ii-a, iii-b, iv-d
   2) i-b, ii-c, iii-a, iv-d
   3) i-b, ii-a, iii-c, iv-d
   4) i-a, ii-c, iii-b, iv-d
18. లోక్‌సభ స్పీకర్‌కు సంబంధించి కింది వాటిలో సరైన అంశం ఏది?
   ఎ) రాజ్యాంగ నిర్మాతలు స్పీకర్ పదవిని బ్రిటిష్ రాజ్యాంగం నుంచి స్వీకరించారు
   బి) స్పీకర్‌గా ఎన్నికైన వ్యక్తికి లోక్‌సభలో సభ్యత్వం ఉండాలి
   సి) లోక్‌సభ రద్దు అయినప్పటికీ స్పీకర్ పదవి రద్దుకాదు
   డి) స్పీకర్ పదవి గురించి 90 - 99 అధికరణల్లో పేర్కొన్నారు
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) బి, సి, డి
19. కింది వ్యాఖ్యల్లో సరైనవి ఏవి?
   ఎ) పార్లమెంటరీ ప్రభుత్వాన్ని 'బాధ్యతాయుత ప్రభుత్వం' అని కూడా పిలుస్తారు
   బి) అధ్యక్షతరహా ప్రభుత్వానికి మరోపేరు 'ఏక సభ్య కార్య నిర్వాహక ప్రభుత్వం'
   సి) పునరాయనం అనేది పరోక్ష ప్రజాస్వామ్య సాధనం
   డి) రాజ్యాంగం అంటే ప్రభుత్వ రూపం - స్టీఫెన్ లీకాక్
   1) బి, సి 2) ఎ, సి
   3) బి, డి 4) ఎ, బి, డి
20. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) రాజ్యసభ సభ్యత్వంతో ప్రధాని పదవి చేపట్టిన నాలుగో వ్యక్తి
   2) ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేసి ప్రధాని అయిన రెండో వ్యక్తి
   3) గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు
   4) పంజాబ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు
21. కింది వాటిని జతపరచండి.
   జాబితా -I
   i) మొరార్జీ దేశాయ్
   ii) పీవీ నరసింహారావు
   iii) దేవెగౌడ
   iv) లాల్ బహదూర్ శాస్త్రి
   జాబితా -II
   a) రాజ్యసభ సభ్యత్వంతో ప్రధాని పదవి చేపట్టిన వారు
   b) మొదటి కాంగ్రెసేతర ప్రధాని
   c) తాష్కెంట్ ఒప్పందంపై సంతకం చేసిన ప్రధాని
   d) తొలి తెలుగు ప్రధాని
   1) i-b, ii-d, iii-a, iv-c
   2) i-a, ii-b, iii-c, iv-d
   3) i-c, ii-a, iii-d, iv-b
   4) i-c, ii-d, iii-b, iv-a
22. కింది వారిలో అలీన విధాన (నామ్) రూపకల్పనలో ప్రమేయం లేని వారెవరు?
   1) మార్షల్ టిటో (యుగోస్లేవియా)
   2) సుకర్నో (ఇండోనేషియా)
   3) సిరిమావో బండారు నాయకే (శ్రీలంక)
   4) జవహర్ లాల్ నెహ్రూ (భారత్)
23. భారత రాష్ట్రపతులు - వారి ప్రత్యేకతలను జతపరచండి.
   జాబితా -I
   i) హిదయతుల్లా ii) వి.వి. గిరి
   iii) జాకీర్ హుస్సేన్ iv) నీలం సంజీవరెడ్డి
   జాబితా -II
   a) భారత ప్రధాన న్యాయమూర్తిగా పని చేసి రాష్ట్రపతి పదవి చేపట్టిన వారు
   b) తాత్కాలిక రాష్ట్రపతిగా పనిచేసిన తొలి వ్యక్తి
   c) తొలి ముస్లిం రాష్ట్రపతి
   d) ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రపతి
   1) i-b, ii-d, iii-a, iv-c
   2) i-a, ii-b, iii-c, iv-d
   3) i-c, ii-a, iii-d, iv-b
   4) i-a, ii-b, iii-c, iv-d
24. ఏ సభలోని సభాపతి ఆ సభలో సభ్యుడిగా ఉండరు?
   1) విధానసభ 2) రాజ్యసభ
   3) లోక్‌సభ 4) పైవేవీకాదు
25. ఉపరాష్ట్రపతిని తొలగించే అధికారం ఎవరికి ఉంది?
   1) పార్లమెంట్ 2) రాష్ట్రపతి
   3) ప్రధానమంత్రి 4) సుప్రీంకోర్టు
26. భారత ఉపరాష్ట్రపతులకు సంబంధించి కింది వాటిలో సరైంది?
   ఎ) ఉపరాష్ట్రపతిని పదవి నుంచి తొలగించే తీర్మానాన్ని మొదట రాజ్యసభలో మాత్రమే ప్రవేశపెట్టాలి
   బి) ఉపరాష్ట్రపతి పదవిని అమెరికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు
   సి) సర్వేపల్లి రాధాకృష్ణన్, మహమ్మద్ హమీద్ అన్సారీ రెండు పర్యాయలు ఉపరాష్ట్రపతులుగా విధులు నిర్వర్తించారు
   డి) ఉపరాష్ట్రపతి తన రాజీనామాను రాష్ట్రపతికి సమర్పిస్తారు
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
27. రాజ్యసభ అధ్యక్షుడికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఓటు వేసే హక్కు ఉండదు
   2) ఇతర సభ్యుల మాదిరిగా ఒక ఓటు ఉంటుంది
   3) సమానంగా ఓట్లు వచ్చిన సందర్భంలో మాత్రమే ఓటు ఉంటుంది
   4) సవరణ బిల్లుల విషయంలో మాత్రమే ఓటు ఉంటుంది
28. భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది?
   ఎ) ఉత్తర్‌ప్రదేశ్ నుంచి రాష్ట్రపతి అయిన తొలి వ్యక్తి
   బి) భారతీయ జనతా పార్టీ నుంచి రాష్ట్రపతి అయిన తొలి వ్యక్తి
   సి) దేశంలో రెండో దళిత రాష్ట్రపతి
   డి) వ్యక్తుల పరంగా 14, ఎన్నికల పరంగా 15వ రాష్ట్రపతి
   1) బి మాత్రమే 2) సి మాత్రమే
   3) ఎ, సి 4) ఎ, బి, సి, డి

సమాధానాలు

1) 3	2) 4	3) 2	4) 1	5) 4
6) 2	7) 1	8) 4	9) 3	10) 4
11) 2	12) 3	13) 2	14) 4	15) 4
16) 2	17) 2	18) 3	19) 4	20) 4
21) 1	22) 3	23) 4	24) 2	25) 1
26) 4	27) 3	28) 4		

ఉద్యోగాలు

మేనేజ్, హైదరాబాద్‌లో కన్సల్టెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్).. కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
- **అర్హత:** పీజీ(అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్/అగ్రికల్చరల్ ఎకనామిక్స్/అగ్రికల్చరల్ మార్కెటింగ్/అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణతతో పాటు ఏడాది అనుభవం ఉండాలి. వయసు: 35 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.45,000.

ముఖ్య సమాచారం:

- గూగుల్‌ఫాం ద్వారా దరఖాస్తులకు చివరితేది: 16.09.2024.
- వెబ్‌సైట్: www.manage.gov.in/

ఎస్ఎస్‌సీటీయూ, హైదరాబాద్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు

ములుగులోని సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ (ఎస్ఎస్‌సీటీయూ) 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
- **పోస్టుల వివరాలు:** గెస్ట్ ఫ్యాకల్టీ(ఎకనామిక్స్)-03, గెస్ట్ ఫ్యాకల్టీ(ఇంగ్లిష్)-03.
- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ(ఎకనామిక్స్/ఇంగ్లిష్)తో పాటు నెట్/జేఆర్ఎఫ్ ఉత్తీర్ణులవ్వాలి.

ముఖ్య సమాచారం:

- **దరఖాస్తు విధానం:** అభ్యర్థులు సీవీతో పాటు సంబంధిత స్కాన్ చేసిన సర్టిఫికేట్లను మెయిల్ ద్వారా పంపించాలి.
- **ఈమెయిల్:** hr@uohyd.ac.in.
- **దరఖాస్తులకు చివరితేది:** 12.09.2024.
- **వెబ్‌సైట్:** https://ssctu.ac.in/



కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

శివరామన్ కమిటీ సిఫార్సుపై ఏర్పాటైన సంస్థ?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

మాదిరి ప్రశ్నలు

1. హరిత విప్లవం కింది వాటిలో ఏ పంట ఉత్పత్తిపై అధిక ప్రభావాన్ని చూపించింది?
   1) నూనె గింజలు 2) పత్తి
   3) గోధుమ, వరి 4) జొన్న
2. హరిత విప్లవం కింది వాటిలో దేనికి దారితీసింది?
   1) అధిక గోధుమ ఉత్పత్తి
   2) ఆదాయ అసమానతల్లో పెరుగుదల
   3) ప్రాంతీయ అసమానతల పెరుగుదల
   4) పైవన్నీ
3. శివరామన్ కమిటీ సిఫార్సుపై ఏర్పాటైన సంస్థ?
   1) నాబార్డ్
   2) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
   3) భారత ఆహార సంస్థ
   4) పైవేవీ కావు
4. వ్యవసాయ ధరల కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంవత్సరం?
   1) 1961 2) 1963
   3) 1965 4) 1987
5. గోల్డెన్ ఫైబర్‌గా కింది వాటిలో దేన్ని వ్యవహరిస్తారు?
   1) జూట్ 2) బియ్యం
   3) గోధుమ 4) పంచదార
6. రైతుల జాతీయ కమిషన్ మొదటి అధ్యక్షుడు?
   1) స్వామినాథన్ 2) రంగరాజన్
   3) సోంపాల్ 4) స్వామి అగ్నివేష్
7. భూ సంస్కరణలను భారతదేశంలోని రాష్ట్రాలు అధికారికంగా అంగీకరించినా ఆచరణలో మాత్రం తిరస్కరించాయని తెల్పినవారు?
   1) లెడెన్ జినెస్కీ 2) నెహ్రూ
   3) రాజీవ్ గాంధీ 4) నరేంద్ర మోదీ
8. కింది వాటిలో వాతావరణ మార్పునకు సంబంధించిన ఒప్పందం?
   1) జెనీవా 2) క్యోటో
   3) మాస్కో 4) సియోల్
9. 2013 వరకు భారతదేశంలో భూ సేకరణ విధానం కింది ఏ చట్టం ప్రాతిపదికగా కొనసాగింది?
   1) భూ సేకరణ చట్టం - 1894
   2) x ఆఫ్ చట్టం 1870
   3) I ఆఫ్ 1824 4) I ఆఫ్ 1850
10. ప్రజోపయోగం కోసం అనే మౌలిక భావనను భూ సేకరణ చట్టం-2013 తగిన విధంగా నిర్వచించలేదని అభిప్రాయపడింది?
    1) స్లాబ్ ఫౌండేషన్
    2) బేస్‌మెంట్ ఫౌండేషన్
    3) అబ్జర్వర్స్ రీసెర్చ్ ఫౌండేషన్
    4) ఇస్లామిక్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్
11. ఆర్థిక కమతం పరిమాణం కింది వాటిలో దేని పై ఆధారపడి ఉంటుంది?



    1) ఉత్పత్తి పద్ధతి 2) పంట స్వభావం
    3) భూసారం 4) పైవన్నీ
12. భూ సంస్కరణలకు సంబంధించిన చర్యల్లో దేనిని భారతదేశంలో పూర్తిగా అమలు చేశారు?
    1) మధ్యవర్తుల తొలగింపు
    2) కౌలు సంస్కరణలు
    3) కమతాలపై గరిష్ఠ పరిమితి
    4) కమతాల సమీకరణ
13. ల్యాండ్ సీలింగ్ లక్ష్యం కింది వాటిలో దేన్ని సాధించడానికి ఉపకరిస్తుంది?
    1) అల్ప ఉత్పాదకత 2) కమతాల విఘటన
    3) ఆదాయ సమానత 4) పైవేవీ కావు
14. భారతదేశంలో కింది ఏ ప్రాంతాన్ని 'రైస్ బౌల్' ప్రాంతంగా పిలుస్తారు?
    1) కృష్ణా - గోదావరి డెల్టా రీజియన్
    2) కర్ణాటక - కేరళ
    3) కేరళ - తమిళనాడు 4) పైవన్నీ
15. భూదాన ఉద్యమానికి పితామహుడు?
    1) వెంకటప్పయ్య 2) గాంధీజీ
    3) లార్డ్ కారన్ వాలీస్
    4) వినోభాభావే
16. హరిత విప్లవానికి సంబంధించి కింది వాటిలో సరికానిది?
    1) ఆహార ఉత్పాదకత పెరుగుదల
    2) వ్యవసాయ ఉత్పాదకత పెరుగుదల
    3) ప్రాంతీయ అసమానతలు పెరుగుదల
    4) గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ సమాన పంపిణీ
17. కావేరి జలాల వివాదంలో కింది ఏ రాష్ట్రానికి సంబంధం లేదు?
    1) కేరళ 2) ఆంధ్రప్రదేశ్
    3) కర్ణాటక 4) తమిళనాడు
18. సహకార వ్యవస్థలో జిల్లా స్థాయికి సంబంధించిన సంస్థ ఏది?
    1) రాష్ట్ర సహకార బ్యాంక్
    2) ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం
    3) జిల్లా కేంద్ర సహకార బ్యాంక్
    4) రిజర్వ్ బ్యాంక్
19. అగ్‌మార్క్ అంటే?
    1) ఆల్ ఇండియా గ్రేడ్ మార్కెటింగ్
    2) అగ్రికల్చర్ మార్కెటింగ్
    3) ఆల్‌గ్రేడ్ మార్క్ 4) పైవేవి కావు
20. భారతదేశంలో వ్యవసాయ మార్కెటింగ్‌లో కింది ఏ లోపాన్ని గమనించవచ్చు?
    1) రవాణ కొరత 2) ఫైనాన్స్ కొరత
    3) సరైన నిల్వ సౌకర్యం లేకపోవడం
    4) పైవన్నీ
21. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ఆహార ధాన్యాలను అందించడానికి కొనుగోలు చేసే ధాన్యాలను, విక్రయించే ధరను ఏమని పిలుస్తారు?
    1) కనీస మద్దతు ధర 2) జారీ ధర
    3) పాలిత ధర 4) పైవేవీ కావు
22. కింది వాటిలో దేనికి సంబంధించి సిఫార్సులు చేయడానికి రేఖీ కమిటీని ఏర్పాటు చేశారు?
    1) పరోక్ష పన్నులకు సంబంధించిన కామన్ కోడ్
    2) నల్లధనం నిర్మూలన 3) జీఎస్టీ
    4) ప్రత్యక్ష పన్నుల ద్వారా రాబడి పెంపు చర్యలు
23. ప్రజా పంపిణీ వ్యవస్థ భారత్‌లో కింది వాటిలో దేనికి సంబంధించిన ముఖ్య సాధనం?
    1) వినియోగ యాజమాన్యం
    2) డిమాండ్ యాజమాన్యం
    3) సప్లయ్ యాజమాన్యం
    4) దిగుమతి ప్రత్యామ్నాయం
24. స్వరణ్ సింగ్ కమిటీ కింది వాటిలో దేనికి సిఫార్సు చేసింది?
    1) లాభసాటి కమతాల ఏర్పాటు
    2) వ్యవసాయ రంగాన్ని ఉమ్మడి జాబితాలో చేర్చడం
    3) సహకార వ్యవసాయం
    4) ఆర్థిక కమతం
25. 2006లో రెండో హరిత విప్లవానికి పిలుపునిచ్చినవారు?
    1) మన్మోహన్ సింగ్ 2) నార్మన్ బోర్లాగ్
    3) వాజ్‌పేయి 4) చరణ్ సింగ్
26. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ఏ సంవత్సరంలో ఏర్పాటైంది?
    1) 1961 2) 1962
    3) 1963 4) 1964
27. కృషి శ్రామిక్ సురక్షా యోజన కింది వాటిలో దేనికి సంబంధించింది?
    1) పేద ప్రజల బీమా
    2) వ్యవసాయ కూలీలకు బీమా
    3) చేతి వృత్తుల వారి బీమా
    4) పారిశ్రామిక కూలీలకు బీమా
28. జమీందారీ పద్ధతిని కింది వాటిలో దేనిగా పిలుస్తారు?
    1) శాశ్వత శిస్తు నిర్ణయం పద్ధతి
    2) రైత్వారీ పద్ధతి 3) మహల్వారీ పద్ధతి
    4) పైవన్నీ
29. నాబార్డ్, కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్‌లు 1998లో సంయుక్తంగా కింది ఏ పథకాన్ని ప్రారంభించాయి?
    1) సహకార వ్యవసాయం
    2) కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం
    3) గ్రామీణ అవస్థాపన అభివృద్ధి నిధి
    4) పైవన్నీ
30. కింది వాటిలో దేనిని ముతక ధాన్యంగా వ్యవహరిస్తారు?
    1) జొన్న 2) రాగి
    3) 1, 2 4) వరి

వ్యవసాయ రంగం



» స్వాతంత్ర్యానంతరం ఆహార భద్రత విషయంలో భారత్ పురోగతి సాధించింది. తలసరి ఆహార ధాన్యాల లభ్యత పెరిగింది. 1960 దశకం మధ్యభాగం ముందు కాలంలో స్వదేశీ అవసరాల నిమిత్తం భారత్ ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకునేది. 1965, 1966 సంవత్సరాల్లో కరువు కాటకాలు తీవ్రమైన నేపథ్యంలో వ్యవసాయ విధానాన్ని సమీక్షించుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది. 1966-67లో అధిక దిగుబడినిచ్చే వంగడాల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో వ్యవసాయ రంగంలో వివిధ పంటల విషయంలో అధిక ఉత్పత్తి, ఉత్పాదకత సాధ్యమైంది. 1960 సంవత్సరం తదుపరి కాలంలో వాస్తవిక వ్యవసాయ వృద్ధిరేటు భారత్‌లో 2.8 శాతంగా నమోదైంది. హరిత విప్లవం ముందు కాలంలో వ్యవసాయ వృద్ధి 2 శాతం కంటే తక్కువ ఉండగా తర్వాత 2004 వరకు 3 శాతంగా నమోదైంది. ప్రపంచ వ్యవసాయ వస్తూత్పత్తి పెరిగిన తర్వాత భారత్‌లో వ్యవసాయ రంగ వృద్ధి సగటున 3.6 శాతంగా నమోదైంది. చైనా వ్యవసాయ రంగ వృద్ధిరేటు దీర్ఘకాలంగా భారత్ కంటే సగటున 1.5 శాతం ఎక్కువ.

» ఆహార ధాన్యాల విషయంలో భారత్ స్వయం సమృద్ధి సాధించినప్పటికీ అనేక దేశాలతో పోల్చినప్పుడు ఉత్పాదకత విషయంలో అనేక పంటలకు సంబంధించి భారత్ వెనుకబడి ఉంది.

31. సాంద్ర వ్యవసాయ జిల్లాల పథకం ప్రవేశపెట్టిన సంవత్సరం?
    1) 1960-61 2) 1964-65
    3) 1965-66 4) 1970-71
32. నీలి విప్లవం కింది వాటిలో దేనికి సంబంధించింది?
    1) పాలు 2) ఎరువులు
    3) చేపలు 4) జనుము
33. 15 నెలల నుంచి 5 ఏళ్ల లోపు తిరిగి చెల్లించే రుణాలు?
    1) స్వల్పకాలిక రుణాలు
    2) మధ్యకాలిక రుణాలు
    3) దీర్ఘ కాలిక రుణాలు
    4) తక్కావి రుణాలు
34. నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1965 2) 1975
    3) 1985 4) 1987
35. కింది వాటిలో తోట పంట కానిది?
    1) రబ్బరు 2) టీ
    3) కాఫీ 4) వేరుశనగ
36. అధిక దిగుబడినిచ్చే విత్తనాల కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
    1) 1960-61 2) 1966-67
    3) 1967-68 4) 1968-69
37. సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తి పెంచడానికి ఉద్దేశించింది?
    1) బ్రౌన్ రెవల్యూషన్
    2) బ్లాక్ రెవల్యూషన్
    3) వైట్ రెవల్యూషన్
    4) రౌండ్ రెవల్యూషన్
38. రైతుల జాతీయ కమిషన్ రెండో అధ్యక్షుడు?
    1) సోంపాల్ 2) స్వామినాథన్
    3) స్వామి అగ్నివేష్ 4) పైవేవీ కావు
39. జాతీయ ఆహార భద్రతా మిషన్‌ను ఎప్పుడు ప్రారంభించారు?
    1) 2004 2) 2005
    3) 2006 4) 2007
40. రైతులు స్వయంగా ప్రభుత్వానికి శిస్తు చెల్లించే విధానం?
    1) రైత్వారీ విధానం
    2) మహల్వారీ విధానం
    3) శాశ్వత శిస్తు విధానం
    4) పైవన్నీ

సమాధానాలు

1) 3	2) 4	3) 1	4) 3	5) 1
6) 3	7) 1	8) 2	9) 1	10) 3
11) 4	12) 1	13) 3	14) 1	15) 4
16) 4	17) 2	18) 3	19) 2	20) 4
21) 2	22) 1	23) 3	24) 2	25) 1
26) 3	27) 2	28) 1	29) 2	30) 3
31) 1	32) 3	33) 2	34) 1	35) 4
36) 2	37) 1	38) 2	39) 4	40) 1

Who is seated at the extreme left end?

BANK EXAMS

REASONING

MODEL QUESTIONS

Directions (Q.No.1-6): Read the information carefully and answer the following:

There are eight persons namely A, B, C, D, E, F, G and H who are born on the same date and in the same month but in different years i.e. 1971, 1974, 1980, 1983, 1991, 1999, 2000 and 2007. Their ages are considered as on the current year of 2018. G is born in even number year, but not born in the year, which does not divisible by 4. A is 35 years old now. B is 17 year older than F, who is 8 years younger than A. There is eight years gap between the age of E and the age of D. H is nine years younger than C, but not born in 1983. E was born earlier than G.

1. **Who is the youngest person among them?**
   1) G 2) A 3) E
   4) D 5) None of these
2. **Who is younger than only two persons?**
   1) C 2) B 3) H
   4) A 5) None of these
3. **Four of the following five are alike based on a particular property. Find out the one which is not matching with the other four.**
   1) C 2) D 3) A
   4) F 5) H
4. **Who is ranking four in the descending order of their ages?**
   1) G 2) A 3) E
   4) D 5) None of these
5. **If the uncle of C is 18 years older than C, then what is the age of C's uncle?**
   1) 62 2) 56 3) 65
   4) 63 5) None of these
6. **Who is elder than only the youngest?**
   1) G 2) F 3) E
   4) D 5) None of these

Directions (Q.No.7 - 12): Read the information carefully and answer the following:

There are six friends A, B, C, D, E and F live on different floors in the same building having six floors numbered 1 to 6. Ground floor is floor numbered one. Each one has a different occupation, viz; Accountant, Doctor, Engineer, Lawyer, Librarian and Professor. All the six persons seated in a single row at equal distance from each other, facing north direction.

C, a Doctor, is seated to the immediate left of the Librarian who lives in 6th floor. Lawyer, who stays in first floor, is not seated at the extreme end and is third to the right of the person who stays in 3rd floor. There is only one person seated between Professor and Accountant. Neither Professor nor Accountant is immediate neighbour of Doctor. B, staying in fourth floor is seated at one of the extreme ends and to the immediate right of F. F is not the Lawyer. There are two persons seated between A and Accountant. D is seated to the immediate left of the person who stays in fifth floor. E does not stay in sixth floor.



7. **C stays in which floor?**
   1) 3rd 2) 5th 3) 6th
   4) Can't be determined
   5) None of these
8. **Who is seated at the extreme left end?**
   1) C 2) A 3) E
   4) D 5) None of these
9. **How many persons are seated between A and the person who stays in 4th floor?**
   1) One 2) Two 3) Three
   4) Four 5) None
10. **What is the occupation of D?**
    1) Librarian 2) Lawyer
    3) Professor 4) Accountant
    5) Engineer
11. **Who is seated at the extreme right end?**
    1) Librarian 2) Lawyer
    3) Professor 4) Accountant
    5) Engineer
12. **Four of the following five are alike based on a particular property. Find out the one which is not matching with the other four.**
    1) C - 6th floor
    2) Librarian - E
    3) Professor - 1st floor
    4) Engineer - 5th floor
    5) Accountant - 4th floor

Directions (Q.No. 13-17): In a certain instruction system, the different computation processes are written as follows:

(I) P % Q $ R means P is multiplied by the sum of Q and R
(II) P ∆ Q © R means P is subtracted from Q and the resultant is divided by R
(III) P # Q * R means P is added to the resultant when Q is divided by R
(IV) P π Q @ R means the product of Q and R is subtracted from P

In each of the questions below, a set of instruction sequence is given. You are required to find out the outcome which should come in place of question mark (?) in each of the given sets of sequence.

13. **20 # 125 * 25 = M**
    M % 60 $ 40 = ?
    1) 1660 2) 2500
    3) 2800 4) 8250
    5) 7240
14. **100 ∆ 300 © 5 = Z**
    160 π Z @ 2 = ?
    1) 80 2) 140 3)60
    4) 30 5) 70
15. **12 % 2 $ 8 = A**
    A ∆ 200 © 8 = ?
    1) 4 2) 2 3) 10
    4) 3 5) 7
16. **20 % 10 $ 20 = T**
    T π 150 @ 4 = ?
    1) 40 2) 100 3) 20
    4) 0 5) 10
17. **35 # 300 * 15 = M**
    450 ∆ 1000 © M = ?
    1) 2 # 5 * 5 2) 5 π 3 @ 5
    3) 8 % 1 $ 2 4) 4 # 24 * 4
    5) None of the above

Directions (Q. No. 18 - 21): In each question below are given two statements followed by two conclusions numbered I and II. You have to take the given statements to be true even if they seem to be at variance with commonly known facts. Read the following statements and then decide which of the given conclusions logically follows from the given statements, disregarding commonly known facts.

Give answer:
1) If only conclusion I follows.
2) If only conclusion II follows.
3) If either conclusion I or II follows.
4) If neither conclusion I nor II follows.
5) If both conclusions I and II follow.

18. **Statements:**
    All towns are cities.
    Some cities are urban.
    Conclusions:
    I. At least some towns are urban.
    II. No town is urban.
19. **Statements:**
    Some parrots are green.
    Some birds are parrots.
    Conclusions:
    I. At least some birds being green is possible.
    II. All parrots being bird is a possibility.
20. **Statements:**
    No cup is a plate.
    No plate is a coin.
    Conclusions:
    I. No cup is a coin.
    II. Some coins are cups.
21. **Statements:**
    Some boys are honest.
    Some intelligent are boys.
    Conclusions:
    I. All honest being intelligent is a possibility.
    II. All boys may be intelligent.

Directions (Q.No.22- 25): Study the following information carefully and answer the questions given below:

There are six persons M, P, Q, R, S and T who are of different heights.

R is taller than Q. T is taller than M. P is definitely shorter than S. M is not as tall as Q. T is not as tall as P. R is not ranking third in the descending order of heights of these persons.

22. **Who is shorter than only the tallest?**
    1) R 2) T 3) P
    4) S 5) Data inadequate
23. **Who is taller than only the shortest?**
    1) R 2) M 3) Q
    4) T 5) Data inadequate
24. **How many are taller than T?**
    1) None 2) Two
    3) One 4) Three
    5) None of these
25. **If R's height is 180 cm, and M's height is 170 cm what could be the height of Q?**
    1) 175 cm 2) 189 cm
    3) 182 cm 4) 165 cm
    5) None of these

Key with Solutions

(1-6):


Year	Age (yrs) as on 2018	Person
1971	47	C
1974	44	B
1980	38	H
1983	35	A
1991	27	F
1999	19	E
2000	18	G
2007	11	D

1) 4; 2) 3;
3) 5; (Others are born in odd numbered year where as H is born in even numbered year)
4) 2; 5) 3; 6) 1;

(7-12):


Doctor(C) (3rd floor)	Librarian (A) (6th floor)	Professor(E) (2nd floor)	Lawyer (D) (1st floor)	Accountant (F) (5th floor)	Engineer (B) (4th floor)

7) 1; 8) 1; 9) 3;
10) 2; 11) 5;
12) 4; (In other options first person is immediate left of second preson)
13) 2; 20 + 125 ÷ 25 = 25
25(60 + 40) = 2500
14) 1;
300 – 100 = 200; 200 ÷ 5 = 40
40 × 2 = 80; 160 – 80 = 80
15) 3;
12(2+8) = 120
200 – 120 = 80; 80 ÷ 8 = 10
16) 4;
20(10 + 20) = 600;
600 – 150×4 = 0
17) 4;
35 + 300 ÷ 15 = 55
1000 – 450 = 550;
550 ÷ 55 = 10; 4 + 24 ÷ 4 = 10
18) 3;
Possible Venn-diagrams are




Thus, either I or II follows.

19) 5; Possible Venn-diagram is




Thus, only I & II follow.

20) 3;



Thus, either I or II follows.

21) 5;
A possible Venn-diagram is



Thus, I & II follow

(22 - 25):
R > Q, Q > M, T > M,
S > P > T
Thus, S > P > T > R > Q > M
22) 3; 23) 3; 24) 2; 25) 1.

సాక్షి ప్లస్
శనివారం। 7-9-2024

బుడమేరులో అక్రమ కట్టడాలను తొలగించాలి

ఏపీ రైతు, కౌలురైతుల సంఘం నేతల డిమాండ్

సాక్షి, అమరావతి: బుడమేరులో అక్రమంగా నిర్మించిన కట్టడాలను వెంటనే తొలగించాలని ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడలో జరిగిన మీడియా సమావేశంలో రైతు సంఘం అధ్యక్షుడు వి.కృష్ణయ్య, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఇష్టానుసారంగా ఈ వాగు భూములను బడా బాబులు కబ్జా చేశారని, తత్ఫలితంగా అమాయక ప్రజలు నేడు మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. వరదలు, వర్షాలతో 5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తపంటలు వేసుకునేందుకు ఉచితంగా విత్తనాలు ఇవ్వాలని, పంట రుణాలపై వడ్డీలను రద్దు చేసి మరలా పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. పశువుల మేతను ఉచితంగా అందించాలన్నారు. పొలాలు, చెరువులు, కాలువలు, డ్రైన్లు, రహదారులకు పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని కోరారు.

బైకుల నుంచి చెలరేగిన మంటలు

- ఇద్దరు చిన్నారులు మృతి
- మృత్యువుతో పోరాడుతున్న దంపతులు
- తమిళనాడులోని తిరుత్తణిలో ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుత్తణి(తమిళనాడు): మోటార్ సైకిళ్ల నుంచి చెలరేగిన మంటల్లో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. 80 శాతం కాలిపోయి తల్లిదండ్రులు మృత్యువుతో పోరాడుతున్నారు. ఈ విషాద సంఘటన గురువారం అర్ధరాత్రి తర్వాత తమిళనాడులోని తిరుత్తణిలో చోటుచేసుకుంది. తిరుత్తణి మురుగప్పనగర్‌కు చెందిన మహేంద్రన్ ఇంట్లో తిరువలంగాడు యూనియన్ తాళవేడు దళితవాడకు చెందిన ప్రేమ్‌కుమార్(32) భార్య మంజుల, కుమారులు మితులన్(2), కబిలన్ (1)తో నివాసం ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మహేంద్రన్ ఇంటి ముందు పార్క్ చేసిన మూడు మోటార్ సైకిళ్ల నుంచి అనుమానాస్పద రీతిలో మంటలు రేగాయి. ఆ బైకుల పెట్రోల్ ట్యాంకు పేలడంతో భారీ శబ్దంతో మంటలు భగ్గుమన్నాయి. మంటల ధాటికి పొగ దట్టంగా ఇంటిని కమ్మేసి, ఊపిరాడకపోవడంతో మిద్దెపై బాడుగకు ఉంటున్న ప్రేమ్‌కుమార్.. భార్య, పిల్లలను తీసుకుని మెట్ల మీదుగా వెలుపలికి వెళ్లే ప్రయత్నంలో మంటల్లో చిక్కుకున్నారు. దీంతో ఇద్దరు చిన్నారులు కన్నుమూశారు. ప్రేమ్‌కుమార్ దంపతులు మృత్యువుతో పోరాడుతున్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ టార్గెట్‌గా ఎల్లో మీడియా దుష్ప్రచారం

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా టీడీపీ అనుకూల మీడియా, వారి సోషల్ మీడియా అబద్ధాలను వండి వారుస్తోందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ పాస్‌పోర్టుపై వస్తున్న ప్రచారాలను ఆయన ఖండించారు. వారం రోజులుగా విజయవాడ నగరం వరద దిగ్బంధంలో ఉంటే, లక్షలాది మంది బాధితులు ఆక్రోశిస్తుంటే వారికి బాసటగా ఉండాల్సింది పోయి బురద రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను పక్కదోవ పట్టించడానికే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ తీసుకున్న డిప్లమాటిక్ పాస్‌పోర్టుకు ఈ ఏడాది నవంబర్ వరకు గడువు ఉందని, అయితే ఆ పదవి నుంచి దిగిపోయిన పరిస్థితుల్లో ఆ పాస్‌పోర్టును వైఎస్ జగన్ స్వచ్ఛందంగా అప్పగించారని చెప్పారు. ఈ నేపథ్యంలో కొత్తగా పాస్‌పోర్టుకు దరఖాస్తు చేశారన్నారు. ఇది పోలీసు వెరిఫికేషన్ వెళ్లినప్పుడు.. జగన్‌పై ఒక ప్రయివేటు కంప్లైంట్ ఉందని రాశారని చెప్పారు. ఆరేళ్ల క్రితం సాక్షి మీడియాలో వచ్చిన ఒక కథనం ఆధారంగా ఇప్పటి టీడీపీ మంత్రి నారాయణ కోర్టులో ప్రైవేటు కేసు వేస్తే, ఆ విషయాన్ని పోలీసులు వెరిఫికేషన్‌లో పేర్కొన్నారన్నారు. దీనిపై దిగువ కోర్టులో కేసు వేయగా, కోర్టు ఎన్‌ఓసీ ఇస్తూ, ఏడాది కాల పరిమితికి పాస్‌పోర్టు మంజూరుకు ఆదేశాలు జారీ చేసిందని, అయితే సీబీఐ కోర్టు వైఎస్ జగన్ పాస్‌పోర్టుకు ఐదేళ్లు ఎన్‌ఓసీ గడువు ఇచ్చిన విషయాన్ని మళ్లీ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లామన్నారు. సీబీఐ కోర్టు ఆదేశాల మేరకు దిగువ కోర్టు ఆర్డర్‌ను సవరించమని కోరామన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే.. ఇష్టానుసారం వార్తలు ప్రచారం చేసి, వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేయడానికి ఎల్లో మీడియా యత్నించిందని మండిపడుతూ శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

చిమ్మ చీకట్లోనే ఉన్నాం



ప్రభుత్వం ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతోనే మా ఇల్లు పూర్తిగా మునిగిపోయింది. ఇంట్లోని వస్తువులన్నీ పనికిరాకుండా పోయాయి. ఆరు రోజులుగా కరెంట్ లేదు. చిమ్మచీకట్లోనే చిన్న పిల్లలతో ఇబ్బంది పడుతున్నాం. రైలు పట్టాల వెంట రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లి ఆహారం, తాగునీరు, సరుకులు తెచ్చుకుంటున్నాం.

– గొల్లపల్లి దుర్గ, కట్టోజి కృప, వాంబేకాలనీ

మళ్లీ ఇల్లు మునిగింది



గతంలో ఎన్నడూ ఇలాంటి వరదను చూడలేదు. వస్తువులన్నీ పాడయ్యాయి. బుధవారం వరద తగ్గిందని.. ఎంతో శ్రమించి ఇంటిని శుభ్రం చేసుకున్నాం. గురువారం రాత్రి మళ్లీ వరద నీరు ఇంట్లోకి చేరింది. ఇంకా ఈ కష్టాలు ఎన్ని రోజులో అర్థం కావట్లేదు.

– వేముల కుమారి, దాబాకొట్లు సెంటర్, సింగ్‌నగర్

బతుకుదెరువు మునిగింది



నాకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. నేను ప్రతి రోజూ ఆటో నడిపితేనే మా ఇల్లు గడుస్తుంది. ఇప్పుడు వరద వల్ల మా ఇల్లు, ఆటో, గృహోపకరణాలు, నిత్యవసర సరుకులన్నీ నీట మునిగాయి. మా జీవితాలు మళ్లీ చీకట్లో కలిసిపోయాయి. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు బ్యాంకుల నుంచి ఈఎంఐలకు గడువు ఇప్పించాలి.

– షేక్ రఫీ, కండ్రిక

ఇంటిని చూస్తే ఏడుపు వస్తోంది



మా ఇంటిలోని పరిస్థితిని చూస్తే ఏడుపు వస్తోంది. వస్తువులన్నీ బురదతో నిండిపోయాయి. ఒక్క వస్తువు కూడా పనికిరాదు. ప్రభుత్వం ఆర్థిక సాయంతో ఆదుకోకపోతే జీవితంలో కోలుకోలేము.

– మాలతీ, 15వ డివిజన్

బతుకు ఛిన్నాభిన్నం

బుడమేరు వరదతో పేదల జీవితాలు అతలాకుతలం.. వీధులన్నీ బురదమయం

- ఇళ్లల్లోకి చేరిన బురదను తొలగించేందుకు పాట్లు
- కష్టపడి కొన్న వస్తువులన్నీ వరదపాలు
- ప్రభుత్వం పట్టించుకోవట్లేదంటూ బాధితుల ఆగ్రహం

ఆటోనగర్, కృష్ణలంక(విజయవాడ తూర్పు)/ లక్ష్మీపురం

బుడమేరు వరద పేదలకు అంతులేని వ్యథను మిగిల్చింది. వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేసింది. ఏళ్ల తరబడి శ్రమించి.. రూపాయి, రూపాయి కూడబెట్టి కొనుక్కున్న వస్తువులన్నింటినీ ముంచేసింది. వారి కలలను కూల్చేసింది. వరద ముంపు నుంచి కాస్త బయటపడిన ప్రాంతాలన్నీ ఇప్పుడు బురదతో నిండిపోయాయి. ఏ రోడ్డును, ఏ ఇంటిని చూసినా.. బురదతో నిండిన టీవీలు, ఫ్రిజ్‌లు, వంటపాత్రలు, దుస్తులు, పుస్తకాలు, వాహనాలే దర్శనమిస్తున్నాయి.



15వ డివిజన్‌లో చెల్లారావు వీధిలో పరిస్థితి



ఇంట్లో వస్తువులను బయటకు తీసుకు వస్తున్న చిన్నారి

కోలుకోలేనంత నష్టం..

వరద వల్ల తమ ఇళ్లల్లోని వస్తువులు, దుస్తులు, వాహనాలు పాడైపోయాయని.. వాటిని మళ్లీ కొనుగోలు చేసేంత శక్తి తమకు లేదంటూ బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రతి కుటుంబానికీ రూ.2 లక్షల నుంచి 3 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. బురదతో నిండిపోయిన తమ ఇళ్లను చూపిస్తూ విలపిస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన వారెవ్వరూ తమ వైపు కన్నెత్తి చూడటం లేదని అజిత్‌సింగ్‌నగర్, రాజరాజేశ్వరిపేట, వాంబే కాలనీ తదితర ప్రాంతాల బాధితులు చెబుతున్నారు. చెత్తాచెదారం, బురదతో నిండిపోయిన ఇళ్లను శుభ్రం చేసుకోవడానికి వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇళ్లల్లోని బురదను తొలగించడానికి ఫైరింజన్లు తెప్పించామంటూ ప్రభుత్వం ఒట్టి మాటలే చెబుతోందని.. తమ ఇళ్లకు ఒక్క ఫైరింజన్ కూడా రాలేదని మండిపడుతున్నారు.



తడిచిన కార్డులను ఆరబెట్టుకుంటున్న వృద్ధురాలు

'సింగ్‌నగర్' పరిస్థితి అగమ్యగోచరం

సింగ్‌నగర్ ప్రాంతం ఇంకా వరద నుంచి తేరుకోలేదు. బుధవారం ఉదయానికి కొన్ని చోట్ల వరద ప్రవాహం తగ్గడంతో బాధితులు తిరిగి ఇళ్లకు చేరుకున్నారు. ఎంతో కష్టపడి తమ ఇళ్లను శుభ్రం చేసుకున్నారు. కానీ గురువారం రాత్రి వరద ప్రవాహం మళ్లీ పెరగడంతో స్థానికులంతా ప్రాణభయంతో భవనాలపైకి చేరుకున్నారు. వరద ఎప్పుడు తగ్గుతుందో.. ఇంకా ఎన్ని రోజులు కష్టాలు పడాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఆర్థికంగా చాలా నష్టపోయాం



వరద తగ్గడంతో బురద పేరుకుపోయిన ఇంటిని శుభ్రం చేసుకున్నాం. వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్, మంచం, టీవీ.. తదితర వస్తువుల్లోకి బురద చేరింది. ఆర్థికంగా చాలా నష్టపోయాం. భవిష్యత్‌ను తలుచుకుంటే భయమేస్తోంది.

– వి.దుర్గ, సింగ్‌నగర్

ప్రభుత్వమే ఆదుకోవాలి



నేను ప్రతి రోజూ కరెంటు పని చేస్తేనే.. కుటుంబం గడుస్తుంది. కొద్ది కాలంగా మా అమ్మ ఆరోగ్య పరిస్థితి బాగోలేదు. ఇప్పుడు ఇల్లంతా మునిగిపోయింది. ప్రభుత్వం ఇస్తున్నామన్న నిత్యవసరాలు మా వరకు రాలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కోటి, పాయకాపురం

రూ.2 లక్షల వరకు నష్టం



నేనూ, నా భర్త కూలి పనులు చేసుకుంటూ.. రూపాయి, రూపాయి దాచుకొని కొనుక్కున్న వస్తువులన్నీ నీట మునిగాయి. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగింది. ట్రాక్టర్ల నుంచి ఆహార పొట్లాలు ఎగిరేస్తున్నారు. వాహనం వెంట పరిగెత్తే వయసు మాకు లేదు. ప్రభుత్వం నిత్యావసర సరుకులు ఇచ్చి.. ఆర్థిక సాయం చేస్తేనే మళ్లీ మా బతుకులు ముందుకెళ్తాయి.

– ధనలక్ష్మి, కండ్రిక



మట్టిసుద్దలుగా మారిన వస్తువులు



వస్తువులను శుభ్రం చేస్తున్న చిన్నారులు



పనికి రాని విధంగా మారిన వస్తువులు



వరదలతో వ్యాధులొచ్చే ప్రమాదం

వర్షాలు, వరదలతో అనేకప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వరద నీటితో పాటు వచ్చిన చెత్తా చెదారం, వ్యర్థాలు ఇళ్ల చుట్టూ పేరుకుపోతున్నాయి. వరద నీరు పోయి, ముంపు ప్రాంతాలు సాధారణ స్థితికి వచ్చేసరికి కొన్ని రోజులు పడుతుంది. ఈలోగా మురుగు నీరు, కుళ్లిన చెత్త వల్ల పరిశుభ్రత కొరవడుతుంది. తాగు నీరూ కలుషితమవుతుంది. వీటి కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశాలు చాలా ఎక్కువ. ముఖ్యంగా అతిసారం, ఎలర్జీలు, చర్మ సంబంధ వ్యాధులు ఎక్కువగా వస్తాయి. నీరు నిలువ ఉండటం వల్ల పాములు, తేళ్లు వంటివి కాటు వేసే అవకాశాలూ ఉంటాయి. ఈ నేపథ్యంలో వ్యాధుల పట్ల కొద్దిపాటి అవగాహన కలి ఉండాలని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

– గుంటూరు మెడికల్

అతిసారం ప్రబలే అవకాశాలు ఎక్కువ

పాములు కాటు వేస్తాయి.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యుల సూచనలు

అతిసారం ప్రబలే అవకాశం

అపరిశుభ్రత, కలుషిత నీటి వల్ల వరద ప్రభావిత ప్రాంతాల్లో అతిసారం (డయేరియా) ప్రబలే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. కలుషితమైన నీటిని తాగటం, ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినటం, వాతావరణం కలుషితం కావడం వల్ల వివిధ రకాల బాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి అతిసారం బారిన పడతారు.



లక్షణాలు..

జీర్ణ వ్యవస్థ పని తీరు అస్తవ్యస్థమై వాంతులు, విరేచనాలు అవుతాయి. విరేచనాలు నీళ్ళు, నీళ్ళుగా పలుచగా అవుతాయి. కడుపులో మెలి పెట్టినట్లు నొప్పి ఉంటుంది. నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కల నొప్పులు వస్తాయి. తాగిన నీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్ళిపోతే డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల పిల్లలకు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం.

పాములుంటాయ్ జాగ్రత్త..

వర్షం, వరదల వల్ల పుట్టల్లో నీరు చేరి పాములు బయటకు వచ్చేస్తాయి. పొలాల్లో, డొంకల్లో అటూ ఇటు తిరిగే మనుషులను కాటు వేస్తాయి. పాము కరిచిన వెంటనే కాటు వేసిన భాగాన్ని మొట్టమొదటగా పరీక్షించాలి. కాటు వేసిన ప్రదేశంలో రెండు గాట్లు మాత్రమే ఉంటే అది విషంతో కూడిన పాము కాటుగా గుర్తించాలి. కరిచిన భాగంలో వాపు రావటం, నల్లగా కమిలినట్లు ఉండటం, నొప్పి ఉండటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. రెండు గాట్లు లేకుండా 'వి' ఆకారంలో కింద, పైన పళ్ళ గుర్తులు ఉంటే అది విషం లేని పాము కాటు.

పాము కాటు వేస్తే ఇలా చేయండి

- పాము కాటు బాధితుడికి ముందుగా బాగా ధైర్యం చెప్పాలి.
- కరిచిన భాగాన్ని, రోగిని కదలనివ్వకూడదు. కాటు వేసిన చోట రుద్దకూడదు.
- కరిచిన భాగాన్ని గుండెకంటే పై ఎత్తులో ఉంచకూడదు.
- పాము కాటు వల్ల ఏర్పడ్డ గాయాన్ని సబ్బు నీళ్ళతో కడగాలి. ఐస్ ముక్కలు ఒక గుడ్డలో చుట్టి కాటు భాగం వద్ద ఉంచాలి.
- కాటేసిన ప్రదేశాన్ని తాడు పెట్టి గట్టిగా కట్టి ప్రతి రెండు మూడు గంటలకు ఒకసారి తాడును వదులు చేస్తూ ఉండాలి.
- కరిచిన పామును సాధ్యమైతే చంపి పట్టుకొని డాక్టర్ వద్దకు తీసుకెళ్ళటం వల్ల పాము ఎలాంటిదో తెలుసుకుని వైద్యం చేసేందుకు చాలా సులువుగా ఉంటుంది. పామును తలపై చితక్కొట్టకూడదు. అలా చేస్తే దానిని గుర్తించేందుకు వీలు ఉండదు.


కాటు వేసిన ప్రదేశాన్ని బ్లేడుతో కోయటం, నోరు పెట్టి రక్తాన్ని తీయటం వంటివి ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదు. ఆకు పసరలు మింగించటం, కరిచిన భాగంలోకి పోయటం వంటివి చేయకూడదు.



పాము కరిచిన వెంటనే వాంతి చేసుకుంటే రోగిని పక్కకు తిప్పి పడుకోబెట్టి ఊపిరి అందేటట్టు చూడాలి.

పిల్లలకు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి

– డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు , పిల్లల వైద్య నిపుణులు, గుంటూరు



డయేరియా వల్ల పెద్దవారికంటే పిల్లలకు ఎక్కువ ఇబ్బందికర పరిస్థితులు వస్తాయి. వ్యాధి లక్షణాలను గుర్తించి దాహం పెరిగితే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగించాలి. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో వీటిని ఉచితంగా ఇస్తారు. ఒక ప్యాకెట్ పౌడర్‌ను లీటర్ నీటిలో కలిపి తాగాలి. విరేచనాలు అయ్యేవారికి కారం, మసాల వంటి ఘాటు పదార్థాలు పెట్టకూడదు. ద్రవ రూపంలో ఉండే ఆహారమే ఇవ్వాలి. మజ్జిగ, పాలు, బార్లీ గంజి, పలచగా చేసిన సగ్గు బియ్యం జావ, రాగి జావ, కొబ్బరి నీళ్ల, నిమ్మరసం, సోయాబీన్స్ రసం, ఇతర పళ్ళరసాలు ఇవ్వొచ్చు.

డయేరియా రాకుండా ఇలా చేయాలి....

– డాక్టర్ ఆళ్ల సిద్ధార్థరెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు



వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. మల, మూత్ర విసర్జన పిదప, భోజనం చేసే ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలి. రోడ్డు పైన, తోపుడు బండ్లపై మూతలు లేకుండా అమ్మే ఆహార పదార్థాలు తినకూడదు. డయేరియా వచ్చినప్పుడు అర్హత ఉన్న వైద్యనిపుణుడి వద్దకు వెళ్ళాలి. ఇంటి వైద్యం, మందుల షాపులకు వెళ్లి మందులు తెచ్చుకోవటం వంటివి చేయొద్దు.

వైద్య శిబిరాల్లో 24 గంటలు వైద్య సేవలు

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ,డీఎంహెచ్‌వో, గుంటూరు



గుంటూరు జిల్లావ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాం. పునరావాస కేంద్రాల్లో 24 గంటలూ వైద్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తారు. వరద ప్రాంతాలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం. పునరావాస కేంద్రాలు తీసివేసే వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగిస్తాం. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మందులు , ఇంజెక్షన్లు సిద్ధం చేసి ఉంచాం. ప్రజలకు ఎటువంటి వైద్య సహాయం అవసరమైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.